www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 11-6-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 73

శ్రీ విశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం తిథి: పౌర్ణమి మ.1:14 తదుపరి పాడ్యమి, నక్షత్రం: జ్యేష్ఠ రా.8:11 తదుపరి మూల, వర్జ్యం: తె. 4:46-6:29, దుర్ముహూర్తం: ఉ.11:48-12:40, అమృతఘడియలు: ఉ.10:35-12:20, రాహుకాలం: మ.12:00-1:30, సూర్యోదయం: 5:44, సూర్యాస్తమయం: 6:45

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

జాతీయ భద్రత సలహా మండలి సభ్యుడిగా సతీశ్‌రెడ్డి



రెండేళ్ల పాటు పదవిలో కొనసాగనున్న

డీఆర్‌డీవో మాజీ చైర్మన్

క్షిపణి వ్యవస్థలపై పరిశోధనల్లో కీలక పాత్ర

రక్షణ మంత్రి సాంకేతిక సలహాదారుగా సేవలు

ఇటీవలే క్యాబినెట్ హోదా ఇచ్చిన ఆంధ్రప్రదేశ్ సర్కారు

2

మంత్రుల శాఖల్లో భారీ మార్పులు!

పలువురి పోర్ట్‌ఫోలియోలు మారే అవకాశం!

ఢిల్లీలో రెండో రోజూ సీఎం రేవంత్‌రెడ్డి చర్చలు

రాహుల్, మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్‌తో భేటీ

సునీల్ కనుగోలుతోనూ సుదీర్ఘంగా సమావేశం

అధిష్ఠానం పిలుపుతో హుటాహుటిన ఢిల్లీకి ఉత్తమ్

ఎస్సీ వర్గీకరణ, కులగణనపై రాష్ట్రంలో రెండు బహిరంగ సభలు నిర్వహించాలని టీపీసీసీ నిర్ణయం


రాహుల్‌గాంధీ, ఖర్గేను ఆహ్వానించిన రేవంత్‌రెడ్డి



ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో నూతనంగా మంత్రి పదవి చేపట్టిన గడ్డం వివేక్ వెంకటస్వామి, ఆయన కుమారుడు, ఎంపీ వంశీకృష్ణ

న్యూఢిల్లీ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గంలోని మంత్రుల శాఖల్లో భారీ మార్పులు చోటు చేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ముగ్గురు మంత్రులకు శాఖల కేటాయింపుతో పాటు ప్రస్తుతం ఉన్న మంత్రుల శాఖలనూ మార్చే దిశగా కాంగ్రెస్ అధిష్ఠానం కసరత్తు చేస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి రెండు రోజులుగా ఢిల్లీలో ఇదే అంశంపై అధిష్ఠానం పెద్దలతో విస్తృత చర్చలు జరుపుతున్నారు. సోమవారం ఢిల్లీకి వచ్చిన రేవంత్.. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి(సంస్థాగత) కేసీ వేణుగోపాల్‌తో గంటకు పైగా చర్చించారు. తిరిగి మంగళవారం పార్టీ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్‌తో రెండున్నర గంటలపాటు భేటీ అయ్యారు. ఇందిరా భవన్‌లో జరిగిన ఈ సమావేశంలో ప్రధానంగా మంత్రుల శాఖల మార్పు పైనే చర్చించినట్లు కాంగ్రెస్ పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. సీఎం రేవంత్‌తో కలిపి మంత్రివర్గంలో ఇప్పటికే 12 మంది ఉండగా, కొత్తగా మరో ముగ్గురికి అవకాశం కల్పించిన విషయం తెలిసిందే. దీంతో కొత్త మంత్రులకు ఏ శాఖలు కేటాయించాలనే అంశంపై నిర్ణయించేందుకుగాను.. ప్రస్తుత ఎవరెవరివద్ద ఏయే మంత్రిత్వ శాఖలు ఉన్నాయనే దానిపై చర్చించినట్లు తెలిసింది. ఇందులో కీలక శాఖలు నిర్వహిస్తున్న మంత్రులెవరు? వారి పనితీరు ఎలా ఉంది? అనే విషయాలపై రేవంత్‌రెడ్డిని రాహుల్‌గాంధీ ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ఆర్థిక, నీటిపారుదల, రెవెన్యూ తదితర ప్రధాన శాఖల పనితీరు ఈ సందర్భంగా చర్చకు వచ్చినట్లు తెలిసింది. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఇప్పటికే మంత్రులందరి పనితీరుపై అధిష్ఠానానికి నివేదిక ఇచ్చినట్లు సమాచారం. కాగా, ఇటీవల జరిగిన విస్తరణలో మంత్రివర్గంలో చోటు దక్కుతుందని ఆశించి, నిరాశ చెందిన వారి గురించీ అధిష్ఠానంతో రేవంత్ భేటీలో చర్చకు వచ్చినట్లు తెలిసింది. దీంతోపాటు ఇటీవల ప్రకటించిన పీసీసీ

మిగతా 13వ పేజీలో...







కాళేశ్వరాన్ని ఎప్పుడు ఆమోదించారు?

మంత్రివర్గ ఉపసంఘం ఎప్పుడు ఏర్పాటైంది?

సబ్ కమిటీకి, బ్యారేజీలకు సంబంధం ఉందా?

మాజీ సీఎం కేసీఆర్‌ను ప్రశ్నించనున్న కమిషన్

రకరకాల వాంగ్మూలాల నేపథ్యంలో

పక్కా ఆధారాలతో ప్రశ్నించాలని నిర్ణయం!

నేడు విచారణకు హాజరుకానున్న కేసీఆర్

ఆయన ఏం చెబుతారనేదానిపై ఉత్కంఠ

ఫాంహౌస్‌లో మరోసారి హరీశ్‌తో సుదీర్ఘ చర్చ

బీఆర్కే భవన్‌కు భారీగా బీఆర్ఎస్ శ్రేణులు!

కేసీఆర్‌కు మద్దతుగా కవిత అనుచరులు కూడా?

నేడు మళ్లీ ప్రభాకర్‌రావు విచారణ

సెల్‌ఫోన్లను అప్పగించాలని సిట్ ఆదేశం

నాంపల్లి కోర్టుకు హాజరైన ప్రభాకర్‌రావు

హైదరాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం బ్యారేజీల కుంగుబాటుపై విచారణలో భాగంగా మాజీ సీఎం కేసీఆర్‌ను పక్కా ఆధారాలతో ప్రశ్నించాలని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. రకరకాల వాంగ్మూలాలు వచ్చిన నేపథ్యంలో ఆధారాలన్నింటినీ ముందు పెట్టి మరీ కేసీఆర్‌ను విచారించనున్నట్లు తెలిసింది. గత కొన్నిరోజులుగా జరుగుతున్న పరిణామాల్లో ప్రాజెక్టుల రీ ఇంజనీరింగ్ నిర్ణయం మంత్రివర్గ ఉపసంఘం తీసుకుందని కమిషన్ ముందు పలువురు వాంగ్మూలం ఇవ్వగా.. తాజాగా మరో వాస్తవం వెలుగులోకి వచ్చింది. హరీశ్ నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘంలో చర్చించాకే కాళేశ్వరం బ్యారేజీలపై, ప్రాజెక్టుల రీ ఇంజనీరింగ్‌పై నిర్ణయం తీసుకున్నారని వాదనలు వినిపిస్తుండగా.. మంత్రివర్గ ఉపసంఘానికి, కాళేశ్వరం బ్యారేజీలకు సంబంధం లేదని తేలింది. ప్రాణహిత-చేవెళ్ల పథకంలో తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటూ కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణానికి రూ.2591 కోట్లతో అనుమతి

మిగతా 14వ పేజీలో...

దేశంలో పడిపోతున్న జననాల రేటు



భర్తీ రేటు కన్నా తక్కువగా 1.9 నమోదు

ఆర్థిక పరిస్థితుల వల్లే పరిమిత కుటుంబం

స్థిరంగానే కొనసాగుతున్న యువత జనాభా

పని చేయదగిన వారు 68 శాతం మంది

వృద్ధులు 7 శాతం.. దేశ జనాభా 146 కోట్లు.. వచ్చే 40 ఏళ్లలో 170 కోట్లకు

ఆ తర్వాత క్రమేణా తగ్గుదల.. ఐరాస ప్రపంచ జనాభా నివేదిక-2025లో వెల్లడి

సగటు ఆయుర్దాయం
పురుషులు 71 ఏళ్లు
మహిళలు 74 ఏళ్లు

న్యూఢిల్లీ, జూన్ 10: ఒకపక్క ఆర్థిక ఇబ్బందులు.. మరోపక్క ఉరుకులు పరుగుల జీవితం.. దీంతో దేశంలో జననాల రేటు వేగంగా పడిపోతోంది. యాభై ఏళ్ల క్రితం సగటున ఐదారుగురు పిల్లలు ఓ కుటుంబంలో ఉండగా, ఇప్పుడు ఒకరు లేదా ఇద్దరితో సరిపెట్టుకుంటున్నారు. ఈ పరిస్థితి భవిష్యత్‌లో జనాభా పెరుగుదలకు సవాల్‌గా మారనుంది. ప్రస్తుతం ప్రపంచ జనాభాలో మనదేశం అగ్రస్థానంలో కొనసాగుతోంది. భారతదేశ జనాభా ఈ ఏడాది 146 కోట్లకు చేరింది. దేశ జనాభా పెరుగుదల, ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని ఐక్యరాజ్యసమితి తన జనాభా నివేదికలో వివరించింది. యూఎన్ఎఫ్‌పీఏకు చెందిన స్టేట్ ఆఫ్ వరల్డ్ పాప్యులేషన్ (ఎస్ఓడబ్ల్యూపీ) 2025 నివేదికను మంగళవారం విడుదల చేసింది. భారత దేశ జనాభా భర్తీ రేటు కంటే జననాల రేటు తక్కువ ఉందని దానిలో వెల్లడించింది. జనాభా పెరుగుదల, తగ్గదల సంక్షోభం కాదని, జననాల రేటు తగ్గడమే నిజమైన సంక్షోభమని పేర్కొంది. లక్షలాది మంది ప్రజలు పునరుత్పత్తి లక్ష్యాలను చేరుకోలేకపోతున్నారని చెప్పింది. జననాల రేటు 1.9కి పడిపోయిందని, భర్తీ స్థాయి 2.1 కంటే తక్కువగా

మిగతా 2వ పేజీలో...

రాజీవ్ యువ వికాసం మరింత జాప్యం!

దరఖాస్తులు ప్రస్తుతానికి నిలుపుదల

కలెక్టర్లకు సర్కారు మౌఖిక ఆదేశాలు!

రాష్ట్రవ్యాప్తంగా 16.23 లక్షల దరఖాస్తులు

రూ.లక్ష లోపు యూనిట్లు ఎక్కువగా ఇవ్వాలని ప్రభుత్వ యోచన.. దరఖాస్తుదారుల అనాసక్తి

3-4 లక్షల యూనిట్లకు 79% దరఖాస్తులు

సిబిల్ ఉంటేనే లక్ష పైన రుణం: బ్యాంకర్లు

కొత్త మార్గదర్శకాలపై సర్కారు కసరత్తు

ఈ ప్రక్రియ పూర్తికి ఆగస్టుదాకా సమయం



హైదరాబాద్/వరంగల్/మహబూబ్‌నగర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన 'రాజీవ్ యువ వికాసం' పథకం అమలులో మరింత జాప్యం జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ నెల 2న తొలి విడత కింద రూ.లక్ష లోపు యూనిట్లను మంజూరు చేస్తామని సర్కారు ప్రకటించినప్పటికీ అది కార్యరూపం దాల్చలేదు. రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి, ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో ప్రారంభించిన ఈ పథకానికి అంచనాలకు మించి దరఖాస్తులు వచ్చాయి. ఈ క్రమంలో అనర్హులకు లబ్ధి చేకూరకూడదని పలువురు మంత్రులు సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. దీంతో

మిగతా 12వ పేజీలో...



శైవ గ్రూప్, టారనిస్ క్యాపిటల్ ప్రతినిధులతో కలిసి మీడియాతో మంత్రి శ్రీధర్‌బాబు

రూ.2,125 కోట్లు

రాష్ట్రంలోని 5 స్థానిక కంపెనీల్లో పెట్టుబడులు పెట్టనున్న

యూఏఈ సంస్థలు శైవ గ్రూప్, టారనిస్ క్యాపిటల్

తెలంగాణ యువతకు 5,020 ఉద్యోగావకాశాలు

మూడేళ్లలో మరో రూ.24 వేల కోట్ల పెట్టుబడులు: శ్రీధర్‌బాబు

హైదరాబాద్‌లో డైచీ లైఫ్.. జపాన్ వెలుపల ఇదే తొలి కేంద్రం

హైదరాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు మరో రూ.2125 కోట్ల పెట్టుబడులు రానున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు తెలిపారు. యూఏఈకి చెందిన శైవ గ్రూప్, టారనిస్ క్యాపిటల్ కంపెనీలు సంయుక్తంగా ఈ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయన్నారు. ఇందుకోసం రాష్ట్రానికి చెందిన ఐదు స్థానిక కంపెనీలతో ఈ రెండు సంస్థలు అవగాహన ఒప్పందం చేసుకున్నాయని అన్నారు. ఈ ఒప్పందాలతో రాష్ట్రంలోని 5,020 మంది యువతకు కొత్తగా ఉపాధి లభిస్తుందన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చి.. యువతకు ఉద్యోగాలు కల్పించాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. ఈ మేరకు మంగళవారం సచివాలయంలో మంత్రి శ్రీధర్‌బాబు విలేకరులతో మాట్లాడారు. "18 నెలల్లో 60 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశాం. ఏడాదిన్నర కాలంలో రూ.3 లక్షల కోట్ల

మిగతా 13వ పేజీలో...



కుల రాజకీయం జరుగుతుందా?

సీనియర్లకు అవకాశం ఇస్తారా??

జూబ్లీహిల్స్ బీజేపీ అభ్యర్థి ఎంపికపై.. కిషన్‌రెడ్డిని ఉద్దేశించి రాజాసింగ్ వ్యాఖ్య

ముస్లింల ఓట్లను ఈసారి మజ్లిస్ ఏ పార్టీకి అమ్మేయనుందోనని ఎద్దేవా 12

ప్రపంచంలో పెద్ద మతం క్రైస్తవం

వేగంగా పెరుగుతున్న ఇస్లాం 2

మతం లేదన్న వారి సంఖ్యా గణనీయం

స్థిరంగా హిందూ మతం: ప్యూ రిసెర్చ్ సర్వే

ఇంజనీరింగ్‌లో బోలెడన్ని సీట్లు

యాజమాన్య కోటా సీట్ల కోసం డబ్బులు వృథా చేసుకోవద్దు

బీ-క్యాటగిరీ సీట్ల భర్తీకి ప్రభుత్వం ఇంకా అనుమతించలేదు

అనుమతి లేని విద్యాసంస్థలతో జాగ్రత్త

జూలై మొదటివారంలో ఎప్‌సెట్ కౌన్సెలింగ్

ఫీజుల పెంపుపై త్వరలో ప్రభుత్వ నిర్ణయం

ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి



హైదరాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌లో సీటు వస్తుందా, రాదా అనే అనుమానాలు వద్దని.. రాష్ట్రంలో బోలెడన్ని ఇంజనీరింగ్ సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య బాలకిష్టారెడ్డి చెప్పారు. విద్యార్థులు, తల్లిదండ్రులు కాలేజీల్లో యాజమాన్య కోటా సీట్ల కోసం ప్రయత్నిస్తున్నట్టు తెలిసిందని.. సీట్ల కోసం డొనేషన్ కట్టి డబ్బులు వృథా చేసుకోవద్దని సూచించారు. ప్రైవేటు కాలేజీల్లో బీ-క్యాటగిరీ సీట్ల భర్తీకి ప్రభుత్వం ఇంకా అనుమతించలేదని, నిబంధనలకు వ్యతిరేకంగా ముందే భర్తీ చేస్తే చర్యలు తప్పవని కాలేజీల యాజమాన్యాలను

మిగతా 14వ పేజీలో...



సమాచార హక్కు అప్పీళ్లపై రేపటి నుంచి విచారణ

కార్యకలాపాలు ప్రారంభించనున్న కొత్త ప్రధాన కమిషనర్, కమిషనర్లు

రెండేళ్ల తర్వాత పూర్తి స్థాయిలో పనిచేయనున్న సమాచార కమిషన్

20వేలకుపైగా దరఖాస్తులు పెండింగ్

వేగంగా పరిష్కరించాలని నిర్ణయం

హాజరుకాని సమాచార అధికారులపై చర్యలకు యోచన

వార్షిక నివేదికల విడుదలకు సన్నాహాలు

హైదరాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సమాచార కమిషన్ గురువారం నుంచి పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించనుంది. రాష్ట్ర సమాచార ప్రధాన కమిషనర్‌గా ఐఎఫ్ఎస్ అధికారి జి.చంద్రశేఖర్‌రెడ్డి, కమిషనర్లుగా ఐదుగురిని ప్రభుత్వం ఇటీవలే నియమించింది. వీరితోపాటు రాష్ట్ర సమాచార కమిషన్ కార్యాలయంలోని 20 మంది అధికారులు, ఉద్యోగులకు నాలుగు రోజులు శిక్షణ ఇచ్చారు. సమాచార హక్కు చట్టం పకడ్బందీగా అమలు

మిగతా 14వ పేజీలో...

నిప్పురవ్వ.. పెను జ్వాలై..



లాస్ ఏంజెలెస్‌లో దగ్ధమవుతున్న కారు ఎదుట అమెరికా జాతీయ జెండాతో ఓ యువతి

అక్రమ వలసదారులపై ఇమ్మిగ్రేషన్ దాడులతో రణరంగంగా మారిన లాస్ ఏంజెలెస్

భారీగా సైన్యం, మెరైన్ల మోహరింపు 2

ట్రంప్ నిర్ణయంపై కాలిఫోర్నియా గవర్నర్ అభ్యంతరం.. రాజ్యాంగ విరుద్ధమని వెల్లడి

ఇతర నగరాలకూ విస్తరిస్తున్న నిరసన జ్వాల

నిప్పురవ్వ.. పెను జ్వాలై..

అక్రమ వలసదారులపై ఇమ్మిగ్రేషన్ అధికారుల దాడులతో మొదలై రణరంగంగా మారిన లాస్ ఏంజెలెస్

లాస్ ఏంజెలెస్.. అంటే దేవతల నగరం అని అర్థం! తళుకుబెళుకు తారలకు నిలయమైన హాలీవుడ్ కొలువుదీరిన నగరం!! ఈ నగరం.. కిందటి శుక్రవారం(జూన్ 6) నుంచి రణరంగంగా మారింది! ఒకవైపు పోలీసులు, దేశ సైన్యంలోని రిజర్వ్ దళాలు, దళాలు, మెరైన్లు.. మరోవైపు బాష్పవాయు ప్రయోగాలకు, రబ్బర్ బుల్లెట్లు, ఫ్లాష్ గ్రెనేడ్లకూ అదరక బెదరక నిరసన తెలుపుతున్న సాధారణ పౌరులు!! క్షణ క్షణం ఉద్రిక్తం.. ఇదీ అక్కడి పరిస్థితి! అక్రమ వలసదారులను డీపోర్ట్ చేయడమే లక్ష్యంగా అమెరికా ఇమ్మిగ్రేషన్ డిపార్ట్‌మెంట్ అధికారులు చేపట్టిన తనిఖీలు, చేసిన అరెస్టులతో చిన్న నిప్పురవ్వలా మొదలైన ప్రజాగ్రహం.. వారిని అణచివేయడానికి ట్రంప్ సర్కారు ఏకంగా నేషనల్ గార్డ్స్‌ను రంగంలోకి దించడంతో పెను జ్వాలగా మారింది.



నిరసనకారులను చెదరగొడుతున్న నేషనల్ గార్డ్స్, భాష్పవాయు గోళాన్ని దూరంగా తన్నేస్తున్న నిరసనకారుడు

అసలేమైందంటే..

అక్రమ వలసదారుల ఏరివేతలో భాగంగా జూన్ 6వ తేదీ ఉదయాన్నే ఫెడరల్ ఇమ్మిగ్రేషన్ అధికారులు లాస్ ఏంజెలెస్ వెస్ట్‌లేక్‌లోని హోమ్ డిపో సహా రోజువారీ కార్మికులంతా పనికోసం వచ్చే ఏడు కేంద్రాలపై ఒకే సమయంలో దాడులకు దిగారు. వారిని ప్రశ్నించినందుకు.. క్యాలిఫోర్నియాలోనే అతి పెద్ద కార్మిక యూనియన్ చీఫ్ అయిన డేవిడ్ హ్యుయెర్టాను అరెస్ట్ చేశారు. లాస్‌ఏంజెలెస్ డౌన్‌టౌన్‌లోని మెట్రోపాలిటన్ డిటెన్షన్ సెంటర్‌కు ఆయన్ను తరలించారు. ఆయనతోపాటు.. సరైన పత్రాలు లేకుండా అమెరికాలో ఉంటున్న పలువురిని పట్టుకుని అక్కడికి తరలించారు. ఈ విషయం తెలియడంతో ఆ రోజు మధ్యాహ్నానికి పలువురు నిరసనకారులు డిటెన్షన్ సెంటర్ వద్దకు చేరుకుని శాంతియుతంగా నిరసన తెలపడం మొదలుపెట్టారు. సాయంత్రం 7 గంటల సమయంలో.. లాస్ ఏంజెలెస్ పోలీసులు నిరసనకారులను అక్కణ్నుంచీ చెదరగొట్టడానికి బాష్పవాయు ప్రయోగం చేశారు. మర్నాడు(జూన్ 7న) ఐసీఈ అధికారులు సరిహద్దు గస్తీ ఏజెంట్లను రంగంలోకి దింపి మరోసారి అక్రమ వలసదారులను పట్టుకునేందుకు తనిఖీలు చేశారు. ఈ విషయం సామాజిక మాధ్యమాల ద్వారా వైరల్ కావడంతో వందలాది మంది.. తనిఖీలు జరుగుతున్న పారామౌంట్ బిజినెస్ సెంటర్ వద్దకు చేరుకుని నిరసనకు దిగారు. సాయంత్రానికి నిరసనలు హింసాత్మకంగా మారాయి. ఆరోజు రాత్రి 7 గంటల సమయంలో.. లాస్ ఏంజెలెస్‌లో జరుగుతున్న నిరసనలను అమెరికా ప్రభుత్వంపై తిరుగుబాటుగా పేర్కొన్న ట్రంప్ యంత్రాంగం.. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు నేషనల్ గార్డ్ దళాలను రంగంలోకి దింపనున్నట్టు ప్రకటించింది. అంతేకాదు.. కాలిఫోర్నియాలోని క్యాంప్ పెండిల్టన్‌లో ఉన్న 500 మంది మెరైన్లను హై అలర్ట్‌లో ఉంచనున్నట్టు అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ ప్రకటించారు. కాలిఫోర్నియా గవర్నర్ గవిన్ న్యూసమ్ ట్రంప్ సర్కారు నిర్ణయాలను తీవ్రంగా వ్యతిరేకించారు. వెంటనే నేషనల్ గార్డ్స్ మోహరింపును ఉపసంహరించుకోవాలని సూచించారు(ఎందుకంటే.. ఒక రాష్ట్ర గవర్నర్ విజ్ఞప్తి చేయకుండా ఫెడరల్ ప్రభుత్వం సైన్యాన్ని రంగంలోకి దించడం సంప్రదాయం కాదు). ఇక, జూన్ 8వ తేదీన.. సాయంత్రం 6గంటల నుంచి ఉదయం ఆరు గంటల దాకా లాస్ ఏంజెలెస్ కౌంటీవ్యాప్తంగా కర్ఫ్యూ విధిస్తున్నట్టు అధికారులు ప్రకటించారు. ఆరోజు ఉదయం 10.30 గంటల నుంచి ఒంటిగంట మధ్య.. వేలాది నిరసనకారులు డిటెన్షన్ సెంటర్ వద్దకు చేరుకున్నారు. డీపోర్టేషన్ ప్రక్రియపై తీవ్ర నిరసన వెలిబుచ్చారు. పోలీసులు అక్కణ్నుంచీ వెళ్లిపోవాలని హెచ్చరించారు. రబ్బరు బుల్లెట్లు ప్రయోగించారు. పలువురిని అరెస్టు చేశారు. అయినా వారు వెనక్కి తగ్గలేదు. దీంతో ట్రంప్ సర్కారు శనివారం నియోగించిన 2100 మంది నేషనల్ గార్డ్ సిబ్బందికి అదనంగా సోమవారం మరో 2000 మందిని, 700మంది మెరైన్లను రంగంలోకి దించింది. ఇలా రాష్ట్ర ప్రభుత్వం అడగకుండా సైన్యాన్ని రంగంలోకి దించడం అమెరికా రాజ్యాంగానికి విరుద్ధమని కాలిఫోర్నియా గవర్నర్ మండిపడుతున్నారు.

కాలిఫోర్నియాలో ఎందుకిన్ని దాడులు?

అమెరికాను అవకాశాల గడ్డగా భావించి ప్రపంచం నలుమూలల నుంచీ చాలా మంది అక్రమంగా వలస వస్తుంటారు. అలా వచ్చేవారు ఎక్కువగా ఉండేది ప్రపంచవ్యాప్తంగా పేరొందిన దిగ్గజ టెక్ కంపెనీలున్న కాలిఫోర్నియాలనే. ఆ రాష్ట్ర జనాభాలో 22 శాతం విదేశీ సంతతికి చెందినవారే. ప్యూ రిసెర్చ్ గణాంకాల ప్రకారం 2022 నాటికి కాలిఫోర్నియా జనాభాలో 18 లక్షల మంది వలసదారులున్నారు. అందుకే ట్రంప్ గతంలో ఒకసారి.. 'లాస్ ఏంజెలెస్‌పైకి అక్రమ వలసదారులు, నేరగాళ్లు దండెత్తారు' అని సోషల్ మీడియాలో పరుష పదజాలంతో వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలోనే ఐసీఈ అధికారులు కాలిఫోర్నియాపై.. ముఖ్యంగా లాస్ ఏంజెలెస్ నగరంపై దృష్టి సారించి వరుస దాడులు చేశారు.

-సెంట్రల్ డెస్క్

హార్వర్డ్‌కు వీసాల జారీ పునఃప్రారంభం

ప్రఖ్యాత హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి విద్యార్థి (స్టూడెంట్/ ఎక్స్‌చేంజ్ విజిటర్) వీసాలు తిరిగి జారీ చేయాలని అమెరికా ఆదేశించింది. ఈ వీసాల ప్రాసెసింగ్‌ను పునఃప్రారంభించాలంటూ అన్ని దేశాల్లోని రాయబార కార్యాలయాలకు విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఈ నెల 6న ఉత్తర్వులు జారీ చేశారు. హార్వర్డ్‌లో విదేశీ విద్యార్థుల ప్రవేశాలను రద్దు చేస్తూ అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయంపై తాత్కాలిక నిషేధం విధిస్తూ బోస్టన్‌లోని ఫెడరల్ కోర్టు చెప్పిన తీర్పునకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అందులో పేర్కొన్నారు. అమెరికాలోని అతిపెద్ద విద్యాసంస్థల్లో ఒకటైన హార్వర్డ్‌లో ప్రవేశం కోసం కలలు కనే భారతీయ విద్యార్థులకు కోర్టు తీర్పుతో భారీ ఉపశమనం లభించింది.

ఇతర నగరాలకూ పాకుతున్న ఘర్షణలు

ఇమ్మిగ్రేషన్ అధికారుల దాడులతో లాస్ ఏంజెలెస్‌లో మొదలైన నిరసనల పర్వం.. క్రమంగా కార్చిచ్చుగా మారి అమెరికాలోని ఇతర ప్రధాన నగరాలకూ పాకుతోంది. న్యూయార్క్, షికాగో, డాలస్, అట్లాంటా తదితర నగరాల్లో వేలాది మంది నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. శాన్‌ఫ్రాన్సిస్కోలో సోమవారం పెద్ద సంఖ్యలో నిరసనకారులు ప్రదర్శన నిర్వహించారు. శాన్‌హోసేలోని సిటీహాల్ వద్ద వందల మంది గుమిగూడి నిరసన తెలుపగా.. శాన్‌డియోగోలో రెండుచోట్ల నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. అలాగే.. లాస్ వెగాస్, పోర్ట్‌లాండ్, సియాటిల్, న్యూయార్క్ నగరాల్లోనూ అందోళనకారులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రదర్శనలు చేపట్టారు. న్యూయార్క్‌లో ట్రంప్ టవర్ వద్ద నిరసనకు దిగినవారిలో తొమ్మిది మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. డాలస్‌లోనూ పోలీసులు ఒక నిరసనకారుణ్ని అరెస్ట్ చేశారు. అటు.. టెక్సస్ కాపిటోల్ వద్ద 500 మంది, శాన్ ఆంటోనియోలో కొన్ని వందల మంది నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. అట్లాంటా, డెట్రాయిట్, ఒక్లహామా నగరాల్లో కూడా పలువురు ర్యాలీలు చేపట్టారు.



చిన్నారులకు ట్రంప్ ఖాతాలు

» ఒక్కో ఖాతాలో వెయ్యి డాలర్ల ఫండ్

వాషింగ్టన్ డీసీ, జూన్ 10: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చిన్నారుల ఉజ్వల భవిష్యత్ కోసం కీలక నిర్ణయం తీసుకున్నారు. 2024 డిసెంబర్ 31 నుంచి 2029 జనవరి ఒకటో తేదీ వరకూ దేశంలో జన్మించిన బాలల కోసం ఉచితంగా ప్రారంభించిన ఇన్‌వెస్ట్‌మెంట్ ఖాతాల్లో 1000 డాలర్లు జమ చేయనున్నట్లు ప్రతిపాదించారు. స్టాక్ మార్కెట్‌తో అనుసంధానించే ఈ ఖాతాలను పిల్లల తల్లిదండ్రులు నిర్వహిస్తారు. ఈ ఖాతాలో ప్రతియేటా పిల్లల తల్లిదండ్రులు, బంధు మిత్రులు కూడా 5000 డాలర్ల వరకూ జమ చేయొచ్చు. పిల్లలకు 18 ఏళ్లు వచ్చే వరకు ఈ మొత్తంపై వడ్డీ జమ చేస్తారు. 30 ఏళ్ల తర్వాత మొత్తం విత్‌డ్రా చేసుకోవచ్చు. అయితే, ఈ నిర్ణయం వల్ల అమెరికా ద్రవ్యలోటు పెరిగే ప్రమాదం ఉందని డెమోక్రాట్లతో పాటు రిపబ్లికన్లు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లక్షల మందిని ఆరోగ్య బీమా పథకం నుంచి తొలగిస్తారన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

అమెరికాలోకి అక్రమంగా వచ్చేవారిని ఉపేక్షించం!

» భారత్‌లోని అమెరికా ఎంబసీ స్పష్టీకరణ

వాషింగ్టన్, జూన్ 10: తమ దేశంలోకి అక్రమంగా ప్రవేశించే వారిని ఉపేక్షించబోమని అమెరికా స్పష్టం చేసింది. 'చట్టబద్ధంగా వచ్చే వారిని అమెరికా ఎల్లప్పుడూ స్వాగతిస్తుంది. కానీ, వీసాలను అక్రమంగా పొంది, అమెరికా చట్టాలను ఉల్లంఘిస్తూ వచ్చే వారిని ఎంతమాత్రమూ సహించం' అని పేర్కొంది. ఈ మేరకు భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం మంగళవారం ఎక్స్‌లో ఓ పోస్ట్ పెట్టింది. న్యూజెర్సీలోని విమానాశ్రయంలో ఓ భారతీయ యువకుడిని స్థానిక అధికారులు చేతులు వెనక్కి కట్టి, సంకెళ్లు వేసి, నేల మీద అదిమిపెట్టిన వీడియో, ఫొటోలు వైరల్ అయిన నేపథ్యంలోనే, అమెరికా ఎంబసీ ఈ ప్రకటన విడుదల చేసింది.



విదేశాల నుంచి తిరిగొచ్చిన అఖిల పక్ష బృందాలతో ప్రధాని మోదీ

ఉగ్రవాద నిర్మూలనలో భారత్ నిబద్ధతను ప్రపంచానికి చాటాం

» అఖిలపక్ష బృందాల పనితీరుకు గర్విస్తున్నా: మోదీ

న్యూఢిల్లీ, జూన్ 10: ఉగ్రవాదాన్ని నిర్మూలించడం.. శాంతి స్థాపనలో భారత్ నిబద్ధతను ప్రపంచానికి చాటామని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్', పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదంపై ఐరోపా సమాఖ్య, 33 దేశాలకు వివరించేందుకు సిటింగ్ ఎంపీల నేతృత్వంలో ఏడు అఖిలపక్ష బృందాలు పర్యటించిన విషయం తెలిసిందే..! భారత్ తిరిగి వచ్చిన ఈ బృందాలతో ప్రధాని మంగళవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. భారత గొంతుకను ప్రపంచ దేశాలకు చాటిన బృందాల పనితీరుకు గర్విస్తున్నానని వ్యాఖ్యానించారు. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ వైఖరిని తెలియజేయడంలో ఈ బృందాల ప్రయత్నాలను ప్రశంసించారు. అంతకు ముందు విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ అఖిలపక్ష పార్లమెంటరీ బృందాల ప్రతినిధులను కలిశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ మాట్లాడుతూ.. తమ పర్యటనలో మంచి ఫలితాలు వచ్చాయని చెప్పారు. ఇదిలా ఉండగా, గత 11 ఏళ్లలో దేశంలో రక్షణ ఉత్పత్తుల ఎగుమతులు 12రెట్లు పెరిగాయని మోదీ తెలిపారు. 2014-15లో రూ.1,930 కోట్లుగా ఉన్న భారత రక్షణ ఎగుమతుల విలువ 2024-25నాటికి రూ.23,622 కోట్లకు చేరిందన్నారు.

11 ఏళ్ల పాలనపై బీజేపీ భారీ ఉత్సవాలు

» నేడు తెలంగాణ సహా పలు రాష్ట్రాల్లో వేడుకలు

న్యూఢిల్లీ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రధానిగా మోదీ 11 ఏళ్ల పాలన పూర్తి చేసుకుంటున్న సందర్భంగా భారీ ఎత్తున ఉత్సవాలను జరుపుకోవాలని బీజేపీ నిర్ణయించింది. దేశంలో జరుగుతున్న అభివృద్ధి, మార్పుల గురించి బీజేపీ ఇప్పటికే ఒక గీతాన్ని విడుదల చేసింది. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోని పార్టీ ప్రధాన కార్యాలయాల్లో కేంద్ర మంత్రులు, పార్టీ అగ్రనేతలు మీడియా సమావేశాలు నిర్వహించి ఎన్డీఏ ప్రభుత్వ విజయాలను వివరించారు. బుధవారం తెలంగాణ సహా పలు రాష్ట్రాల్లో జిల్లా స్థాయిలో వేడుకలను నిర్వహించనున్నారు. ఇదిలా ఉండగా, మహబూబ్‌నగర్ లోక్‌సభ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న రైల్వే పనులను పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ఎంపీ డీకే అరుణ విజ్ఞప్తి చేశారు. తన నియోజకవర్గ పరిధిలోని కృష్ణా - వికారాబాద్ రైల్వే లైన్ పనులు త్వరగా ప్రారంభించాలని కోరారు. సీఎం రేవంత్ 46 సార్లు ఢిల్లీకి వచ్చి తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాంగ్రెస్ అధిష్ఠానం దగ్గర తాకట్టు పెట్టారని ఎంపీ లక్ష్మణ్ విమర్శించారు.

ఆరోపణలు సరే.. ఫిర్యాదేదీ?

» ఓడినప్పుడల్లా మాపై పడతారా?.. రాహుల్‌కు ఈసీ ప్రశ్న

న్యూఢిల్లీ, జూన్ 10: ఎన్నికల ప్రక్రియ, ఓటర్ల జాబితాలో అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపణలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీపై ఎన్నికల సంఘం(ఈసీ) ఆగ్రహం వ్యక్తం చేసింది. "ఆరోపణలు సరే.. ఇప్పటి వరకు అధికారికంగా ఫిర్యాదు ఎందుకు చేయలేదు?. సంబంధిత నివేదికలు ఇవ్వాలని మమ్మల్ని ఎందుకు కోరలేదు? పోనీ.. మాతో భేటీ కావడానికి ఎందుకు ప్రయత్నించలేదు?" అని ఈసీ ప్రశ్నించింది. "ఏ రాజకీయ పార్టీ అయినా.. ఎన్నికల ఫలితాలను ముందుగానే ఊహించుకుని ఉంటే.. దానిని రాజకీయాలకు మాత్రమే పరిమితం చేసుకోవాలి. రిఫరీతో యుద్ధం చేయొద్దు" అని స్పష్టం చేసింది. "దేశంలో ఓటర్లు అత్యంత తెలివైన వారు. వారికి అన్నీ తెలుసు. ఓడిపోయిన ప్రతిసారీ కాంగ్రెస్ పార్టీ రిఫరీపై యుద్ధం చేస్తుండడాన్ని కూడా వారు అర్థం చేసుకుంటారు" అని వ్యాఖ్యానించింది.

2023 నుంచి నియమితులైన సీఎస్‌లందరిపైనా ధిక్కార కేసు నమోదు

» మద్రాస్ హైకోర్టు ఆదేశం

చెన్నై, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కారుణ్య నియామక వ్యవహారంలో గతంలో తాము జారీ చేసిన ఆదేశాలను తమిళనాడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు పాటించకపోవడం పట్ల మద్రాస్ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. 2023 సెప్టెంబరు నుంచి ఈ నెల 6వ తేదీ వరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులుగా పని చేసిన అధికారులందరిపైనా కోర్టు ధిక్కార కేసు నమోదు చేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. "కోర్టు ఆదేశాలు అమలు చేయని, ధిక్కారంతో వ్యవహరించే అధికారులకు మేం స్పష్టమైన సందేశం ఇవ్వదలిచాం" అని న్యాయమూర్తి కటువుగా వ్యాఖ్యానించారు. కారుణ్య నియామకానికి సంబంధించిన ఓ పిటిషన్‌పై విచారణ సందర్భంగా.. తమిళనాడు సివిల్ సర్వీస్ (కారుణ్య నియామకాలు) నిబంధనలు-2023ను సవరించేందుకు అవసరమైన సిఫారసులు చేయడానికి, వాటి సాధ్యాసాధ్యాలను పరిగణనలోకి తీసుకునేందుకు మూడు నెలల్లోపు కమిటీని నియమించి, నివేదికను పొందేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని 2023 సెప్టెంబరులో హైకోర్టు ఆదేశించింది. ఆ ఆదేశాలు అమలు కాలేదు.

జాతీయ భద్రత సలహా మండలి సభ్యుడిగా జి.సతీశ్‌రెడ్డి



న్యూఢిల్లీ, జూన్ 10: జాతీయ భద్రత సలహా మండలి (ఎన్ఎస్ఏబీ) సభ్యుడిగా డీఆర్‌డీవో మాజీ చైర్మన్ ప్రొఫెసర్ జి.సతీశ్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ భద్రత మండలి సచివాలయం ఉప కార్యదర్శి పుష్పేంద్ర కుమార్ మంగళవారం ఉత్తర్వులిచ్చారు. సతీశ్‌రెడ్డి ఈ పదవిలో రెండేళ్లపాటు కొనసాగుతారు. 2027 జూన్ 9 వరకు.. లేదా తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు ఆయన ఎన్ఎస్ఏబీ సభ్యుడిగా ఉంటారు. కాగా.. ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండలం మహిమలూరు గ్రామానికి చెందిన సతీశ్‌రెడ్డి డీఆర్‌డీవో చైర్మన్‌గా, భారత రక్షణ మంత్రి సాంకేతిక సలహాదారుగా సేవలందించారు. ఆంధ్రప్రదేశ్ ఆయనను విమానయానం, రక్షణ రంగాల్లో గౌరవ సలహాదారు(రాష్ట్ర క్యాబినెట్ హోదా)గా ఈ ఏడాది మార్చి 19న నియమించింది. ఆయన భారతదేశ క్షిపణి వ్యవస్థలపై పరిశోధన, అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు.

మాల్దీవులకు 'గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్'గా కత్రినా కైఫ్



జూన్ 10: బాలీవుడ్ నటి కత్రినా కైఫ్ మాల్దీవులకు గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపికయ్యారు. ఈ విషయాన్ని ఆ దేశ మార్కెటింగ్ అండ్ పబ్లిక్ రిలేషన్స్ విభాగం మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొంది. నటిగా, వ్యాపారవేత్తగా ఆమెకున్న గుర్తింపు తమ దేశ పర్యాటక రంగాన్ని అంతర్జాతీయంగా ప్రోత్సహించడంలో కలిసొస్తుందని ఆశాభావం వ్యక్తం చేసింది. మాల్దీవుల 'సన్నీ సైడ్ ఆఫ్ లైఫ్' ప్రచార కర్తగా ఎంపిక కావడం పట్ల కత్రినా తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. భారత్‌తో సంబంధాలను మెరుగుపరుచుకునే ప్రయత్నంలో భాగంగానే మాల్దీవుల ప్రభుత్వం కత్రినాను ప్రచారకర్తగా ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. మోదీ వచ్చే నెలలో ఆ దేశానికి పర్యటనకు వెళ్లనున్న నేపథ్యంలో కత్రినాను గ్లోబల్ అంబాసిడర్‌గా నియమించడం విశేషం.

హత్యా స్థలంలో సోనమ్ చొక్కా

ఇండోర్, జూన్ 10: హనీమూన్‌లో రాజా రఘువంశీని హత్య చేసింది ఆయన భార్య సోనమ్, ఆమె బాయ్‌ఫ్రెండ్‌గా భావిస్తున్న రాజ్ కుశ్వాహ ప్రమేయం ఉన్నట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ మేరకు కీలక ఆధారాలను పోలీసులు సేకరించారు. ఇండోర్ దంపతులు రాజా రఘువంశీ, సోనమ్ పెళ్లయ్యాక హనీమూన్ కోసం మేఘాలయాకు వెళ్లగా, మూడు రోజుల తర్వాత ఆ దంపతులు కనిపించకుండాపోయారు. వారం తర్వాత ఓ లోయలో పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో రాజా మృతదేహం లభ్యమైంది. అయితే మృతదేహం సమీపంలో రక్తపుమరకలతో కూడిన చొక్కా పోలీసులకు లభ్యమైంది. ఇదే చొక్కాను అంతకుముందు సోనమ్ ధరించి ఉన్నట్లుగా సీసీపుటేజీ ద్వారా పోలీసులు నిర్ధారించారు. ముగ్గురు వ్యక్తులకు సుపారీ ఇచ్చి భర్తను చంపించిన సోనమ్, తన చొక్కకు రక్తపుమరకలు అంటుకోవడంతో అక్కడే వదిలేసి వెళ్లినట్లు భావిస్తున్నారు.

దేశంలో పడిపోతున్న జననాల రేటు

(మొదటిపేజీ తరువాయి)



ఉందని, అంటే జనాభా సంఖ్యను కొనసాగించడానికి కావాల్సిన జననాల రేటులో దేశం లేదని స్పష్టం చేసింది. జననాల రేటు మందగించినా.. యువత జనాభా మాత్రం దేశంలో గణనీయంగానే ఉందని తెలిపింది. 0-14 ఏళ్ల వారు 24 శాతం, 10-19 ఏళ్ల వారు 17 శాతం, 10-24 ఏళ్ల వారు 26 శాతం ఉన్నారని వెల్లడించింది. పని చేసే వయసు (15-64)లో ఉన్న వారు 68 శాతం ఉన్నారని వెల్లడించింది. ఇక 65 ఏళ్లు దాటిన వృద్ధులు మొత్తం జనాభాలో 7 శాతంగా ఉన్నారి, ఆయుర్దాయం అంచనా పెరుగుతున్న నేపథ్యంలో వృద్ధుల సంఖ్య వచ్చే కాలంలో మరింత పెరుగుతుందని అంచనా వేసింది.

యూఎన్ నివేదికలో ముఖ్యాంశాలు..

- 2025లో ఆయుర్దాయం పురుషులకు 71 ఏళ్లు, మహిళలకు 74 ఏళ్లుగా అంచనా వేశారు.
- ప్రస్తుతం దేశ జనాభా 146.39 కోట్లు. వచ్చే 40 ఏళ్లలో అది 170కోట్లకు చేరుకుంటుంది. అక్కడి నుంచి తిరోగమనం ప్రారంభమవుతుంది.
- 1960లో భారత జనాభా 43.6 కోట్లు. అప్పుడు మహిళలు సగటున ఆరుగురు పిల్లలకు జన్మనిచ్చేవారు. ఇప్పుడు సగటున ఇద్దరు పిల్లలకు మాత్రమే జన్మనిస్తున్నారు.
- సంతానోత్పత్తికి ఎందుకు వెనకాడుతున్నారో తెలుసుకోవడానికి 14 దేశాల్లో 14 వేల మంది (భారత్ నుంచి 1,048) నుంచి ఐరాస అభిప్రాయాలు సేకరించింది. 38% భారతీయులు ఆర్థిక ఇబ్బందుల వల్ల కోరుకున్నంత మంది పిల్లలకు జన్మనివ్వలేకపోతున్నామని చెప్పారు. అలాగే, ఉద్యోగ భద్రత లేదని 21% మంది, ఇల్లు ఇబ్బంది ఉందని 22% మంది, పిల్లల సంరక్షణకు తగిన సౌకర్యాలు లేవని 18% మంది పేర్కొన్నారు. ఇక అనారోగ్యం కారణంగా 15%, సంతాన సాఫల్యత సమస్యల వల్ల 13%, గర్భిణులకు సంరక్షణ లేమి కారణంగా 14% సంతానోత్పత్తికి దూరంగా ఉన్నారు. భాగస్వామి లేదా కుటుంబం ఒత్తిడి వల్ల అనుకున్నంతమందికి జన్మనివ్వలేకపోతున్నామని 19 మంది చెప్పారు. భవిష్యత్‌పై భయంతో కూడా చాలా మంది పిల్లలకు దూరమవుతున్నారని నివేదిక వెల్లడించింది.

మహిళల్లో మార్పు వల్లే..

నివేదిక విడుదల సందర్భంగా యూఎన్ఎఫ్‌పీఏ భారత ప్రతినిధి ఆండ్రియా ఎం వోజ్నర్ మాట్లాడుతూ.. "జననాల రేటు తగ్గించడంలో భారత్ చెప్పుకోదగ్గ ప్రగతి సాధించింది. సగటున ఒక్కో మహిళ 1970లో ఐదుగురు పిల్లలకు జన్మనివ్వగా, ఇప్పుడు ఇద్దరికే జన్మనిస్తున్నారు. మహిళల్లో విద్య, ఆరోగ్య సంరక్షణ పెరగడం దీనికి కారణం. మాతృమరణాల సంఖ్య గణనీయంగా తగ్గింది. ఇప్పటికి రాష్ట్రాల మధ్య, కులాల్లో, ఆదాయ వర్గాల్లో అసమానతలు అలాగే ఉన్నాయి. ప్రతిఒక్కరికి స్వేచ్ఛ, పునరుత్పత్తిలో సొంత నిర్ణయం ఉన్నప్పుడు జనాభాతో వచ్చే లాభాలు నిజంగా అందుతాయి. పునరుత్పత్తి హక్కులు, ఆర్థిక శ్రేయస్సు కలసి ముందుకెళ్లడాన్ని ప్రదర్శించే సదవకాశం భారత్ ముందు ఉంది" అని పేర్కొన్నారు.

- బిహార్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్‌లో జననాల రేటు ఎక్కువగా ఉండగా, ఢిల్లీ, కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో భర్తీ రేటు కంటే తక్కువగా ఉంది. దీనికి ఆర్థిక అసమానతలు కారణమని నివేదిక పేర్కొంది.
- వేగవంతంగా జనాభా మార్పునకు లోనవుతున్న మధ్య ఆదాయ దేశాల జాబితాలో భారత్‌ను ఐరాస ఉంచింది. జనాభా రెట్టింపు అయ్యే సమయాన్ని 79 ఏళ్లుగా అంచనా వేసింది.

విజయోత్సవాల నిర్ణయం ఎవరిది?

తొక్కిసలాటపై కర్ణాటక సర్కారుకు హైకోర్టు ప్రశ్నల వర్షం

» ఆర్సీబీ మేనేజర్‌కు బెయిల్ నిరాకరణ

బెంగళూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): బెంగళూరు తొక్కిసలాట ఘటనకు సంబంధించి కర్ణాటక ప్రభుత్వంపై హైకోర్టు తీవ్ర విమర్శలు చేసింది. కార్యక్రమానికి అనుమతులు, రద్దీ నిర్వహణపై కీలకమైన తొమ్మిది ప్రశ్నలను ప్రభుత్వానికి సంధించింది. సీల్డ్ కవర్‌లో జవాబులు అందజేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది. ఈనెల 5న బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో ఆర్సీబీ క్రికెట్ జట్టు విజయోత్సవాల సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో 11 మంది మరణించగా, 50 మందికిపైగా గాయాలపాలైన విషయం తెలిసిందే. ఘటనను హైకోర్టు సుమోటోగా విచారణకు స్వీకరించింది. మంగళవారం విచారణ జరిపింది. తొక్కిసలాట ఘటన తర్వాత ప్రభుత్వం కీలకమైన నిర్ణయాలు తీసుకుందని, దర్యాప్తు సాగుతోందని ఏజీ కోర్టుకు తెలిపారు. నగర పోలీస్ కమిషనర్‌తోపాటు ఐదుగురు అధికారులను సస్పెండ్ చేశారని, ఆర్సీబీ, డీఎన్ఏ ప్రతినిధుల బెయిల్ పిటిషన్లు హైకోర్టులో విచారణ దశలో ఉన్నాయని వివరించారు. అయితే, ఆర్సీబీ మార్కెటింగ్ మేనేజర్ నిఖిల్ సొసలెకు మధ్యంతరంగా ఏ విధమైన వెసులుబాటూ కల్పించలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. నిఖిల్ భార్య మాళవిక దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది. మరోవైపు, తొక్కిసలాట ఘటన నేపథ్యంలో కర్ణాటక ప్రభుత్వం, రాష్ట్ర సీఎస్‌పై వేటుకు కసరత్తు జరుపుతున్నట్లు తెలుస్తోంది.

ఆర్సీబీ విజయోత్సవాల నిర్ణయం సీఎందే: రాజ్‌భవన్

ఆర్సీబీ క్రికెట్ జట్టు విజయోత్సవాలు నిర్వహించాలనే నిర్ణయం కర్ణాటక సీఎం సిద్దరామయ్యదేనని, గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్‌ను ఆహ్వానించింది కూడా ఆయనేనని రాజ్‌భవన్ వర్గాలు తెలిపాయి. 'ఆర్సీబీ ఆటగాళ్లను రాజ్‌భవన్‌కు పిలిచి సన్మానించాలని గవర్నర్ నిర్ణయించారు. అయితే, విధానసౌధ వద్ద కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ప్రభుత్వం ఆయనకు తెలిపింది. ఆ కార్యక్రమంలో పాల్గొనాలని సీఎం అధికారికంగా గవర్నర్‌ను ఆహ్వానించారు' అని రాజ్‌భవన్ వర్గాలు ఒక ఆంగ్ల మ్యాగజైన్‌కు తెలిపాయి.

'చినాబ్ రైల్వే బ్రిడ్జి' ఘనత నా ఒక్కదానిదే కాదు

» ఐఐఎస్‌సీ ప్రొఫెసర్ మాధవీలత



న్యూఢిల్లీ, జూన్ 10: భారత ఇంజనీరింగ్ నైపుణ్యానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన చినాబ్ రైలు బ్రిడ్జి నిర్మాణంలో తన పాత్ర పరిమితమైనదని, నిర్మాణ ఘనత అంతా రైల్వే, అఫ్కాన్స్ సంస్థలదేనని ఐఐఎస్‌సీ ప్రొఫెసర్ మాధవీలత వినమ్రంగా తెలిపారు. ఈ వంతెన సివిల్ ఇంజనీరింగ్ అద్భుతమని, దీని నిర్మాణ ఘనత భారతీయ రైల్వేలకే దక్కుతుందని పేర్కొన్నారు. అత్యద్భుతమైన ఈ వంతెన నిర్మాణంలో వివిధ రూపాల్లో వేలాది మంది ప్రజలు భాగస్వాములయ్యారని తెలిపారు. ప్రతిష్ఠాత్మక బ్రిడ్జి నిర్మాణంలో పాలుపంచుకొన్న తెరవెనక హీరోలు ఎంతో మంది ఉన్నారని, వారికి సెల్యూట్ చేస్తున్నానని వెల్లడించారు. అఫ్కాన్స్ సంస్థకు తాను జియో టెక్నికల్ కన్సల్టెంట్‌గా మాత్రమే ఉన్నానని.. ఏటవాలు ప్రాంతాల్లో పునాదులు, నిర్మాణాల డిజైన్ల అభివృద్ధిలో సాయం చేయడమే తన పని అని ఆమె ఎక్స్‌లో పోస్ట్ చేశారు. తనను అనవసరంగా తనను ప్రముఖురాలిని చేయొద్దని విజ్ఞప్తి చేశారు. తన గోప్యతకు భంగం కలిగించవద్దని కోరారు.

తమకు మతం లేదన్నవారు పెరుగుతున్నారు

» వేగంగా పెరుగుతున్న ఇస్లాం.. స్థిరంగా హిందూ మతం

న్యూఢిల్లీ, జూన్ 10: ప్రపంచంలో ప్రధాన మతాలను అనుసరించే వారి సంఖ్య ఓ వైపున పెరుగుతుంటే.. మరోవైపు తమకు ఎలాంటి మతమూ లేదని చెప్పేవారు కూడా గణనీయంగానే ఉన్నారు. క్రైస్తవం ఇప్పటికీ అతి పెద్ద మతంగా కొనసాగుతున్నప్పటికీ, మతం వద్దనుకొనే వారి సంఖ్య కూడా దాంట్లోనే అధికంగా ఉంది. అందువల్ల శాతాల్లో లెక్కిస్తే క్రైస్తవుల సంఖ్య తగ్గుతోంది. ఇంకోవైపు ప్రపంచవ్యాప్తంగా ముస్లింల జనాభా పెరుగుతూ ఈ శతాబ్దం మధ్యభాగం నాటికి క్రైస్తవంతో సమానం కానుంది. హిందువుల జనాభా స్థిరంగా ఉండగా, బౌద్ధుల సంఖ్య పడిపోతోంది. ప్యూ రీసెర్చ్ సెంటర్ జరిపిన అధ్యయనంలో ఈ ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. 2010-2020 కాలానికి చెందిన 2,700 జనాభా లెక్కలు, సర్వేలను అధ్యయనం చేసిన ప్యూ సెంటర్ మతాల వారీగా జనాభా పెరుగుదలలో మార్పులను గుర్తించింది. ఈ పదేళ్ల కాలంలో క్రైస్తవుల జనాభా 218 కోట్ల నుంచి 230 కోట్లకు పెరిగింది. అయితే ప్రపంచ జనాభాలో క్రైస్తవుల వాటా తగ్గింది.



2010లో 30.6 శాతం ఉండగా, అది 28.8 శాతానికి పడిపోయింది. అదే సమయంలో ముస్లిం జనాభా 34.70 కోట్ల మేర అధికమయింది. మొత్తం జనాభా సుమారు 200 కోట్ల వరకు ఉంది. 1.8 పాయింట్ల వృద్ధి శాతంతో ప్రపంచ జనాభాలో 25.6 శాతం వాటా పొందింది. ఏ మతమూ లేదని చెప్పే వారి సంఖ్య ప్రపంచ జనాభాలో 24.2 శాతం వరకు ఉంది. హిందూమతం, జూడాయిజం జనాభా స్థిరంగా ఉంది. గత పదేళ్లలో బౌద్ధుల జనాభా తగ్గింది. ఐరోపా దేశాల్లో క్రైస్తవుల సంఖ్య తగ్గుతుండగా సబ్ సహారన్ ఆఫ్రికాలో పెరుగుతోంది. ఎలాంటి మతం లేదని చెప్పేవారి సంఖ్య అమెరికా, చైనా, జపాన్‌ల్లో అధికంగా ఉంది. లౌకికవాద భావజాలం పెరుగుతుండడంతో అందుకు అనుగుణంగా సమాజం, పరిపాలనలో మార్పులు వస్తాయని ఈ అధ్యయనం చేసిన నిపుణులు అభిప్రాయపడ్డారు.

స్టైపెండ్ కోసం మెడికోల పోరు బాట

- తమకు రావాల్సిన భృతి ఇవ్వాలని డిమాండ్
- ప్రైవేటు కాలేజీలపై ప్రభుత్వానికి ఫిర్యాదు
- స్టైపెండ్ సొమ్ము ఎగ్గొడుతున్నాయని ఆవేదన
- వైద్య శాఖ అప్రమత్తం.. 15 కాలేజీల్లో తనిఖీలు
- కళాశాలలకు నచ్చినంత చెల్లిస్తున్నట్లు వెలుగులోకి

హైదరాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రైవేటు వైద్య కళాశాలల్లో పని చేసే హౌస్ సర్జన్లు స్టైపెండ్ కోసం ఆందోళన బాటపట్టారు. జాతీయ వైద్య కమిషన్(ఎన్ఎంసీ) నిబంధనల ప్రకారం తమకు రావాల్సిన భృతి ఇవ్వాలని రాష్ట్రవ్యాప్తంగా మెడికోలు నిరసనలకు దిగారు. తమకు నెల నెలా చెల్లించాల్సిన స్టైపెండ్‌ను కాలేజీ యాజమాన్యాలు ఇవ్వడం లేదని గతంలో వారంతా ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. రాష్ట్రానికి వచ్చిన ఎన్ఎంసీ చైర్మన్ డాక్టర్ గంగాధర్ దృష్టికి కూడా తీసుకువెళ్లారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రైవేటు మెడికల్ కాలేజీలు చెల్లిస్తున్న స్టైపెండ్‌పై ఆరా తీసింది. వైద్య బృందాలను పంపి, నివేదిక ఇవ్వమని ఆదేశించింది. దాంతో తొలి విడతగా 15 కాలేజీల్లో తనిఖీలు చేశారు. ఈ సోదాల్లో ఎన్ఎంసీ నిబంధనల ప్రకారం మెడికోలకు స్టైపెండ్ చెల్లించడం లేదని అధికారుల నివేదిక వెల్లడించింది. కొన్ని కాలేజీలైతే ఒక్క రూపాయి కూడా ఇవ్వడం లేదని తేలింది.

కాలేజీలకు నచ్చినంత చెల్లింపు..

వైద్య విద్యార్థులు ఎంబీబీఎస్ పూర్తి చేసిన తర్వాత తమ కళాశాల అనుబంధ ఆస్పత్రుల్లోనే ఏడాది పాటు హౌస్ సర్జన్‌గా పనిచేయాలి. ఆ సమయంలో వారికి ఎన్ఎంసీ నిబంధనల మేరకు నెలకు రూ.25,906 స్టైపెండ్ చెల్లించాలి. అలా ఏడాది పాటు ఇవ్వాల్సి ఉండగా, చాలా కాలేజీలు సక్రమంగా ఇవ్వడం లేదు. కొన్ని కళాశాలలు భృతి ఇచ్చినట్లు లెక్కల్లో చూపిస్తున్నాయి. అధికారులు తనిఖీ చేసిన 15 కాలేజీల్లో 1,675 మంది హౌస్ సర్జన్లు పనిచేస్తున్నారు. ప్రతి నెలా వీరందరికీ రూ.4.33 కోట్లు స్టైపెండ్ చెల్లించాలి. కానీ కాలేజీలు కేవలం రూ.92,83,169 చెల్లిస్తున్నాయి. మిగిలిన 3.41 కోట్లను ఇవ్వడం లేదు. ఇలా ఒక ఏడాదిలో రూ.40.93 కోట్ల స్టైపెండ్‌ను ఈ కాలేజీల్లోని హౌస్ సర్జన్లు కోల్పోతున్నారు. ఇదిలా ఉంటే, పీజీ విద్యార్థులకు కూడా ప్రతి నెలా స్టైపెండ్ ఇవ్వాలి. ప్రైవేటులో 19 కాలేజీల్లో పీజీ కోర్సులున్నాయి. నిబంధనల మేరకు మొదటి ఏడాది పీజీలకు రూ.58 వేలు, రెండో ఏడాది రూ.61 వేలు, మూడో ఏడాది వారికి రూ. 64 వేలు చెల్లించాలి. పీజీ డిప్లొమా కోర్సుల వారికి కూడా రూ.58-61 వేల మధ్యలో చెల్లించాలి. విద్యార్థులు పీజీలో చేరగానే ప్రైవేటు కాలేజీలు తమ క్యాంపస్‌లోని బ్యాంకులో ఖాతా తెరిపిస్తున్నాయి. ప్రతి నెలా స్టైపెండ్ వేసి, పీజీల డెబిట్ కార్డులు, చెక్‌లు ముందే తీసుకుని, వాటితో నగదు ఉపసంహరించుకుంటున్నట్లు వైద్య వర్గాలు తెలిపాయి. ఇలా, ఇంటర్న్‌ల స్టైపెండ్‌తో పాటు పీజీల భత్యాలను కూడా ప్రైవేటు కాలేజీ యాజమాన్యాలు దోచేస్తున్నాయి.

త్వరలో మరిన్ని తనిఖీలు..

మెడికోలు నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో సర్కారు మరోసారి రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రైవేటు కాలేజీల్లో పీజీ, హౌస్ సర్జన్ల స్టైపెండ్‌ల వివరాలను తనిఖీ చేయనుంది. కాళోజీ యూనివర్సిటీ వీసీ, వైద్య విద్య సంచాలకులు (అకడమిక్) డాక్టర్ శివరాం ప్రసాద్ ఆధ్వర్యంలోని బృందాలు ప్రైవేటు కాలేజీలను తనిఖీ చేయనున్నాయి. సమగ్ర విచారణ జరిపి, సర్కారుకు నివేదిక ఇవ్వనున్నాయి.

ఆ వ్యాఖ్య వెనుక కుట్ర

సమాజంలో అలజడికి పన్నాగం.. ఖండించాల్సిన కొమ్మినేని ప్రోత్సహించారు

- కుట్ర ప్రకారమే లైవ్ డిబేట్.. వాదనలు వినిపించిన ఏపీ స్పెషల్ కౌన్సెల్
- కొమ్మినేనికి 24 వరకు రిమాండ్
- గుంటూరు జిల్లా జైలుకు తరలింపు

గుంటూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): అమరావతి మహిళలను దారుణంగా అవమానిస్తూ.. 'వేశ్యలు'గా సంబోధిస్తూ సాగిన డిబేట్‌కు సంబంధించి 'సాక్షి' చానల్ యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావుకు మంగళవారం మంగళగిరి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మేజిస్ట్రేట్ రిమాండ్ విధించారు. ఈ నెల 24 వరకు రిమాండ్ విధించడంతో కొమ్మినేనిని ఏపీ పోలీసులు గుంటూరు జిల్లా జైలుకు తరలించారు. సాక్షి చానల్‌లో ఈ నెల 6న జరిగిన చర్చలో.. "అమరావతి దేవత రాజధాని కాదు.. వేశ్యల రాజధాని." అంటూ ఎనలిస్టు కృష్ణంరాజు దారుణ వ్యాఖ్యలు చేయడం.. ఆ డిబేట్‌ను నిర్వహించిన యాంకర్ కొమ్మినేని సదరు వ్యాఖ్యలను ఖండించకపోగా 'అవును.. నిజమే' అన్నట్లుగా సమర్థించడం తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై అమరావతి ప్రాంత దళిత జేఏసీ నాయకురాలు కంభంపాటి శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి కొమ్మినేనిని అదుపులోకి తీసుకున్న పోలీసులు సోమవారం రాత్రి గుంటూరులోని నల్లపాడు పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. మంగళవారం ఉదయం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం, మంగళగిరి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరు పరిచారు. కొమ్మినేని తరఫున ఏపీ మాజీ ఏఏజీ పొన్నవోలు సుధాకర్ రెడ్డి, వైసీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, న్యాయవాది మనోహర్ రెడ్డి, పలువురు న్యాయవాదులు వాదనలు వినిపించారు. ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ కౌన్సెల్ వీరగంధం రాజేంద్రప్రసాద్, మంగళగిరి కోర్టు ఏపీపీ శివలీల వాదనలు వినిపించారు. సమాజంలో వివిధ వర్గాల మధ్య వైషమ్యాలు.. విభేదాలు సృష్టించేందుకు సాక్షి డిబేట్‌లో జరిగిన కుట్రను చేదించాల్సి ఉందని.. దీనిపై సమగ్ర విచారణ జరపాల్సి ఉందని రాజేంద్రప్రసాద్ కోర్టు దృష్టికి తెచ్చారు. సాక్షిలో ప్రసారమైన కార్యక్రమాన్ని ల్యాప్‌టాప్‌లో మేజిస్ట్రేట్‌కు చూపారు. ఆ కార్యక్రమాన్ని చూసిన న్యాయాధికారి.. వారు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించారు. మరోవైపు.. కొమ్మినేని శ్రీనివాసరావును రిమాండ్ నుంచి తప్పించేందుకు పొన్నవోలు, తదితరులు తీవ్రంగా ప్రయత్నించారు. ఇరు పక్షాల వాదనలూ విన్న న్యాయాధికారి కె. సురేశ్ బాబు నిందితుడు కొమ్మినేనికి 24 వరకూ రిమాండ్ విధించారు.



కొమ్మినేనిని జైలుకు తరలిస్తున్న పోలీసులు

పొన్నవోలు చిందులు..

కొమ్మినేనికి కోర్టు రిమాండ్ విధించడంతో.. ఆయన తరఫు న్యాయవాది పొన్నవోలు సుధాకర్ రెడ్డి తీవ్ర అసహనానికి గురయ్యారు. "మా వాదనలు పూర్తిగా వినకుండానే రిమాండ్ విధించడం అన్యాయం, అక్రమం, అధర్మం." అంటూ చిందులు తొక్కారు. పొన్నవోలు కోర్టులో వ్యవహరిస్తున్న తీరుపై మేజిస్ట్రేట్ సురేశ్ బాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఇది చేపల మార్కెట్ కాదు. నోరు అదుపులో పెట్టుకుంటే మంచిది" అని హెచ్చరించారు.

అందువల్ల.. మీరు శిక్షార్హులే!

కోర్టులో న్యాయాధికారి అడిగిన ప్రశ్నలకు నిందితుడు కొమ్మినేని నీళ్లు నమిలారు. "వేశ్యలు, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు రాజధాని చుట్టూ ఉన్నారని ఇంత దుర్మార్గమైన వ్యాఖ్యలు చేస్తున్నప్పుడు.. మీరెందుకు ఖండించలేదు. అంతేగాక హిందూ దేవతలు, ముస్లిం దేవతలు, క్రిస్టియన్ దేవతలు అంటూ నవ్వుతూ వ్యంగ్యంగా మాట్లాడడం.. ఆ వ్యాఖ్యలను ప్రోత్సహించినట్లే కదా!. అందువల్ల మీరు శిక్షార్హులే. ఎలా వదిలి పెట్టాలి?" అని ప్రశ్నించారు. దీంతో.. కొమ్మినేని నీళ్లు నమిలారు.

అట్రాసిటీ చట్టంపై అభ్యంతరం

సాక్షి టీవీ చర్చలో చేసిన వ్యాఖ్యలపై నమోదైన కేసులో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ సెక్షన్ నమోదు చేయడంపట్ల న్యాయాధికారి సురేశ్ బాబు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సెక్షన్లను ఎలా నమోదు చేస్తారని తుళ్లూరు డీఎస్పీ మురళీకృష్ణను నిలదీశారు. వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

ఎన్‌సీడబ్ల్యూ సుమోటో విచారణ

జగన్ చానల్‌లో జర్నలిస్టు కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించిన జాతీయ మహిళా కమిషన్(ఎన్‌సీడబ్ల్యూ) సుమోటోగా విచారణకు తీసుకుంది. ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ కమిషన్ చైర్‌పర్సన్ విజయ రహత్కర్ డీజీపీకి లేఖ రాశారు. మూడు రోజుల్లో నివేదిక సమర్పించాలని స్పష్టం చేశారు.

జగన్ మీడియాను నిషేధించాలి

- మూడోరోజూ మహిళల ఆందోళనలు

జగన్ మీడియా లైవ్ డిబేట్‌లో అమరావతి రాజధాని మహిళల పట్ల అనుచితంగా మాట్లాడిన జర్నలిస్టులు కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజులతోపాటు ఆ మీడియా యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం కూడా రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ, బీజేపీ, జనసేన మహిళా నేతలు, మహిళా సంఘాల కార్యకర్తలు ఆందోళనలు నిర్వహించారు. జగన్ మీడియా కార్యాలయాల వద్ద ఆందోళనలు నిర్వహించారు. జగన్ పత్రిక ప్రతులను దహనం చేశారు. నెల్లూరు జిల్లా కావలి, కందుకూరు, వింజమూరు, కోవూరులలో ర్యాలీలు నిర్వహించారు. రాజమహేంద్రవరంలో ఆజాద్ చౌక్ నుంచి దేవిచౌక్ వరకు భారీ ర్యాలీ చేశారు. విజయనగరంలో మహిళలు భారీ ర్యాలీ, మానవహారం నిర్వహించారు. కడప నగరంలో సంధ్యా సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అమరావతిని వేశ్యల రాజధాని అని సాక్షి చానల్ లైవ్ డిబేట్‌లో వ్యాఖ్యానించడం దారుణమని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలం రాయలం గ్రామంలో మంగళవారం ఆయన ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులుతో కలిసి జగన్ పత్రిక ప్రతులను తగలబెట్టారు.



నెల్లూరు జిల్లా కావలిలో సాక్షి మీడియాకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు



మంత్రి దామోదర రాజనర్సింహతో వాకిటి శ్రీహరి

వైద్యమంత్రిని కలిసిన వాకిటి, డిప్యూటీ స్పీకర్

హైదరాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను తాజాగా మంత్రివర్గంలో చోటు దక్కించుకున్న మంత్రి వాకిటి శ్రీహరి తన కుటుంబ సభ్యులతో సహా మంత్రుల క్వార్టర్స్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీహరిని మంత్రి దామోదర అభినందించారు. అలాగే, డిప్యూటీ స్పీకర్‌గా నియమితులైన రామచంద్రు నాయక్ కూడా వైద్య మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు దామోదర అభినందనలు తెలిపారు.

హరీశ్‌రావుపై ఎన్నికల పిటిషన్ కొట్టివేత

- ఆరోపణలకు ఒక్క ఆధారమూ చూపలేదని హైకోర్టు వ్యాఖ్య

హైదరాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావుకు హైకోర్టులో ఊరట లభించింది. ఆయన ఎన్నిక చెల్లదంటూ దాఖలైన ఎలక్షన్ పిటిషన్ (ఈపీ)ని హైకోర్టు మంగళవారం కొట్టివేసింది. 2023 ఎన్నికల్లో ఆయనపై బీఎస్పీ తరఫున పోటీచేసి ఓడిపోయిన గధగోని చక్రధర్‌గౌడ్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కే శరత్ ధర్మాసనం విచారణ జరిపింది. చక్రధర్ గౌడ్ తరఫు న్యాయవాదులు వాదిస్తూ.. హరీశ్‌రావు ఫారం-26 అఫిడవిట్‌లో సరైన వివరాలు ఇవ్వలేదని పేర్కొన్నారు. హరీశ్‌రావు తరఫున న్యాయవాది ఆర్. చంద్రశేఖర్‌రెడ్డి వాదిస్తూ ఒక్క ఆరోపణకు కూడా ఆధారాలు లేవని తెలిపారు. ఈ వాదనతో ధర్మాసనం ఏకీభవించింది. ఇతర ఆరోపణలకు ఒక్క ఆధారం కూడా చూపనందున పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్టు తెలిపింది.

మాగంటి గోపీనాథ్‌పై దాఖలైన పిటిషన్ల ముగింపు..

2023లో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా ఎన్నికైన మాగంటి గోపీనాథ్ ఎన్నిక చెల్లదని దాఖలైన రెండు ఎలక్షన్ పిటిషన్‌లను హైకోర్టు ముగించింది. ఆయన ప్రత్యర్థి అయిన మహమ్మద్ అజారుద్దీన్, వి. నవీన్‌రెడ్డి వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. గోపీనాథ్ చనిపోయిన నేపథ్యంలో వాటిని ముగిస్తున్నట్లు జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం ప్రకటించింది.

ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల బంద్ ప్రశాంతం

చర్ల/దుమ్ముగూడెం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం ఛత్తీస్‌గఢ్‌లో బంద్ సంపూర్ణంగా జరిగింది. తెలంగాణలో బంద్ ప్రభావం కనిపించలేదు. మిగతా రాష్ట్రాల్లో పాక్షిక స్పందన లభించింది. మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో పాటు ఇతర మావోయిస్టుల ఎన్‌కౌంటర్లను నిరసిస్తూ ఆ పార్టీ దేశవ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. దీంతో పలు ప్రాంతాల్లో కేంద్ర బలగాలతో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాల్లోని చర్ల, దుమ్ముగూడెం, వెంకటాపురం, వాజేడు, ఏటూరు నాగారం మండలాల్లో బంద్ ప్రభావం కనిపించలేదు. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, సుక్మా, నారాయణపూర్, కొడగావ్, ఇతర జిల్లాల్లో దుకాణాలను మూసివేశారు.

మరో ముగ్గురు ఎన్‌కౌంటర్ మృతుల గుర్తింపు

బీజాపూర్ జిల్లా ఇంద్రావతి నేషనల్ పార్కు అడవుల్లో ఈ నెల 8న జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన ఐదుగురు మావోయిస్టుల్లో ముగ్గుర్ని బలగాలు మంగళవారం గుర్తించాయి. మృతులు రైనీ, పూనెం సుందూర్, కుడియం మహేష్‌లు నేషనల్ పార్కు మావోయిస్టు కమిటీ సభ్యులు. వీరిపై రూ.11 లక్షల వరకు రివార్డు ఉంది.

ప్రైవేటుకు మరింత స్వయం ప్రతిపత్తి

- విద్యా సంస్థల విషయంలో కేంద్ర ప్రభుత్వం నిర్ణయం
- తెలంగాణలో ఐఐఎంకు ప్రతిపాదన
- కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

హైదరాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యా విధానం మన దేశ విద్యావ్యవస్థలో చరిత్రాత్మక మార్పులకు శ్రీకారం చుడుతుందని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చెప్పారు. ఉన్నత విద్యలో విద్యార్థుల స్థూల నమోదు నిష్పత్తి (జీఈఆర్) ప్రస్తుతం 27శాతం ఉందని, దీనిని 2035 కల్లా 50శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఇందుకోసం మరిన్ని కాలేజీలు, వర్సిటీలు అవసరమని చెప్పారు. ప్రైవేటు విద్యా సంస్థలకు మరింత స్వయంప్రతిపత్తి కల్పించాలని కేంద్రం సూత్రప్రాయంగా నిర్ణయించిందని వెల్లడించారు. అయితే ఏకచ్ఛత్రాధిపత్యాన్ని అంగీకరించబోమన్నారు. తెలంగాణలో ఐఐఎం ఏర్పాటుకు ప్రతిపాదనఉందని తెలిపారు. ప్రధాని మోదీ 11ఏళ్ల పాలనలో సాధించిన విజయాలకు సంబంధించిన పుస్తకాన్ని మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ధర్మేంద్ర ప్రధాన్ ఆవిష్కరించారు. భారత్ గత 11 ఏళ్లలో ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదిగిందన్నారు. దేశప్రగతిలో దక్షిణాది రాష్ట్రాలు గ్రోత్ ఇంజన్లని వ్యాఖ్యానించారు. ఏపీలో క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటు అంశం సీఎం చంద్రబాబు విజన్‌కు నిదర్శనమని ప్రశంసించారు. స్టార్టప్‌లకు బెంగళూరు, బహుళజాతి సంస్థల ఆర్థిక రంగానికి తమిళనాడు హబ్‌గా మారితే.. హైదరాబాద్ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తోందన్నారు. విద్యారంగంలో దక్షిణ భారత్ లీడర్ అని అభివర్ణించారు.



ఐఐటీహెచ్‌లో సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ధర్మేంద్ర ప్రధాన్

ఏఐతో మానవ శ్రమ కనుమరుగు

కంది, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రాబోయే రోజుల్లో కృత్రిమ మేధ(ఏఐ) మానవ శ్రమను పూర్తిగా కనుమరుగు చేస్తుందన్న ఆలోచన విడ్డూరమైందేమీ కాదని, భవిష్యత్తు అంతా ఏఐదే అని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. అయితే, మానవాళికి ఏఐ వల్ల కలిగే మేలు, హానిపై ప్రశ్నించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ-హైదరాబాద్‌లో అంతర్జాతీయ యువ శాస్త్రవేత్తల సదస్సును, గ్లోబల్ యంగ్ అకాడమీ వార్షిక సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. సదస్సును మంగళవారం ధర్మేంద్ర ప్రధాన్ ప్రారంభించారు. పరిశోధనల కోసం ఇప్పటికే 9 రిసెర్చ్ పార్కులను ప్రారంభించామని, మరో 13పార్కులను త్వరలోనే ఏర్పాటు చేస్తామని తెలిపారు. కాగా, ఈ నెల 14వరకు జరిగే సదస్సులో 60 దేశాలకు చెందిన 135 మంది యువ శాస్త్రవేత్తలు పాల్గొననున్నారు. మంగళవారం ప్రారంభ కార్యక్రమంలో ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ అధ్యక్షుడు ప్రొఫెసర్ అశుతోష్ శర్మ, ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి, ఐఐటీ హైదరాబాద్ బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ చైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ఈదురు గాలులు, భారీవర్ష బీభత్సం!

- కూలిన భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు.. అంధకారంలో గ్రామాలు
- చెట్టు కూలి ఒకరు, పిడుగు పడి మరొకరి మృతి
- నిజామాబాద్, సంగారెడ్డి, ఆదిలాబాద్ జిల్లాల్లో ఘటనలు

హైదరాబాద్, సుభాష్‌నగర్ (నిజామాబాద్), ధరూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో సోమవారం అర్ధరాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. భారీ వృక్షాలు, కరెంటు స్తంభాలు నేలకూలిపోయాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో అనేక ప్రాంతాలు అంధకారంలో మునిగిపోయాయి. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 126 విద్యుత్ స్తంభాలు నేలమట్టమవగా, మూడు ట్రాన్స్‌ఫార్మర్లు సైతం దెబ్బతిన్నాయి. ఈదురుగాలులకు రేకుల షెడ్డుపై చెట్టుపడగా అక్కడే ఉన్న ట్రాన్స్‌కో లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ (52) తీవ్ర గాయాలతో చనిపోయాడు. అలాగే, సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్, కల్హేర్, కంగ్టి మండలాల్లో గాలివానతో విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకూలాయి. ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం లక్ష్మీపూర్‌లో కలిమి నాగమ్మ(45) పిడుగుపడి మృతి చెందింది. కాగా, మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం మధ్య నిర్మల్ జిల్లా కుబీర్‌లో అత్యధికంగా 7 సెం.మీ. వర్షపాతం నమోదైంది. కాగా, జోగుళాంబ గద్వాల జిల్లాలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు వద్ద మంగళవారం 20 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 17,467 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో నమోదవుతోంది.

నేడు, రేపు భారీ వర్ష సూచన

రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో బుధ, గురువారాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. బుధవారం ప్రధానంగా మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల జిల్లాల్లోనూ, గురువారం భూపాలపల్లి, ములుగు, వికారాబాద్, మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. మిగిలిన అన్ని జిల్లాల్లోనూ ఉరుములు, మెరుపులతో వర్షాలు కురుస్తాయని తెలిపింది. రాబోయే 4 రోజులకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది.

మాట తప్పితే రాష్ట్రాన్ని రణరంగంగా మారుస్తాం

- బీసీలకు 42 శాతం కోటాపై

ఆర్ కృష్ణయ్య హెచ్చరిక



బర్కత్‌పుర, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన తీర్మానానికి అనుగుణంగా బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకపోతే రాష్ట్రాన్ని రణరంగంగా మారుస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య హెచ్చరించారు. రిజర్వేషన్లపై జీవో జారీ చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంఘాలు, మేధావులు, న్యాయ నిపుణులు, అన్ని పార్టీలతో సమావేశం వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం కాచిగూడలోని ఓ హోటల్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ఆధ్వర్యంలో బీసీ కుల సంఘాల సమావేశం నిర్వహించారు. ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ బీసీ పథకాలను నీరుగార్చే కుట్ర జరుగుతోందని, సీఎం రేవంత్‌రెడ్డి సరైన రీతిలో స్పందించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి మాట్లాడుతూ రిజర్వేషన్లపై బీసీలు చావో రేవో తేల్చుకోవాలని పిలుపునిచ్చారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కెనడాకు మోదీ!

ఐదురోజుల్లో ఆరంభంకాబోతున్న జీ7సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొనబోతున్నారు. ఇందుకోసం పదేళ్ళ తరువాత కెనడాలో అడుగుపెట్టబోతున్నారు. కెనడా ప్రధానిగా జస్టిన్ ట్రూడో ఉండగా ఇరుదేశాల సంబంధాలను ఉప్పూనిప్పూగా మార్చివేసిన విషయం తెలిసిందే. ఖలిస్తానీ వేర్పాటువాది హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్య ఘటనతో ఏడాదిన్నర కాలంగా రెండుదేశాల మధ్య పూడ్చలేనంత అగాధం ఏర్పడింది. ట్రూడో హద్దులు దాటిన వ్యాఖ్యలతో, నిరాధారమైన ఆరోపణలతో దౌత్యసంబంధాలను దెబ్బతీశారు. ఇరుదేశాలు వాగ్బాణాలు విసురుకున్నాయి, దౌత్యసిబ్బందిని బహిష్కరించుకున్నాయి, వాణిజ్యచర్చలను సైతం నిలిపివేశాయి. ప్రస్తుత ప్రధాని మార్క్ కార్నీ భారత ప్రధానికి ఫోన్‌చేసి జీ7 సదస్సుకు ఆహ్వానించడం ద్వారా ఆ ప్రతిష్ఠంభనను తొలగించారు. అయితే, ఇందుకు ఆయన స్వదేశంలో విమర్శలు ఎదుర్కోవాల్సివచ్చింది, వివరణలూ ఇచ్చుకోవాల్సివచ్చింది. జనసంఖ్యలో తొలిస్థానంలోనూ, ఆర్థికవ్యవస్థలో ఐదోస్థానంలోనూ ఉంటూ, ప్రపంచ సరఫరావ్యవస్థల్లో ముఖ్యభూమిక నిర్వహిస్తున్న భారత్‌ను ఆహ్వానించకుండా ఎలా ఉంటాం? అని ఆయన ఎదురుప్రశ్న వేశారు. భౌగోళికార్థిక, రాజకీయ ప్రాధాన్యతలరీత్యా పిలిచారే తప్ప, మనమీద గౌరవంతో కాదని కొందరు చేస్తున్న వ్యంగ్య వ్యాఖ్యలను అటుంచితే, భారత్‌ను కాదనగలిగే స్థితిలో ఆ అగ్రరాజ్య కూటమి లేదన్నది వాస్తవం. కెనడాకు ఇది రాజీకావచ్చు. భారతదేశానికి మాత్రం గౌరవమే.

అయితే, మేనెల తొలివారంలోనే ఆహ్వాన ప్రక్రియను పూర్తిచేయాల్సిన కెనడా ఆ మేరకు మనల్ని వెనక్కునెట్టి, కాసింత కక్షతీర్చుకున్నట్టే కనిపిస్తోంది. ప్రత్యేకాహ్వానితులకు సైతం నెలక్రితమే పిలుపులు వచ్చి, వస్తున్నామన్న వారి సందేశాలు కూడా వెనక్కు చేరిపోయినా, మనలను మాత్రం వారం ముందువరకూ పిలవకుండా ఊరుకోవడం విచిత్రమే. ఈ పేరంటానికి ఎంతకూ పిలుపురాకపోవడం గురించి జాతీయమీడియా తెగచర్చోపచర్చలు చేసింది. రమ్మని అనకపోతే మనకు పోయేదేమీ లేదని కొందరు విశ్లేషకులు సాధారణజనానికి ముందే సర్దిచెప్పారు. ఇప్పుడు కేవలం ఓ వారంముందు ఫోన్‌చేసి రమ్మంటే వెళ్ళిపోవడం ఏమి బాగుంటుందని కొందరి అనుమానం. వెళ్ళకపోతే అలిగామనో, అవమానపడ్డామనో అనుకుంటారు కనుక, వారిది పైచేయి కాకుండా వెళ్ళడమే మంచిదని మన నాయకులకు అనిపించివుండవచ్చు. ప్రపంచస్థాయి సదస్సులు నరేంద్రమోదీకి కొత్తేమీ కాదు కానీ, పదకొండేళ్ళ పాలన పూర్తిచేసుకున్న వారంలోనే ఆయన కెనడాలో కాలూని, ఏడుగురు దేశాధినేతలతో ముచ్చటించబోతున్నారు. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో, ఉగ్రవాదంపై పోరు విషయంలో భారత్ వీసమెత్తురాజీపడబోదని మిగతా ప్రపంచానికి మరోమారు చాటిచెప్పేందుకు ఈ సదస్సు ఉపకరిస్తుంది. పహల్గాంలో పర్యాటకుల ఊచకోత, పాక్ ప్రేరేపిత ఉగ్రవాదుల పాత్ర, భారత్ ఆత్మరక్షణ హక్కు ఇత్యాది అంశాలను ఆయన వివరించవచ్చు. వాణిజ్యాన్ని ఆయుధంగా వాడి యుద్ధం నేనే ఆపానని చెప్పుకున్న అమెరికా అధ్యక్షుడితో నేరుగా సంభాషించగలిగే సందర్భం కూడా ఇదే.

ఈ సదస్సుకు మోదీని ఆహ్వానించడం ఖలిస్తానీ శక్తులకు పెద్ద ఎదురుదెబ్బ అని కొందరు విశ్లేషిస్తున్నారు. ఎంత ఒత్తిడితెచ్చినా కెనడా ప్రధాని ముందడుగువేశారని ప్రశంసిస్తున్నారు. ఆర్థికంగా బలంగా ఉన్న భారత్‌కు సహజవాయువు అమ్ముకోవచ్చు, అణువిద్యుత్ కర్మాగారాలు నిర్మించవచ్చు, మరెన్నో ప్రాజెక్టులు నిర్మించి మనమూ బాగుపడవచ్చునంటూ కెనడా ప్రధాని నిర్ణయాన్ని అక్కడి విపక్షనాయకుడు సైతం సమర్థించుకొచ్చారు. భారత వ్యతిరేక చర్యలకు కెనడాను వేదికగా వాడుకుంటున్న ఖలిస్థానీ వేర్పాటువాద శక్తుల పట్ల కెనడా ప్రధాని కఠినంగా వ్యవహరించినప్పుడే ఉభయదేశాల సంబంధాలు పూర్తిస్థాయిలో తిరిగిపట్టాలు ఎక్కుతాయి. శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో రెండుదేశాలు పూర్తిగా సహకరించుకుంటాయని గట్టిగా చెబుతున్న కెనడా ప్రధాని, తమదేశంలో ఖలిస్తానీల బలం, బలగంతో నిమిత్తం లేకుండా భారతదేశం ఆందోళనలకు, అనుమానాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంది. ఆపరేషన్ సిందూర్ అనంతరం పాకిస్థాన్‌తోనూ, అక్కడి ఉగ్రవాద సంస్థలతోనూ వైరం హెచ్చి, రాబోయే రోజుల్లో భారత్ మరింత పోరాడాల్సిన తరుణంలో, ఈ శక్తులకు కెనడానుంచి ఎటువంటి మద్దతూ లభించకుండా చూడాలి. మోదీని ఆహ్వానించడం వెనుక కెనడా స్వప్రయోజనాల పరిరక్షణ ఉన్నట్టే, భారతీయులు గణనీయంగా ఉన్న కెనడాతో నెయ్యం సాధించడం భారత్‌కూ ప్రయోజనకరమే.

భారత రాష్ట్ర సమితి రాజకీయ అనిశ్చిత పరిస్థితిలో కొట్టుమిట్టాడుతుండగా యోజనాల దూరంలోని అమెరికాలో అట్టహాసంగా జరిపిన తెలంగాణ అవతరణ దినోత్సవ సభ ద్వారా భారాస లేదా కేటీఆర్ బృందం ఏ రకమైన సందేశం ఎవరికి ఇవ్వదలుచుకున్నది?

కేటీఆర్ కేంద్రంగా అమెరికాలోనూ హడావుడి!

భారత రాష్ట్ర సమితి అధ్వర్యంలో ఇటీవల అమెరికాలో తెలంగాణ అవతరణ దినోత్సవాలు విజయవంతంగా జరిగాయి. మాతృభూమిలోని రాజకీయాలకు ప్రత్యేకించి భారాస రాజకీయ కార్యాచరణకు ఈ వేడుకలు పరోక్షంగా ఒక దిశ, దశను నిర్దేశించాయని చెప్పవచ్చు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి స్వాగతం పలుకుతూ తొలుత 2014లో న్యూయార్క్‌లో, పిదప 2019లో టెక్సాస్‌లో నిర్వహించిన సభల స్థాయిలో తెలంగాణ రాష్ట్ర అవతరణోత్సవ సభను భారాస నిర్వహించిందని చెప్పవచ్చు. ప్రధాని మోదీ సభలు విజయవంతం కావడానికి అప్పట్లో రాంమాధవ్ కృషి ఒక ప్రధాన కారణం. అయితే భారత రాష్ట్ర సమితికి అమెరికాలో ఆ స్థాయి నాయకత్వ శ్రేణులు లేవు.

గల్ఫ్ లేఖ

అయినప్పటికీ అమెరికాలో తెలంగాణ ప్రవాసులు ఇప్పటి వరకు నిర్వహించిన రాజకీయ సభలలో ఇటీవలి భారాస సభ విజయకేతనంగా నిలిచిందనడంలో సందేహం లేదు.

తెలంగాణ ఆవిర్భావాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ సభ కేటీఆర్ కేంద్రంగా జరిగింది! ఈ భారీ సభలో కేటీఆర్ మాత్రమే భవిష్యత్తులో భారాసకు అధినాయకుడని స్పష్టమైన సంకేతాలు వెల్లడయ్యాయి. ఆంధ్రప్రదేశ్ వైపు తెలంగాణ ఆరంభంలో ఉండే సూర్యాపేటకు చెందిన జగదీశ్ రెడ్డి మొదలు మహారాష్ట్రకు సమీపంలో ఉండే చెన్నూరు ప్రాంతీయుడు బాల్క సుమన్ వరకు దాదాపు భారాస నాయకగణం అంతా తరలివచ్చిన అమెరికా సభ ఒక విధంగా కేటీఆర్ పట్టాభిషేక ఉత్సవమని కూడ అంతరంగికుల అభిప్రాయం. కేసీఆర్ దేవుడు అని, అయితే ఆయన చుట్టూ దయ్యాలు ఉన్నాయంటూ కవిత ఆక్షేపించిన నేపథ్యంలో ఈ సభకు భారాస నాయకులు పలువురు ప్రత్యేకంగా వచ్చి పాల్గొనడం సహజంగానే ఆసక్తి కలిగించింది. తమ రాజకీయ అస్తిత్వ ప్రదర్శన అయిన ఎల్కతుర్తి సభకు వరంగల్ జిల్లా భారాస కార్యకర్తలు ఎంత వరకు పని చేసారో తెలియదు



కానీ అమెరికా సభ విజయవంతం కావడానికి మాత్రం వరంగల్ జిల్లా నాయకులందరు కలిసికట్టుగా కృషి చేశారు. అందునా అమెరికా ప్రవాసురాలు ఒకరు కాంగ్రెస్ పార్టీ పక్షాన ప్రాతినిధ్యం వహిస్తున్న పాలకుర్తి నియోజకవర్గం నుంచి ఎక్కువ మంది ఈ సభా విజయానికి చురుకైన పాత్ర వహించడం విశేషం.

అసలు అమెరికాలో భారాస కంటే కవిత నేతృత్వంలోని తెలంగాణ జాగృతి ప్రాబల్యం ఎక్కువ. విదేశాలలో తెలంగాణవాదానికి బతుకమ్మ అనేది ఒక సాంస్కృతిక ప్రతీక. బతుకమ్మ స్ఫూర్తిని అమెరికాతో సహా ప్రపంచవ్యాప్తంగా సకల దేశాలలో వ్యాపింపజేయడంలో కవిత కీలకపాత్ర వహించారు. ఈ రీత్యా అమెరికాలో తెలంగాణ జాగృతి ఒక ఊపు మీద ఉండాలి. పైగా కేటీఆర్ స్వాగత సన్నాహక ఏర్పాట్లు జరుగుతున్న సందర్భంలో కవిత అమెరికాలోనే ఉన్నారు. కవిత లేదా తెలంగాణ జాగృతి ఎక్కడ కూడ ఈ సన్నాహక ఏర్పాట్ల దరిదాపులలో కూడ కనిపించలేదు. భారాస నాయకగణం అమెరికాలో ఉన్నా ఎవరూ కూడా ఆమెతో ప్రత్యేకంగా భేటీ అయినట్లుగా కూడ సమాచారం లేదు. అమెరికా నుంచి తిరిగి వెళ్ళిన తర్వాత కవిత తన వ్యాఖ్యల ద్వారా ప్రకంపనలు సృష్టించారు.

అమెరికాలో భారాసకు తన్నీరు మహేశ్ రావు ఒక ప్రధాన దిక్కు. అందరితో సౌమ్యంగా ఉంటూ కలుపుకుపోయే స్వభావం ఆయన సొంతం. భారాస అగ్ర నాయకుడు హరీశ్ రావుకు మహేశ్ స్వయాన సోదరుడు. ఈ సభ నిర్వహణలో మహేశ్ రావుతో ఇతరులు కీలక పాత్ర వహించారు. విభిన్న సామాజిక వర్గాల నేపథ్యం ఉన్న ఈ ఇతరులు ఇక్కడ ఒక ప్రధాన ఆకర్షణ. సాధారణంగా అధికారంలో ఉన్న పార్టీల నేతల, సామాజిక వర్గాలకు చెందిన బంధుమిత్ర గణం విదేశాలలో పార్టీ కార్యకలాపాలలో ముందంజలో ఉంటారు. భారాస అధికారంలో ఉన్నప్పుడు కూడ ఇదే పరిస్థితి. అయితే ఈసారి కేటీఆర్ సభ నిర్వహణలో విభిన్న సామాజిక వర్గాలకు చెందిన ప్రవాసులకు కూడా పాత్ర కల్పించారు.

అధికారంలో లేకున్నా కేటీఆర్ అమెరికాకు వస్తూ లండన్‌లోనూ, ఆ తర్వాత అమెరికాలో విశ్వవిద్యాలయాల విద్యార్థులు, వ్యాపార ప్రముఖులతో జరిపిన సమావేశాల ద్వారా సామాజిక మాధ్యమాలలో సముచిత ప్రాచుర్యం కల్పించారు. అమెరికాలో అడుగు పెట్టినప్పటి నుండి తిరిగి వెళ్లే వరకు కేటీఆర్ వేసిన ప్రతి అడుగు గురించి వివరించిన తీరు విలక్షణంగా ఉన్నది. దాని లక్ష్యం ఎవరు? అమెరికాలో ఉన్నవారా లేదా తెలంగాణలో ఉన్న వారా అనేది తెలియదు. రాజకీయ అస్తిత్వం కొరకు తెలంగాణలో పోరాడవల్సిన సమయంలో అమెరికాలో సభ ఎందుకు అంటూ కవిత సంధించిన ప్రశ్నను కూడ తోసిపుచ్చడానికి వీలు లేదు.

భారత రాష్ట్ర సమితి రాజకీయ అనిశ్చిత పరిస్థితిలో కొట్టుమిట్టాడుతుండగా యోజనాల దూరంలోని అమెరికాలో అట్టహాసంగా జరిపిన తెలంగాణ అవతరణ దినోత్సవ సభ ద్వారా భారాస లేదా కేటీఆర్ బృందం ఏ రకమైన సందేశం ఎవరికి ఇవ్వదలుచుకున్నది?

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

జాతిని నడిపిస్తున్న ఆలోచనే మోదీ



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చి 11 సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో ఆయన పాలనను పర్యాలోచన చేస్తే భారత రాజకీయాల్లో మోదీ రంగప్రవేశం తర్వాత కొత్త శకం మొదలైందని అనిపిస్తుంది. పీవీ నరసింహారావు ప్రధానమంత్రి అయిన తర్వాత ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టడంతో ఒక ఆర్థిక వ్యవస్థగా దేశం రూపురేఖలు మారినట్లే, మోదీ ప్రధానమంత్రి అయిన తర్వాత ఒక రాజకీయ, సామాజిక వ్యవస్థగా దేశం తీరుతెన్నులు మారాయన్న అభిప్రాయం కలుగుతుంది. పీవీ ప్రారంభించిన ఆర్థిక సంస్కరణల ప్రభావం ప్రతి రంగంలోనూ ఇప్పుడు కనపడుతోంది. మనుషుల జీవన ప్రమాణాలు మాత్రమే కాదు, మానవ సంబంధాలు కూడా మారిపోయాయి. మార్కెట్ శక్తులు మనిషి ఆలోచనలను పసిగట్టి తమకు అనుకూలంగా మార్చుకునే పరిస్థితి ఏర్పడింది. మధ్యతరగతి ప్రజల ఆకాంక్షలు పెరిగిపోయాయి.

నరేంద్ర మోదీ ఈ పరిస్థితుల్లో దేశ రాజకీయాల్లోకి ప్రవేశించారు. మార్పుకు చోదకశక్తిగా తనను తాను ప్రకటించుకున్నారు. మోదీ మార్కెట్‌ను సృష్టించలేదు. మార్కెట్‌కు అనువుగా తనను తాను తీర్చిదిద్దుకున్నారు. దేశంలో పెరుగుతున్న యువ జనాభా, టెక్నాలజీ, ముఖ్యంగా సోషల్ మీడియా విప్లవం, పట్టణీకరణ దేశ రాజకీయ క్రీడ స్వరూప స్వభావాలను మార్చి వేశాయి. ఈ క్రీడలో మోదీ నిష్ణాతుడుగా నిరూపించుకున్నారు. పీవీ ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలను కొనసాగిస్తూనే రాజకీయ, సామాజిక వ్యవస్థలపై పట్టు బిగించడం ప్రారంభించారు. క్రమంగా దేశ రాజకీయాలన్నీ తన చుట్టూ తిరిగేలా చేసుకున్నారు. మోదీ ప్రభావాన్ని ఎలా ఎదుర్కోవాలా అన్న మీమాంసలో ప్రతి రాజకీయ పార్టీ పడే పరిస్థితి ఏర్పడింది. సామాజిక వ్యవస్థలపై, సామూహిక చేతనపై ఒక బలమైన భావజాలం ప్రభావం చూపేందుకు మోదీ కారణమయ్యారు. ఇద్దరు వ్యక్తులు ఈ దేశం గురించి మాట్లాడుకుంటే నరేంద్రమోదీ అన్న వ్యక్తి పేరు దొర్లక తప్పని పరిస్థితిని ఆయన కల్పించారు. మోదీ దుర్మార్గుడని తీర్మానిస్తూ బలంగా ద్వేషించే వారు ఒక వర్గం అయితే, మోదీ అంతటి దేశభక్తుడు, జాతీయవాది మరొకరు లేరని బలంగా ఆరాధించేవారు మరో వర్గంగా చీలిపోయారు. తనను విమర్శించినా విస్మరించలేని పరిస్థితిని మోదీ కల్పించుకున్నారు.

'బలమైన నాయకులు సాధారణంగా జాతీయవాదాన్ని తమ రాజకీయంగా ప్రకటిస్తూ తమ చుట్టూ ఒక వ్యక్తిగతమైన ఆకర్షణను సృష్టించుకుంటారు. ఈ దేశ సమస్యల్ని పరిష్కరించగల సామర్థ్యం తమకే ఉన్నదని, తామేది చేసినా దేశం కోసమే చేశామనే అభిప్రాయాల్ని కల్పించే ప్రయత్నిస్తారు. ప్రజాస్వామ్యం పట్ల అవిశ్వాసం ఉన్నా, తాము ప్రజాస్వామికంగానే వ్యవహరిస్తున్నామని జనం భావించేలా చేస్తారు.' అని ప్రముఖ బ్రిటిష్ జర్నలిస్టు గిడియన్ రాక్ మన్ అన్నారు. నిజానికి ఈ విశ్లేషణ మోదీకి మాత్రమే కాదు, దేశంలో అనేకమంది నేతలకు కూడా వర్తిస్తుంది. అయితే మోదీ ప్రభావం ఇప్పటి వరకూ మన దేశం చూసిన నేతల కంటే విస్తృతమైనదే కాదు, భిన్నమైనది కూడా. తాను అధికారంలోకి వచ్చి 11 సంవత్సరాలైనా తన ఆమోదయోగ్యత, ప్రభావం తగ్గలేదని మోదీ నిరూపించుకున్నారు. అలా తగ్గలేదని నిరూపించుకునేందుకు ఆయన మొత్తం పార్టీ వ్యవస్థనూ, ప్రభుత్వ యంత్రాంగాన్నీ మాత్రమే కాదు, అనేక సంస్థల్నీ, వ్యక్తుల్నీ, మీడియాను ఉపయోగించుకుంటుండవచ్చు. గత ఏడాది సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి మెజారిటీ రాకపోయినా ఇవాళ పార్టీ మొత్తం తన చుట్టూ కేంద్రీకృతం కావడమే కాదు. తన మిత్రపక్షాలుగా భావిస్తున్న వారిని కూడా తన చుట్టూ దృష్టి సారించేలా చేసుకోగలిగారు. అంతే కాదు. దేశంలో ప్రతిపక్ష పార్టీలన్నీ ఆత్మరక్షణలో పడిపోయి తనను నిత్యం విమర్శించకుండా ఉండలేని పరిస్థితిని కల్పించుకున్నారు. అయిష్టంగానైనా కొన్ని పార్టీలు భజన చేసే పరిస్థితి కల్పించుకున్నారు. అలా చేసుకోగలగడమే ఆయన బలమైన నాయకత్వ లక్షణానికి నిదర్శనం.

బలమైన చర్యలు తీసుకోని వారు బలమైన నాయకులు కాలేరు. ఒక్కోసారి ఆ బలమైన చర్యలు బెడిసికొట్టవచ్చు, కాని ఆ పరిస్థితులను కూడా తనకు అనుకూలంగా తిప్పుకుని వ్యతిరేకతా పవనాలకు ఎదురొడ్డి పైకి లేవగల శక్తి తనకున్నదని మోదీ రుజువు చేసుకున్నారు. గత 11 సంవత్సరాలలో మోదీ ఎంతో ప్రతికూల వాతావరణాన్ని ఎదుర్కొన్నారు. పెద్ద నోట్ల రద్దు వల్ల ఆర్థిక వ్యవస్థ అతలాకుతలమైంది. రెట్టింపు కంటే ఎక్కువ ధరలకు రాఫెల్ యుద్ధ విమానాలను కొనుగోలు చేశారన్న విమర్శల్ని ఎదుర్కొన్నారు. వేలాది రైతులు సాగు చట్టాలకు వ్యతిరేకంగా నెలల తరబడి నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. భూసేకరణ చట్టాలపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. సమాచార హక్కు చట్టాన్నీ నీరుకార్చారన్న విమర్శలూ ఎదుర్కొన్నారు. జీఎస్టీ విధించిన తీరు కూడా వివాదాస్పదమయింది. పెగాసస్ నిఘా సాఫ్ట్‌వేర్ ద్వారా ప్రతిపక్షాల కదలికల్ని పసికట్టారన్న ఆరోపణలూ ఎదురయ్యాయి. భయంకరమైన కరోనా అగ్నిపరీక్షగా మారింది. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు పడిపోయినా సరే పెట్రోలియం ఉత్పత్తుల ధరలు తగ్గకపోవడం, రూపాయి విలువ దారుణంగా పడిపోవడం, ద్రవ్యోల్బణం తీవ్రస్థాయికి చేరుకోవడం, పార్లమెంట్‌లో కీలక బిల్లులను చర్చలు లేకుండా ఆమోదించడం, పార్లమెంట్ నూతన భవన ప్రారంభాన్ని, అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠను తానే నిర్వహించడం కూడా చరిత్ర పుటల్లో నమోదయ్యాయి. ఇక వ్యవస్థలపై పట్టు సాధించేందుకు చేసిన ప్రయత్నాలూ, ప్రతిపక్ష నేతలకు వ్యతిరేకంగా ఈడీ, సీబీఐ వంటి సంస్థల్ని ప్రయోగించడం కూడా జనం చర్చల్లో రాక మానలేదు. ఎన్నికల బాండ్ల పేరుతో అధికార పార్టీ పారదర్శకత లేకుండా భారీ ఎత్తున నిధులు సేకరించడాన్ని సుప్రీం కోర్టే తప్పు పట్టింది. చివరకు పాకిస్థాన్‌పై యుద్ధం ప్రారంభించి నాలుగు రోజుల్లో కాల్పుల విరమణ ప్రకటించడం మోదీ హయాంలో ఇప్పటివరకూ తీసుకున్న నిర్ణయాలకంటే ఎక్కువగా అంతటా చర్చనీయాంశమైంది.

వాజపేయి కంటే భిన్నమైన నేత నరేంద్ర మోదీ. ఆయన తనకు అనుకూలంగా జరిగిన ప్రచారాన్ని మాత్రమే కాదు, ఈ దేశ సమస్యలకన్నిటికీ నెహ్రూ–గాంధీ కుటుంబమే కారణమని ప్రతిభావంతంగా జనం విశ్వసించేలా చేయగలిగారు. కార్పొరేట్లకు అనుకూలమైన ప్రధానిగా ప్రతిపక్షాలు విమర్శించినా, తనను తాను ఓబీసీ నేతగా, చాయ్‌వాలాగా, తన తల్లి అంట్లు తోమిన పేదరాలిగా గద్గద స్వరంతో మాట్లాడి ఆకట్టుకోగలిగిన శక్తి మోదీకి ఉన్నది. తన విజయాలను తనకు అనుకూలంగా మార్చుకుని తన వైఫల్యాలకు ప్రతిపక్షాల గత నిర్ణయాలే కారణమని చెప్పడంలో మోదీని మించిన దిట్ట ఎవరూ లేరు. అన్నిటికంటే మించి మెజారిటీ హిందువులను తనకు అనుకూలంగా మార్చుకునేందుకు అన్ని రకాల వ్యూహాలను అవలంబించిన భారతీయ జనతా పార్టీ నేత మరొకరు లేరు. ఈ విషయంలో అడ్వాణీ, వాజపేయిలను కూడా మోదీ ఎంతో అధిగమించారు. సమాజాన్ని చీల్చారన్న విమర్శ ఎదుర్కొన్నా అదే ఆయన బలంగా మారింది.



నరేంద్ర మోదీ ఇవాళ ఒక వ్యక్తి కాదు ఒక శక్తి, ఒక సమిష్టి ఆలోచనా విధానంగా మారిపోయిన మహాశక్తి. ప్రధానమంత్రిగా విఫలమైనా, విజయవంతమైనా ఆయన ఆలోచనా విధానం ప్రజల మనసుల్లోంచి తొలగిపోవడం అంత సులభం కాదు. ఆయన ప్రధానిగా ఎన్నాళ్లుంటారన్నది ప్రశ్న కాదు. ఆయన ఆలోచనా విధానం కంటే బలమైన ఆలోచనా విధానాన్ని ప్రవేశపెట్టినప్పుడే ప్రతిపక్షం విజయం సాధించగలదు.

మోదీ వైఫల్యాలను ప్రజల ముందుకు తీసుకెళ్లడంతో ప్రతిపక్షాలు చేయని ప్రయత్నం అంటూ లేదు. కాని ఆ ప్రయత్నాలన్నీ వీగిపోయాయి. 'చౌకీదార్ చోర్ హై' అన్న నినాదం జనంలోకి వెళ్లలేదు. అదానీ, అంబానీలను మితిమీరి ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలూ ప్రభావం చూపలేదు. నిరుద్యోగం, ధరల పెరుగుదల, ఆర్థిక అసమానతల గురించి ఎంత తీవ్రంగా మాట్లాడినా అరణ్య రోదనలే అయ్యాయి. సామాజిక న్యాయాన్ని ఎజెండాగా చేపట్టినా జనంలో కదలికలు కనపడ్డ దాఖలాలు లేవు. గత ఏడాది నవంబర్‌లో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీతో ఎన్నికల కమిషన్ కుమ్మక్కయిందని తాజాగా రాహుల్ గాంధీ ఆరోపించారు. లక్షలాది నకిలీ ఓటర్లను జాబితాలో చేర్చారని, రెండు గంటల్లో 65 లక్షల ఓట్లు పోలయ్యాయని కాంగ్రెస్ పార్టీ చెబుతోంది. మహారాష్ట్ర మాదిరే బిహార్‌లో కూడా బీజేపీ అక్రమంగా గెలిచే ప్రయత్నం తప్పక చేస్తుందని రాహుల్ ఘంటాపథంగా సూచిస్తున్నారు. అయినా రాహుల్, కాంగ్రెస్ నేతల ఆరోపణలు జనం నమ్ముతున్నారని చెప్పేందుకు దాఖలాలు ఏమీ లేవు. అసలు కాంగ్రెస్ మాదిరి మిగతా రాజకీయ పార్టీలు కూడా బీజేపీ అక్రమాల ద్వారా గెలుస్తోందని నమ్ముతున్నాయా, బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా విషయంలో జరిగినట్లు అన్ని పార్టీలు ఎన్నికలను బహిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నాయా, అంతకు మించి బంగ్లాలో లాగా ప్రజా వెల్లువ కాంగ్రెస్ తదితర రాజకీయ పార్టీలకు అనుకూలంగా మారగలదా అన్న ప్రశ్నలకు జవాబు రానంతవరకూ రాహుల్ ఎన్ని ఆరోపణలు చేసినా వాటికి ప్రామాణికత ఏర్పడదు. అంతే కాదు, ప్రజాభిప్రాయాన్ని తమకు పూర్తిగా అనుకూలంగా మళ్లించుకునేందుకు, ప్రజలు తమ వెంట నడిచేందుకు తగిన వాతావరణాన్ని సృష్టించుకోవడంలో, తమ విశ్వసనీయతను పెంచుకోవడంలో ఈ దేశంలో ప్రతిపక్ష పార్టీలు ఎంతవరకు విజయం సాధించాయన్నదే ప్రశ్నార్థకం. అసలు మోదీపై తాము ఎక్కుపెట్టిన విమర్శలన్నీ ఎందుకు వీగిపోతున్నాయో ప్రతిపక్షాలకూ క్లూ అందడం లేదు!

నరేంద్రమోదీ త్వరలో 75 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న తరుణంలో ఆయన 11 సంవత్సరాల పాలనపై బీజేపీ పెద్ద ఎత్తున ప్రచారం చేసేందుకు ఎంతో ప్రాధాన్యమున్నది. భగవంతుడు ఒక లక్ష్యంతోనే భూమ్మీద తనను ప్రవేశపెట్టాడని భావిస్తున్న నరేంద్ర మోదీ ఇవాళ ఒక వ్యక్తి కాదు ఒక శక్తి, ఒక సమిష్టి ఆలోచనా విధానంగా మారిపోయిన మహాశక్తి. ప్రధానమంత్రిగా విఫలమైనా, విజయవంతమైనా ఆయన ఆలోచనా విధానం ప్రజల మనసుల్లోంచి తొలగిపోవడం అంత సులభం కాదు. ఆయన ప్రధానిగా ఎన్నాళ్లుంటారన్నది ప్రశ్న కాదు. ఆయన ఆలోచనా విధానం కంటే బలమైన ఆలోచనా విధానాన్ని ప్రవేశపెట్టినప్పుడే ప్రతిపక్షం విజయం సాధించగలదు.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

బడివేళ... ఉపాధ్యాయులకో మాట !

లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దడానికి కదులుతున్న ఉపాధ్యాయ లోకానికి స్వాగతం. ప్రభుత్వ ఉపాధ్యాయులుగా మీరు ఇటీవలి వేసవి సెలవుల్లో ఎన్నో శిక్షణల్లో పాల్గొన్నారు. అక్కడ చెప్పిన విషయాలు మీ వాస్తవ పరిస్థితులకు ఎంత వేరుగా ఉన్నాయో గుర్తించి ఉంటారు. శిక్షణ ఇచ్చిన వారిని మీరు సహృదయంతో అర్థం చేసుకుని, వారిని విసిగించకుండా ఆ శిబిరాలలో పాల్గొని ఉంటారు. మీరు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్చలు ఉంటే బాగుండని కొందరు ఉపాధ్యాయులు అనుకుంటే, చెప్పినా వినిపించుకునే వారు ఉండరని మరికొందరు మౌనంగా అనుసరించి ఉండిపోయి ఉంటారు.

వేసవి సెలవుల అనంతరం గురువారం నుంచి తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలలు తెరుచుకోనున్నాయి. రెండు నెలలుగా మూసి ఉన్న పాఠశాలలు– దుమ్ము ధూళితో, వెలిసిపోయిన గోడలు, పగిలిన కిటికీలు, అవసరానికి పనికిరాని టాయిలెట్లతో మీకు స్వాగతం పలుకుతాయి. కొన్ని గ్రామాలు–బస్తీలలో, కొన్ని పాఠశాలల ప్రాంగణాలలో బాధ్యతా రాహిత్య వ్యక్తులు 'దావతులు' చేసుకుని తాగి పారేసిన సీసాలు, సిగరెట్ ముక్కలు, ఇతర వస్తువులతో నిండి.. మీలోని ఉత్సాహాన్ని తగ్గించడం సహజం.

ఆహ్లాదకరమైన వాతావరణంలో పిల్లలకు ఆహ్వానం పలకడానికి పాఠశాలలను శుభ్రం చేయించే బాధ్యత కూడా మీపై పడడం బాధాకరమే. విద్యాశాఖకు కళ్ళు, చెవులు మీరే. ఈ దుస్థితికి మీరే కారణం అనే అపవాదు కూడా మీపై వేస్తారు. క్షేత్ర స్థాయిలో మీరే ఉంటారు. మీ పై అధికారులు కనిపించరు. ప్రభుత్వ బడి బాగుపడే స్థితి లేదనే నిరాశ నిస్పృహ లోకి కొంతమంది వెళ్తే, పట్టు వదలని విక్రమార్కుల లాగా సొంత నిధులను ఖర్చు చేసినవారు కొందరుంటారు. మరికొందరు ప్రైవేటు సంస్థలను బతిమలాడి, ఒప్పించి, తమ బడులను బాగు చేసుకునే పనిలో పడ్డారు. అభ్యుదయభావాలు గల ఉపాధ్యాయ సంఘాలు స్వచ్ఛందంగా విద్యార్థులతో కలిసి ప్రభుత్వ బడి పటిష్ఠతకు పూనుకుంటున్నాయి. ఇవన్నీ పట్టించుకోకుండా కొన్ని సార్లు పరిపాలనలో ఉన్న పెద్దలు ప్రభుత్వ బడిలో నమోదు తగ్గడానికి మిమ్మల్ని బాధ్యులను చేయడం, విద్యను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మెరుగుపరుస్తామనే రాజకీయ ఉపన్యాసాలు ఇవ్వడం కూడా చూసే ఉంటారు.

ఇది ఇలా ఉంటే త్వరలోనే వాట్సాప్ గ్రూపుల్లో అధికారుల ఉత్తర్వులను, సందేశాలను చూస్తారు. పాఠ్యపుస్తకాల పంపిణీ, పాఠశాలలకు నోట్‌బుక్స్ తెచ్చుకునే వివరాలు, యూనిఫాంలు, జయశంకర్ బడిబాట, 'మధ్యాహ్న భోజనం' వివరాలు, వంద శాతం పాస్ ప్రణాళికలు... ఇవన్నీ అమలు చేయడం ఒక ఎత్తయితే వాటిని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం మరో ఎత్తు. కొన్ని ప్రాంతాలలో నెట్ కనెక్షన్ లేక చెట్లు, గుట్టలు ఎక్కి అప్‌లోడ్ చేసిన ఘటనలు కోకొల్లలు.

ఇక మీరు ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులైతే ఆ సవాళ్లు వేరే రకంగా ఉంటాయి. ఎండా కాలంలో కొత్త విద్యార్థుల వేటలో తిరిగి ఉంటారు. అది మీ ఉద్యోగ భద్రతలో భాగం అని మీ యాజమాన్యం చెప్పి ఉంటారు. విద్య వ్యాపారం అయిన చోట టీచర్లుగా కేవలం బోధనపైన దృష్టి పెట్టడం కష్టమే. ఇక గురుకుల పాఠశాల ఉపాధ్యాయుల సవాళ్ళు.. రోజుకో ఉత్తర్వుతో, అధికారుల కొత్త ఆలోచనలను అమలు చేయడంలో, తల్లిదండ్రులకు–అధికార యంత్రాంగానికి మధ్య సతమతమవుతూనూ బడులకు కదిలి ఉంటారు.

మీ పాఠశాల పిల్లల తల్లిదండ్రులకు మీపై ఎంతో నమ్మకం ఉంది. విద్యతోనే విముక్తి అని బలంగా నమ్మి మీ పాఠశాలకు వాళ్ళ పిల్లలను పంపిస్తున్నారు. అత్యధిక శాతం రెక్కాడితే కానీ డొక్కాడని తల్లిదండ్రులు. ఇన్ని ఇబ్బందులలో ఉన్నవాళ్ళు పిల్లలకు సమయం ఇవ్వకపోవడం వాళ్ళ పొరపాటుగా భావించవద్దు. వాళ్ళు మీపై ఉంచిన విశ్వాసాన్ని వమ్ము చేయకుండా ఉండడమే మీరు వాళ్ళకిచ్చే గౌరవం.



సెలవుల తరువాత బడులకు వస్తున్న కొంతమంది పిల్లలు సినిమాల ప్రభావంతో, హీరోలు–క్రికెటర్ల స్టయిల్స్‌తో, కొత్త హెయిర్‌కట్‌లతో, కొత్త రకం డ్రెస్సులతో, అలాగే సోషల్ మీడియా ప్రభావంతో వస్తారు. సెలవుల్లో స్మార్ట్ ఫోన్ స్క్రీన్ టైం ఎక్కువగానే వాడి ఉంటారు. రీల్స్ చూసీ, చేసీ ఉంటారు. కొందరికి మత్తుపదార్థాల పరిచయం కూడా ఉండివుండొచ్చు! వీటన్నిటికీ పిల్లలు బాధ్యులు కారని గ్రహించాలి. ఈ పిల్లలతో మెలగాలంటే మీకు కొత్త నైపుణ్యాలు అవసరం కావచ్చు. పిల్లలపై, తల్లిదండ్రులపై ఆరోపణలు చేయడంలో ప్రయోజనం లేదు. ఇది కష్టమైన పని, కానీ అనివార్యమైనది. ఎన్నో సామాజిక రుగ్మతలను రూపుమాపడంలో తల్లిదండ్రుల కన్నా ఉపాధ్యాయులు పోషించిన పాత్ర చాలా ఉంది.

మీ పాఠశాల్లోని పిల్లల తల్లిదండ్రులకు మీపై ఎంతో నమ్మకం ఉంది. విద్యతోనే విముక్తి అని బలంగా నమ్మి మీ పాఠశాలకు వాళ్ళ పిల్లలను పంపిస్తున్నారు. అధిక శాతం రెక్కాడితే కానీ డొక్కాడని తల్లిదండ్రులు. ఒంటరి మహిళల కుటుంబాలు లేదా నిత్యం హింసకు గురయ్యే కొంతమంది విద్యార్థుల తల్లులు. ఇన్ని ఇబ్బందులలో ఉన్న వాళ్ళు పిల్లలకు సమయం ఇవ్వకపోవడం వాళ్ళ పొరపాటుగా భావించవద్దు. వాళ్ళు మీపై ఉంచిన విశ్వాసాన్ని వమ్ము చేయకుండా ఉండడమే మీరు వాళ్ళకిచ్చే గౌరవం.

పిల్లలు తెలివైనవారు, శక్తిమంతమైనవారు. వాస్తవ ప్రపంచం, వర్చువల్ ప్రపంచం రెండింట్లోనూ ఎదుగుతున్నవారు. వివిధ అలవాట్లకు లోనవుతున్నారు. పిల్లలు తమ భావోద్వేగాలను అర్థం చేసుకుంటూనే, అవి తగిన పరిమితులలో ఉండేలా మీరు మార్గనిర్దేశం చేయాలి. అంతేకానీ వారిని మానసిక–శారీరక శిక్షల ద్వారా, పది మందిలో అవమానించడం ద్వారా క్రమశిక్షణలో పెడదామనుకోవడం పొరపాటని గ్రహించండి.

అవును, మీ పని కష్టమైనది. ప్రతి రోజు గొప్పగా ఉండకపోవచ్చు. కానీ మీ మాటలకు జీవితాలను మార్చగల శక్తి ఉందని గుర్తుంచుకోండి. ఇతర ఏ వృత్తి నిపుణులకు అంత నమ్మకం ఉండదు. మీ పనిని ఎవరూ గుర్తించకున్నా, మీకు మీరే అభినందించుకోండి. మీ పనికి గుర్తింపు కోసం మీరు మీ గొంతు పెంచడం అవసరమే కానీ, మీరు బోధించిన విషయాన్ని అర్థం చేసుకోలేని విద్యార్థులపై గొంతు చించుకోవడం మాత్రం అనవసరం. ఒకటి రెండు సెలవులను వదులుకోవడం పరవాలేదు కానీ, చదువులో వెనుకబడుతున్న విద్యార్థిపై ఆశను వదిలేయడం మాత్రం తగదు. ప్రభుత్వాలు మీకు జీతాలు ఇవ్వవచ్చు, మౌలిక వసతులు కల్పించవచ్చు. కానీ పిల్లలు మీకు బోధించే హక్కును ప్రసాదిస్తారు. కావున ఉపాధ్యాయులుగా మీరు పిల్లల హక్కులకు కాపలాదారులై ఉండాలి. వారి నాణ్యమైన విద్యాహక్కును, రక్షణ హక్కును, మీరు ముందుండి రక్షించి, ప్రజాస్వామ్య పటిష్ఠతను బలంగా ప్రభావితం చేయగలరని ఆశిస్తూ..

• ఆర్. వెంకట్ రెడ్డి
జాతీయ కన్వీనర్, ఎం.వి. ఫౌండేషన్

ఎస్ఎస్ఏ ఉద్యోగుల కల సాకారమయ్యేనా?

"నేను అధికారంలోకి వచ్చాక.. చాయ్ తాగినంత సేపట్లో మిమ్మల్ని రెగ్యులరైజ్ చేస్తా" హన్మకొండ ఏకశిలా పార్కు వద్ద ఆందోళన చేస్తున్న సర్వ శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగులతో గత అసెంబ్లీ ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డి అన్న మాటలివి. ఆయన సీఎం అయ్యాక ఇన్నాళ్లకైనా ఆ హామీలపై దృష్టి సారిస్తారా?


రాష్ట్రంలో దాదాపు ఇరవై వేల మంది సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులు ఇరవై ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో వివిధ హోదాల్లో పని చేస్తున్నారు. మండల వనరుల కేంద్రం, భవిత కేంద్రాల్లో, పాఠశాల స్థాయిలోని కేజీబీవీల్లో, డీపీఓ కార్యాలయంలో ఇలా పలు శాఖల్లో వీరు విధులు నిర్వర్తిస్తున్నారు. పది, ఇంటర్ ఫలితాల్లో గురుకుల పాఠశాలలతో సమానంగా కేజీబీవీ విద్యార్థులు ప్రతిభ చూపుతున్నారు. ఇందులో ఎస్ఎస్ఏ ఉద్యోగుల తోడ్పాటు ఎనలేనిది.

గత సమ్మె సమయంలో రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీతో ఏ ప్రయోజనమూ సాధించకుండానే ఎస్ఎస్ఏ ఉద్యోగులు సమ్మెను విరమించారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడచినా ప్రభుత్వం స్పందించకపోవడంతో గత డిసెంబర్‌లో వారు మళ్లీ సమ్మెకు దిగారు. మొత్తంగా 28 రోజులు సమ్మెలో పాల్గొన్నారు. ప్రభుత్వ పెద్దల హామీతో, విద్యార్థుల పరీక్షలనూ దృష్టిలో ఉంచుకొని మళ్లీ సమ్మెను విరమించారు.

గతంలో హామీ ఇచ్చినట్టుగా... 'ఎస్ఎస్ఏ ఆర్థిక సంబంధ అంశాలు క్యాబినెట్ సబ్ కమిటీకి అప్పగింత, టర్మినేషన్ విధానం రద్దు, 28 రోజుల సమ్మె కాలపు పూర్తి వేతనం చెల్లింపు, పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లకు పూర్తి ఏడాది వేతనం చెల్లింపు, ప్రతి సంవత్సరం 20 శాతం జీతాల పెంపుతో పాటు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఏడాదికి పురుషులకు 22, మహిళలకు 27 సీఎల్స్, ఆప్షనల్ హాలిడేస్, అనారోగ్య పరిస్థితుల్లో వేతనంతో కూడిన సెలవులు, చైల్డ్ కేర్ లీవ్స్, రెసిడెన్షియల్ క్లస్టర్ల పెంపు' వంటి డిమాండ్లను ప్రభుత్వం పరిశీలించాలి.

కాంట్రాక్ట్ ఉద్యోగులను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలన్నప్పుడు కొన్ని సాంకేతిక, న్యాయపరమైన అడ్డంకులు రావచ్చు. ఇప్పటివరకు ఎస్ఎస్ఏలో రెగ్యులర్ ఉద్యోగులంటూ ఎవరూ లేరు కాబట్టి వీరికి అలాంటి అడ్డంకులేవి రావు. రాతపరీక్ష, మెరిట్, రోస్టర్ ప్రకారమే వీరు భర్తీ అయ్యారు. రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘాలతో (206 సంఘాలు)ఏర్పడిన టీజీఈ జేఏసీలో సర్వ శిక్షా అభియాన్ ఉద్యోగులు కూడా భాగంగా ఉన్నారు. జేఏసీ 57 డిమాండ్లలో వారి డిమాండ్లు కూడా ఉన్నాయి. జేఏసీ డిమాండ్లపై ముగ్గురు సీనియర్ ఐఏఎస్ అధికారులతో కమిటీ ఏర్పాటవడం సంతోషకరం. ఇప్పటికైనా వారు మా జేఏసీ డిమాండ్లను పరిశీలించి, మాకు సత్వర న్యాయం చేయాలి.

– జుర్రు నారాయణ యాదవ్
టీజీఈ జేఏసీ కో–కన్వీనర్





కాంగ్రెస్‌లో కుత కుత

- ఉపాధ్యక్ష పదవికి రాజీనామా చేసే యోచనలో ఎమ్మెల్యే నాయిని
- తన స్థాయికి తగిన పదవి ఇవ్వలేదని ఆవేదన
- బస్వరాజుకు ఉపాధ్యక్ష పదవిపై కొండా వర్గం నారాజ్
- నర్సంపేటలో కత్తికి పదవిపై దొంతి అనుచరుల్లో అసంతృప్తి
- రాష్ట్ర కమిటీలో చోటు దక్కని నేతల అనుచరుల్లో ఆందోళన
- మంత్రివర్గం, టీపీసీసీ విస్తరణపై తీవ్ర అసంతృప్తి
- ఇక అందరి దృష్టి కీలకమైన వర్కింగ్ ప్రెసిడెంట్ పదవిపైనే..

అర'చేయి'లో మంటలు రాజుకుంటున్నాయి.. అసంతృప్త గొంతులు గర్జనకు సిద్ధమవుతున్నాయి... మంత్రివర్గ విస్తరణ, రాష్ట్ర కమిటీలో పదవుల వ్యవహారం ఓరుగల్లు కాంగ్రెస్‌లో మంటలు పుట్టిస్తోంది. పార్టీకి సేవ చేసిన వారికి ఇదేమి గుర్తింపు అని నేతలు మౌనంగా ఆక్రోశిస్తున్నారు. ఇటీవల మంత్రివర్గ విస్తరణలో ఓరుగల్లు కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు అవకాశం దక్కకపోగా, పార్టీ పదవుల్లోనూ కీలక నేతలకు అధిష్ఠానం ఝలక్ ఇచ్చిందనే వ్యాఖ్యలు వినబడుతున్నాయి. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోసం ప్రయత్నాలు చేసిన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి వైస్ ప్రెసిడెంట్ పదవిని కట్టబెట్టడంతో ఆయన తనకిచ్చిన పదవికి రాజీనామా చేసే యోచనలో ఉన్నట్టు చెబుతున్నారు. అలాగే వరంగల్‌తూర్పు నియోజకవర్గంలో మంత్రి కొండా సురేఖ రాజకీయ ప్రత్యర్థిగా ఉన్న ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యకు వైస్ ప్రెసిడెంట్ పదవిని ఇవ్వడంపై కొండా వర్గంలో తీవ్ర అసంతృప్తి వ్యక్తం అవుతుండగా, కత్తి వెంకటస్వామికి ప్రధానకార్యదర్శి పదవి కట్టబెట్టడం పట్ల ఎమ్మెల్యే దొంతి అనుచరులు గుర్రుమంటున్నారు. మొత్తంగా పదవుల పందేరం కాంగ్రెస్‌ను కుతకుత లాడిస్తోంది.

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

మంత్రివర్గం, టీపీసీసీ విస్తరణపై ఓరుగల్లు నేతల్లో అసంతృప్తి వ్యక్తం అవుతోంది. ఆదివారం జరిగిన మంత్రివర్గ విస్తరణలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఏ ఒక్క ఎమ్మెల్యేకు చోటు దక్కకపోవటంపై కాంగ్రెస్ క్యాడర్‌ను డీలా పడేసింది. వరంగల్ పశ్చిమ, నర్సంపేట, పరకాల ఎమ్మెల్యేల్లో ఒకరికి అవకాశం వస్తుందని ఆశించినప్పటికీ అధిష్ఠానం రిక్తహస్తం చూపింది. ఇక సోమవారం రాత్రి ప్రకటించిన టీపీసీసీ ఉపాధ్యక్ష, ప్రధానకార్యదర్శులుగా ఊహించని నేతలకు పదువులిచ్చింది. ఎన్నో ఏళ్ల నుంచి పార్టీకి సేవలు అందిస్తున్నవారితో పార్టీకి అకింతభావంతో పని చేస్తున్న నేతలకు జాబితాలో చోటు దక్కకపోవటంపై కాంగ్రెస్ నేతల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. ప్రధానంగా స్టేషన్‌ఘనపూర్ నుంచి గత ఎ న్నికల్లో ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడిపోయిన సింగపురం ఇందిర, రాష్ట్ర నాయకురాలు కూచన రవళి, కాంగ్రెస్ వరంగల్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణతో పాటు ఎంపీ సీటును త్యాగం చేసిన దొమ్మాటి సాంబయ్య, పెరుమాండ్ల రామకృష్ణ, గత ఎన్నికల్లో పరకాల టికెట్‌ను త్యాగం చేసిన గాజర్ల అశోక్‌తో పాటు అనేకమంది నేతలకు టీపీసీసీలో అవకాశం రాకపోవటం వారి అనుచరుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. కొంతమంది అనామకులకు కూడా కీలక పదవులు వచ్చాయని, పార్టీకి అంకితభావంతో పని చేస్తున్నప్పటికీ తమను అధిష్ఠానం గుర్తించటం లేదని కొందరు సీనియర్ నేతలు నారాజ్ అవుతున్నారు. అయితే ఇంకా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, అధికార ప్రతినిధులు, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులకు సంబంధించిన పదవులను ప్రకటించాల్సి ఉండటంతో వీటిలో కొందరికి అవకాశం కల్పిస్తారనే ప్రచారం జరుగుతోంది.

టీపీసీసీ పదవులపై ఓరుగల్లు నేతల్లో అసంతృప్తి

ఉపాధ్యక్ష పదవికి నాయిని రాజీనామా..?

అధిష్ఠానం తనకు ఇచ్చిన వైస్ ప్రెసిడెంట్ పదవిపై వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. 11ఏళ్లు ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా, 9ఏళ్లుగా హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా పార్టీ కష్టకాలంలో పనిచేసినప్పటికీ ఆశించిన పదవిని ఇవ్వలేదని బాధపడుతునారు. దీంతో ప్రస్తుతం తాను నిర్వహిస్తున్న హనుమకొండ జిల్లా అధ్యక్ష పదవి ఇక తనకు వద్దని, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇవ్వాలని ఆరు నెలల కిందటే నాయిని పార్టీ అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో ఏఐసీసీ నేతలను కలిసి తాను పార్టీకి చేసిన సేవలను వివరించారు. అయితే వర్కింగ్ ప్రెసిడెంట్‌పై ఆశతో ఉన్న రాజేందర్‌రెడ్డికి ఒక దశలో మంత్రి పదవి వస్తుందని, డిప్యూటీ స్పీకర్ పదవి అంటూ ప్రచారం జరిగింది. అవేమీ రాకపోవడంతో తనకు ఇచ్చిన వైస్ ప్రెసిడెంట్ పదవికి రాజీనామా చేసేందుకు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అపాయింట్‌మెంట్ కోసం నాయిని ప్రయత్నాలు చేస్తున్నారు.

కాగా, తీవ్ర అసంతృప్తితో ఉన్న రాజేందర్‌రెడ్డి టీపీసీసీ ఉపాధ్యక్ష పదవికి రాజీనామా చేస్తే, ఆ ప్రభావం పార్టీపై తీవ్రంగా ఉంటుందనే చర్చ జరుగుతోంది. ఇప్పటికే నాయిని అనుచరులు

(మిగతా 7వ పేజీలో...)

నకిలీలపై ఉక్కుపాదం

విత్తనాలు, పురుగు మందుల విక్రయాలపై సమాచారం ఇవ్వండి

పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీ సన్‌ప్రీత్‌సింగ్, ఏసీపీలు

వరంగల్ క్రైం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : నకిలీ విత్తనాలు, పురుగు మందుల విక్రయాలపై ప్రజలకు సమాచారం ఉంటే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ సూచించారు. వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో నకిలీ విత్తనాలను నియంత్రణకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో రూపొందించిన వాల్‌పోస్టర్‌ను మంగళవారం సీపీ అవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. వ్యాపారస్థులు లేదా ఇతర వ్యక్తులు రైతులను నకిలీ విత్తనాలు, పురుగు మందులతో మోసం చేస్తే పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. నకిలీ విత్తనాలను అరికట్టేందుకు ఇప్పటికే కమిషనరేట్ పరిధిలో ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని, అందులో భాగంగా ఇప్పటికే వరంగల్ పోలీసు కమిషనరేట్‌లో కోటి 23 లక్షల విలువ చేసే నకిలీ పురుగు మందులు, విత్తనాలు, పెద్ద ఎత్తున గడ్డి మందును స్వాధీనం చేసుకోవడంతోపాటు 14మంది నిందితులను జైలుకు తరలించామన్నారు. నకిలీలపై సమాచారం ఉంటే స్థానిక పోలీసులకు లేదా వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఫోన్‌నెంబర్ 7799848333 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ రవి, ఏసీపీ జితేందర్ రెడ్డి, డేవిడ్‌రాజు, ఇన్‌స్పెక్టర్ విశ్వేశ్వర్ పాల్గొన్నారు.

ఆరుగురు ఇన్‌స్పెక్టర్ల బదిలీ

వరంగల్ క్రైం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఆరుగురు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సుబేదారి సీఐ సత్యనారాయణరెడ్డిని టాస్క్‌ఫోర్స్‌కు బదిలీ చేసి అక్కడ పనిచేస్తున్న మేకల రంజిత్‌కుమార్‌ను సుబేదారికి బదిలీ చేశారు. హనుమకొండ సీఐ వై.సతీష్‌ను ఎస్‌బీకి బదిలీ చేసి ఆయన స్థానంలో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఎం.శివకుమార్‌ను నియమించారు. ఏనుమాముల ఇన్‌స్పెక్టర్ ఎ.రాఘవేందర్‌ను సీసీఎస్‌కు బదిలీ చేసి ఆయన స్థానంలో ఎస్‌బీలో పనిచేస్తున్న జె.సురేష్‌ను నియమించారు.



ఏనుగులగడ్డ బస్టాండ్ కోసం విడుదలైన నిధుల మంజూరు కాపీని మంత్రి కొండా సురేఖకు ఇస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ఏనుగులగడ్డలో బస్టాండ్

మంత్రి సురేఖ చొరవతో రూ.50లక్షలు మంజూరు

హనుమకొండ చౌరస్తా, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ చౌరస్తా సమీపంలోని ఏనుగులగడ్డ బస్టాప్‌లో ప్రయాణికులు పడుతున్న అవస్థలకు తెరపడే సమయం వచ్చింది. ఇక్కడ నెలకొన్న సమస్యలపై 'నిలువ నీడ లేక అవస్థలు' అనే పేరుతో ఆంధ్రజ్యోతిలో సోమవారం కథనం ప్రచురితమైంది. దీనిపై వరంగల్ తూర్పు ఎమ్మెల్యే, అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ స్పందించారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను స్వయంగా కలిసి పరిస్థితులను వివరించారు. ఏనుగులగడ్డ బస్టాప్ నుంచి నిత్యం వందలాది బస్సులు వెళుతుంటాయని, బస్సుల కోసం ఎండలోనే ప్రయాణికులు వేచి ఉంటున్నారని ఆమె తెలిపారు. దీంతో స్పందించిన మంత్రి పొన్నం ఏనుగులగడ్డలో బస్టాండ్ నిర్మించేందుకు రూ.50లక్షలను కేటాయించారు. వెంటనే తగిన ఏర్పాట్లను చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆంధ్రజ్యోతి కథనంతో తమ కష్టాలు తీరనున్నాయని పలువురు ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఇంటి దొంగ

- సొంత ఇంట్లోనే చోరీకి పాల్పడిన యువకుడు
- 24 గంటల్లోనే అరెస్టు చేసిన పోలీసులు
- 12 తులాల బంగారం స్వాధీనం
- జల్సాలకు డబ్బుల కోసం మాస్టర్ ప్లాన్



నిందితుడి వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ నందిరామ్ నాయక్

కరీమాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : కన్నకొడుకే ఆ ఇంటికి కన్నం వేశాడు. జల్సాలకు అలవాటు పడి డబ్బుల కోసం ఎవరూ లేని సమయంలో సొంతింట్లోనే దొంగతనం చేశాడు. కాగా, 24 గంటల్లోనే పోలీసులు ఈ కేసును ఛేదించి బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు వివరాలను మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో ఏసీపీ నందిరాంనాయక్ మీడియాకు వెల్లడించారు. ఖిలావరంగల్ పడమర కోటకు చెందిన గుర్రపు రామకృష్ణ, భార్య సవితారాణి, కూతురు శ్రీనిధి ముగ్గురు కలిసి ఈ నెల 8వ తేదీన ఉదయం హైదరాబాద్‌లోని తమ బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి వెళ్లారు. తిరిగి అదే రోజు రాత్రి వచ్చే సరికి ఇంట్లో ఉన్న బీరువా తాళాలు తెరిచి ఉన్నాయి. లోపల పరిశీలించగా ఆరున్నర తులాల బంగారు పెద్ద హారం, ఐదున్నర తులాల చిన్న హారం, రెండు తులాల గొలుసులు, రెండు తులాల నెక్లెస్ మొత్తం 16 తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో యజమాని రామకృష్ణ వెంటనే మిల్స్‌కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ బొల్లం రమేష్ ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టారు. విచారణలో భాగంగా మంగళవారం రామకృష్ణ కుమారుడైన జయంత్ సెల్‌ఫోన్‌ను ఇవ్వమని అడగడంతో నిరాకరించాడు. దీంతో అనుమానించి లోతుగా విచారించడంతో తానే ఈ దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు.

డబ్బుల కోసం..

నిందితుడు జయంత్ హనుమకొండలోని ఓ కళాశాలలో బీబీఏ కోర్సులో జాయిన్ అయ్యాడు. మరోవైపు హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్‌లో స్టార్టర్స్ ఆన్ వీల్స్ పేరుతో ఓ ఫుడ్ కోర్ట్ ఏర్పాటు చేసి నష్టపోయాడు. ఫుడ్ బిజినెస్ కోసం స్నేహితుల వద్ద, తెలిసిన వారి వద్ద అప్పు చేశాడు. దీనికి తోడు ఇతడికి గర్ల్‌ఫ్రెండ్ ఉందని, ఆమెతో కలిసి జల్సాలు చేయడానికి డబ్బు అవసరమైందని విచారణలో తేలింది. దీంతో ఏం చేయాలో తెలియక డబ్బుల కోసం ఇంట్లో ఆభరణాలను తీసుకెళ్లాలని భావించి అదనుకోసం చూస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం కుటుంబసభ్యులు అందరూ హైదరాబాద్ వెళ్లడంతో బీరువాలోని ఆభరణాలను ఎత్తుకెళ్లాడు. వాటిని విక్రయించే క్రమంలో పోలీసులకు దొరికిపోయాడు. దొంగిలించిన దాంట్లో కొంత కరిగించగా మిగిలిన 11 తులాల బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన సీఐ బొల్లం రమేష్, ఎస్‌ఐలు శ్రీకాంత్, సురేష్, సిబ్బంది ప్రవీణ్ రెడ్డి, వాజీద్‌పాషా, నరేందర్, హోంగార్డ్ రఫీని ఏసీపీ అభినందించారు.



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సంపత్‌రావు

దొంగతనాలకై దోస్తీ

- జైలులో పరిచయమైన ఆరుగురు వ్యక్తులు
- త్వరగా స్థిరపడాలని చోరీలను వృత్తిగా ఎంచుకున్నవైనం
- జైలు నుంచి విడుదలయ్యాక 15 దొంగతనాలు
- ఆట కట్టించిన భూపాలపల్లి, గణపురం పోలీసులు
- సహకరించిన వ్యక్తితో పాటు ఆరుగురి అరెస్ట్
- మూడు బైక్‌లు, రూ. 37 లక్షల విలువ గల సొత్తు రికవరీ

7

అకడమిక్ క్యాలెండర్ భళా!

- ప్రతీ రోజు 5 నిమిషాల పాటు యోగా, ధ్యానం
- ప్రతీ నెల మూడో శనివారం బ్యాగ్‌లెస్ డే
- 90 శాతం విద్యార్థులు హాజరు కావాల్సిందే..
- ఆసక్తికరంగా విద్యాశాఖ డైరెక్టర్ ఉత్తర్వులు
- పకడ్బందీగా అమలైతే ప్రభుత్వ పాఠశాలలకు కొత్తకళ



వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలు గురువారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో పకడ్బందీ విద్య కోసం ఈ విద్యాసంవత్సరం అడకమిక్ క్యాలెండర్‌ను విద్యాశాఖ ఆసక్తికరంగా రూపొందించింది. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యాబోధన సాగిస్తూనే కో కరిక్యులర్ యాక్టివిటీస్‌కు ప్రాధాన్యతనిస్తూ అడకమిక్ క్యాలెండర్‌ను రూపొందించింది. ఈ విద్యా సంవత్సరంలో బడులకు 230 పనిదినాలను నిర్ణయించింది. గతంలో ఎన్నడూ లేని విధంగా సిలబస్ పూర్తి చేయడానికి గడువును విధించింది. ప్రతీరోజు పాఠశాలకు విద్యార్థులు 90శాతం హాజరయ్యేలా ఉపాధ్యాయులు తగిన చర్యలు చేపట్టాలని విద్యాశాఖ సూచించింది. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల సంఖ్యను గణనీయంగా పెంచడంతో పాటు ఆయా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో కనీసం 90 శాతం విద్యార్థులు ప్రతీరోజు పాఠశాలకు హాజరయ్యేలా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలి. పాఠశాల ప్రారంభం నాటి నుంచి చివరి పనిదినం వరకు ప్రతీ రోజు కనీసం పాఠశాలల్లో 90 శాతం విద్యార్థులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ డైరెక్టర్ ఇప్పటికే డీఈవోలకు ఉత్తర్వులు జారీ చేశారు.

విద్యార్థుల్లో ఏకాగ్రత పెంచడంతో పాటు వారిలోని దాగి ఉన్న విజ్ఞాన తృష్ణను రగిలించడం కోసం పాఠశాలల్లో ప్రతీ రోజు 5నిమిషాల పాటు యోగా, ధ్యానం కార్యక్రమాలు నిర్వహించాలని క్యాలెండర్‌లో

(మిగతా 8వ పేజీలో...)



మొట్లగూడెం పాఠశాల వద్ద విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు

మళ్లీ బడికి పూర్వవైభవం

22 ఏళ్ల అనంతరం స్కూల్ పునఃప్రారంభం

బయ్యారం (మహబూబాబాద్ జిల్లా), జూన్ 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లేక మూత పడుతున్న పాఠశాలలను చూస్తున్న తరుణంలో ఇందుకు భిన్నంగా వారి సంఖ్యను పెంచి 22 ఏళ్ల అనంతరం స్కూల్‌ను తిరిగి ప్రారంభించిన ఉదంతం మొట్లగూడెంలో చోటు చేసుకుంది. కొన్నేళ్ల కిందట విద్యార్థులు లేక ఈ పాఠశాల మూతపడింది. తండాకు చెందిన బానోత్ రాజు-బేబీ దంపతులు విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి గ్రామస్థుల సహకారంతో 13 మంది పిల్లలను ఈ పాఠశాలలో చేర్పించారు. దీంతో మంగళవారం ఎంఈవో దేవేంద్రచారి స్కూల్‌ను మళ్లీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సిబ్బంది, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కడుపునొప్పితో యువకుడి ఆత్మహత్య


పందిబోయిన రమేశ్ (ఫైల్)

జఫర్‌గఢ్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి భరించలేక యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం తమ్మడపల్లి(జి)లోచోటుచేసుకుంది. ఎస్‌ఐ బానోత్ రాంచరణ్ నాయక్ కథనం ప్రకారం.. తమ్మడపల్లి(జి)కి చెందిన పందిబోయిన ఎల్లయ్యకు ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్నకుమారుడు పందిబోయిన రమేశ్ (20) డిగ్రీ చదువును మధ్యలోనే ఆపి వేసి హైద్రాబాద్‌లో కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. తండ్రికి వ్యవసాయ పనుల్లో సాయపడుతుండేవాడు. రమేశ్ కొంతకాలంగా గాయాలు, కడుపునొప్పితో బాధపడుతున్నాడు. చికిత్స చేయించినా నొప్పి కడుపు తగ్గకపోవడంతో, బాధను భరించలేక సోమవారం రాత్రి ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లి గ్రామ చివర తమ వ్యవసాయ భూమిలోని వేపచెట్టుకు ఉరి వేసుకున్నాడు. రాత్రి అయినా కొడుకు ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు, కుటుంబీకులు వెదకగా మంగళవారం ఉదయం వేపచెట్టుకు ఉరి వేసుకుని కనిపించాడు. రమేశ్ అవివాహితుడు. మృతుడి తండ్రి ఎల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ చెప్పారు.

పెర్కవేడులో వికసించిన విద్యా కుసుమం

మూడు ఉద్యోగాలు సాధించిన శ్రవణ్ కుమార్


శ్రవణ్‌కుమార్‌కు స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు

రాయపర్తి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పట్టుదలతో మూడు ఉద్యోగాలు సాధించాడు ఓ యువకుడు. మండలంలోని పెర్కవేడు గ్రామానికి చెందిన బొమ్మెర రమాదేవి, వీరస్వామిల కుమారుడు శ్రవణ్‌కుమార్ చిన్నప్పటి నుంచే చదువులో రాణించాడు. ఒకటి నుంచి పదో తరగతి వరకు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించాడు. 2008 నుంచి 2014 వరకు బాసర ట్రిపుల్ ఐటీలో బీటెక్ (మెకానిక్) పూర్తి చేశాడు. 2015 నుంచి సివిల్స్ కోసం శ్రమించాడు. 2018లో గ్రూప్-4 సాధించి వర్ధన్నపేట ఏరియా ఆస్పత్రిలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఉద్యోగం చేస్తూనే పోటీ పరీక్షలకు సిద్ధమవుతూ 2025 జూన్ 6న గ్రూప్ 3, మే 22న గ్రూప్ 2 లో విజయం సాధించాడు. కుమారుడు మూడు ఉద్యోగాలు సాధించడంపై తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. శ్రవణ్ కుమార్‌ను గ్రామస్థులు, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రైవేటు హాస్టళ్లపై నిఘా ఏదీ?

● అధికారిక అనుమతి లేకుండా నిర్వహణ ● ఆదాయంపైనే నిర్వాహకుల దృష్టి

బాలసముద్రం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): నగరంలో విద్యార్థులకు, ఉద్యోగార్థులకు ఆశ్రయంగా మారిన ప్రైవేటు హాస్టళ్ల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. ప్రస్తుతం నగరంలోని విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులతో పాటు ఉపాధి కోసం, ఉద్యోగాల కోసం వచ్చిన ఎందరో యువతీ యువకులు ప్రైవేటు హాస్టళ్లల్లో ఆశ్రయం పొందుతున్నారు. ముఖ్యంగా విద్యాసంస్థలు, కోచింగ్ సెంటర్ల, చుట్టుపక్కల వందల సంఖ్యలో ప్రైవేటు వ్యక్తులు సొంతంగా హాస్టళ్లను ప్రారంభించి నడుపుతున్నారు. ఈ ప్రైవేటు హాస్టళ్లకు సంబంధించి ప్రభుత్వం ఎలాంటి నియమ నిబంధనలు రూపొందించి అమలు చేస్తుందో ఎవరికీ తెలియడం లేదు. ఎలాంటి రిజిస్ట్రేషన్ లేకుండానే ఎంతోమంది హాస్టళ్లను తమ ఇష్టానుసారంగా అనధికారికంగా నడుపుతున్నారు. హాస్టళ్లపై ఏ ప్రభుత్వ అధికార విభాగం పర్యవేక్షిస్తుందో స్పష్టత లేదు. దీంతో హాస్టళ్లలో ఆశ్రయం పొందుతున్న విద్యార్థుల భద్రత ఆరోగ్యప్రమాణాలు పరిరక్షించే అధికారగణం కొరవడింది.

హాస్టళ్ల నిర్వహణకు ముందుగా మున్సిపాల్ కార్పొరేషన్ నుంచి అనుమతి పొందడానికి రిజిస్ట్రేషన్ చేసుకోవడం, శాంతి భద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యక్రమాల నివారణకు పోలీసు శాఖ, హాస్టల్ భవనం ఫైర్ సేఫ్టీ నిబంధనలకు అనుగుణంగా ఉండడానికి ఫైర్ డిపార్ట్‌మెంట్ నుంచి అనుమతి, ఆహార భద్రత నాణ్యత ప్రమాణాలు పాటించే విధంగా ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ నుంచి లైసెన్స్ పొందడం లాంటి వివిధ ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేస్తూ సమర్థవంతంగా నిర్వహించే పర్యవేక్షణ కరువైంది. ఆయా ప్రభుత్వ విభాగాలు తరచుగా హాస్టళ్లను తనిఖీ చేసి పరిశీలించే విధంగా జిల్లా అధికారులు చర్యలు చేపట్టాలి. రాష్ట్ర ప్రభుత్వం హాస్టళ్ల నిర్వహణ తీరుపై తక్షణం పాలసీని రూపొందించి సురక్షితమైన, నాణ్యమైన హాస్టల్ సదుపాయాలను అందించేందుకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ప్రైవేటు హాస్టళ్లపై దృష్టి సారించాలి..
మండల పరశురాములు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ పూర్వ చైర్మన్

ప్రైవేటు వ్యక్తులతో నిర్వహిస్తున్న హాస్టళ్ల వ్యవస్థపై ప్రభుత్వం సమగ్రంగా దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రైవేటు హాస్టళ్లలో విద్యార్థుల ఆరోగ్యం, భద్రతపై తగు చర్యలు చేపట్టాలి. సురక్షితమైన,నాణ్యమైన హాస్టల్ సదుపాయాలు అందించేందుకు చర్యలు చేపట్టాలి.

ఇష్టారాజ్యంగా 'ఇందిరమ్మ' లబ్ధిదారుల ఎంపిక

● సంబంధం లేదని ఎంపీడీవో వింత సమాధానం ● బైఠాయించి నిరసన


ఎంపీడీవో చాంబర్ ముందు బైఠాయించి, నిరసన తెలుపుతున్న బీఎస్ఎస్ నాయకులు

శాయంపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేయలేదని, నిజమైన లబ్ధిదారులకు అన్యాయం జరుగుతోందని బహుజన సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మారపెల్లి క్రాంతికుమార్ ఆరోపించారు. ఈ మేరకు బీఎస్ఎస్ నాయకులు మంగళవారం ఎంపీడీవో ఫణిచంద్రకు వినతి పత్రం ఇచ్చేక్రమంలో.. 'ఎంపికతో తనకు సంబంధం లేదు.. అది ప్రభుత్వ నిర్ణయం.. ప్రభుత్వాన్ని అడగండి' అని ఎంపీడీవో బాధ్యతారాహిత్యంగా సమాధానం ఇవ్వడంతో ఆయన చాంబర్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో పోలీసులు ప్రవేశించి శాంతింపజేసి వినతిపత్రం ఇప్పించారు. ఈ సందర్భంగా క్రాంతికుమార్ మాట్లాడుతూ... ప్రజాపాలనలో దరఖాస్తులు గ్రామసభలలో తీసుకుని, ఇందిరమ్మ కమిటీ సభ్యులు చాటుగా ఇష్టారాజ్యంగా లబ్ధిదారులను ఎంపిక చేశారని, పారదర్శకంగా జరగలేదని విమర్శించారు. గ్రామసభ ద్వారా నిరుపేదలైన అర్హులకే ఇళ్లు నిర్మించాలని, లేకుంటే లబ్ధిదారులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు.

గుంతలో పడి విద్యార్థి మృతి



వరంగల్ క్రైం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : భద్రకాళీ చెరువు పూడిక తీత కోసం తవ్విన గుంతల్లో విద్యార్థి జారిపడి మృతి చెందినట్లు హనుమకొండ పోలీసులు తెలిపారు. ఎస్సై కిషోర్ కథనం ప్రకారం.... వరంగల్ పాపయ్యపేట చమన్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు బక్రీద్ పండుగ నేపథ్యంలో విందు చేసుకుందామని మంగళవారం భద్రకాళీ చెరువు వద్దకు వంటలకు వచ్చారు. ఈ నేపథ్యంలో గంతకు వద్ద వచ్చిన 9వ తరగతి చదువుతున్న అమీర్ (14) జారిపడి గుంతలోని బురదలో కాలు దిగబడి బయటికి రాలేకపోయాడు. తోటి మిత్రులు షర్టు చేతికి అందించి బయటికి లాగే ప్రయత్నం చేసినప్పటికి కాపాడలేకపోయారు. చివరికి నీటిలో మునిగి మృతిచెందాడన్నారు. మృతుని కుటుంబసభ్యులకు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి గాయాలు

హసన్‌పర్తి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగారం గ్రామ శివారు అంబాల రోడ్డులో సోమవారం రాత్రి కరుణాపురం నుంచి పరకాల వైపు వెళ్తున్న కారు నడుచుకుంటూ వెళ్తున్న మహిళను వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో మహిళకు తీవ్ర గాయాలుకాగా స్థానికులు, కారులో ప్రయాణిస్తున్న వారు 108 అంబులెన్స్‌లో ఎంజీఎంకు తరలించారు. కాగా, గాయపడిన మహిళ బతుకుదెరువు కోసం ఇతర రాష్ట్రం నుంచి నాగారం శివారు ప్రాంతంలో ఉంటూ కూలీ పనులు చేసుకుంటున్నట్లు చెబుతున్నారు. ఈ విషయంపై ఇన్‌స్పెక్టర్ వట్టి చేరాలును వివరణ కోరగా పూర్తివివరాలు తెలియాల్సి ఉందని తెలిపారు.

అప్పుల బాధతో వివాహిత ఆత్మహత్య

మామునూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ భరించలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న విషయం ఆలస్యంగా బయటపడింది. మృతురాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మామునూరు ప్రాంతంలోని లెనిన్‌నగర్‌కు చెందిన కస్తూరి అనిత (40), ఆమె భర్త కస్తూరి కుమార్ కూలి పనులు చేసుకుంటూ ఇద్దరు పిల్లల్ని పోషించుకుంటున్నారు. కుటుంబ అవసరాలకు ఆదాయం సరిపోక బంధువుల దగ్గర అప్పు చేశారు. అయితే ఓ వైపు పని దొరకక మరో వైపు అప్పు తీర్చే మార్గం లేక మనస్తాపం చెందారు. ఈ క్రమంలో ఈ నెల ఆరో తేదీన భర్త, పిల్లలు బంధువుల ఇంటికి వెళ్లగా అదేరోజు రాత్రి అనిత గడ్డి మందు తాగి పడిపోయింది. పక్కింటి వారు గమనించి వెంటనే కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో పాటు ఆమెను ఎంజీఎంకు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఈ నెల 9వ తేదీన అనిత మృతి చెందింది. మంగళవారం పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మామునూరు పోలీసులు ఆమె మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించి కేసు నమోదు చేశారు.


లారీ ఢీకొనడంతో ఆటోలో ఇరుక్కుని మరణించిన డ్రైవర్ రమేష్

ఆటోను ఢీకొట్టిన లారీ

ఘన్‌పూర్‌లో అక్కడికక్కడే ఆటో డ్రైవర్ మృతి


రమేష్ (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఆటోను వెనుకాల నుంచి లారీ ఢీకొట్టిన ఘటనలో ఆటో డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందిన ఘటన మంగళవారం స్టేషన్‌ఘన్‌పూర్ బస్టాండ్ ఎదురుగా చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని ధర్మపురానికి చెందిన సింగారపు రమేష్(42) ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మంగళవారం ఆటో నడుపుతూ జనగామ నుంచి హనుమకొండ వైపు వెళ్తుండగా, హైదరాబాద్ నుంచి హనుమకొండ వైపు వెళ్తున్న లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ఆటో సమారు 50 అడుగుల దూరం వరకు దూసుకెళ్లి సర్వీసురోడ్డు లోని పండ్ల దుకాణాన్ని ఢీకొంది. రమేష్ తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య సుమ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 35 మందికి జరిమానా

మట్టెవాడ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపిన కేసులో 35 మందికి వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ అబ్బోజు వెంకటేష్ మంగళవారం రూ.44,200 జరిమానా విధించారు. వారిలో వరంగల్ కాశిబుగ్గ ప్రాంతానికి చెందిన మందుర్తి సుధాకర్, వరంగల్ రాంచంద్రాపురంనకు చెందిన కాలే సుధాకర్‌కు రెండు రోజుల జైలుశిక్ష విధించారు. అదేవిధంగా లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన ఇద్దరికి రూ.1,000 జరిమానా విధించారని ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు.

అమ్మవారి చెంత అన్నదాన సత్రం

ఒక్కో శాఖకు ఒక్కో ఫ్లోర్ కేటాయింపు

ఐదు అంతస్థులతో నిర్మాణం

ప్రభుత్వం వద్దకు ప్రతిపాదనలు



వరంగల్ కల్చరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని అతి పెద్ద దేవాలయాల్లో ఒకటిగా నిలుస్తున్న భద్రకాళి అమ్మవారి దేవాలయ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. అత్యధిక నిధులు కేటాయించి శక్తి పీఠంగా తీర్చిదిద్దుతోంది. ఇప్పటికే మాడవీధులు, రాజగోపురాలు, వేద పాఠశాల నిర్మిస్తోంది. వాటి సరసన తాజాగా మరో భారీ ప్రాజెక్టుకు పచ్చజెండా ఊపినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా అమ్మవారి కైంకర్యాలకు, పూజలకు, ఆలయ నిర్వహణకు గాను ప్రత్యేక భవన సముదాయం నిర్మించబోతున్నట్లు తెలుస్తోంది. దాదాపు వెయ్యి గజాల స్థలంలో ఐదు అంతస్థుల భవనాన్ని నిర్మించాలనే లక్ష్యంతో ప్రభుత్వానికి నివేదికను పంపినట్లు తెలిసింది.

నిర్మాణం తీరు

ఐదు అంతస్థుల భవన నిర్మాణంలో ఒకటి అన్నదాన సత్రం, రెండోది లడ్డూ, పులిహోర, రవ్వ కేసరితోపాటు అమ్మవారి నైవేద్యం తయారు చేసే పోటుశాల (ప్రసాదాల తయారీ కేంద్రం), మూడోది ఉద్యోగులు, ఆలయ కార్యనిర్వాహణాధికారి కార్యాలయం, నాలుగోది దేవాలయానికి సంబంధించిన వస్తువులు ఇతర సామగ్రి నిల్వ చేసుకోవడానికి, ఐదోది ఆలయ పాలక మండలి, ఇతర ఉన్నతాధికారులు సమావేశాలు నిర్వహించుకోవడానికి ఇలా ఐదు అంతస్థుల భవనాన్ని నిర్మించడానికి ఇప్పటికే ప్రణాళిక సైతం రూపొందించి ప్రభుత్వానికి పంపారని సమాచారం.

అధికారుల అనుమతి రాలేదు.. : శేషు భారతి, ఈవో

ఐదు అంతస్థుల భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిన విషయం వాస్తవమే. కాకపోతే ఇందుకు సంబంధించి అధికారికంగా అనుమతి రాలేదు. వచ్చాక నిర్మాణ పనులు ప్రారంభం అవుతాయి.

క్రీడాకారులకు ఓరుగల్లు నిలయం

ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు అజీజ్‌ఖాన్ ● సందడిగా రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్ ప్రవేశాల ఎంపిక పోటీలు



రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్ ప్రవేశాల ఎంపిక పోటీల్లో మాట్లాడుతున్న అజీజ్ ఖాన్

వరంగల్ స్పోర్ట్స్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఓరుగల్లు జిల్లా అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులకు నిలయమని హనుమకొండ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అజీజ్‌ఖాన్ అన్నారు. మంగళవారం హనుమకొండ జేఎన్ఎస్‌లో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్) ఆదేశాల మేరకు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ హనుమకొండ ఆధ్వర్యంలో జేఎన్ఎస్‌లోని రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్ ప్రవేశాల ఎంపిక పోటీలు సందడిగా ప్రారంభం అయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అజీజ్‌ఖాన్ హాజరై మాట్లాడుతూ.. రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో ప్రవేశాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి అర్హత సాధించిన క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. హనుమకొండ జిల్లాను క్రీడా హబ్‌గా తీర్చిదిద్దడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయిస్తోందని అన్నారు.

డీవైఎస్‌వో అశోక్ కుమార్ మాట్లాడుతూ.. హనుమకొండ రీజనల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో 10, 12, 14, 16 వయస్సుగల రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల బాలబాలికలకు రెండు రోజుల పాటు ఉన్న అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్, రెజ్లింగ్, హ్యాండ్ బాల్, స్విమ్మింగ్ క్రీడాంశాల్లో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఎత్తు, బరువు, 30 మీటర్ల ఫ్లేయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్జమ్, 800 పరుగు పందెం, 6, 10 మీటర్ల షటిల్ రన్, మెడిసిన్ బాల్ త్రో, వర్టికల్ జంప్, ఫ్లెక్సిబిలిటితోపాటు మెడికల్ టెస్ట్‌లను నిర్వహించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ఈ ఎంపిక పోటీల్లో తొలిరోజు సుమారు 300 మంది బాలబాలికలు పాల్గొన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాట్ అబ్జర్వర్లు డాక్టర్ రవికుమార్, నర్సింగరావు, స్వర్ణలత, సంతోష్, హ్యాండ్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శ్యామల పవన్ కుమార్, బీఎస్‌ఏ కోచ్‌లు నరేందర్, శ్రీమన్నారాయణ, వెంకటేశ్వర్లు, నవీన్, అఫ్జల్, జీవన్, దేవిక, రాజు, శంకర్, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

అటకెక్కిన 'మన ఊరు - మన బడి' పనులు

నిధులు విడుదల కాకపోవడంతో అసంపూర్తిగా పనులు ● అమ్మ ఆదర్శ కమిటీ పనులకు సైతం నిధుల గండం ● బడులు ప్రారంభానికి ముందే పనులు పూర్తి చేస్తేనే మేలు


కొత్తపెల్లిలో అధ్వానంగా ఉన్న వంట గది (ఫైల్)


గదుల లేమితో కొత్తపెల్లిలో హెచ్ఎం రూంలో క్లాస్ రూం చేసి పాఠాలు బోధిస్తున్న టీచర్

వర్ధన్నపేట రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): 'మన ఊరు - మన బడి' పథకం కింద 2023-24 విద్యా సంవత్సరంలో ప్రారంభమైన పనులు నిధుల కొరతతో మధ్యలోనే నిలిచిపోయాయి. బీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని వర్ధన్నపేట మండలంలో దాదాపు రూ.2.78కోట్లతో పనులు ప్రారంభించారు. తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో 'మన ఊరు - మన బడి' కార్యక్రమం, వాటి నిధులు అటకెక్కాయి. ఇప్పటి ప్రభుత్వం కొత్తగా 2024-25 విద్యా సంవత్సరంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలంటూ నామకరణం చేసి నిధులను మంజూరి చేసి కొత్త పనులకు శ్రీకారం చుట్టింది. ఈ పనులు సైతం ప్రస్తుతం నిధుల లేమితో కొన్నిచోట్ల మధ్యలో నిలిచిపోయాయి. 2025-26 విద్యా సంవత్సరం ప్రారంభం కావొస్తున్న ఈ పనులు వంద శాతం ఇప్పటి వరకు కాకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ బడుల పట్ల ఒకింత ఆసక్తి చూపాలంటే ఆలోచిస్తున్నారు.

'మన ఊరు - మన బడి' పనులు ఇవే..

'మన ఊరు - మన బడి' పథకంలో మండలాన్ని యూనిట్‌గా తీసుకుని ఆయా గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం నిధులు కేటాయించింది. ఈ నేపథ్యంలో వర్ధన్నపేట మండలంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లాపరిషత్ 12 ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసింది. ఈ పాఠశాలల్లో ఎలక్ట్రిషన్, క్లాస్ రూమ్స్, డ్రింకింగ్ వాటర్ సప్లయ్, మేజర్ అండ్ మైనర్ రిపేర్స్, డైనింగ్ హాల్, కాంపౌండ్ వాల్, టాయిలెట్స్, కిచెన్ షెడ్ లాంటి పనులు చేయాలని నిధులను కేటాయించింది. పాఠశాలల వారిగా ఒక్కో పాఠశాలలో ఒక్కో పని చేసేలా వాటికి తగినట్లుగా నిధులను అందించింది. కానీ ప్రభుత్వం మారడంతో పథకం పేరు మార్పుతోపాటు నిధులు కూడా మంజూరి కాక, పనులు అసంపూర్తిగా ఉండిపోయాయి.

అసంపూర్తిగానే పనులు

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొత్తగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పేరిట కొత్తగా పనులను ప్రారంభించింది. మండలంలోని ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కింద దాదాపు రూ.కోటికిపైగా నిధులను అందించేందుకు ముందుకు వచ్చింది. టాయిలెన్స్ తాగునీరు, మైనర్ రిపేర్లు, ఎలక్ట్రిషన్ వర్క్ పేరిట పనులు చేయాలని నిర్ణయించింది. ఈ పనులను స్థానికంగా ఉన్న మహిళా సంఘాలకు అప్పగించింది. 25 శాతం అడ్వాన్సు డబ్బులు చెల్లించి పనులు ప్రారంభించిన తర్వాత మిగతా పనులకు నిధుల కొరత వెంటాడింది. వీటిలో 75 శాతం పనులు పూర్తి కాగా, ఎంబీలు చేసిన తర్వాత నిధులు మంజూరు కాలేదు. ఇంకా 25 శాతం పనులు నిధుల లేమితోనే మధ్యలో నిలిచిపోయాయి. ముఖ్యంగా మైనర్ రిపేర్లు అలాగే నిలిచిపోయాయి. దీనిపై జిల్లా విద్యాశాఖ అధికారికి, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు ఎంఈవో శ్రీధర్ వివరించారు.

విద్యార్థులకు సౌకర్యాలందేనా..?

ప్రభుత్వం జూన్ 6 నుండి బడి బాట కార్యక్రమాన్ని ప్రారంభించాలని నిర్ణయించింది. జూన్ 12 నుండి ప్రభుత్వ పాఠశాలలను పునఃప్రారంభించాలని తెలంగాణ ప్రభుత్వం ఆలోచిస్తోంది. కానీ అప్పటిలోగా పాఠశాలల్లో జరిగే పనులు పూర్తయ్యేలా కనిపించడం లేదు. దీనికి తోడు 'మన ఊరు - మన బడి' పనులు అసంపూర్తిగానే ఉండిపోయాయి. పాఠశాలల్లో ఎలక్ట్రిషన్, మేజర్ అండ్ మైనర్ రిపేర్లు చేసి పాత గోడలకు కొత్త సున్నాలు అద్ది కాంట్రాక్టర్లు చేతులు దులుపుకున్నారు. కానీ ముఖ్యంగా కావాల్సిన తరగతి గదుల నిర్మాణం, డైనింగ్ హాల్స్, టాయిలెట్స్, కిచెన్ రూమ్‌లాంటి పనులు ఇంకా అసంపూర్తిగానే ఉన్నాయి. చాలా పాఠశాలలో వంట గదులు సరిగ్గా లేక ఇప్పటికీ ఇబ్బందులు పడుతున్నారు. కొత్తపెల్లి గ్రామంలో వంట గదితో పాటు విద్యార్థులను సరైన గదులు లేకపోవడంతో రెండేసి క్లాసులు ఒకే గదిలో నిర్వహించడం గమనార్హం.

పనులు పూర్తయ్యేలా చూస్తాం..
ఎం. శ్రీధర్ ఎంఈవో వర్ధన్నపేట

మండలంలో 'మన ఊరు - మన బడి' పథకంలో భాగంగా పాఠశాలలో జరిగిన పనులు నిధుల లేమితో అసంపూర్తిగానే ఉన్నాయి. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో జరిగిన పనులు 70శాతం పూర్తికాగా, మరికొంత పెండింగ్ ఉన్నాయి. వీటికి సైతం నిధులు పెండింగ్‌లో ఉండడంతో పనులు ముందుకు సాగడం లేదు. వీటిపై ఇప్పటికే జిల్లా విద్యాశాఖ అధికారికి, కలెక్టర్‌కు విన్నవించాం. పనులు పూర్తయ్యేలా చూస్తాం.



వైద్యుల కోసం ఎదురుచూస్తున్న రోగులు

పేరుకే పెద్దాస్పత్రి

- అందని వైద్యసేవలు.. సమయపాలన పాటించని వైద్యులు
- సమస్య చెబితే ప్రైవేటు ఆసుపత్రులకు సిఫార్సు
- మహదేవపూర్ ప్రభుత్వ ఆసుపత్రిదుస్థితి



ప్రైవేటు ఆస్పత్రి పేరు రాసిచ్చిన ఓపీ చిట్టీ

మహదేవపూర్ రూరల్/మహదేవపూర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ఐదు మండలాలకు పెద్ద దిక్కు ఆ ఆసుపత్రి.. ఎలాంటి జబ్బు వచ్చినా, ప్రమాదం సంభవించినా అక్కడికే వెళ్తారు. కాని ఆ ఆసుపత్రికే జబ్బు పట్టింది.. వైద్యం అందించాల్సిన వైద్యులు సమయానికి రాపోవడం.. వచ్చినా ప్రైవేటు ఆసుపత్రులకే సిఫార్సులు చేస్తుండటంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇది మహదేవపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి పరిస్థితి. మహదేవపూర్‌తో పాటు పలిమెల, కాటారం, మహాముత్తారం, మల్హర్ మండలాలకు పెద్దదిక్కుగా ఉన్న ఈఆసుపత్రికి వచ్చే వైద్యులు సమయ పాలన పాటించడం లేదు. విధుల్లో ఉండాల్సిన వైద్యులు భూపాలపల్లి, హన్మకొండ, కరీంనగర్ వంటి పట్టణాల్లో ప్రైవేటు ఆసుపత్రులు పెట్టుకుని వంతులవారీగా విధులకు వస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఒక్కరోజు ఒక డాక్టర్ రాత్రి, పగలు డ్యూటీ చేస్తే.. మరో రెండు రోజుల వరకు మళ్లీ ఆయన కనిపించరు. ఇలా ఒకరి డ్యూటీ మరొకరు చేస్తూ ప్రతి రోజూ హాజరు వేసుకుంటున్నట్లు తెలుస్తోంది. వంతుల వారీగా వైద్యులు విధులకు హాజరవడం.. ఆ వంతు రోజు సమయానికి రాకపోవడంతో మారుమూల ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసలే వానాకాలం.. ఆపై సీజనల్ వ్యాధులు ప్రబలుతుండటంతో రోగులు పెద్దాసుపత్రికి క్యూ కడుతున్నారు. వ్యయప్రయాసలకోర్చి ఆసుపత్రికి వస్తే మళ్లీ ప్రైవేటు ఆసుపత్రులకు రెఫర్ చేస్తుండటం పట్ల తీవ్రవిమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వాసుపత్రికి వచ్చిన రోగులకు వింత పరిస్థితి ఎదురవుతోందంటున్నారు. సమస్య చిన్నదైనా పెద్దదైనా వైద్యుల నుండి ఒకటే సమాధానం వస్తుందని వాపోతున్నారు. 'సార్ నాకు కాలు నొప్పి వస్తుంది.. దీనికి కొంచెం మంచి ట్రీట్‌మెంట్ రాయండి..' అని ఆసుపత్రికి వెళ్ళిన ఓ రోగి వైద్యుడితో మొరపెట్టుకున్నాడు. దీనికి ఆ వైద్యుడు బదులిస్తూ.. 'ఇప్పుడైతే ఈట్యాబ్లెట్లు రాస్తున్నా.. దీనికి ఇక్కడ ట్రీట్‌మెంట్ లేదు.. ఈ జబ్బు ఇక్కడ నయమవదు.. తక్కువ ఖర్చుతో మీజబ్బు నయమయ్యే ఉపాయం చెప్తా...' అంటూ బదులిచ్చారని తెలిపాడు. హన్మకొండలో ఫలానా ఆసుపత్రికి వెళ్తే మీ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని.. ఓపీ చిట్టీమీద ఓ ప్రైవేటు ఆసుపత్రి పేరు రాసిచ్చారని వాపోయాడు. ఇక్కడ నయమయ్యే జబ్బులకు సైతం ప్రైవేటు ఆసుపత్రికి రెఫర్ చేస్తున్నారంటూ వాపోతున్నారు. ఈ ఆసుపత్రిలో జబ్బు నయం కాకపోతే జిల్లా ఆసుపత్రికి లేదా ఎంజీఎంకు రెఫర్ చేయాల్సి ఉంటుంది.. కాని ఇలా ప్రైవేటు ఆసుత్రులకు రెఫర్ చేయడం వెనుక ఆంతర్యం ఏంటో స్పష్టంగా అర్థమవుతోంది. ప్రభుత్వాసుపత్రికి వస్తున్న రోగుల పట్ల ప్రభుత్వాసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. నిత్యం ఆసుపత్రిలో ఉండాల్సిన వైద్యాధికారులు.. వంతుల వారీగా వస్తుండటం.. పర్యవేక్షించాల్సిన వారు పట్టించుకోకపోవడంతో ఈదుస్థితి ఎదురైందని రోగులు వాపోతున్నారు. పెద్దాసుపత్రిపై కలెక్టర్ దృష్టిసారించాలని ఇక్కడికి వచ్చే రోగులు కోరుతున్నారు. వానాకాలం ప్రారంభమైనందున వైద్యులు సకాలంలో హాజరయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు మందులు అందుబాటులో ఉండేలా చూడాలని కోరుతున్నారు.

దొంగతనాలకై దోస్తీ

- జైలులో పరిచయమైన ఆరుగురు వ్యక్తులు
- త్వరగా స్థిరపడాలని చోరీలను వృత్తిగా ఎంచుకున్న వైనం
- జైలు నుంచి విడుదలయ్యాక 15 దొంగతనాలు
- ఆరుగురి అరెస్ట్.. రూ. 37 లక్షల సొత్తు రికవరీ



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సంపత్‌రావు

కృష్ణకాలనీ, జూన్ 10(ఆంధ్రజ్యోతి): వివిధ కేసుల్లో నిందితులైన ఆరుగురికి జైల్లో దోస్తానా కుదిరింది. జైలు నుంచి బయటకు వచ్చాకా లైఫ్‌లో త్వరగా స్థిరపడాలని స్కెచ్ వేశారు. అందుకు సరైన మార్గం దొంగతనాలే భావించి దాన్నే వృత్తిగా ఎంచుకున్నారు. గతంలో చోరీలకు పాల్పడిన అనుభవం ఉన్న భూపాలపల్లి జిల్లా కేంద్రానికి చెందిన వ్యక్తి సలహాలు, సూచనలతో గడిచిన 23 రోజుల్లో భూపాలపల్లితో పాటు గణపురంలో వరుస దొంగతనాలకు పాల్పడ్డారు. సింగరేణి క్వార్టర్స్‌నే టార్గెట్‌గా చేసుకొని చోరీలకు పాల్పడి ఇన్నాళ్లు పోలీసులకు కంటి మీద కునుకు లేకుండా చేశారు. ఎట్టకేలకు భూపాలపల్లి, గణపురం, సీసీఎస్ విభాగం పోలీసులు బృందంగా ఏర్పడి నిఘా పెట్టి ఆ కేటుగాళ్ల ఆటకట్టించారు. మంగళవారం భూపాలపల్లి పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ అవిర్నేని సంపత్‌రావు నిందితుల వివరాలను వెల్లడించారు.

ఏకం చేసిన జైలు జీవితం

భూపాలపల్లి మునిసిపాలిటీ పరిధిలోని జంగేడుకు చెందిన దొరిశెట్టి స్వామి నిరంజన్ 2024 ఆగస్టు నెలలో గోదావరిఖనిలో దొంగతనం చేసి అక్కడి పోలీసులకు పట్టుబడ్డాడు. దీంతో ఆయన్ను పోలీసులు తొలుత కరీంనగర్ జైలుకు.. తదపరి ఖమ్మం జైలుకు పంపించారు. ఈ క్రమంలో జలులో ఉన్న అతనికి సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఇందిరమ్మకాలనీకి చెందిన షైన శివ, భద్రాద్రికొత్తగూడెం జిల్లా బూర్గుపాడు మండలం సారపాక గ్రామానికి చెందిన వాంకుడోతు సాయికుమార్, హైదరాబాద్ మెడ్చేల్ మల్కాజిగిరి జవహర్‌నగర్‌కాలనీకి చెందిన కురిమిళ్ల రమేష్, గుంటూరు జిల్లా కారంపూడి మండలం మిర్యాల గ్రామానికి చెందిన షేక్ బాబావలీ, పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలంలోని శాంతినగర్‌కు చెందిన నెరువట్ల అజయ్‌లు వివిధ కేసుల్లో నేరస్తులై జైలులో ఉండగా వారు పరిచయమయ్యారు.

సాదకబాదకలతో ఆరుగురి మధ్య సయోధ్య కుదిరింది. వారు తమ స్నేహాన్ని అక్కడితో ఆపకుండా బయటకు వచ్చాక కూడా ఫోన్‌లో కలుసుకున్నారు. దొరిశెట్టి స్వామి నిరంజన్ హైదరాబాద్‌లో ఉన్న కురిమిళ్ల రమేష్‌ను కలిసి భవిష్యత్తులో స్థిరపడాలని కోరగా అందుకు రూ.10లక్షలు అవసరం ఉంటాయని రమేష్ చెప్పాడు. దీంతో రూ. 10 లక్షలు సంపాదించాలంటే చోరీలే సరైన మార్గమని, తనకు అనుభవం కూడా ఉందని చెప్పుకొచ్చాడు. దీంతో మిగిలిన నలుగురిని కూడా కలుపుకున్నారు. స్వామి నిరంజన్ సలహాతో భూపాలపల్లికి వచ్చిన వారంతా సింగరేణి కార్మికుల క్వార్టర్స్‌నే టార్గెట్ చేశారు. సీసీ కెమెరాలు ఉండకపోవడంతో పాటు లాక్ తీసే పరికరం ఉండటం వారికి కలిసొచ్చింది. దీంతో గత నెల 8వ తేదీ నుండి 30వ తేదీ వరకు భూపాలపల్లి, గణపురంతో పాటు మణగూరు పరిధిలోని సింగరేణి కార్మికుల క్వార్టర్స్‌లో 15 దొంగతనాలకు పాల్పడ్డారు. దోచిన సొమ్మును భూపాలపల్లి జిల్లా కేంద్రానికి స్వామి నిరంజన్ తండ్రి అయిన దొరిశెట్టి శంకర్ వద్ద భద్రపరిచేవారని డీఎస్పీ తెలిపారు. దీంతో వరుస చోరీలక పాల్పడిన ఆరుగురితో పాటు సహకరించిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్ పంపిస్తున్నట్లు డీఎస్పీ సంపత్‌రావు స్పష్టం చేశారు.

కావాలనే నా భర్తను ఇరికించారు...

దొంగతనాల కేసుతో సంబంధం లేకున్నా తన భర్తను కావాలనే పోలీసులు కేసులో ఇరికించారని దురిశెట్టి శంకర్ భార్య పద్మ ఆరోపించింది. తన కుమారుడు స్వామి నిరంజన్ దొంగతనాలు చేసేవాడని, అది నిజమేనని, అతనికి మాకు సంబంధం లేదని పోలీసులకు చెప్పామన్నారు. కానీ, ఇటీవల అత్యవసరమని భద్రాచలం నుంచి లాయర్‌తో ఫోన్ చేపించి రూ.10వేలు కావాలని అడిగితే ఫోన్‌పే చేశాడని చెప్పింది. అంతేకానీ తన కొడుకు ఏ ఒక్క రూపాయి కూడా తమకు ఇవ్వలేదని, తమ వద్ద భద్రపరచలేదని పేర్కొంది. సొత్తు రికవరీకి రూ.8 లక్షలు తక్కువ అవుతున్నాయని, ఆ డబ్బులు తన భర్తను ఇవ్వాలని సీసీఎస్ పోలీసు అధికారులు ఇబ్బంది పెట్టారని ఆమె ఆరోపించింది. ఆ డబ్బులు ఇవ్వని మూలంగానే తన భర్తను అరెస్టు చేశారని తెలిపింది.

సొత్తు రికవరీ..



పోలీసులు స్వాధీనం చేసుకున్న సొత్తు ఇదే

ఏడుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించడంతో పాటు వారి నుంచి రూ. 37,95,260 విలువ గల సొత్తును రికవరీ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఇందులో 37.15 తులాల బంగారం, 2 కిలో 125 గ్రాముల వెండీ, 3 ద్విచక్ర వాహనాలు, 2 టీవీలు, 1 లాప్‌టాప్, 1 హోమ్‌థియేటర్, 1 గ్యాస్ సిలిండర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నిందితులంతా దొంగిలించిన సొత్తును వరంగల్, హైదరాబాద్‌లో విక్రయించేందుకు భూపాలపల్లి నుండి వెళ్తుండగా వర్గం మధ్యలో గణపురం పరిధిలో ఎస్సై, సిబ్బంది వాహనాల తనిఖీల్లో అనుమానస్పదంగా కనిపించగా వీరు పట్టుబడ్డారన్నారు. ఈ సమావేశంలో సీసీఎస్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సైలు సాంబమూర్తి, రమేష్, అశోక్, సీసీఎస్ ఎస్సై, సిబ్బంది పాల్గొన్నారు.

అటవీశాఖ వేధింపులతో గొత్తికోయ ఆత్మహత్యాయత్నం

పరిస్థితి విషమం... ములుగు ఆసుపత్రికి తరలింపు

ఏటూరునాగారం రూరల్, జూన్ 10, (ఆంధ్రజ్యోతి) : తనకు సంబంధించిన పోడుభూములను అటవీశాఖ అధికారులు తీసుకొని మొక్కలు నాటుతుండడంతో మనోవేదనకు గురై ఓ గొత్తికోయ రైతు ఉరివేసుకొని ఆత్మహత్య పాల్పడిన సంఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం మండలంలోని చిన్నబోయినపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గల రాయబంధం గొత్తికోయగూడానికి చెందిన సోడి రమేష్‌కు గ్రామ శివారులో పోడుభూమి ఉంది. పోడుభూమిని అటవీశాఖాధికారులు తమ ఆధీనంలోకి తీసుకొని ఆ భూమిలో గత మూడు రోజులుగా అటవీశాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటుతున్నారు. ఈ క్రమంలో సోడి రమేష్ మంగళవారం పోడుభూములోకి వెళ్లగా అక్కడ అటవీశాఖ అధికారులు మొక్కలు నాటుతుండడం చూసి మనోవేదనకు గురై పొలంలో ఉన్న గుడిసెలోకి వెళ్లి తాడుతో ఉరివేసుకున్నాడు. ఈ విషయాన్ని గమనించిన తోటి గొత్తికోయవాసులు అతడిని బయటకు తీసి ట్రాక్టర్ ద్వారా రోడ్డు మీదకు తీసుకొచ్చారు. అక్కడి నుంచి 108 వాహనం ద్వారా మండల కేంద్రంలోని సామాజిక ఆసుపత్రికి తీసుకొచ్చి చికిత్సనందించారు. రమేష్ పరిస్థితి కొంత విషమంగా ఉందని, మెరుగైన వైద్యం కోసం ములుగు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతానికి అతని పరిస్థితి విషమంగానే ఉంది. ఈ విషయంపై తాడ్వాయి పరిధి డిప్యూటీ రేంజర్ నరేందర్‌ను వివరణ అడగగా అక్కడి రైతులు సమ్మతితోనే మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతున్నది. 20హెక్టార్‌లో ప్లాంటేషన్ పనులు చేయవల్సి ఉండగా గతేడాది 10 హెక్టార్‌లో ప్లాంటేషన్ చేశామని, మిగతా 10హెక్టార్‌లో పనులు కొనసాగుతున్నాయని, ఎవరిని కూడా వేధింపులకు గురిచేయలేదని ఆయన తెలిపారు.



సోడి రమేష్‌ను ట్రాక్టర్ ద్వారా తీసుకొస్తున్న దృశ్యం

'అమ్మమాట- అంగన్‌వాడీ బాట'



బండారుపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీ స్కూల్ కార్యక్రమంలో..



ఎల్లారెడ్డిపల్లి గ్రామంలో కోడిగుడ్లు అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్ మంజుల

- చిన్నారులను ఆకర్షించే విధంగా కార్యక్రమాలు
- ఈ నెల 17 వరకు వారోత్సవాలు

ములుగు రూరల్, జూన్ 10, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల తరహాలోనే అంగన్‌వాడీలను సైతం బలోపేతం చేసేందుకు రాష్ట్ర మహిళ, శిశు సంక్షేమశాఖ పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. మూడేళ్ల లోపు పిల్లలను బడిలో చేర్పించేలా గ్రామ పంచాయతీలను, ప్రజలను భాగస్వాములను చేస్తున్నారు. అందులో భాగంగా ఈ నెల 10 నుంచి 17వ తేదీ వరకు 'అమ్మ మాట- అంగన్‌వాడీ బాట' పేరుతో వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం నుంచి అంగన్‌వాడీ బడులను పూర్తిస్థాయిలో తెరవనున్నారు. గ్రామస్థాయిలో చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తూ ఆటపాటలతో విద్యాబోధనకు తోడు బాలింతలు, గర్భవతులకు పౌష్టాకాహారం, సలహాలు, సూచనలు అందిస్తూ పలు కార్యక్రమాలతో అంగన్‌వాడీలు కొనసాగతున్నాయి.

గ్రామస్థాయిలోని అంగన్‌వాడీ కేంద్రాలను పూర్తిస్థాయిలో బలోపేతం చేసే దిశగా ఆశాఖ చర్యలు చేపట్టింది. మూడేళ్ల నుంచి ఆరేళ్ళలోపు చిన్నారులు ప్రైవేటు పాఠశాలల్లో కాకుండా అంగన్‌వాడీల్లో చేరేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టేందుకు నిర్ణయించారు. బడీడు పిల్లలు బడిలో ఉండాలంటూ ఇటీవల ఆ శాఖ మంత్రి సీతక్క అంగన్‌వాడీల బలోపేతంపై నిర్వహించిన సమావేశాల్లో ప్రత్యేకంగా వెల్లడించారు. ప్రైవేటు స్కూళ్ళకు దీటుగా కేంద్రాలను తీర్చిదిద్దేందుకు ఫర్నీచర్, ఆట వస్తువులు, ప్రీపైమరీ విద్య, యూనిఫామ్స్ ఇచ్చే అంశాలను ప్రజలకు వివరించి చైతన్య పరచాలని సూచించారు. తల్లిదండ్రులకు కేంద్రాలపై పూర్తి నమ్మకం కలిగేలా చూడాలని శాఖ నిర్ణయించింది. అక్షరజ్ఞానంతో పాటు వికాసం, ఉల్లాసం, పోషకాహార కేంద్రాలుగా అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నయన్న విషయాన్ని ప్రజలకు వివరించనున్నారు. కేంద్రాల్లో పలు వసతులు కల్పించడంతో పాటు పూర్తిస్థాయిలో వసతులు లేని కేంద్రాలను సమీపంలోని ప్రభుత్వ భవనాల్లోకి మార్చనున్నారు. ఇరుకు, అద్దె గదుల్లో అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్న చోట ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఒక్కో అంగన్‌వాడీ కేంద్రం రూ. 12లక్షల వ్యయంతో నిర్మించేందుకు కూడా చర్యలు చేపడుతున్నారు.

షెడ్యూల్ ఇలా..

ఈ నెల 10న అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, పేరెంట్స్ గ్రూప్, గ్రామస్థాయిలో ప్రజాప్రతినిధులు, మహిళా స్వయం సహాయక సంఘాలతో సమావేశం నిర్వహించనున్నారు. 11న మూడేళ్లపైబడ్డ చిన్నారులను గుర్తించి వారి నివాసాలను సందర్శించి అంగన్‌వాడీ కేంద్రాల్లో అందుతున్న సేవలపై తల్లిదండ్రులకు అవగహన కల్పించాలి. 12, 13, 16న పోషన్ కిచెన్ గార్డెన్, పోషాకాహార వివరాలను, స్టడీ మెటీరియల్ పంపిణీ చేయాలి. చైల్డ్ ఫ్రెండ్లీ వాతావరణం అంగన్‌వాడీల్లో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. 17న కేంద్రాల్లో తల్లిదండ్రులు, గ్రామపెద్దల సమక్షంలో సాముహిక అక్షరాభ్యాసం నిర్వహించాలి. ములుగు జిల్లాలో ప్రాజెక్టులో పరిధిలో 640 అంగన్‌వాడీ సెంటర్లు ఉండగా అందులో గర్భవతులు 2187 మంది, బాలింతలు 1244 మంది, 0-3 ఏళ్ల పిల్లలు 9991 మంది, 3-6 ఏళ్ల లోపు పిల్లలు 8437 మంది, 0-5 ఏళ్ల లోపు పిల్లలు మొత్తం కలిపి 16,970 మంది సౌకర్యాలు పొందుతున్నారు.

తొలకరి వానలకే తొందరపడొద్దు

- దుక్కులు సిద్ధం చేసుకోవాలి
- భూసార పరీక్షలు తప్పనిసరి
- విత్తనాల ఎంపిక ముఖ్యం
- వరంగల్ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త ఉమారెడ్డి





వరంగల్ వ్యవసాయం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): 'తొలకరి జల్లులు పడగా రైతులు తొందరపడి విత్తనాలు నాటొద్దు. సరైన వర్షపాతం, అనువైన సమయం రాకముందే విత్తనాలు నాటితే ఆశించిన స్థాయిలో మొలకశాతం రాదు. తొలకరికి ముందే భూసార పరీక్షలు చేయించుకోవాలి.పొలంగట్లను తయారు చేసుకోవాలి. నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలి'.. అంటున్నారు వరంగల్ ప్రాంతీయ పరిశోధనా కేంద్రం అదనపు సంచాలకుడు ఆర్.ఉమారెడ్డి. వర్షాకాలంసీజన్ ఆరంభమైనందున' ఆంధ్రజ్యోతి' ద్వారా ఆయన రైతులకు సూచనలు చేశారు.

కనీసం 70 మి.మీ. వర్షం పడాలి..

రైతులు సరైన వర్షపాతం, అనువైన సమయం రాకముందే విత్తనాలు వేయడం వల్ల రైతులు నష్టాల పాలవుతారు. తొలకరి వర్షాలకే విత్తనాలు విత్తుకోవడం మంచిది కాదు. కనీసం 70 మి.మీ. వర్షం కురిశాక నాటితేనే వంద శాతం మొలక వస్తుంది. పొడి దుక్కుల్లో విత్తితే అవి మొలకెత్తవు.

అనువైన సమయం

ఈ నెల రెండో వారం నుంచి జూలై 20 వరకు పత్తి విత్తనాలు వేసుకోవచ్చు. జూన్ నుంచి జూలై మూడో వారం వరకు మొక్కజొన్నలు విత్తుకోవచ్చు. జూన్ రెండో వారం నుంచి జూలై రెండో వారం వరకు కంది పంట వేసుకోవచ్చు. జూలై నుంచి నీటి వసతిని బట్టి మిరుప నారు పోసుకోవాలి. సెప్టెంబర్ మొదటి వారం వరకు మొక్కలు నాటుకునేలా చూడాలి. జూన్ ఆరంభం నుంచి చివరి వరకు వరి నార్లు పోసుకోవడానికి అనువైన కాలం.

ముందస్తు దక్కులు దున్నడం

వానాకాలం సీజన్ పంటలు సాగు చేయాలంటే ముందస్తు ప్రణాళికలు వేసుకోవాలి. ముందుగా దుక్కులు దున్నడం వల్ల తొలకరి వర్షాలకు భూమి నీటిని పీల్చుకుని తేమశాతం పెరుగడానికి దోహదపడుతుంది. వాలుకు అడ్డంగా దున్నితే వర్షపు నీరు ఎక్కువగా నిలుస్తుంది. తోటల్లో ఉండే మొండి జాతి కలుపు మొక్కలు, దుంపలు వేళ్లతో సహా బయటకు ఊడి వస్తాయి. నిద్రావస్థలో ఉన్న పలు కీటకాలు నశిస్తాయి.

భూసార పరీక్షలు

రైతులు యేటా విధిగా భూసార పరీక్షలు చేయించాలి. ఏడాదికి ఒకటి, రెండు పంటల పండించే భూముల్లో మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షా కేంద్రాల్లో అందజేయాలి. వారి సూచనల మేరకు పంటలు సాగు చేసుకోవడం మంచిది.

పొలం గట్ల తయారీ

పంటలపై తీసుకునే శ్రద్ధ పొలం గట్లపై, నీటి కాల్వలపై తీసుకోవడం లేదు. దీంతో ఒయ్యారి భామ, మాల మాతంగి, నీరు గొబ్బి, గొంగల గరకు, గరక రాకాసి, తుంగ వంటి మొక్కలు పెరిగి పంటకు వివిధ రకాలైన వ్యాధులు వచ్చేందుకు కారణమవుతాయి. వేసవిలోనే తప్పనిసరిగా పొలం గట్లు, కాల్వల్లో కలుపు లేకుండా చూసుకోవాలి.

విత్తనాల ఎంపిక ముఖ్యం

తాలు గింజలు, కలుపు విత్తనాలు వేరు చేసి నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలి. సర్టిఫైడ్ విత్తనాలు కానీ, పరిశోధనా స్థానం నుంచి సేకరించిన విత్తనాలను కాని తీసుకోవాలి. ఏ విత్తనమైనా మొలకశాతం తెలుసుకోకుండా నారు పోయకూడదు. ఎంపిక చేసిన విత్తనాలను విత్తన శుద్ధి చేసిన 12 గంటల తరువాతనే భూమిలో విత్తుకోవాలి.

పచ్చిరొట్ట సాగు

తొలకరి వర్షాలకు జనము, జీలుగ, పిల్లిపెసర, అలసంద మొదలైన పంటలను పండించి భూమిలో కలియదున్నాలి. దీంతో ఎకరాకు 20 నుంచి 30 కిలోల యూరియాను ఆదా చేయవచ్చు. భూమి ఆరోగ్యంగా ఉంటుంది. జనుము, పిల్లి పిసర పంటలు ఎరువులుగానే కాకుండా పశువుల మేతకు కూడా ఉపయోగపడుతాయి.

ఫీజులు మాకొద్దు.. బడికొస్తే చాలు..

- ఉన్నతులుగా తీర్చిదిద్దుతాం..
- ప్రభుత్వ బడుల్లో ప్రవేశాలకు వినూత్న పద్ధతులు
- ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు



కరపత్రం పంచుతున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు హరీష్

మహదేవపూర్ రూరల్, జూన్ 10 : మాకు ఫీజులొద్దు.. మేం అడుగం.. తిండి పెట్టి విద్యనందిస్తాం.. మా పాఠశాలకు రండి అంటూ ప్రభుత్వ ఉపాధ్యాయులు గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతున్నారు. ప్రభుత్వ బడుల్లో ఉండే సౌకర్యాలు, వెసులుబాట్లను తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. బడిబాటలో భాగంగా కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులు అడ్మిషన్ల సంఖ్య పెంచేందుకు తమ నైపుణ్యాలను ప్రదర్శిస్తున్నారు. సూరారం ఎస్టీ కాలనీ ఉపాధ్యాయుడు మేడుదుల హరీష్ తానే సొంతంగా ఓ కరప్రతం తయారు చేశాడు. అందులో ఉచితవిద్య, ఉచిత యూనిఫాం, టిఫిన్, మధ్యాహ్న భోజనం, టెక్స్ బుక్కులు, వర్క్ బుక్కులు, ఆటలపోటీలు, ఏఐ బోధన, ప్లేగ్రౌండ్, తల్లిదండ్రులతో సమావేశాలు, ప్రతిభ ఆధారంగా బోధన.. ఇలా ప్రభుత్వ పాఠశాలల్లో ఉండే సదుపాయలను పొందుపరిచాడు. ప్రైవేటు బడులకు తీసిపోకుండా ప్రభుత్వ బడుల్లో పొందే సౌకర్యాలను వివరిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులకు పాంప్లేట్లను పంపిణీ చేస్తున్నారు. ఈ సందర్భంగా సదరు ఉపాధ్యాయుడిని పలువురు అభినందిస్తున్నారు.

కాంగ్రెస్‌లో కుత కుత

5వ పేజీ తరువాయి

మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకుని, అధిష్ఠానం తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసినట్లుగా సమాచారం.

తూర్పులో కొండా.. నర్సంపేటలో దొంతికి ఝలక్..

టీపీసీసీ పదవుల వ్యవహారం కాంగ్రెస్‌లో విభేదాలకు దారితీస్తోంది. ముఖ్యంగా వరంగల్ తూర్పు నియోజకవర్గంలో మంత్రి కొండా సురేఖతో రాజకీయ విభేదాలు ఉన్న ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యకు టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ పదవి ఇవ్వటం కొండా వర్గీయులకు మింగుడు పడటం లేదనే ప్రచారం ఉంది. ఇటీవలే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన బస్వరాజు సారయ్యకు మంత్రి కొండా దంపతుల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా విభేదాలు ఏర్పడ్డాయి. బహిరంగంగా ఒకరిపై మరొకరు పరోక్షంగా విమర్శలు గుప్పించుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మంత్రి కొండా సురేఖ నియోజకవర్గం నుంచి రాజకీయ ప్రత్యర్థికి కీలక పదవి ఇవ్వటం కొండా వర్గంలో అసంతృప్తి వ్యక్తం అవుతోంది. టీపీసీసీ కార్యదర్శిగా ఉన్న మీసాల ప్రకాష్, మంత్రి ముఖ్య అనుచరులుగా ఉన్న గోపాల నవీన్‌రాజుతో పాటు అనేక మంది పార్టీ పదవిపై నజర్ వేశారు. అయితే అనుహ్యంగా సారయ్యకు రాష్ట్ర ఉపాధ్యక్ష పదవిని ఇవ్వటం తూర్పులో రాజకీయ తుఫాన్ రావటం ఖాయమనే చర్చ జరుగుతోంది. అలాగే నర్సంపేట నియోజకవర్గం నుంచి టీపీసీసీ అధికార ప్రతినిధిగా ఉన్న కత్తి వెంకటస్వామికి ప్రధాన కార్యదర్శి పదవి ఇవ్వటంపై స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అనుచరుల్లో అసంతృప్తి వ్యక్తం అవుతోంది. 2014లో నర్సంపేట కాంగ్రెస్ టికెట్ దొంతిని కాదని కత్తికి కేటాయించారు. దీంతో మాధవరెడ్డి ఇండిపెండెంట్‌గా పోటీచేసి ఎమ్మెల్యేగా గెలిచి, కాంగ్రెస్‌కు అనుబంధంగా కొనసాగారు. అప్పటి నుంచి కత్తితో దొంతికి విభేదాలు కొనసాగుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో వెంకటస్వామికి పార్టీ ప్రధాన కార్యదర్శి పదవి ఇవ్వటం పార్టీలో చర్చనీయాంశంగా మారింది.

వర్కింగ్ ప్రెసిడెంట్ దక్కేదెవరికో..?

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీలో అధ్యక్ష పదవి తర్వాత కార్యనిర్వాహ అధ్యక్ష పదవికే ఎక్కువ పోటీనెలకొంది. టీపీసీసీలో వర్కింగ్ ప్రెసిడెంట్‌లుగా పని చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భట్టి విక్రమార్క లాంటి నేతలు రాష్ట్ర స్థాయిలో కీలకంగా ఎదిగారు. దీంతోపాటు టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీలో వర్కింగ్ ప్రెసిడెంట్‌లు కూడా సభ్యులుగా ఉంటారు. దీంతో చాలామంది నేతలు వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి కోసం పోటీ పడుతున్నారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో పాటు మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్యనాయక్, దొమ్మాటి సాంబయ్య తదితరుల పేర్లు వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి కోసం వినిపించాయి.

రాజకీయ సమీకరణలో నాయినికి వర్కింగ్ పదవి దక్కే అవకాశం లేకనే వైస్‌ప్రెసిడెంట్ పదవి ఇచ్చారనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఎంపీ బలరామ్‌నాయక్‌కు కూడా కీలకమైన పొలిటికల్ అఫైర్స్ కమిటీ(పీఏసీ)లో ఇటీవలే చోటు కల్పించారు. దీంతో పాటు ఎస్టీ సామాజిక వర్గం నుంచి డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రనాయక్‌కు డిప్యూటీ స్పీకర్ పదవి ఇవ్వటంతో ఇక ఎస్సీ సామాజిక వర్గం నుంచే వర్కింగ్ ప్రెసిడెంట్ ఉంటారనే చర్చ జరుగుతోంది. దొమ్మాటి సాంబయ్యతో పాటు ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజు, ఎంపీ కడియం కావ్య, సింగపురం ఇందిరతో పాటు పలువురి పేర్లు తెరపైకి వస్తున్నాయి. దీంతో వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ సామాజిక వర్గానికి, ఎవరికి దక్కుతుందో అనే ఉత్కంఠ కాంగ్రెస్ కేడర్‌లో నెలకొంది.

కోటి విత్తనాల సేకరణ

కాజీపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : కాజీపేటకు చెందిన పర్యావరణ పరిరక్షకుడు ప్రకాశ్ ఏళ్లుగా పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తున్నారు. పద్మశ్రీ వనజీవి రామయ్య స్ఫూర్తితో ఈ సంవత్సరానికి గాను మంగళవారం సోమిడిలో రామకోటి (పద్మశ్రీ రామయ్య) విత్తనాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. సోమిడి ప్రాంతంలో కొంత మంది యువకులతో కలిసి రామకోటి విత్తనాలు సేకరించి వర్షాకాలంలో గుట్టలు, మైదాన ప్రాంతాలు, ప్రభుత్వ భూముల్లో చల్లుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జి.కార్తీక్, కె.సుశాంత్, కె.విష్ణు, జి.త్రిదేవ్, ఎం.శ్రావణ్‌కుమార్, జే.జంపయ్య, బి.చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.



విత్తనాలు సేకరిస్తున్న దృశ్యం



కేవిలో భారతీయ భాష సమ్మర్ క్యాంప్ ముగింపు కార్యక్రమంలో విద్యార్థులతో ప్రిన్సిపాల్ సుభాషిణి

విద్యార్థులకు అన్ని భాషలపై పట్టు ఉండాలి

మడికొండ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట మండలం కడిపికొండ కేంద్రీయ విద్యాలయంలో వారం రోజుల పాటు జరిగిన భారతీయ భాష తమిళ్ సమ్మర్ క్యాంప్ ముగింపు కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుభాషిణి మాట్లాడుతూ.. విద్యార్థులకు అన్ని భాషలపై పట్టు ఉండాలన్నారు. తమిళ భాషను విద్యార్థులకు నేర్పించడంతో పాటు తమిళుల ఆచార వ్యవహారాలు, చారిత్రక ప్రదేశాలు, వ్యవసాయం, ఆహార ఉత్పత్తులు గురించి వివరించి పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో తమిళ శిక్షకురాలు రమ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

సీపీని కలిసిన మిల్స్‌కాలనీ సీఐ

వరంగల్ క్రైం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఇటీవలే మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన బొల్లం రమేష్ మంగళవారం వరంగల్ పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. పోలీసుశాఖకు కీర్తి ప్రతిష్ఠలు తెచ్చేలా విధులు నిర్వర్తించి ప్రజల మన్ననలు పొందాలని సీఐకి సీపీ సూచించారు.



సీపీకి మొక్క అందజేస్తున్న సీఐ బొల్లం రమేష్

పదోన్నతులతో బాధ్యతలు పెరుగుతాయి

పోలీసు అధికారులకు పదోన్నతులతోపాటు బాధ్యతలు పెరుగుతాయని వరంగల్ సీపీ సన్‌ప్రీత్‌సింగ్ అన్నారు. కాజీపేట ఎస్సైగా విధులు నిర్వర్తిస్తూ సీఐగా పదోన్నతి పొందిన శివకృష్ణ మంగళవారం సీపీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీపీ చేతుల మీదుగా తన భుజాలపై నక్షత్రాన్ని అలంకరించుకొని మురిసిపోయారు.

బదిలీపై వెళ్తున్న ఇన్‌స్పెక్టర్‌కు సన్మానం

కాజీపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కాజీపేట పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐగా పనిచేసి ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతిపై వెళ్తున్న శివకృష్ణకు మంగళవారం సన్మానం చేశారు. ఈ సందర్భంగా కాజీపేట పోలీస్ ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. సుదీర్ఘకాలం ఎస్‌ఐగా పని చేసిన శివకృష్ణ సేవలను కొనియాడారు. క్రమశిక్షణ, పట్టుదలతో పని చేసిన వారిని ప్రజలు గుర్తిస్తారన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నవీన్, ఏఎస్‌ఐ శ్రీధర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



కాజీపేట ఎస్‌ఐగా పని చేసి సీఐగా బదిలీపై వెళుతున్న శివకృష్ణను సన్మానిస్తున్న పోలీసు సిబ్బంది

అనుమతిలేని స్కూల్ సీజ్

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): అనుమతి పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. వివిధ విద్యార్థి సంఘాల అభ్యర్థన మేరకు డీఈవో వాసంతి ఆదేశానుసారం ఎంఈవో నెహ్రూ నాయక్ రాంనగర్‌లోని అనుమతిలేని మెరిడీయన్ స్కూల్‌ను మంగళవారం సీజ్ చేశారు. అనుమతి లేని పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు సత్వరమే స్పందించి చర్యలు తీసుకోవాలని బీఎస్ఎఫ్, టీజీవీపీ, టీఎస్ఎఫ్, ఎన్ఎస్ఎఫ్ నాయకులు మేడ రంజిత్, కాడపాక రాజేందర్, కన్నం సునిల్, సాంబరాజు, నాగారం మణితేజ డిమాండ్ చేశారు.

హనుమమానగర్ కాలనీ ఆర్చ్ ప్రారంభం

రాంనగర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : 54వ డివిజన్‌లోని హనుమాన్‌నగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రవేశ ద్వారంను ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. కాలనీవాసుల కలిసి స్వచ్ఛందంగా ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని ప్రశంసించారు. కాలనీలో మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వ సహకారం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు వెంకటేశ్వర దేవుడి ఫొటోను బహూకరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ భర్త, కాంగ్రెస్ నాయకుడు గుంటి శ్రీనువాస్, కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు రాజేందర్, రాజేశ్వర్‌రావు, సదానందం, మురళి, దేవేంద్రచారి, సూర్యనారాయణ, మల్లారెడ్డి, శ్రీనువాస్, రాజేశ్, ఉప్పుల రాజు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వెంకటేశ్వరుడి ఫొటో బహూకరిస్తున్న కాలనీవాసులు

పింగిళి కళాశాలలో జాబ్‌మేళా

వడ్డేపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ వడ్డేపల్లిలోని పింగిళి ప్రభుత్వ డిగ్రీ , పీజీ మహిళా కళాశాలలో కామర్స్ అండ్ వ్యాపార నిర్వహణ శాస్త్ర విభాగం, ఎంట్రప్రెన్యూర్ డెవలప్‌మెంట్ సెల్, రిటైల్ అసోసియేషన్, స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (రాసి) వారి సంయుక్తాధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాసి సంస్థ మేనేజర్ చందావడ్డె, రిలయన్స్ సంస్థ మేనేజర్ చల్లారావు, మెడ్‌ప్లస్ సంస్థ మేనేజర్ శైలేష్, మంగళ గౌరీ సంస్థ మేనేజర్ మురళి, దర్పన్ సంస్థ మేనేజర్ రేష్మాతో పాటు కళాశాల వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సారంగపాణి, బీబీఏ కోర్సు ఇన్‌చార్జి డాక్టర్ సుమలత, ఎంట్రాప్రెన్యూర్ డెవలప్‌మెంట్ సెల్ ఇన్‌చార్జి డాక్టర్ రాజు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అకడమిక్ క్యాలెండర్ భళా!

(5వ పేజీ తరువాయి)

పేర్కొన్నారు. అలాగే పాఠశాలలోని ప్రతీ విద్యార్థి చేత 30 నిమిషాలపాటు చదివించాలని సూచించారు. రీడింగ్ యాక్టివిటీలో పాఠ్యపుస్తకాలతో పాటు కథల పుస్తకాలు, దినపత్రికలు, మ్యాగ్జిన్లు వంటి వాటిని చదివించాలని పేర్కొన్నారు. అలాగే మునుపెన్నడూ లేని విధంగా సిలబస్ పూర్తి చేసేందుకు గడువు విధించడం విశేషం. 10వ తరగతి సిలబస్‌ను జనవరి 10లోగా సిలబస్‌ను పూర్తి చేయాలి. 1 నుంచి 9 తరగతుల విద్యార్థులకు సిలబస్‌ను ఫిబ్రవరి 28లోగా పూర్తి చేయాలి. ఇక ప్రాథమిక పాఠశాలలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తే, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.15 గంటల దాకా నడుస్తాయి. ప్రతీ నెల మూడో శనివారం రోజును బ్యాగ్‌లెస్ డేగా పాటించాలని విద్యాశాఖ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రైవేటు పాఠశాలల్లో మాత్రమే ప్రైమరీ క్లాసులు చదివే విద్యార్థులకు ఇలాంటి కార్యక్రమాలు ఉంటాయి. అయితే ఈ సారి ప్రభుత్వ బడుల్లోనూ వినూత్నంగా ఈ ప్రక్రియను ప్రారంభించనున్నారు.

బడి బస్సులు భద్రమేనా..?

- పాఠశాలల పున:ప్రారంభ వేళ జాగ్రత్త
- ఫిట్‌నెస్ పరీక్షలకు సగం బస్సులు దూరం
- మొక్కుబడిగా పరీక్షలు నిర్వహిస్తున్నారంటూ విమర్శలు

వరంగల్ క్రైం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు ముగిసి బడుల పునఃప్రారంభానికి ఇంకా రెండు రోజులు గడువే ఉండగా, పాఠశాల బస్సుల యాజమాన్యాలు ఫిట్‌నెస్ పరీక్షలకు హాజరుకాకుండా దూరంగా ఉంటున్నారు. అరకొరగా ఫిట్‌నెస్ పరీక్షలకు వస్తున్న బస్సులను మొక్కుబడిగానే తనిఖీలు చేసి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు ఆర్టీఏ అధికారులపై వస్తున్నాయి. కేవలం బ్రేకులు, క్లచ్‌లు, గేర్లపైనే అధికారులు దృష్టిసారించి మోటార్ వెహికల్ యాక్టులోని ఇతర నిబంధనలను పట్టించుకోకుండా క్షణాల్లో ఫిట్‌నెస్ పరీక్ష ముగిస్తున్నారనే అపవాదు సంబంధి శాఖపై ఉంది.

తల్లితండ్రులు పర్యవేక్షణ తప్పనిసరి..

విద్యార్థులను ఇంటి నుంచి పాఠశాల బస్సుల్లో పంపించే తల్లిదండ్రులు కేవలం పాఠశాల ఎంపిక వరకే పరిమితం కాకుండా బస్సుల ఫిట్‌నెస్‌పై దృష్టిసారించాల్సిన అవసరం ఉందని ఆర్టీఏ అధికారులు చెబుతున్నారు. విద్యార్థుల అడ్మిషన్ల సమయంలోనే బస్సుల కండిషన్‌ను పరిశీలించి నిత్యం పర్యవేక్షించాల్సిన అవసరం ఉందన్నారు. డ్రైవర్‌తో పాటు అటెండెంట్ల వ్యవహార శైలిని నిత్యం గమనిస్తూ యాజమాన్యాల దృష్టికి తీసుకపోతే తప్పు ఒప్పులు ఉంటే సరిచేసే అవకాశం ఉంటుందని ఆర్టీఏ అధికారులు అభిప్రాయపడుతున్నారు.

కాలం చెల్లినవి 320 బస్సులు

జిల్లాలో 1271 బస్సులు ఉండగా, ఇందులో 320 బస్సులు 15 యేళ్లు దాటినవి ఉన్నాయని, ఇవి విద్యార్థుల రవాణాకు పనికి రావని ఆర్టీఏ అధికారులు గుర్తించారు. మే 15వ తేదీలోపే ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తి చేసుకోవాల్సిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఇప్పటికి పూర్తిస్థాయిలో హాజరుకాలేదని ఆర్టీఏ రికార్డులు చెబుతున్నాయి. 1,271 బస్సుల్లో కాలం చెల్లిన 320 బస్సుల పోనూ మిగిలిన 971 బస్సులకు గానూ సోమవారం నాటికి కేవలం 499 బస్సులు మాత్రమే ఫిట్‌నెస్ పరీక్షలకు హాజరయ్యాయని తెలుస్తోంది. ఇంకా 452 బస్సులు ఫిట్‌నెస్ పరీక్షలకు హాజరు కావాల్సి ఉంది. రెండు రోజుల్లో పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో ఫిట్‌నెస్ పరీక్షలకు మిగిలిన బస్సులు వస్తాయా లేవా..? లేదంటే ఆర్టీఏ అధికారులు కళ్లు గప్పి రోడ్డెక్కి రానున్న ఆర్టీఏ తనిఖీల్లో పట్టుబడుతాయా..? అనేది వేచి చూడాలిమరీ.



నిఘా ఉంటుందా..?

జిల్లాలో 320 బస్సులకు కాలం చెల్లిపోగా వాటి యాజమానులు వాటిని షెడ్డుకు పరిమితం చేస్తారా లేదా ఆర్టీఏ అధికారులు కళ్లుగప్పి రోడ్లు ఎక్కించి విద్యార్థులను తరలిస్తారా? అనేది ముందున్న పరీక్ష. పాఠశాల పునః ప్రారంభం తర్వాత ఆర్టీఏ అధికారులు వాటిపై ప్రత్యేక దృష్టిసారించి రోడ్డెక్కకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లితండ్రులు కోరుతున్నారు. వాటి వివరాలను సైతం ఆర్టీఏ అధికారులు బయటపెడితే తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండే అవకాశం ఉంటుందని, ప్రమాదాలను సైతం ముందస్తుగా నివారించవచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు.

నిబంధనలు పాటించని బస్సులు సీజ్ చేస్తాం..

- హనుమకొండ రవాణా అధికారి వేణుగోపాల్

ఫిట్‌నెస్ పరీక్షలకు రాని పాఠశాల యాజమాన్యాలకు ముందస్తుగా నోటీసులు జారీ చేస్తాం. ధిక్కరించి రోడ్డెక్కితే సీజ్ చేస్తాం. విద్యార్థులు ప్రయాణించే బస్సుల విషయంలో ఎలాంటి ఒత్తిళ్లకు మెత్తబడేది లేదు. పాఠశాలల పునః ప్రారంభం తర్వాత కచ్చితంగా తనిఖీలు చేసి మరోకసారి బస్సులను పరిశీలిస్తాంది. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడితే ఊరుకునేది లేదు. మద్యం అలవాటు లేని బ్యాడ్జి ఉన్న డ్రైవర్స్‌నే ఆయా యాజమాన్యాలు నియమించుకోవాలి. ఫిట్‌నెస్ పరీక్ష పూర్తి అయితేనే విద్యార్థులను ట్రాన్స్‌పోర్ట్ చేయాలి. తల్లితండ్రుల పర్యవేక్షణ బడి బస్సులపై కచ్చితంగా ఉండాలి.

నిబంధనలు

- 60 ఏళ్లు దాటిన వ్యక్తులను డ్రైవర్లుగా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు నియమించుకోవద్దు.
- డ్రైవర్స్ ఆరోగ్యంపై ఆయా పాఠశాలల యాజమాన్యాలు తరుచుగా ఆరా తీస్తూ వైద్యపరీక్షల నివేదికలను దగ్గర ఉంచుకోవాలి.
- డ్రైవర్‌కు ఐదేళ్ల అనుభవం ఉండేలా చూసుకోవాలి.
- ప్రతీ బస్సులో అటెండెంట్‌ను నియమించి విద్యార్థులు రోడ్డు దాటుతున్నప్పుడు చేయి పట్టుకొని దాటించాలి.
- విద్యార్థులు బస్సు ఎక్కేందుకు అనుకూలంగా మెట్లు ఉండాలి, భూమి నుంచి మెదటి మెట్టు 325 మిల్లీమీటర్ల ఎత్తులో ఉండాలి. ఎక్కడానికి పక్కకు రెయిలింగ్‌లు ఉండేలా ఏర్పాటు చేసుకోవాలి
- పాఠశాల పేరు, సెల్‌నెంబర్, అడ్రస్ స్పష్టంగా కనిపించేలా బస్సుపై ముద్రించాలి, 15 ఏళ్లు దాటిన బస్సులను విద్యార్థుల రవాణాకు ఉపయోగించరాదు.
- కిటికీల నుంచి విద్యార్థులు తల, చేతులు బయటపెట్టకుండా ఉండేందుకు కిటీకీలకు మధ్యలో లోహపు కడ్డీలను కచ్చితంగా అమర్చాలి.
- బస్సులో తప్పనిసరిగా అటెండెన్స్ ఉండాలి, విద్యార్థులు బ్యాగులను పెట్టుకునేందుకు సీట్ల కింద ప్లేస్ ఉండాలి.
- ప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు ప్రథమ చికిత్స అందించేందుకు పరికరాలు, మందులతోపాటు ఆక్సిజన్ సిలిండర్ ఉండాలి. అత్యవసర ద్వారం ఉండాలి.
- రేడియం స్టిక్కర్స్, ప్రభుత్వం సూచించే స్లోగన్స్ బస్సుపై రాయించాలి.
- కెపాసిటీకి మించి ఓవర్‌లోడ్‌తో వెళ్లొదు. సీటుకు ఇద్దరిని మాత్రమే కూర్చోబెట్టాలి

భూసేకరణ పూర్తయిన రైతులకు పరిహారం చెల్లించాలి

హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్ జూన్10(ఆంధ్రజ్యోతి): గౌరవెల్లి ప్రాజెక్టు, గ్రీన్‌ఫీల్డ్‌హైవే, రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ పూర్తయిన రైతులకు వెంటనే పరిహారం చెల్లించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో మంగళవారం భీమదేవరపల్లి, వేలేరు మండలాల పరిధిలో గౌరవెల్లి ప్రాజెక్టు, పరకాల నియోజకవర్గ పరిధిలో గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే ప్రాజెక్టు, జిల్లాలో వివిధ రైల్వే ప్రాజెక్టుల భూసేకరణ ప్రక్రియ, రైతులకు పరిహారం చెల్లింపు, భూసేకరణ పురోగతి అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరవెల్లి ప్రాజెక్టు, గ్రీన్‌ఫీల్డ్ హైవే, రైల్వే ప్రాజెక్టుకులకు సంబంధించి కొనసాగుతున్న భూసేకరణ, పరిహారం చెల్లింపు తదితర వివరాలను సంబంధిత శాఖల అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తయ్యేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పరిహారం ఆలస్యం చేయకుండా సంబంధిత రైతులకు అందజేయాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, హనుమకొండ, పరకాల ఆర్డీఓలు రాథోడ్ రమేష్, డాక్టర్ నారాయణ, నేషనల్ హైవే అధికారులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

భూభారతి సదస్సులో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ఆర్డీఓలు, తహశీల్దార్‌లను ఆదేశించారు. జిల్లాలోని మండలాల్లో జరుగుతున్న భూభారతి రెవెన్యూ సదస్సుల నిర్వహణ, వచ్చిన దరఖాస్తుల పరిష్కారంపై ఆర్డీఓలు, తహసీల్దార్‌లతో మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. అప్లికేషన్‌లను భూభారతి ఫోల్డర్‌లో ఆన్‌లైన్ చేయాలని, వచ్చిన సాదా బైనామా అప్లికేషన్‌లను విచారించి సిద్ధంగా ఉండాలన్నారు. వచ్చిన దరఖాస్తులను కేటగిరీలుగా విభజించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.ఈ సమీక్షలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, పరకాల, హనుమకొండ ఆర్డీఓలు, తహసీల్దార్‌లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

స్ట్రాంగ్‌రూంలను తనిఖీ చేసిన కలెక్టర్

వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులో పటిష్ఠ భద్రత పర్యవేక్షణలో ఉన్న ఈవీఎం స్ట్రాంగ్‌రూంలను గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమయంలో మంగళవారం కలెక్టర్ ప్రావీణ్య తనిఖీ చేశారు. ఈవీఎంల వివరాలు, రికార్డుల నిర్వహణ గురించి ఎన్నికల విభాగం అధికారులను ఈ సందర్భంగా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

సఖి కేంద్రం ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయండి

రాంనగర్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): లష్కర్ బజార్‌లో నూతనంగా నిర్మించిన సఖీ కేంద్రం ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు సిద్ధం చేయాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం లష్కర్ బజార్‌లోని సఖీ కేంద్ర నూతన భవన ప్రాంగణంతోపాటు గదులను కలెక్టర్ ప్రావీణ్య పరిశీలించారు. ఈ సందర్భంగా వసతుల కల్పన, తుది దశ పనుల గురించి ఆర్‌అండ్‌బీ ఈఈ సురేష్‌బాబు, జిల్లా సంక్షేమ శాఖ అధికారి జయంతిలను కలెక్టర్ ఆరాతీశారు. భవన నిర్మాణ పనులు పూర్తికాగానే ఇప్పుడున్న సఖీ కేంద్రాన్ని ఈ భవనంలోకి మార్చాలని అధికారులను ఆదేశించారు. సఖి కేంద్రానికి వచ్చే మహిళలకు కార్యాలయం గురించి తెలిసే విధంగా సైన్ బోర్డు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సఖీ కేంద్రం కోఆర్డినేటర్ హైమావతి, ఆర్ అండ్ బీ డీఈ గోపీకృష్ణ పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న మేయర్ సుధారాణి

యుద్ధ ప్రాతిపదికన వాహనాల మరమ్మతు జరగాలి

- మేయర్ గుండు సుధారాణి
- బాలసముద్రం వెహికిల్ షెడ్డు అకస్మిక తనిఖీ

వరంగల్ కార్పొరేషన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): యుద్ధప్రాతిపదికన వాహనాల మరమ్మతు జరగాలని మేయర్ గుండు సుధారాణి అధికారులకు సూచించారు. బాలసముద్రంలో నిర్వహిస్తున్న వెహికిల్ షెడ్డును మంగళవారం అకస్మికంగా తనిఖీ చేశారు. వాహనాలకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం మరమ్మతుకు వచ్చిన 41 స్వచ్ఛ ఆటోలు, 9 ట్రాక్టర్లు, 4 డంపర్ ప్రేజర్లు, 4 జేసీబీలు, 2 ఇటాచీలు, 4 కాంపాక్టర్లు వారం రోజుల్లోగా మరమ్మతు చేసి పంపించాలని ఆదేశించారు. ఇక్కడ మరమ్మతు కానీ వాహనాలు షోరూంకు తరలించాలని అన్నారు. స్వచ్ఛఆటోలకు అమర్చిన మైకులు సరిగా పనిచేస్తున్నాయా? లేదా అని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన వంద రోజుల కార్యక్రమాలను దిగ్విజయం చేయాలని అన్నారు. వర్షాకాలం నేపథ్యంలో జోమల నివారణకు ప్రత్యేక పద్ధతులు పాటించాలని సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డిని ఆదేశించారు. ఈకార్యక్రమంలో ఈఈ మహేందర్, సీఎంహెచ్‌వో రాజారెడ్డి, ఏఈలు సంతోష్‌కుమార్, ఫణి పాల్గొన్నారు.



గతంలో నకిలీ విత్తనాలు విక్రయించిన వారితో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ కిషన్

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

మడికొండ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ హెచ్చరించారు. నకిలీ విత్తనాలను నియంత్రించడంలో భాగంగా సీపీ ఆదేశాల మేరకు మంగళవారం పలు విత్తన విక్రయ కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించామన్నారు. నకిలీ విత్తనాలు విక్రయించి ఇబ్బందులు పడవద్దని సూచించామన్నారు. మడికొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో గతంలో నకిలీ విత్తనాలు అమ్మి అరెస్టయిన 18 మందిని తీసుకు వచ్చి కాజీపేట తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు.



భద్రకాళి వద్ద స్మార్ట్ సిటీ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

గడువులోగా స్మార్ట్‌సిటీ పనులు పూర్తి చేయండి

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ కార్పొరేషన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో జరుగుతున్న స్మార్ట్‌సిటీ పనులు గడువులోగా పూర్తి చేయాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. మంగళవారం వరంగల్ నగరంలో పలు ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భద్రకాళి బండ్, మడికొండ, బీఆర్‌నగర్, కడిపికొండ, గోకుల్‌నగర్, రాజాజీనగర్ కల్వర్టు ప్రాంతాలలలో జరుగుతున్న పనులను పరిశీలించారు. పనుల పురోగతిపై అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. భద్రకాళి బండ్ పనులు 90 శాతం పూర్తి చేశామని, డ్రైన్, ఫినిషింగ్, గ్రానైట్, లైటింగ్, ఎంట్రన్స్ గేట్ పనులు వారంలోగా పూర్తి చేయాలని అన్నారు. బంధం చెరువు ప్రాంతంలో రోడ్డు పనులు, సుబేదారి ప్రాంతంలో రోడ్డు పనులు, బీఆర్‌నగర్, మడికొండ ప్రాంతంలో అంతర్గత రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్ఈ శ్రీనివాస్, ఈఈలు రవికుమార్, సంతోష్‌బాబు, డీఈలు రవికిరణ్, రాజ్‌కుమార్, ఏఈలు రాగి శ్రీనివాస్, సంతోష్‌తో పాటు స్మార్ట్ సిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో రాయితీ ఇవ్వాలి

హనుమకొండ కలెక్టరేట్, జూన్10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అక్రిడేషన్ కలిగిన జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో 50శాతం ఫీజు రాయితీ ఇవ్వాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ -143 అధ్యక్ష, కార్యదర్శులు మస్కుపురి సుధాకర్, అర్షం రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు మంగళవారం కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి అంధప్రదేశ్ రాష్ట్రంలో ఆయా జిల్లాల కలెక్టర్లు విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారని, ఈ ఆనవాయితీ ప్రస్తుతం కూడా కొనసాగుతుందని ఈ సందర్భంగా యూనియన్ నాయకులు కలెక్టర్‌కు వివరించారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ ప్రావీణ్య జిల్లా విద్యాశాఖ అధికారితో మాట్లాడి జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో యూనియన్ నాయకులు పొగాకుల అశోక్, బత్తిని రాజేందర్, బూరం ప్రశాంత్, తాళ్లపెల్లి వేణుగోపాల్, గోకారపు శ్యాంకుమార్, బండారి సతీష్, బొడిగె శ్రీనివాస్, బొమ్మగాని ఆదర్శ్ కుమార్ తదితర జర్నలిస్టు యూనియన్ నాయకులు ఉన్నారు.

టీపీసీసీ నియామకాల్లో నాయినికి అన్యాయం

వడ్డేపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ నియామకాల్లో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి తగిన ప్రాధాన్యత కల్పించలేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా నేత తాళ్లపెల్లి విజయ్ అన్నారు. మంగళవారం హనుమకొండ వడ్డేపల్లిలో కాంగ్రెస్ నాయకులు రాసమల్ల రూపస్ అధ్యక్షతన నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నాయిని రాజేందర్‌రెడ్డికి అవకాశం రావాల్సి ఉండగా, కేవలం రాష్ట్ర ఉపాధ్యక్ష పదవిని కేటాయించి అధిష్ఠాన వర్గం చేతులు దులుపుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా టీపీసీసీ అధిష్ఠాన వర్గం పునరాలోచన చేసి నాయిని రాజేందర్‌రెడ్డికి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పదవిని కేటాయించాలని తాళ్లపెల్లి విజయ్ కోరారు. సమావేశంలో కాంగ్రెస్ శ్రేణులు యోబు, శ్యామ్, సుధీర్, జీవన్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నవ్య
కుటుంబ కదంబం
బుధవారం • 11జూన్ 2025

ఫ్యాషన్

చుడీదార్ చూడముచ్చటగా...



అన్ని వయసుల మహిళలూ ధరించడానికి ఇష్టపడే డ్రెస్.. చుడీదార్! ఇంపైన రంగులు, చూడచక్కని ప్రింట్లు, ఆకర్షణీయమైన చున్నీలు.. ఇన్ని హంగులు ఉంటాయి కాబట్టే చుడీదార్‌కు అంతటి ఆదరణ! తాజాగా ఆధునికత ఉట్టిపడే పలు రకాల చుడీదార్లు ట్రెండ్ సృష్టిస్తున్నాయి. వాటిలో ఇవి కొన్ని..

- నెక్ పెద్దదిగా ఉంటే, మెడకు అంటుకుని ఉండే చోకర్ ధరించాలి. చిన్నదిగా ఉంటే, చాంద్‌బాలీ లాంటి ఝుంకాలు పెట్టుకోవాలి
- మిక్స్ అండ్ మ్యాచ్ ప్రయత్నిస్తూ ఉండాలి. అందుకోసం కాంట్రాస్ట్ రంగుల టాప్స్, బాటమ్స్ ఎంచుకోవాలి
- రాజస్థాన్ జుత్తీలు, షోలాపూర్ చెప్పులు వినూత్నంగా కనిపిస్తాయి కాబట్టి చుడీదార్‌తో వీటిని వేసుకోవాలి.





- ప్లెయిన్ టాప్‌కు రంగురంగుల బాటమ్ జత చేయాలి. ఈ బాటమ్‌కు ఉపయోగించిన వస్త్రాన్నే టాప్ చేతులు, అంచులకు జోడించాలి. అప్పుడు చుడీదార్ సాదాసీదాగా కాకుండా మరింత ఆకర్షణీయంగా తయారవుతుంది



- కాటన్ చుడీదార్‌కు లెగ్గింగ్, జెగ్గింగ్ బదులుగా పాటియాలా ప్యాంట్ ప్రయత్నించవచ్చు. పలాజోలు నేల మీద జీరాడేలా పొడవుగా ఉండకుండా, నీ లెంగ్త్ పలాజోలు కూడా ప్రయత్నించవచ్చు
- డోరీలు, కుచ్చులు, కాలర్లు లాంటి కొత్త ప్రయోగాలు కూడా ప్రయత్నిస్తూ ఉండాలి. స్లీవ్‌లెస్ టాప్ కుట్టించుకుంటే, దాన్ని ఫ్రాక్‌లా కూడా వాడుకోవచ్చు
- నెక్ డిజైన్‌లో ప్రయోగాలను అనుసరించాలి. హై నెక్, బోట్ నెక్, కాలర్ నెక్‌లు చుడీదార్‌కు ఆధునిక అందాన్ని తెచ్చి పెడతాయి. కాబట్టి ఆ మెడ డిజైన్ కోసం బాటమ్ వస్త్రాన్నే వాడుకోవాలి





అవకాడోతో ఆరోగ్యం

కొన్నాళ్లుగా అవకాడోల వినియోగం పెరిగింది. ఈ అవకాడోల వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. అవేంటో తెలుసుకుందాం...

- అవకాడోలో విటమిన్ బి6, సి, ఇ, కె వంటివి పుష్కలంగా ఉంటాయి. ఈ శరీరంలో రోగ నిరోధకశక్తిని మెరుగుపరుస్తాయి.
- అవకాడోలోని మెగ్నీషియం, పొటాషియం రక్తపోటును నియంత్రిస్తాయి.
- శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలు పెరగకుండా అవకాడో నియంత్రిస్తుంది. దీని వలన గుండె సంబంధిత వ్యాధుల ముప్పు తగ్గుతుంది.
- అవకాడోలోని ఫొలేట్ మెదడు చురుగ్గా పని చేసేలా సహాయపడుతుంది.
- అవకాడోలో ఉండే కొవ్వు ఆమ్లాలు (ఫ్యాటీ యాసిడ్స్), ఫైబర్ ఆకలిని నియంత్రించి శరీర బరువు తగ్గడంలో సహాయపడతాయి.
- ఫైబర్ అజీర్తి సమస్యలను కూడా నివారిస్తుంది. పేగు ఆరోగ్యానికి సహాయపడతుతుంది.
- అవకాడోలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ ఆక్సిడెంట్ గుణాలు మంట, వాపులను తగ్గించడంలో ఉపయోపడతాయి.
- గర్భిణీ స్త్రీలు, పాలిచ్చే తల్లులకు అవకాడో వల్ల ఉపయోగాలు ఉన్నాయి. అవకాడోలోని పోషకాలు ప్రెగ్నెన్సీలో సమస్యలను నివారించడంతో పాటు, ప్రసవం తర్వాత తల్లిలో పాల ఉత్పత్తిని పెంచుతుంది.

వర్షాల్లో కురుల సంరక్షణ ఇలా

వర్షాకాలం మొదలైపోయింది. వర్షం చినుకుల్లో జుట్టు తడిచిపోతుంటుంది. వర్షపు నీటిలో ఆమ్లత్వం ఉండడం వలన అనేక కేశ సమస్యలు వస్తాయి. కాబట్టి ఈ కాలంలో శిరోజాల రక్షణకు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.

- ఈ కాలంలో గాలిలో తేమ ఎక్కువగా ఉండడం వలన మాడు జిడ్డుగా మారడంతో పాటు కురులు గడ్డిలా మారుతాయి. దీనివలన కేశాలు బలహీనపడి రాలిపోతుంటాయి. కాబట్టి వారానికి కనీసం రెండు లేదా మూడుసార్లు తలస్నానం చేయాలి. సల్ఫేట్ లేని షాంపూలు వాడితే జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది.
- వర్షాకాలంలో చుండ్రు సమస్య ఎక్కువ అవుతుంది. కలబంద గుజ్జులో నిమ్మరసం కలిపి రాసుకుంటే చుండ్రు తగ్గుతుంది.
- కలబంద గుజ్జును మాడుకు బాగా పట్టించి మసాజ్ చేయాలి. అరగంట తరువాత కడిగేయాలి. వారానికి రెండు సార్లు ఇలా చేస్తే జుట్టు రాలడం తగ్గుతుంది.
- తడి జుట్టును దువ్వడం వలన కూడా జుట్టు రాలుతుంది. కాబట్టి జుట్టును ఆరిపోయాక మాత్రమే దువ్వాలి.



- కురులను బిగుతుగా కట్టి ఉంచేలా జడలు, పోనిటైల్స్‌ను వేసుకోకూడదు.
- వర్షాకాలంలో స్ట్రైట్‌నర్‌లు, కర్ల్ ఐరన్‌లు వంటివి వాడకపోవడం మంచిది.

నాన్న స్ఫూర్తితో పతకాల వేట

చేబోయిన ఆర్యాణి... భారత జాతీయ మహిళా స్కేటింగ్ జట్టులో అత్యంత సీనియర్ సభ్యురాలు మాత్రమే కాదు... 'వరల్డ్ స్కేట్ గేమ్స్'లో మన దేశం తొలి పతకం సాధించడంలో కీలక పాత్ర పోషించింది. వచ్చే నెల 'ఆసియా రోలర్ ఛాంపియన్‌షిప్' కోసం తమ్ముడితో కలిసి సన్నద్ధమవుతున్న ఆమె తన క్రీడా ప్రయాణం గురించి 'నవ్య'తో మాట్లాడింది.



"మా స్వస్థలం విజయవాడ. ప్రస్తుతం ఇక్కడే ఉంటున్నాం. మా నాన్న శివ పరమేశ్వరరావు ఎక్స్-సర్వీస్‌మన్. బాస్కెట్ బాల్ కోచ్. మా అమ్మ గృహిణి. బాల్యం నుంచి నాన్నే నా రోల్ మోడల్. ఆయన బాస్కెట్ బాల్ పోటీలకు వెళ్ళేవారు, శిక్షణ ఇచ్చేవారు. ఆయన ప్రేరణతో ఏదైనా క్రీడలో అభ్యాసం చేద్దామనే ఆలోచన ఉండేది. ఒకసారి ఏలూరులోని మా అమ్మమ్మ గారి ఇంటికి వెళ్ళాను. అక్కడ స్టేడియంలో చాలామంది పిల్లలు స్కేటింగ్ చేయడం చూశాను. ఆ క్రీడ నన్ను ఆకర్షించింది. నేర్చుకుంటే బాగుంటుందనుకున్నాను. అలా... ఆ ఏడాది వేసవి సెలవుల్లో స్కేటింగ్ శిక్షణలో చేరాను. సరదాగా ప్రారంభించినా... క్రమంగా దాని మీద ఆసక్తి కలిగింది. 'ఇంకా నేర్చుకోవాలి, ఈ క్రీడలో నైపుణ్యం సాధించాలి' అనే తపన పెరిగింది. రెండు మూడేళ్ళపాటు శిక్షణ తీసుకున్నాక... మా నాన్నగారికి ముంబయికి బదిలీ అయింది. అక్కడ కూడా స్కేటింగ్ కొనసాగించాను. అప్పుడే దీన్ని కూడా ఒక ప్రొఫెషనల్ క్రీడగా ఎంచుకోవచ్చునని అర్థమయింది. ఆ దిశగా సాధన చేయడం ప్రారంభించాను. నైపుణ్యం సాధించిన తరువాత... జిల్లా, రాష్ట్ర పోటీల్లో రాణించడంతో... 2014లో జాతీయ స్థాయిలో ఆడే అవకాశం వచ్చింది. అప్పుడు మా నాన్నగారు ఢిల్లీలో పని చేస్తూ ఉండడంతో... ఢిల్లీ జట్టులో సభ్యురాలిగా ఉన్నాను. ఆ తరువాత జాతీయ జట్టులో ఆంధ్రప్రదేశ్ తరఫున కొనసాగుతున్నాను.

మోస్ట్ వేల్యుబుల్ ప్లేయర్‌గా...

నేను 2017లో జాతీయ స్థాయిలో తొలి పతకం అందుకున్నాను. ఆస్ట్రేలియా, అమెరికాతో జరిగిన మ్యాచ్‌లలో 'మోస్ట్ వేల్యుబుల్ ప్లేయర్'గా అవార్డులు సాధించాను. జట్టులో అత్యంత సీనియర్ ప్లేయర్‌ని కావడం, 2019లో జరిగిన 'వరల్డ్ రోలర్ గేమ్స్'లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన విస్తృతమైన అనుభవం ఉండడం 2019 చైనా నిర్వహించిన పోటీల్లో విజయాలకు దోహదం చేసింది. ఆ పోటీల్లో భారత జట్టు సెమీస్‌కు చేరుకొని, నాలుగో స్థానంలో నిలిచింది. ఈ క్రమంలో... భారత జట్టులో 'మోస్ట్ క్యాప్డ్ ఇంటర్నేషనల్ ప్లేయర్'గా గుర్తింపు పొందాను. బార్సిలోనాలో జరిగిన డబ్ల్యుఎస్‌డీలో పాల్గొన్నాను. 2022లో అర్జెంటీనాలో, 2023లో చైనాలో జరిగిన పోటీలకు ఎంపికయ్యాను. కిందటి ఏడాదిలో ఇటలీలో జరిగిన 'వరల్డ్ స్కేట్ గేమ్స్'లో.... రోలర్ డెర్బీ విభాగంలో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించాను. అందులో మన జట్టు చైనాను ఓడించి మూడో స్థానంలో నిలిచింది. కాంస్య పతకం గెలిచింది. ఇది' వరల్డ్ స్కేట్ గేమ్స్'లో ఇప్పటివరకూ భారత్ సాధించిన తొలి పతకం. ఈ ఘనతలో భాగమైనందుకు చాలా సంతోషంగా ఉంది. వచ్చే ఏడాది జరిగే వరల్డ్ చాంపియన్‌షిప్‌లో మా జట్టు బంగారు పతకం సాధించాలి. అదే నా లక్ష్యం.

తమ్ముడితో కలిసి...

స్కేటింగ్‌తో పాటు బాస్కెట్‌బాల్‌లోనూ నాకు నైపుణ్యం ఉంది. సౌత్‌జోన్‌లో మా యూనివర్సిటీ తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నాను. ఎన్‌సీసీలో కూడా ఉన్నాను. ఈ ఏడాది నా బీటెక్ పూర్తవుతుంది. ఇక... నేను స్కేటింగ్ అభ్యాసం ప్రారంభించిన ఏడాదికి... నా తమ్ముడు అభిరామ్ కూడా స్కేటింగ్‌లో చేరాడు. తను కూడా బాగా రాణిస్తున్నాడు. ఇంటర్ పూర్తి చేశాడు. మ్యూజిక్ అంటే ఇష్టం. వయోలిన్‌లో డిప్లమా చేస్తున్నాడు. ఈ ఏడాది జూలైలో దక్షిణ కొరియాలో జరగబోయే 'ఏషియన్ రోలర్ ఛాంపియన్‌షిప్'లో... రోలర్ డర్బీ ఈవెంట్‌కు నేను, అభిరామ్ ఎంపికయ్యాం. దానికోసం రోజూ ప్రాక్టీస్ చేస్తున్నాం, అన్ని విధాలుగా సన్నద్ధం అవుతున్నాం. మా నాన్నగారే మాకు కోచ్. ఆయన ఇంటర్నేషనల్ క్వాలిఫైడ్ రిఫరీ కూడా. ఫిట్‌నెస్‌లో, టెక్నిక్స్‌లో... ఇలా అన్నిట్లో ఆయనే మాకు శిక్షణ ఇస్తారు.

వారి సంకల్పంతోనే...

చిన్నప్పుడు నాకు బంధు మిత్రుల ప్రోత్సాహం లభించినా.. ఆ తరువాత "ఇంకా ఇది అవసరమా? నేషనల్ మెడల్ వచ్చింది కదా? ఇక చాలు అన్నట్టు" కొందరు మాట్లాడారు. ఇప్పుడు అంతర్జాతీయ పోటీల్లో పాల్గొంటూ ఉండడంతో మద్దతు ఇస్తున్నారు. కానీ మా తల్లిదండ్రులు ఎల్లప్పుడూ నాకు అండగా నిలిచారు. వారిద్దరి సంకల్పమే నన్ను ఇక్కడివరకూ తీసుకువచ్చింది. క్రీడల వల్ల శారీరక దారుఢ్యం, మానసిక దారుఢ్యం అభివృద్ధి చెందుతాయి. స్కేటింగ్.. జట్టుగా ఆడే క్రీడ. జట్టులోని ఇతర సభ్యులతో ఎలా కమ్యూనికేట్ చెయ్యాలో మేము నేర్చుకుంటాం. నాయకత్వ లక్షణాలు పెరగడానికి, కొత్త ప్రదేశాలకు, అక్కడి వాతావరణాలకు, సంస్కృతులకు త్వరగా అలవాటు పడడానికి క్రీడలు దోహదం చేస్తాయి. అయితే దీనిలో సవాళ్ళు కూడా ఉన్నాయి. స్కేటింగ్ గేమ్‌కు భారత ప్రభుత్వం నుంచి నిధులు రావు. ప్రతిసారీ మేమే స్పాన్సర్లను వెతుక్కోవాలి. క్రితంసారి నాకు కెనరాబ్యాంక్ ఎండి స్పాన్సర్ చేశారు. రాబోయే ఆసియా ఛాంపియన్‌షిప్‌కి నాకు, మా తమ్ముడికి కూడా కెనరా బ్యాంకే స్పాన్సర్ చేస్తోంది. అన్ని విధాలా సాయపడుతోంది. మాకు ఆర్థికంగా సహకరించాలని ప్రభుత్వాన్ని కోరాం. క్రీడామంత్రిని కూడా కలిశాం. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లభిస్తుందని ఆశిస్తున్నాం."



• కృష్ణశర్మ

శుక్స్ భారతంలో అర్జునుడిలాంటి వాడు

అంతరిక్షం ప్రయోగాలను టీవీలో చూసే వారికి అవి గమ్యం ఎప్పుడు చేరతాయా అనే ఉత్కంఠ ఉంటుంది..
ఆ అంతరిక్ష నౌకలలో ప్రయాణించే వ్యోమగాముల కుటుంబ సభ్యులు ఎంతో ఉద్విగ్నతతో వారు ఎప్పుడు తిరిగి వస్తారా అని ఎదురుచూస్తూ ఉంటారు. ప్రస్తుతం భారతీయ వ్యోమగామి శుభాన్షు శుక్లా భార్య కామ్నా పరిస్థితీ అంతే!
యాక్సియం-4 మిషన్‌లో భాగంగా 14 రోజుల యాత్ర కోసం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి(ఐఎస్ఎస్) వెళ్తున్న శుభాన్షు గురించి కామ్నా పంచుకున్న ముచ్చట్లు...





"శుక్స్ (శుభాన్షు శుక్లా ముద్దుపేరు)ను నేను తొలిసారి చూసింది మా స్కూల్లో! మేమిద్దరం మూడో క్లాసు నుంచి కలిసి చదువుకున్నాం. మేమిద్దరం చిన్నప్పటి నుంచి మంచి స్నేహితులం కూడా! చిన్నప్పుడు శుక్స్ ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడేవాడు కాదు. ఎవరితోనైనా మాట్లాడాలంటే సిగ్గుపడేవాడే వాడు. కానీ కాలేజీకి వచ్చే సరికి అతనిలో మార్పు వచ్చింది. ఫైటర్ పైలెట్ అయిన తర్వాత ఒక ఆదర్శవంతమైన వ్యక్తిగా మారాడు. తనకు ఒక కచ్చితమైన రొటీన్ ఉంటుంది. దేనినీ అసాధ్యం అనుకోడు. 'ఫైండింగ్ నిమో' చిత్రంలో డోరి అనే పాత్ర ఉంటుంది. ఎలాంటి పరిస్థితులు ఎదురయినా- 'ఈదుతూ పో' అని చెబుతూ ఉంటుంది. శుక్స్ ఎప్పుడూ ఈ డైలాగ్‌ను చెబుతూ ఉంటాడు. సమస్యలు ఎదురయినప్పుడు పరిష్కారాలను అన్వేషించి ఒడిసిపట్టుకోవటం అతని ప్రత్యేకత! తను దేనికీ భయపడడు. రిస్క్ తీసుకోవటానికి వెనకాడడు. బహుశా అందుకే తను టెస్ట్ పైలెట్ వృత్తిని వదిలేసి అంతరిక్ష నౌకాయానానికి సిద్ధపడ్డాడు. టెస్ట్ పైలెట్స్ ఒక సెకను వ్యవధిలో కీలకమైన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. వ్యోమగాములు అంతరిక్షంలో కళ్లకు కనిపించని అతి సున్నితమైన సూక్ష్మజీవులపై పరిశోధనలు చేయాల్సి ఉంటుంది. ఒక విధంగా చూస్తే రెండింటికీ ఎలాంటి పోలిక లేదు. కానీ ఈ మార్పును శుక్స్ చాలా సహజంగానే స్వీకరించాడు. నాకు తెలిసిన వారిలో శుక్స్ అత్యంత ధైర్యవంతుడు. తను అతి కొద్ది మందికి మాత్రమే సాధ్యమయ్యే అంతరిక్ష ప్రయాణానికి వెళ్తున్నానని తెలిసినా తనలో ఏ మాత్రం మార్పు లేదు.

ఐదేళ్ల క్రితం...

2020లో గగన్‌యాన్ కోసం టెస్ట్ పైలెట్స్‌ను దరఖాస్తులు పెట్టుకొమ్మన్నారు. సాధారణంగా భారతీయ వాయుసేనలో టెస్ట్ పైలెట్స్ తక్కువ మందే ఉంటారు. అందువల్ల ఎవరు వ్యోమగామిగా ఎంపిక అయినా- మాకు తెలిసిన వ్యక్తే అయి ఉంటాడని చాలా ఆనందపడ్డాం. శుక్స్ కూడా దరఖాస్తు చేశాడు. ఎంపిక అయ్యాడు. ఆ రోజు మేము ఊహించుకున్నది ఇప్పుడు వాస్తవ రూపం అవుతోందంటే చాలా ఆనందంగా ఉంది. ఆ తర్వాతి కాలంలో శుక్స్‌తో పాటు వ్యోమగాములుగా శిక్షణ పొందిన ముగ్గురు కూడా మాకు మంచి స్నేహితులు అయ్యారు. అంతరిక్షంలో మైక్రోగ్రావిటీ అనుభవాలు వారందరినీ మరింత దగ్గర చేస్తాయనుకుంటున్నా! ఇక్కడ మా అబ్బాయి సిడ్‌కు.. శుక్స్‌కు మధ్య ఉన్న అనుబంధం కూడా చెప్పాలి. తను టెస్ట్ పైలెట్ అవటంవల్ల ఎక్కువ సమయం సిడ్‌తో గడపలేకపోయాడు. కానీ సమయం దొరికినప్పుడల్లా సిడ్‌తో ఉండటానికే తను ఇష్టపడతాడు. గత ఐదేళ్లగా భారతంలో అర్జునుడిలా శుక్స్ దృష్టి అంతా తన లక్ష్యంపైనే ఉంది. అందువల్ల సిడ్‌తో ఎక్కువ గడపలేకపోయాడు. సిడ్ చాలా చిన్నవాడు. వాడికి ఏం జరుగుతోందో తెలియదు. అందరి నాన్నలు వ్యోమగాములే అనుకుంటున్నాడు. ఈ మధ్య మేము అమెరికాలో నాసా అంతరిక్షకేంద్రానికి వెళ్లాం. అక్కడ రాకెట్లు, వ్యోమగాములు వేసుకొనే సూట్లు మొదలైన వాటిని చూసి చాలా ఉత్సాహపడ్డాడు. కానీ- 'నీకు నాసాలో ఏం నచ్చింది?' అని అడిగితే- "నాసా పార్కులో జింకలు చాలా బావున్నాయి' అన్నాడు. దీని ఆధారంగా వాడి మానసిక పరిస్థితి మనం అర్థం చేసుకోవచ్చు.

> 140 కోట్ల మందికి.. ఒక అద్భుతమైన దేశానికి ప్రాతినిధ్యం వహించే అదృష్టం మీ నాన్నకు వచ్చిందని సిడ్‌కు చెబుతున్నా! వాడు పెద్దవాడైన తర్వాత నాన్నను చూసి గర్వపడతాడు.

ఎప్పుడూ వెళ్లలేదు..

తన టెస్ట్ ఫ్లైట్ టేకాఫ్‌ను చూడటానికి నేను ఎప్పుడూ వెళ్లలేదు. నేను చూడను కాబట్టి వాటి గురించి ఆలోచించను. ఇప్పుడు యాక్సియం-4 లాంచ్ గురించి కూడా నేను ఆలోచించటం లేదు. అంతా సజావుగా సాగిపోతుందని ఆశిస్తున్నాను. రిస్క్ చేయకుండా మనకు జీవితంలో గొప్ప విజయాలు లభించవు. సాహసవంతులకే కీర్తి లభిస్తుంది.. శుక్స్ నాకు దూరంగా ఉన్న సమయంలో నా ముందు రెండే మార్గాలుండేవి. ఒకటి ఆందోళన చెంది బాధపడుతూ ఉండటం. రెండోది తన విజయాలను చూసి ఉత్సాహంగా ఉండటం. అప్పుడు నేను రెండో మార్గాన్ని ఎంచుకొనేదాన్ని. ప్రస్తుతం కూడా నేను రెండో మార్గానే ఎంచుకున్నా! తను అంతరిక్ష యాత్రను విజయవంతంగా ముగించుకుని వచ్చే ఉత్కంఠ క్షణాల కోసం ఎదురుచూస్తున్నా."

'స్పైడర్' ఉండాల్సిందే!

మనం ఇంట్లో అందమైన మొక్కల కుండీలను పెట్టుకుంటూ ఉంటాం. ఈ మొక్కలు ఇల్లంతా తాజాదనాన్ని వ్యాపింపజేస్తూ ఉంటాయి. ఈ కోవలో చెప్పుకోదగ్గది 'స్పైడర్ ప్లాంట్'. దీని ఆకులు సన్నగా పొడవుగా చివర్లు మొనదేలి ఉంటాయి. ఈ మొక్క గుబురుగా పెరిగినప్పుడు.... పేరుకు తగ్గట్టు సాలెపురుగును తలపిస్తుంది. దీనిని ఎక్కువగా సంరక్షించాల్సిన అవసరం లేదు. ఎండ, వాన, చలి లాంటి వాతావరణ పరిస్థితులను తట్టుకుని చక్కగా పెరుగుతుంది.

- వెడల్పాటి కుండీలో తోట మట్టిని నింపి చిన్న మొక్కను నాటితే చాలు. కొద్ది సమయంలోనే గుబురుగా పెరుగుతుంది. బాల్కనీ గోడమీద, కిటికీల దగ్గర కుండీలు అమర్చుకోవచ్చు. ఈ మొక్కకు నేరుగా ఎండ తగలకూడదు. కొద్దిగా వెలుగు సోకితే చాలు. గది ఉష్ణోగ్రత వద్ద వేగంగా పెరుగుతుంది. దీనికి నీరు ఎక్కువగా పోయకూడదు. మట్టి తేమగా ఉందో లేదో చూసుకుని రెండు రోజులకు ఒకసారి నీళ్ల చిలకరిస్తే సరిపోతుంది. క్లోరిన్ కలిపిన మంచినీరు కాకుండా బోరు నీళ్ల, బాగా శుద్ధి చేసిన నీరు లేదంటే వర్షపు నీటిని మాత్రమే కొద్దిగా చల్లాలి.
- స్పైడర్ మొక్క కుండీలను వంటగది, పడక గది, పిల్లలు చదువుకునే గదుల్లో పెట్టుకోవచ్చు. హాల్లో సోఫాకు ఇరుపక్కలా పెట్టినా అందంగా కనిపిస్తుంది.
- వంటగది నుంచి వెలువడే వేడి, ఘాటైన వాసనలను ఈ మొక్క పీల్చుకుంటుంది. ఆక్సిజన్‌తోపాటు తేమనీ విడుదల చేస్తుంది. దీనివల్ల ఇల్లంతా చల్లగా ఉన్నట్టు అనిపిస్తుంది. స్పైడర్ మొక్క ఆకులు ఇంట్లో గాలిని శుద్ధి చేస్తాయి. దీంతో ఒత్తిడి, ఆందోళన తగ్గి ప్రశాంతంగా నిద్ర పడుతుంది. మెదడు చురుకుగా పనిచేయడం తోపాటు ఏకాగ్రత పెరుగుతుంది. ఏసీ ఉన్న గదిలో ఈ మొక్కను ఏర్పాటు చేసుకుంటే శ్వాసకోశ సమస్యలు రావు. ఇంట్లో స్పైడర్ మొక్కను పెంచడం వల్ల ఈగలు, దోమలు, ఇతర క్రిమి కీటకాలు లోనికి రావు.



అవమానించి పనిలోంచి తీసేశారనే..

- రాజేంద్రనగర్‌లో వృద్ధ దంపతుల హత్య కేసులో వీడిన మిస్టరీ
- చంపింది వారి వద్ద పనిచేసిన డ్రైవరే
- అతడికి సహకరించిన మిత్రుడు.. ఇద్దరి అరెస్టు

రాజేంద్రనగర్, జూన్10 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ పరిధిలోని జనచైతన్య ఫేజ్-2లో ఈ నెల 5వ తేదీన జరిగిన వృద్ధ దంపతుల హత్య కేసును పోలీసులు ఛేదించారు. వృద్ధ దంపతులను వారి వద్ద 8 నెలల క్రితం వరకు డ్రైవర్‌గా పనిచేసిన వ్యక్తి, మరొకరి సహాయంతో హత్య చేశాడని నిర్ధారించారు. కేసు వివరాలను డీసీపీ చింతమనేని శ్రీనివాస్ వెల్లడించారు. షేక్ అబ్దుల్లా అబ్దుల్ హమీద్, ఉమ్మాతుర్ రఫాయి రిజ్వానా భార్యాభర్తలు. షేక్ అబ్దుల్లా ఎస్బీఐలో అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందాడు. రిజ్వానా రిటైర్డ్ లెక్చరర్. ఈ దంపతులు నగరంలోని రెడ్‌హిల్స్‌లో నివాసం ఉండే వారు. వీరికి నలుగురు సంతానం. పిల్లలంతా విదేశాల్లో ఉంటున్నారు. రిటైరయ్యాక షేక్ అబ్దుల్లా రాజేంద్రనగర్ జనచైతన్య ఫేజ్-2లో ఐదు వందల గజాల స్థలం కొనుక్కుని ఐదంతస్తుల భవనం నిర్మించాడు. మూడేళ్లక్రితం వీరి వద్ద మెదక్ జిల్లా ఘనపూర్ మండలం, సుల్తాన్‌పూర్ నివాసి, ఫలక్‌నుమాలో ఉంటున్న మహ్మద్ షకీల్ సల్మాన్ (33) డ్రైవర్‌గా చేరాడు. వృద్ధ దంపతులు తాము జనచైతన్య ఫేజ్-2లో కడుతున్న అపార్ట్‌మెంట్ పనుల్లో సల్మాన్‌ను వాడుకున్నారు. ఎనిమిది నెలల క్రితం షేక్ అబ్దుల్లా.. డ్రైవర్ మహ్మద్ షకీల్ సల్మాన్‌ను అవమానించి పనిలోనుంచి తొలగించాడు. ఇంటి నిర్మాణపు పనుల్లో తనతో బాగా పని చేయించుకుని అవమానించడమే కాకుండా పనిలోనుంచి తీసేశారని షేక్ అబ్దుల్లాపై సల్మాన్ కక్ష పెంచుకున్నాడు. అతడిని ఎలాగైనా హత్య చేయాలని పథకం వేశాడు. మెదక్ పట్టణానికి చెందిన తన పాత మిత్రుడు మహ్మద్ ముజీబుద్దీన్ (25)కు విషయం చెప్పాడు. తన వెంట వస్తే గతంలో అతడి దగ్గర తీసుకున్న రూ. 37వేలు తిరిగిచ్చేస్తానని నమ్మబలికాడు. అప్పటికే గేమింగ్ యాప్స్ ద్వారా డబ్బులు పోగొట్టుకుని కష్టాల్లో ఉన్న ముజీబుద్దీన్ స్నేహితుడి మాటలు నమ్మి అతడి వెళ్లేందుకు ఒప్పుకొన్నాడు. పథకంలో బాగంగా ఈ నెల 4వ తేదీన సల్మాన్,ముజీబుద్దీన్ కలిసి రెడ్‌హిల్స్‌లోని పాత ఇంటికి వెళ్లారు. అక్కడ షేక్ అబ్దుల్లా కుటుంబం లేదని, రాజేంద్రనగర్ జనచైతన్య ఫేజ్-2 కు మకాం మారారని స్థానికులు తెలుపడంతో అక్కడి నుంచి నేరుగా కొత్త ఇంటికి వచ్చారు. ఇంట్లో వృద్ధ దంపతులు ఉన్నట్లు తెలుసుకొని తిరిగి వారి నివాసానికి వెళ్లిపోయారు. ఈ నెల 5న సాయంత్రం ఐదు గంటలకు సల్మాన్, మహిళగా బురఖా ధరించి.. ముజీబుద్దీన్ నెత్తికి క్యాప్, ముఖానికి మాస్క్ ధరించి షేక్ అబ్దుల్లాకు చెందిన అపార్ట్‌మెంట్ వద్దకొచ్చారు. అక్కడ కాపాల ఉన్న వాచ్‌మన్ రాజేశ్ థాపాతో తాము షేక్ అబ్దుల్లాకు తెలిసినవారమని, పేరు అలీ అని చెప్పారు. వాచ్‌మన్ తన ఫోన్ ద్వారా అలీ కుటుంబం వచ్చారని షేక్ అబ్దుల్లాకు చెప్పడంతో ఆయన పైకి పంపించాలని చెప్పాడు. పైకి వెళ్లగానే లోపల గడియ పెట్టిన సల్మాన్ తాను తెచ్చుకున్న కత్తితో షేక్ అబ్దుల్లాను విచక్షణ రహితంగా కడుపులో పొడిచి హత్య చేశాడు. ఆయన కేకలు విని.. భార్య రిజ్వానా వచ్చి అడ్డుకునేందుకు ప్రయత్నించగా ఆమెనూ కత్తితో పొడిచి చంపాడు. ఆ తర్వాత మహ్మద్ ముజీబుద్దీన్ అక్కడి నుంచి వెళ్లిపోగా, సల్మాన్ మాత్రం అక్కడే ఉండి షేక్ అబ్దుల్లా జేబులో ఉన్న ఐ ఫోన్, రూ. 600 నగదు తీసుకుని ఫోన్‌లో సీసీ ఫుటేజీని లేకుండ చేసే యాప్ ఏమైనా ఉందా అని చూశాడు. అదే ఫోన్ నుంచి వాచ్‌మెన్‌కు ఫోన్ చేసి కూల్ డ్రింక్ తీసుకురమ్మని చెప్పాడు. వాచ్‌మెన్ దగ్గర డబ్బులు లేకపోవడంతో అతను కూల్ డ్రింక్ తీసుకురాలేదు. వాచ్‌మెన్ కూల్ డ్రింక్ తీసుకురావడానికి వెళితే... కీలక పరికరం తీసుకెళడం ద్వారా సీసీ ఫుటేజీని మాయం చేయొచ్చునని సల్మాన్ భావించాడు. అది కుదరకపోవడంతో అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఆ మరుసటి రోజు వాచ్‌మెన్ షేక్ అబ్దుల్లా , రిజ్వానా మృతదేహాలను చూసి స్థానికుల ద్వారా పోలీసులకు తెలుపడంతో ఈ ఘటన వెలుగుచూసింది. ఘటనపై రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. సీసీ ఫుటేజీలో లభించిన ఆధారాల ప్రకారం హత్య చేసిన వ్యక్తి పాత డ్రైవర్ సల్మాన్‌గా గుర్తించిన పోలీసులు సల్మాన్‌తో పాటు అతడికి సహకరంచిన ముజీబుద్దీన్‌ను మెదక్‌లో అరెస్ట్ చేశారు. ఇద్దరినీ రిమాండ్‌కు తరలించారు.

గాలి జనార్దన్‌రెడ్డి పిటిషన్‌లపై నేడు తీర్పు

హైదరాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఓబులాపురం మైనింగ్ కంపెనీ (ఓఎంసీ) కేసులో దోషిగా తేలిన మాజీ మంత్రి గాలి జనార్దన్‌రెడ్డి సహా ఇతరులు దాఖలు చేసిన పిటిషన్‌లపై బుధవారం హైకోర్టు తీర్పు వెలువరించనుంది. ముద్దాయిలు గాలి జనార్దన్‌రెడ్డి, బీవీ శ్రీనివాసరెడ్డి, వీడీ రాజగోపాల్, అలీఖాన్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌లతోపాటు గాలి జనార్దన్‌రెడ్డి విడిగా దాఖలు చేసిన జైలుశిక్ష సస్పెన్షన్ పిటిషన్లపై తీర్పు వెలువడనుంది. జైలుశిక్ష సస్పెన్షన్ పిటిషన్‌పై మంగళవారం వాదనలు కొనసాగాయి. గాలి జనార్దన్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాదులు నళిన్‌కుమార్, నాగముత్తు వాదించారు. పిటిషనర్ ఇప్పటికే 50 శాతానికి పైగా అంటే మూడున్నరేళ్లపాటు జైలుజీవితం అనుభవించారని తెలిపారు. ఇంకా మూడున్నరేళ్లకాలం జైలు శిక్ష మాత్రమే మిగిలి ఉందని.. ఈ దశలో శాసన సభ్యత్వం కోల్పోకుండా సీబీఐ కోర్టు తీర్పును సస్పెండ్ చేయాలని కోరారు. శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేస్తూ ఇప్పటికే కర్ణాటక అసెంబ్లీ కార్యదర్శి గతనెలలో నోటిఫికేషన్ జారీచేశారని.. ఖాళీ అయిన అసెంబ్లీ స్థానానికి ఎన్నికల నోటిఫికేషన్ వస్తే కోలుకోలేని విధంగా నష్టం కలుగుతుందని పేర్కొన్నారు. మరోవైపు బెయిల్ విషయంలో ఎలాంటి అభ్యంతరం వ్యక్తం చేయని సీబీఐ.. జైలుశిక్షను సస్పెండ్ చేసే విషయంలో వ్యతిరేకించింది. అన్నివర్గాల వాదనలు విన్న జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం.. బుధవారం ఆదేశాలు వెలువరిస్తానని పేర్కొంది.

నిజమైన అంబేద్కర్‌వాది జస్టిస్ ఎంజీ ప్రియదర్శిని

- హైకోర్టు సంతాపం

అనారోగ్యంతో కన్నుమూసిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎంజీ ప్రియదర్శినికి హైకోర్టు న్యాయమూర్తులు, న్యాయవాదులు ఘన నివాళులు అర్పించారు. మొదటి కోర్టుహాల్‌లో జరిగిన ఫుల్ కోర్టు సమావేశంలో తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, ఏజీ సుదర్శన్‌రెడ్డి ఆమె సేవలను కొనియాడారు. హైకోర్టు బార్ అసోసియేషన్‌లో జరిగిన సంతాపసభలో జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ నగేశ్ భీమపాక ప్రసంగించారు. సామాజిక న్యాయం కోసం చివరి శ్వాసవరకు నిలిచిపోరాడిన గొప్ప సామాజిక వేత్త జస్టిస్ ఎంజీ ప్రియదర్శిని అని పేర్కొన్నారు. అనారోగ్యం తీవ్రంగా వేధిస్తున్నా.. చివరి వరకు కేసుల విచారణ చేపట్టి తక్కువ కాలంలోనే వేలకేసులు పరిష్కరించారని శ్లాఘించారు. సమావేశాలకు హాజరైన జస్టిస్ ఎంజీ ప్రియదర్శిని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిజేశారు. అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని తన వృత్తిలో ప్రవృత్తిలో నిబద్ధతతో పాటించిన వ్యక్తి అని న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ పేర్కొన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏ జగన్, కార్యదర్శులు విజారత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

విస్తృత పరిశీలన.. విశాలమైన రోడ్లు

- 93 రహదారులపై.. 65 వేల పాయింట్ల వద్ద 30 బృందాల అధ్యయనం
- ఆ తర్వాతే 28 వేల కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణానికి ప్రణాళిక
- ప్రజలపై 'టోల్' భారం పడకుండా హ్యామ్ విధానంలో నిర్మాణం

హైదరాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గ్రామీణ రహదారులను మండల, జిల్లా కేంద్రం నుంచి రాష్ట్ర స్థాయి వరకూ అనుసంధానం చేయాలని రాష్ట్ర సర్కారు ఇటీవల నిర్ణయించిన సంగతి తెలిసిందే. హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ (హ్యామ్)లో మొత్తం 28 వేల కిలోమీటర్ల మేర రహదారులను నిర్మించేందుకు సర్కారు సిద్ధమైంది. అయితే, ఆ నిర్ణయం తీసుకోవడానికి ముందు రహదారుల నిర్మాణంపై విస్తృత కసరత్తు జరిపింది. అధికారులు 30 ప్రత్యేక బృందాలుగా ఏర్పడి.. 93 రహదారులను ఎంపిక చేసుకుని.. ప్రతి రహదారిపై 200 మీటర్లకు ఒక పాయింట్ చొప్పున మొత్తం 65 వేల పాయింట్లను ఏర్పాటు చేసుకుని.. ఆయా రోడ్ల ప్రస్తుత పరిస్థితి ఎలా ఉంది? రోడ్డు ఎంత ఎత్తులో ఉంది? ఏ సమయంలో ట్రాఫిక్ ఎలా ఉంటుందనే అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లకు సంబంధించిన వివరాలను తెలంగాణ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్ సెంటర్ (ట్రాక్) నుంచి కూడా సేకరించారు. క్షేత్రస్థాయిలో హ్యామ్ కింద వేయాల్సిన రోడ్ల గుర్తింపు, ఇతర వివరాల నిమిత్తం ప్రత్యేకంగా ఒక యాప్‌ను కూడా రూపొందించారు. క్షేత్రస్థాయి వివరాలన్నీ అందులో నమోదుచేయగానే.. నేరుగా అవి రాష్ట్రస్థాయిలో ఏర్పాటుచేసిన కంట్రోల్ సెంటర్‌కు చేరేలా ఏర్పాటు చేశారు. ఆ వివరాల ఆధారంగా ఆయా రోడ్లపై అధ్యయనం చేసి.. ఎన్ని కిలోమీటర్ల మేర రహదారులు నిర్మించాలనే అంశంపై ఒక నిర్ణయానికి వచ్చారు. ఈ రోడ్ల నిర్మాణాలను ఇండియన్ రోడ్ కాంగ్రెస్ (ఐఆర్‌సీ), జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) మార్గదర్శకాలతో.. దాదాపు 15 ఏళ్ల వరకు నిర్వహణ సమస్యలు లేకుండా ఉండేలా చేపట్టనున్నారు. మొత్తం 28వేల కిలోమీటర్ల మేర రోడ్లను దశల వారీగా నిర్మించనుండగా.. మొదటి దశలో 13 వేల కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణానికి రూ.33,194 కోట్లను ఖర్చు చేయనున్నారు. ఈ రోడ్ల పనులు వెంటనే ప్రారంభించి 2027 ఆఖరు నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

టోల్ గేట్లు ఉండవు..

హ్యామ్ విధానంలో రహదారుల నిర్మాణంలో 40 శాతం నిధులను ప్రభుత్వం ఇస్తుంది. మిగతా 60 శాతం నిధులను.. ఆయా రోడ్ల నిర్మాణ కాంట్రాక్టు పొందిన కాంట్రాక్టర్లు భరించాల్సి ఉంటుంది. రోడ్ల పనులు కొంతమేర పూర్తిచేసిన తర్వాత ప్రభుత్వం కొన్ని నిధులను విడుదల చేస్తుంది. కాంట్రాక్టు సంస్థలు వ్యయం చేసిన 60 శాతం నిధులను 10 నుంచి 15 ఏళ్లలో ఏటా కొంత మొత్తం చొప్పున వడ్డీతో కలిపి ప్రభుత్వం చెల్లిస్తుంది. ఈ కాలంలో ఆయా రహదారుల నిర్వహణ, మరమ్మతులను ఆయా సంస్థలే చేపడతాయి. ఈ రహదారులపై ఎటువంటి టోల్ వసూలు చేయరు. ఈ విధానం వల్ల ప్రభుత్వానికి ఒకేసారి ఖర్చు చేసే ఇబ్బంది తప్పడంతో పాటు ఏటా కొంత మొత్తం చెల్లించే వెసులుబాటు ఉంటుంది. అందుకే ప్రభుత్వం ఈ పద్ధతిలో రోడ్ల నిర్మాణాన్ని చేపట్టాలని నిర్ణయించింది.

మళ్లీ తెరపైకి 'ధూప దీపం'!

రాష్ట్రంలో 250 ఆలయాల ఎంపికకు నోటిఫికేషన్.. 3 వేల దరఖాస్తులు

హైదరాబాద్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ధూప దీప పథకంలో కొత్త ఆలయాల ఎంపిక ప్రక్రియ కొనసాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా 250 ఆలయాలను ఎంపిక చేసేందుకు దేవాదాయ శాఖ నోటిఫికేషన్ జారీ చేయగా 3 వేలకుపైగా దరఖాస్తులు అందాయి. వాటిని పూర్తిస్థాయిలో పరిశీలించిన తర్వాత ఈ పథకం కింద ఆలయ అర్చకుడికి ప్రతి నెలా రూ.10 వేలు చెల్లిస్తారు. ఇందులో ఆలయంలో ధూపం, దీపం, నైవేద్యానికి రూ.4 వేలు వెచ్చించాలి. అర్చకుడి గౌరవ భృతి రూ.6 వేలు. చిన్న ఆలయాల మనుగడకు ఉద్దేశించిన ఈ పథకంలో ఇప్పటికే మూడు విడతల్లో 6,300కుపైగా ఆలయాలను ఎంపిక చేశారు. వాటికి ప్రభుత్వం ప్రతి నెలా సుమారు ఆరున్నర కోట్లు చెల్లించాల్సి ఉంది. 3 నెలలుగా ఈ ఆర్థిక సహాయం అందడం లేదు. గతంలో దేవాదాయ శాఖ అధికారులు ఆలయాలను ఎంపిక చేసిన తీరుపై విమర్శలు వచ్చాయి. రోడ్డుపక్కన రంగులు పూసిన బండరాయిని ఆలయంగా చూపించారు. ఇంట్లో పూజ గదికి సైతం ప్రతి నెలా డబ్బులు చెల్లించారు. దీంతో ఉన్నతాధికారులు వాటిని రద్దు చేశారు. ప్రస్తుతం అలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా ఆలయాలను ఎంపిక చేయాలని కోరుతున్నారు.



పూర్తిగా ధ్వంసమైన ఇల్లు

ప్రేమించాడని.. ఇల్లు కూల్చేశారు!

యువతి కుటుంబసభ్యుల విధ్వంసం

ఆదిలాబాద్ జిల్లా సాలెవాడ బిలో ఉద్రిక్తత

ఆదిలాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు కులాలకు చెందిన ఇద్దరు ప్రేమించుకున్నారు. తమ పెళ్లికి పెద్దలు అంగీకరించని ఎవరికీ తెలియకుండా ఊరు విడిచి వెళ్లిపోయారు. దీంతో ప్రేమజంటలోని యువతికి చెందిన కుటుంబసభ్యులు యువకుడి ఇంటిని ధ్వంసం చేసి కూల్చేశారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం సాలెవాడ బి గ్రామంలో మంగళవారం జరిగిన ఈ ఘటన తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. సాలెవాడ బి గ్రామ పంచాయతీలో తాత్కాలిక ఉద్యోగిగా పని చేసే రాజశేఖర్.. అదే గ్రామంలోని గోండు సామాజిక వర్గానికి చెందిన ఓ యువతి (26) కొంతకాలంగా ప్రేమలో ఉన్నారు. ఇద్దరివి వేర్వేరు కులాలు కాగా.. పెద్దలు పెళ్లికి ఒప్పుకోరని రాజశేఖర్, ఆ యువతి గత సోమవారం గ్రామం నుంచి వెళ్లిపోయారు. దీనిపై యువతి కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో గొడవలు జరగకూడదనే ఉద్దేశంతో ప్రేమజంట ఆచూకీ కనుగొని రప్పించిన పోలీసులు.. యువతిని సఖి కేంద్రానికి తరలించారు. రాజశేఖర్‌ను కొద్ది రోజులు గ్రామానికి రావద్దని సూచించారు. ఈ క్రమంలో యువతి కుటుంబసభ్యులు, వారి కులపెద్దలు మంగళవారం సమావేశమయ్యారు. ఆ వెంటనే రాజశేఖర్ ఇంటిపై దాడి చేసి కూల్చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని నిందితులను అదుపులోకి తీసుకునేందుకు యత్నించారు. ఈ విషయం తెలుసుకున్న పలువురు గ్రామస్థులు పోలీసుస్టేషన్‌కు చేరుకుని హడావుడి చేశారు. పోలీసులు వారికి కౌన్సెలింగ్ ఇచ్చి పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు యత్నించారు. సాలెవాడబి వద్ద పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేశారు.

చిత్రజ్యోతి

SINCE 1965

ఉస్తాద్ సెట్స్‌లో పవన్



ఇటీవలే 'హరిహర వీరమల్లు' చిత్రం డబ్బింగ్ పనులు ముగించారు పవన్ కల్యాణ్. ఇప్పుడు ఆయన 'ఉస్తాద్ భగత్‌సింగ్' చిత్రం సెట్స్‌లోకి అడుగుపెట్టారు. ఈ చిత్రం తాజా షెడ్యూల్ మంగళవారం హైదరాబాద్‌లోని అల్యూమినియం ఫ్యాక్టరీలో మొదలైంది. పవన్‌కల్యాణ్‌తో పాటు ఇతర తారాగణంపై కీలక సన్నివేశాలను తెరకెక్కిస్తున్నారు. నెల రోజుల పాటు ఈ షెడ్యూల్ సాగనుంది. ఈ చిత్రంలో పవన్‌కు జోడీగా శ్రీలీల నటిస్తున్నారు. గతంలో పవన్‌కల్యాణ్‌తో 'గబ్బర్‌సింగ్' లాంటి బ్లాక్‌బస్టర్‌ను తెరకెక్కించిన హరీశ్ శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. నవీన్ యెర్నేని, వై. రవి శంకర్ భారీస్థాయిలో నిర్మిస్తున్నారు. సంగీతం: దేవి శ్రీ ప్రసాద్, సినిమాటోగ్రఫీ: అయనంక బోస్.

అంకెలతో పనిలేదు... అర్థం చేసుకుని ముందుకు సాగడమే!




నందమూరి బాలకృష్ణ

తానేంటో రాబోయే రోజులలో చూస్తారని, పట్టుదలతో ముందుకు సాగాలని నిర్ణయించుకున్నట్లు నందమూరి బాలకృష్ణ తెలిపారు. ఆయన 65వ పుట్టిన రోజు వేడుకలను మంగళవారం బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రిలో నిర్వహించారు. సంస్థ ఆవరణలో ఉన్న దివంగత నందమూరి తారక రామారావు, బసవతారకం విగ్రహాలకు పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఆస్పత్రి ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో భారీ కేక్ కట్ చేసి క్యాన్సర్‌తో పోరాడుతున్న చిన్నారులకు తినిపించారు. ఆ తర్వాత క్యాన్సర్ చికిత్స తీసుకొంటున్న చిన్నారులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ 'ఎటు అడుగు వేసినా ఆ పనిని ప్రేమించి చేయడం నాకు అలవాటు. వయసు కేవలం ఒక నంబర్ మాత్రమే. నా వయసు అందరికీ తెలిసిందే. తల్లితండ్రుల దీవెనలతో 64 ఏళ్లు పూర్తి చేసుకున్నా. నాకు అంకెలతో పనిలేదు. నన్ను నేను అర్థం చేసుకుని ముందుకు వెళుతుంటా. ఎప్పటికప్పుడు నా మెదడుకు సాన పెడుతుంటా. తద్వారా పనిలో కొత్తదనాన్ని చూపే ప్రయత్నం చేస్తుంటా. నాన్నగారి కోరిక మేరకు ఒకసారి మెడిసిన్ ఎంట్రెన్స్ రాశా. మెడిసిన్ చదవలేదు కానీ సినిమాల్లో డాక్టర్ పాత్రలు పోషించా. పదిహేనేళ్ల క్రితం ఈ ఆస్పత్రి బాధ్యతలు చేపట్టా. మా అమ్మగారి ఆశయాన్ని నెరవేర్చగలగడం పూర్వజన్మ సుకృతం. ఈ ఆస్పత్రి ఒక దేవాలయం లాంటిది. ఇక్కడ పని చేస్తున్న వారందరూ భగవంతునితో సమానం. నాకు పద్మభూషణ్ పతకం సినిమా పరంగా ఇచ్చినా దానికి ప్రధాన కారణం బసవతారకం ఆస్పత్రి ద్వారా చేస్తున్న పలు మంచి కార్యక్రమాలే అని భావిస్తున్నా' అని అన్నారు. ఈ సమావేశం తర్వాత తన అభిమానులు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అభిమానులు, రోగులతో ఫొటోలు, సెల్ఫీలు దిగారు. కొత్తగూడెం త్రివేణి స్కూలు యాజమాన్యం, పిల్లలు క్యాన్సర్ రోగుల చికిత్స కోసం అందించిన రూ. 1,01,016 ప్రత్యేక విరాళాన్ని వారి నుంచి స్వీకరించారు. ఇటీవల తనకు భారత ప్రభుత్వం అందజేసిన పద్మభూషణ్ పతకాన్ని ధరించి నందమూరి బాలకృష్ణ ఈ కార్యక్రమంలో పాల్గొనడం విశేషం.

హైదరాబాద్ సిటీ (ఆంధ్రజ్యోతి)

ఎన్టీఆర్‌లో ఏదో తెలియని ఆకర్షణ శక్తి ఉంది





- కాస్ట్యూమ్స్ డిజైనర్ అనైతా

జూనియర్ ఎన్టీఆర్, బాలీవుడ్ హీరో హృతిక్ రోషన్ కలసి నటించిన 'వార్ 2' చిత్రం ఆగస్టు 14న విడుదల కానుంది. ఇటీవల విడుదల చేసిన టీజర్‌తో అంచనాలు అమాంతం పెరిగాయి. సినిమాలో ఎన్టీఆర్ లుక్, స్టైలింగ్ గురించి అందరూ మాట్లాడుకుంటున్నారు. 'వార్ 2' చిత్రానికి అనైతా ష్రాఫ్ అడజానియా కాస్ట్యూమ్స్ డిజైనర్‌గా పని చేశారు. సినిమాలో ఆయన లుక్, ఇతర విషయాల గురించి అనైతా వివరిస్తూ 'ఎన్టీఆర్‌తో తొలిసారిగా కలసి పనిచేయడం ఆనందంగా అనిపించింది. ఆయన సెట్స్‌లోకి ఎంట్రీ ఇస్తే ఆ ఎనర్జీ అందరిలోకి ప్రవేశిస్తుంది. ఆయనలో ఏదో తెలియని ఆకర్షణ శక్తి ఉంది. తన చుట్టూ ఉన్న వాతావరణాన్ని ఆయన ఎంతో ఉల్లాసంగా ఉంచుతారు. 'వార్ 2'లో ఆయన పోషిస్తున్న పాత్రలో ఎన్నో రకాల లేయర్స్ ఉంటాయి. అందుకే చాలా లుక్స్ డిజైన్ చేశాం. ఆయన పాత్ర స్వభావాన్ని ప్రతిబింబించేలా కాస్ట్యూమ్స్ డిజైన్ చేశాం. ఓ లక్ష్యంతో పని చేసే మానవ యంత్రంలా ఆయన్ని చూపించే ప్రయత్నం చేశాం' అన్నారు. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో ఆదిత్య చోప్రా 'వార్ 2' చిత్రాన్ని నిర్మించారు.



నా మనసుకు దగ్గరైన సినిమా

ధనుష్

"కుబేర' నా కెరీర్‌లో ప్రత్యేక చిత్రం. నా మనసుకు దగ్గరైన సినిమా. ఈ సినిమా షూటింగ్ ఓ మరపురాని అనుభవం. నాగార్జునతో కలసి పనిచేయడం చాలా ఆనందాన్నిచ్చింది. ఈ సినిమాలో బిచ్చగాడి పాత్ర చేశాను. ఈ పాత్ర కోసం నేను ముందస్తుగా సన్నద్ధమవ్వలేదు. మా దర్శకుడు శేఖర్ కమ్ముల చెప్పింది చేశా. ఆయనో అద్భుతమైన దర్శకుడు. డంపింగ్ యార్డ్ సన్నివేశాలు చేసేటప్పుడు సైతం రష్మిక ఎలాంటి ఇబ్బంది లేకుండా నటించడం చూసి ఆశ్చర్యపోయాను. ఈ సినిమా తప్పకుండా మీ అందరికీ నచ్చుతుంది' అని హీరో ధనుష్ అన్నారు. ఈ నెల 20న కుబేర విడుదలవుతోంది. ఈ సందర్భంగా ముంబైలో నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం 'పీ పీ డుమ్ డుమ్' అంటూ సాగే గీతాన్ని విడుదల చేసింది. ఈ చిత్రంలో కీలకపాత్ర పోషించిన నాగార్జున మాట్లాడుతూ '15 ఏళ్లుగా శేఖర్‌తో సినిమా చేయాలనుకుంటున్నాను. 'కుబేర'తో తీరింది. ధనుష్, రష్మిక ప్రతిభావంతులైన కళాకారులు. చాలా గొప్పగా నటించారు. సినిమా ఘన విజయం అందుకుంటుంది' అని చెప్పారు. రష్మిక మాట్లాడుతూ 'నటిగా 'కుబేర' విభిన్నమైన అనుభూతిని ఇచ్చింది. నా పాత్ర ప్రేక్షకులను సర్‌ప్రైజ్ చేస్తుంది. అభిమానుల స్పందన కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను' అని తెలిపారు. సునీల్ నారంగ్, పుష్కర్ రామ్‌మోహన్ నిర్మించారు.

ప్రేమ గొప్పదనాన్ని చాటేలా...



యశ్‌రాజ్ ఫిల్మ్స్ బేనర్‌పై మోహిత్ సూరి తెరకెక్కిస్తోన్న కొత్త తరం ప్రేమ కథ 'సయరా'. జూలై 18న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ చిత్రం ద్వారా ఆహాన్ పాండే హీరోగా పరిచయం అవుతున్నారు. అనీత్ పద్దా కథానాయిక. తాజాగా ఈ చిత్రం నుంచి 'బర్బాద్' అంటూ సాగే రెండో పాటను మేకర్స్ విడుదల చేశారు. ఈ పాటకు దిరిష్ సాహిత్యాన్ని అందించడంతోపాటు బాణీని సమకూర్చగా, జుబిన్ ఆలపించారు. ఈ సందర్భంగా దర్శకుడు మోహిత్ మాట్లాడుతూ 'రొమాంటిక్ పాటలకు లోతైన భావం ఉంటుంది. అలాంటి పాటలకు గతంలోకి తీసుకెళ్లే శక్తి ఉంటుంది. ఈ పాట ప్రేమ, ప్రేమికుల గొప్పదనాన్ని చాటేలా ఉంటుంది' అని అన్నారు.



ట్రైలర్ రిలీజ్ అప్పుడే

మంచు విష్ణు ప్రధాన పాత్రలో ముకేశ్ కుమార్ సింగ్ తెరకెక్కిస్తోన్న చిత్రం 'కన్నప్ప' ట్రైలర్‌ను ఈనెల 13న విడుదల చేస్తున్నారు. ఈ మేరకు మేకర్స్ అధికారికంగా ప్రకటిస్తూ ప్రత్యేక పోస్టర్‌ని విడుదల చేశారు. ఈనెల 27న ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. పరమ శివుని భక్తుడైన కన్నప్ప జీవిత కథ ఆధారంగా తెరకెక్కుతోన్న ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇందులో మంచు విష్ణు టైటిల్ రోల్ పోషించగా, మోహన్ బాబు, ప్రభాస్, శరత్‌కుమార్, మోహన్‌లాల్, అక్షయ్ కుమార్ వంటి అగ్రతారలు కీలక పాత్రల్లో నటించారు.

నిమిషానికి రూ. నాలుగు కోట్లు!




బాలీవుడ్ హీరో అజయ్ దేవగణ్ ప్రస్తుతం వరుస సినిమాలతో దూసుకుపోతున్న సంగతి తెలిసిందే. ఆయన తీసుకునే పారితోషికం గురించిన ఓ వార్త ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. దర్శకధీరుడు రాజమౌళి దర్శకత్వంలో 2022లో విడుదలై సంచలన విజయం సాధించిన చిత్రం 'ఆర్ఆర్ఆర్'. ఆ చిత్రంలో ఓ అతిథి పాత్రలో అజయ్ దేవగణ్ నటించిన విషయం తెలిసిందే. ఇందులో స్వాతంత్ర్యం కోసం పోరాడే వీరుడి పాత్రలో ఆయన ఎనిమిది నిమిషాల పాటు కనిపించారు. ఇంత చిన్న నిడివి ఉన్న పాత్ర కోసం ఆయన సుమారు రూ.35 కోట్లను నిర్మాతల ముక్కు పిండి వసూలు చేశారట. అంటే నిమిషానికి రూ.నాలుగు కోట్లపైనే. ఇది విన్న నెటిజన్లు షాక్ అవుతున్నారు. నిమిషాల పరంగా చూస్తే దేశంలో అత్యధిక పారితోషికం తీసుకున్న నటుడు ఆయనే అని లెక్కలు వేస్తున్నారు. అలాగే, ఓటీటీ పరంగానూ రికార్డు స్థాయిలో పారితోషికం తీసుకున్న ఘనత అజయ్ దేవగణ్ సొంతం. 2021లో విడుదలైన 'రుద్ర' అనే సిరీస్‌లో నటించడానికి ఆయన రూ.125 కోట్లు తీసుకున్నారని సమాచారం. అలాగే, సినిమా స్థాయిని బట్టి ఆయన తీసుకునే పారితోషికం మారుతుందట. భారీ బడ్జెట్ సినిమాకైతే రూ.40 కోట్లు.. తక్కువ స్థాయి బడ్జెట్‌లో తెరకెక్కే చిత్రాలకు రూ.20 కోట్ల వరకూ తీసుకుంటారట.

ప్రేమతో.. మానుషీ



వరుణ్‌తేజ్ కథానాయకుడిగా నటించిన 'ఆపరేషన్ వాలెంటైన్' చిత్రంతో తెలుగులోనూ గుర్తింపు తెచ్చుకున్నారు మాజీ విశ్వ సుందరి మానుషీ చిల్లర్. ఆమె ప్రస్తుతం బాలీవుడ్‌లో రాజ్‌కుమార్ రావు కథానాయకుడిగా పులకిత్ తెరకెక్కిస్తున్న 'మాలిక్' చిత్రంలో నటిస్తున్నారు. తాజాగా, ఈ సినిమాలో ఆమె పాత్రను పరిచయం చేస్తూ ఓ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. రాజ్‌కుమార్ రావును ఆమె ప్రేమతో చూస్తున్న ఈ ఫొటో ఆకట్టుకునేలా ఉంది. ఇందులో ఆమె పోషిస్తున్న రోల్ మునుపటి చిత్రాల్లో కంటే భిన్నంగా ఉండనుందని మేకర్స్ తెలిపారు. జూలై 11న చిత్రం విడుదలవుతోంది. కాగా, జాన్ అబ్రహం నటిస్తున్న 'తెహ్రాన్' చిత్రంలోనూ మానుషీ చిల్లర్ నటిస్తున్నారు.

అలరించే హారర్ థ్రిల్లర్



మనోజ్ కుమార్, ఆశిత రెడ్డి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'నిశ్శబ్ద'. రమణమూర్తి తంగెళ్లపల్లి దర్శకత్వంలో ఎం.శ్రీనివాస్, సంధ్యారాణి నిర్మిస్తున్నారు. ఈ హారర్ థ్రిల్లర్ చిత్రీకరణ ఇటీవలే పూర్తయింది. మంగళవారం నిర్మాత శ్రీనివాస్ పుట్టిన రోజు సందర్భంగా చిత్రబృందం నిర్వహించిన కార్యక్రమంలో టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ 'కొత్తవాళ్లకు అవకాశాలు ఇవ్వాలనే లక్ష్యంతో శ్రీ రిషి సాయి ప్రొడక్షన్స్ స్థాపించాను. త్వరలో 'నిశ్శబ్ద' విడుదల తేదీని ప్రకటిస్తాం' అన్నారు. రమణమూర్తి మాట్లాడుతూ "షూటింగ్ మొత్తం రాత్రివేళల్లో చేశాం. ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుంది' అని చెప్పారు.

జీడీపీలో కుటుంబ రుణాల వాటా 42%

అయినా ఆందోళన చెందాల్సిన పని లేదు

తాజా రెపో తగ్గింపుతో అప్పులపై చెల్లించే వడ్డీ భారం రూ.60,000 వరకు తగ్గుదల

ఎస్‌బీఐ నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: గత మూడేళ్లుగా మన దేశంలోనూ కుటుంబాల అప్పులు గణనీయంగా పెరిగిపోతున్నాయి. 2021 జూన్ నాటికి స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో 36.6 శాతంగా ఉన్న ఈ అప్పుల భారం ప్రస్తుతం 42 శాతానికి చేరింది. 2023 డిసెంబరు నాటికి ఉన్న 40.2 శాతంతో పోల్చినా ఇది 1.8 శాతం ఎక్కువ. అయితే ఇదేమీ పెద్దగా ఆందోళన చెందాల్సిన విషయం కాదని ఎస్‌బీఐ రీసెర్చ్ ఒక నివేదికలో పేర్కొంది. ఇతర వర్ధమాన దేశాల కుటుంబాల అప్పులు ఇప్పటికే ఆయా దేశాల జీడీపీలో సగటున 49.1 శాతానికి చేరిన విషయాన్ని గుర్తు చేసింది. ఆ దేశాలతో పోలిస్తే మన దేశ కుటుంబాల అప్పుల భారం ఇప్పటికీ తక్కువేనని స్పష్టం చేసింది. ఇటీవల భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) రెపో రేటు తగ్గించడంతో ఒక్కో కుటుంబం అప్పులపై చెల్లించే వడ్డీల భారం రూ.50,000 నుంచి రూ.60,000 వరకు తగ్గుతుందని అంచనా వేసింది.

ఇతర ప్రధానాంశాలు

- రుణ మొత్తాలు పెరగడం కాకుండా.. రుణాలు తీసుకునే కుటుంబాలు పెరగడం వల్లే రుణ భారం పెరుగుతోంది.
- మూడింట రెండు వంతుల రుణాల చెల్లింపులకు ఢోకా లేదు
- గృహ, వాహన వంటి ఆస్తుల రూపంలో 25 శాతం కుటుంబ రుణాలు
- కుటుంబ రుణాల్లో వ్యవసాయం, వ్యాపారం, విద్యా రుణాలు వంటి ఉత్పాదక రుణాల వాటా మూడు శాతం
- 45 శాతం రుణాలు వినియోగ సంబంధమైన రుణాలు
- రిటైల్, ఎంఎస్ఎంఈల రుణాల్లో 80 శాతం రెపో లేదా ఎంసీఎల్ఆర్ ఆధారిత రుణాలు
- మరో రెండేళ్ల వరకు వడ్డీ రేట్లు కిందికే

'మారుతి'ని తాకిన మాగ్నెట్ల కొరత

- ఈ-విటారా ఉత్పత్తిలో భారీ కోత

న్యూఢిల్లీ: రేర్ ఎర్త్ మాగ్నెట్ల కొరత దేశంలో అతి పెద్ద కార్ల కంపెనీ మారుతీ సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ)ని తాకింది. ఈ ప్రభావం కంపెనీ త్వరలో విడుదల చేసే ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ ఈ-విటారాపై పడింది. ఈ మాగ్నెట్ల కొరతతో ఈ సంవత్సరం ఏప్రిల్-సెప్టెంబరు మధ్య కాలంలో 26,512 ఈ-విటారా ఈవీలు ఉత్పత్తి చేయాలన్న లక్ష్యాన్ని కంపెనీ 8,221 కి కుదించుకుంది. కంపెనీ అధికారికంగా ఈ విషయం ధ్రువీకరించడం లేదు. అయితే రేర్ ఎర్త్ మాగ్నెట్ల ఎగుమతులపై చైనా విధించిన ఆంక్షలే ఇందుకు కారణమని తెలుస్తోంది.

టీవీఎస్ అపాచీ ఆర్‌టీఆర్ 200 4వీ బైక్



ప్రారంభ ధర రూ.1,53,990

చెన్నై: టీవీఎస్ మోటార్ మార్కెట్లోకి సరికొత్త అపాచీ ఆర్‌టీఆర్ 200 4వీ బైక్‌ను విడుదల చేసింది. తాజా ఓబీడీ2బీ ఎమిషన్ నిబంధనలకు అనుగుణంగా, అధునాతన టెక్నాలజీ, భద్రతా ప్రమాణాలతో ఈ బైక్‌ను తీసుకువచ్చినట్లు వెల్లడించింది. ఈ బైక్ ప్రారంభ ధర రూ.1,53,990 (ఢిల్లీ ఎక్స్‌షోరూమ్). డ్యూయల్ చానెల్ ఏబీఎస్, అర్బన్, స్పోర్ట్, రైన్ అనే మూడు రైడ్ మోడ్స్‌తో ఈ బైక్‌ను తీసుకువచ్చింది.

హైదరాబాద్‌లో దైచీ లైఫ్ జీసీసీ

క్యాప్‌జెమినీతో కలిసి ఏర్పాటు

జపాన్ వెలుపల సంస్థకిదే తొలి కేంద్రం





హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌లో మరో అంతర్జాతీయ సంస్థ తన గ్లోబల్ క్యాపబిలిటీ కేంద్రాన్ని (జీసీసీ) ఏర్పాటు చేస్తోంది. జపాన్ కేంద్రంగా పనిచేసే ప్రముఖ బీమా కంపెనీ దైచీ లైఫ్ గ్రూప్ ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. ఫ్రాన్స్‌కు చెందిన ఐటీ, కన్సల్టెన్సీ దిగ్గజం క్యాప్‌జెమినీ.. దైచీ లైఫ్ గ్రూప్ కోసం బిల్డ్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్ (బీఓటీ) పద్ధతిలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తుంది. దీనికి సంబంధించి రెండు సంస్థల మధ్య ఒక ఒప్పందం కుదిరింది. అంతర్జాతీయంగా తన సేవల డిజిటల్ మార్పునకు ఈ జీసీసీ ఉపయోగపడుతుందని దైచీ లైఫ్ భావిస్తోంది. తన సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, మౌలిక సదుపాయాలు, కృత్రిమ మేధ (ఏఐ), డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ సేవల విస్తృతికి ఈ జీసీసీ నుంచి పనిచేసే ఐటీ, వృత్తి నిపుణులు దోహదం చేస్తారని భావిస్తున్నట్టు దైచీ లైఫ్ తెలిపింది. దైచీ లైఫ్‌కు జపాన్ వెలుపల ఇదే తొలి కేంద్రం.

క్రమంగా ఇతర దేశాలకు

ప్రారంభంలో ఈ జీసీసీ కేంద్రం సేవలు జపాన్, అమెరికా, ఆస్ట్రేలియా దేశాలకు మాత్రమే పరిమితం. మార్కెట్ అవకాశాలు, డిమాండ్‌ను బట్టి హైదరాబాద్ జీసీసీ సేవలను ఇతర దేశాలకు విస్తరిస్తామని దైచీ లైఫ్ తెలిపింది. జీసీసీల ద్వారా భిన్నమైన అంతర్గత సామర్థ్యాలు పెంచుకోవాలన్న లక్ష్యానికి క్యాప్‌జెమినీతో కుదిరిన వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం దోహదం చేస్తుందని దైచీ లైఫ్ గ్రూప్ సీఈఓ, ప్రెసిడెంట్ టెట్సుయ కికుట ఒక ప్రకటనలో తెలిపారు. టెక్నాలజీ, నవకల్పనల మేళవింపు ద్వారా ఖాతాదారులు ఆశించిన దానికంటే ఎక్కువ సంతృప్తిని ఈ జీసీసీ ద్వారా అందిస్తామని క్యాప్‌జెమినీ సీఈఓ ఐమాన్ ఇజ్జత్ తెలిపారు.

ప్రీమియర్ ఎనర్జీస్‌లో 5.55% వాటా విక్రయం

హైదరాబాద్‌కు చెందిన సోలార్ ఫొటోవోల్టాయిక్ (పీవీ) సెల్స్, మాడ్యూల్స్ తయారీ సంస్థ ప్రీమియర్ ఎనర్జీస్‌లో 5.55 శాతం వాటాను జీఈఎఫ్ క్యాపిటల్ పార్టనర్స్ రూ.2,629 కోట్లకు విక్రయించింది. ఎన్ఎస్ఈ బల్క్ డీల్ డేటా ప్రకారం.. అమెరికాకు చెందిన జీఈఎఫ్ క్యాపిటల్ పార్టనర్స్ తన అనుబంధ విభాగమైన సౌత్ ఏషియా గ్రోత్ ఫండ్-2 హోల్డింగ్స్ ఎల్ఎల్‌సీ ద్వారా ప్రీమియర్ ఎనర్జీస్‌లో 5.5 శాతం వాటాకు సమానమైన 2.5 కోట్ల షేర్లను ఒక్కొక్కటీ సగటున రూ.1,051.60కి విక్రయించింది. ఈ లావాదేవీ అనంతరం ప్రీమియర్ ఎనర్జీస్‌లో సౌత్ ఏషియా గ్రోత్ వాటా 11.10 శాతం నుంచి 5.55 శాతానికి తగ్గింది. మంగళవారం ఎన్ఎస్ఈలో ప్రీమియర్ ఎనర్జీస్ షేరు ధర 1.94 శాతం పెరిగి రూ.1,082.80 వద్ద ముగిసింది.

క్విక్ ఫుడ్ సేవల్లోకి బిగ్‌బాస్కెట్

- స్విగ్గీ, జొమాటో, జెప్టోతో పోటీకి సిద్ధం
- వచ్చే మార్చి నాటికి దేశవ్యాప్త విస్తరణ

బెంగళూరు: టాటా గ్రూప్‌నకు చెందిన ఆన్‌లైన్ కిరాణా ప్లాట్‌ఫామ్ బిగ్‌బాస్కెట్ కూడా క్విక్ కామర్స్ సేవల్లోకి పూర్తి స్థాయిలో రంగ ప్రవేశం చేసేందుకు సిద్ధమవుతోంది. నెల క్రితం బెంగళూరులో ప్రారంభించిన '10 నిమిషాల్లో ఫుడ్ డెలివరీ' సేవలను ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి (2026 మార్చి) దేశవ్యాప్తంగా విస్తరించాలనుకుంటున్నట్టు బిగ్ బాస్కెట్ సహ వ్యవస్థాపకులు విపుల్ పరేఖ్ తెలిపారు. దీంతో బిగ్‌బాస్కెట్.. స్విగ్గీ స్నాక్, జొమాటో క్విక్‌కామర్స్ విభాగమైన బ్లింకిట్ బిస్ట్రో, జెప్టో కేఫ్‌కు పోటీనివ్వనుంది. క్విక్ ఫుడ్ సేవల కోసం ప్రస్తుత 700 డార్క్ స్టోర్ల (గిడ్డంగులు) సంఖ్యను ఈ ఏడాది చివరి నాటికి 1000-1200కు పెంచుకోవాలని నిర్ణయించింది.

ర్యాపిడో కూడా వచ్చేస్తోంది..

ఓలా, ఉబెర్‌కు పోటీగా బైక్, క్యాబ్ సర్వీసులందిస్తోన్న ర్యాపిడో కూడా స్విగ్గీ, జొమాటోకు సవాలు విసురుతోంది. ఓన్లీ పేరుతో ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సేవలను పైలట్ ప్రోగ్రామ్ కింద తొలుత బెంగళూరులో ప్రారంభించేందుకు సిద్ధమైంది. ఈ నెలాఖరు లేదా వచ్చే నెలలో సేవలను ఆరంభించనున్నట్లు కంపెనీ తెలిపింది. అంతేకాదు, ఆహారోత్పత్తులను రెస్టారెంట్‌లో లభించే ధరకే కస్టమర్ ఇంటి వద్దకు సరఫరా చేయనున్నట్లు ర్యాపిడో ప్రకటించింది.

ఎంఎస్ఎంఈలకు మరింత చేయూత

ఈయూతో త్వరలోనే ఎఫ్‌టీఏ : కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్



బెర్న్ (స్విట్జర్లాండ్): సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థల (ఎంఎస్ఎంఈ) ఎగుమతులకు మరింత చేయూత ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ సంస్థలు ఏదైనా కొత్త దేశం లేదా కొత్త ఎగుమతిదారులకు తమ ఉత్పత్తులు ఎగుమతి చేయాలంటే అందుకు అయ్యే పూర్తి రిజిస్ట్రేషన్ చార్జీలు భరించాలని యోచిస్తోంది. ప్రస్తుతం స్విట్జర్లాండ్ పర్యటలో ఉన్న కేంద్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖల మంత్రి పీయూష్ గోయెల్ ఈ విషయం వెల్లడించారు. ఇందుకోసం ప్రత్యేక పథకాన్ని తీసుకువస్తామన్నారు. ఈ పథకం ఎగుమతుల ప్రోత్సాహక మిషన్ (ఈపీఎం)లో భాగంగా ఉంటుందన్నారు. ఎగుమతుల రంగంలో ఉన్న దేశీయ కంపెనీలు విలువ జోడింపు, తమ బ్రాండ్ల ప్రచారంపై దృష్టి పెట్టాలని గోయెల్ కోరారు.

ఈయూతో వాణిజ్య ఒప్పందం: స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) కోసం యూరోపియన్ యూనియన్ దేశాలతో జరుగుతున్న చర్చలు ఏడాది లేదా ఏడాదిన్నరలో ఒక కొలిక్కి వచ్చే అవకాశం ఉందని గోయెల్ తెలిపారు. ఈ ఒప్పందం అమల్లోకి వస్తే భారత-ఈయూ వాణిజ్యం ఆటుపోట్లు లేకుండా స్థిరంగా వృద్ధి సాధిస్తుందన్నారు. బ్రిటన్, యూఏఈలతో కుదుర్చుకున్న తరహాలోనే ఇతర దేశాలతోనూ ఎఫ్‌టీఏలు కుదుర్చుకునేందుకు చర్చలు జరుపుతున్నట్టు వెల్లడించారు. భారత్‌లో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు స్విట్జర్లాండ్ కంపెనీలు ముందుకు రావాలని కోరారు. ఇందుకోసం ప్రత్యేక పారిశ్రామిక క్లస్టర్లు ఏర్పాటు చేసేందుకూ సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు.

మార్కెట్లో లాభాల స్వీకరణ

నాలుగు రోజుల ర్యాలీకి బ్రేక్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లో నాలుగు రోజుల వరుస ర్యాలీకి అడ్డుకట్ట పడింది. మదుపరులు బ్యాంకింగ్, ఇంధన రంగ షేర్లలో లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో ప్రామాణిక సూచీలు మిశ్రమంగా ముగిశాయి. మంగళవారం లాభాల్లో ప్రారంభమైన సెన్సెక్స్, ఉదయం సెషన్‌లో 235 పాయింట్ల వరకు ఎగబాకింది. అయితే, రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ వంటి దిగ్గజ షేర్లలో అమ్మకాల కారణంగా సూచీలపై ఒత్తిడి పెరిగింది. ఒక దశలో 205 పాయింట్ల వరకు క్షీణించిన సెన్సెక్స్, ఐటీ షేర్లలో కొనుగోళ్లతో చివరికి 53.49 పాయింట్ల నష్టంతో 82,391.72 వద్ద ముగిసింది. నిఫ్టీ మాత్రం ఒక పాయింటు పెరిగి 25,104.25 వద్ద స్థిరపడింది.

13నెలల కనిష్ఠానికి ఈక్విటీ ఫండ్లలోకి పెట్టుబడులు

గత నెలలో ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలోకి పెట్టుబడులు 13 నెలల కనిష్ఠ స్థాయి రూ.19,013 కోట్లకు తగ్గాయి. ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో లార్జ్‌క్యాప్, మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఫండ్లలోకి పెట్టుబడుల ప్రవాహం తగ్గడం ఇందుకు ప్రధాన కారణం. అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (యాంఫీ) డేటా ప్రకారం.. ఈక్విటీ ఫండ్లలోకి నిధులు తగ్గడం వరుసగా ఇది ఐదో నెల. అంతేకాదు, ఈ ఏప్రిల్‌లో వచ్చిన రూ.24,269 కోట్ల పెట్టుబడులతో పోలిస్తే గత నెలలో 22 శాతం తగ్గుదల నమోదైంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



11వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	550
వరంగల్	542	గోదావరి	535
చిత్తూరు	613	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	100	విజయవాడ	109
వరంగల్	100	గుంటూరు	112
కరీంనగర్	100	ఒంగోలు	112
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	103
కర్నూలు	100	నెల్లూరు	108
విశాఖపట్నం	96	అనంతపురం	108
గోదావరి	109		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	97,580 ▼	89,450 ▼	1,19,000 ▲
విజయవాడ	99,500 ▲	93,500 ▲	1,10,000 ▲
విశాఖపట్నం	99,510 ▲	89,450 ▼	1,19,000 ▲
రాజమండ్రి	97,580 ▼	89,450 ▼	1,09,600 ▲
ప్రొద్దుటూరు	96,450 ▲	88,730 ▲	1,04,000 ▲
ముంబై	96,359 ▲	88,265 ▲	1,07,000 ▲

స్పోర్ట్స్

ఈ రాకెట్ రూ.1.34 కోట్లు పలికింది!




న్యూఢిల్లీ: స్పెయిన్ బుల్ రఫెల్ నడాల్ వాడిన ఓ రాకెట్ వేలంలో ప్రకంపనలు సృష్టించింది. 2017 ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో ఇదే రాకెట్‌ను వాడి నడాల్ క్లే కోర్టు గ్రాండ్‌స్లామ్‌లో పదోసారి చాంపియన్‌గా నిలిచాడు. తాజాగా 'ప్రెస్టీజ్ మెమొరబిలియా' అనే సంస్థ ఆ రాకెట్‌ను వేలంలో ఉంచగా ఓ ఔత్సాహికుడు ఏకంగా కోటీ 34 లక్షల ధరకు కొనుగోలు చేశాడు. టెన్నిస్ రాకెట్‌కు ఈ స్థాయిలో ధర పలకడం ఇదే తొలిసారి. 2017 సీజన్ ఆద్యంతం నడాల్ అదే రాకెట్‌తో 24 మ్యాచ్‌లు ఆడాడు. ఇక గతంలో 2022 ఆస్ట్రేలియన్ ఓపెన్‌ను గెలిచిన నడాల్ రాకెట్ రూ.1.19 కోట్లు పలికింది.

పది హేనేళ్లలో తొలిసారి..

ర్యాంకింగ్స్‌లో టాప్-50 నుంచి బోపన్న అవుట్

న్యూఢిల్లీ: భారత టెన్నిస్ వెటరన్ స్టార్ రోహన్ బోపన్న పదిహేనేళ్లలో తొలిసారిగా ర్యాంకింగ్స్‌లో టాప్-50లో చోటు కోల్పోయాడు. ఫ్రెంచ్ ఓపెన్‌లో నిరాశాజనక ప్రదర్శన కనబర్చిన బోపన్న 20 స్థానాలు చేజార్చుకొని 53వ ర్యాంక్‌లో నిలిచాడు. గతంలో 2015 జూన్‌లో బోపన్న 52వ స్థానంలో నిలిచాడు. 45 ఏళ్ల బోపన్న నిరుడు ఏకంగా డబుల్స్‌లో వరల్డ్ నెంబర్‌వన్‌గా నిలిచి, ఈ ఘనత సాధించిన పెద్ద వయస్కుడిగా రికార్డు సృష్టించాడు. ఆరు స్థానాలు ఎగబాకిన యుకీ భాంబ్రీ 35వ ర్యాంక్‌తో భారత్ తరఫున డబుల్స్‌లో నెంబర్‌వన్‌గా కొనసాగుతున్నాడు. డబుల్స్‌లో తెలుగు ఆటగాడు రిత్విక్ బొల్లిపల్లి 72, విజయ్‌సుందర్ 100వ ర్యాంక్‌లో ఉన్నారు. ఇక సింగిల్స్‌లో సుమిత్ నగాల్ ఏకంగా 63 స్థానాలు కోల్పోయి 233వ ర్యాంక్‌లో నిలిచాడు.



కమిన్స్ బవుమా

టెస్టు 'గద' దక్కేదెవరికో?

నేటి నుంచి డబ్ల్యూటీసీ ఫైనల్

ఆస్ట్రేలియాతో దక్షిణాఫ్రికా అమీతుమీ

మధ్యాహ్నం 3.00 గం. నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

లండన్: చాంపియన్స్ ట్రోఫీ.. ఆ వెంటనే ధనాధన్ ఐపీఎల్‌తో ఖుషీ అయిన క్రికెట్ ప్రేమికుల ముందుకు మరో అద్భుత సమరం రాబోతోంది. సుదీర్ఘ ఫార్మాట్‌కు తలమానికంగా నిలిచే ఐసీసీ వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌కు రంగం సిద్ధమైంది. ప్రతిష్ఠాత్మక లార్డ్స్ మైదానంలో నేటి నుంచి జరిగే అంతిమ సమరంలో డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాతో దక్షిణాఫ్రికా అమీతుమీ తేల్చుకోనుంది. వరుసగా రెండోసారి ఈ తుది పోరుకు అర్హత సాధించిన కమిన్స్ సేన అత్యంత పటిష్ఠంగా కనిపిస్తోంది. ఈసారీ అదిరే ప్రదర్శనతో మరో డబ్ల్యూటీసీ టైటిల్‌ను ఖాతాలో వేసుకోవాలనుకుంటోంది. అటు ఊహించని రీతిలో తుది పోరుకు అర్హత సాధించిన సఫారీలు తొలి ఐసీసీ టైటిల్‌ను దక్కించుకునేందుకు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. అలాగే రెండు దేశాలు కూడా తమ తుది జట్లను ఇదివరకే ప్రకటించాయి.

అనుభవం అండగా..: ఆసీస్ జట్టులో చాలామంది ఆటగాళ్లకు చివరి ఫైనల్లో ఆడిన అనుభవముంది. అందుకే ఒత్తిడిని తట్టుకుని చాంపియన్‌గా ఎలా నిలవాలో వారికి తెలుసు. ఓపెనర్‌గా ఖవాజాకు తోడు తొలిసారి లబుషేన్‌ను ఆడించనున్నారు. అలాగే కామెరూన్ గ్రీన్ వన్‌డౌన్‌లో సత్తా చాటాలనుకుంటున్నాడు. ఇక స్టీవ్ స్మిత్ నిలకడ, హెడ్ దూకుడు జట్టుకు బలం కానున్నాయి. అలాగే బౌలింగ్‌లో పేస్ త్రయం స్టార్క్, కమిన్స్, హాజెల్‌వుడ్‌లతో పాటు స్పిన్నర్ నాథన్ లియోన్‌ను అడ్డుకోవడం ప్రత్యర్థి బ్యాటర్లకు సవాలే. ఈ నలుగురు కలిపి మొత్తం 1508 టెస్టు వికెట్లు తీయడం విశేషం. కమిన్స్ మరో ఆరుగురిని అవుట్ చేస్తే కెరీర్‌లో 300 వికెట్లు పూర్తి చేస్తాడు.

ఒత్తిడిని జయిస్తేనే..: దక్షిణాఫ్రికా జట్టులో మార్‌క్రమ్, కెప్టెన్ బవుమాలకు మాత్రమే ప్రస్తుత ఆసీస్ బౌలర్లను ఎదుర్కొన్న అనుభవముంది. కానీ స్టబ్స్, రికెల్టన్ మాత్రం ఐపీఎల్‌లో ఆసీస్ పేసర్లను ఆడారు. సఫారీల బ్యాటింగ్ భారం కూడా ఈ నలుగురిపైనే ఉంది. సీనియర్ పేసర్ రబాడ ఇటీవల డోపింగ్ వివాదంలో ఇరుక్కున్న విషయం తెలిసిందే. తాజా ఫైనల్లో అతడిపైనే అందరి దృష్టి నిలువనుంది. లార్డ్స్‌లో ఆడిన చివరి టెస్టులో అతడు ఇంగ్లండ్‌ను దెబ్బతీశాడు. అదే ఊపును ఈసారీ కొనసాగిస్తే ఆసీస్‌కు కష్టకాలమే. ఎన్‌గిడి, యాన్సెన్ ఇతర పేసర్లు కాగా.. స్పిన్నర్ కేశవ్ మహరాజ్ ప్రభావం చూపాలనుకుంటున్నాడు.

తుది జట్లు

ఆస్ట్రేలియా: ఖవాజా, లబుషేన్, గ్రీన్, స్మిత్, హెడ్, వెబ్‌స్టర్, క్యారీ, కమిన్స్ (కెప్టెన్), స్టార్క్, లియోన్, హాజెల్‌వుడ్.

దక్షిణాఫ్రికా: మార్‌క్రమ్, రికెల్టన్, ముల్డర్, బవుమా (కెప్టెన్), స్టబ్స్, బెడింగమ్, వెరేయిన్, యాన్సన్, కేశవ్, రబాడ, ఎన్‌గిడి.

ఎలవెనిల్ గోల్డెన్ షూట్

ప్రపంచకప్‌లో పసిడి కైవసం



మ్యూనిచ్ (జర్మనీ): ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్‌ను భారత్ ఘనంగా ప్రారంభించింది. మంగళవారం ఇక్కడ మొదలైన ఈ మెగా టోర్నీలో భారత షూటర్ ఎలవెనిల్ వలరివన్ పతకం కొల్లగొట్టింది. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో కాంస్యం సాధించింది. ఫైనల్స్‌లో 25 ఏళ్ల ఎలవెనిల్ 231.2 పాయింట్లు షూట్ చేసి మూడో స్థానంతో పోడియం ఫినిష్ చేసింది. చైనా షూటర్ వాంగ్ జీఫీ (252.7) స్వర్ణం, కొరియాకు చెందిన క్వాన్ ఎన్‌జి (252.6) రజతం గెలుచుకున్నారు. ఇక, మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్ క్వాలిఫికేషన్స్‌లో హైదరాబాద్ షూటర్ ఇషా సింగ్ నాలుగో స్థానంలో నిలవగా.. పారిస్ ఒలింపిక్స్‌లో రెండు పతకాల విజేత మనూ భాకర్ 12వ స్థానానికి పరిమితమైంది.

పూరన్ అనూహ్య రిటైర్మెంట్

విండీస్ స్టార్ సంచలన నిర్ణయం



పోర్ట్ ఆఫ్ స్పెయిన్: వెస్టిండీస్ స్టార్ బ్యాటర్ నికోలస్ పూరన్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. 29 ఏళ్ల వయస్సులోనే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలుకుతున్నట్టు ప్రకటించాడు. టీ20ల్లో పూరన్ అత్యంత దూకుడుగా ఆడే బ్యాటర్‌గా పేరు తెచ్చుకున్నాడు. 2016లో అరంగేట్రం చేయగా, విండీస్ తరఫున ఎక్కువ పరుగులు (106 టీ20ల్లో 2,275) సాధించిన రికార్డు నెలకొల్పాడు. గతేడాది పొట్టి ఫార్మాట్‌లో ఎక్కువ సిక్సర్లు (170) బాదిన ఘనత కూడా అతడిదే. అలాగే ఇటీవలి ఐపీఎల్‌లోనూ లఖ్‌నవూ తరఫున 500+ రన్స్ సాధించడమే కాకుండా 40 సిక్సర్లతో టాప్‌లో నిలిచాడు. అయితే అతడి విజ్ఞప్తి మేరకు తాజా ఇంగ్లండ్, ఐర్లండ్‌లతో సిరీస్‌లకు విశ్రాంతినిచ్చారు. ఇంతలోనే అందరినీ ఆశ్చర్యపరుస్తూ వీడ్కోలు ప్రకటించాడు. 'చాలా ఆలోచించాకే క్రికెట్ నుంచి తప్పుకోవాలని నిర్ణయం తీసుకున్నా' అని పూరన్ తెలిపాడు. 2022లో విండీస్ పరిమిత ఓవర్ల కెప్టెన్‌గా పూరన్ బాధ్యతలు తీసుకున్నా.. అదే ఏడాది టీ20 మెగా టోర్నీ తొలి రౌండ్‌లోనే జట్టు నిష్క్రమించడంతో రాజీనామా చేశాడు. విండీస్ తరఫున టెస్టులు ఆడలేకపోయిన పూరన్ 61 వన్డేల్లో 1,983 పరుగులు చేశాడు.

మూడు రోజులు రెండు ప్రపంచ రికార్డులు

కెనడా స్విమ్మర్ మెకింటోష్ సంచలనం



విక్టోరియా (కెనడా): టీనేజ్ స్విమ్మర్, ఒలింపిక్ చాంపియన్ సమ్మర్ మెకింటోష్ సంచలన ప్రదర్శన నమోదు చేసింది. మూడ్రోజుల్లోనే రెండు ప్రపంచ రికార్డులు నెలకొల్పి అదరహో అనిపించింది. 18 ఏళ్ల మెకింటోష్.. కెనడియన్ స్విమ్మింగ్ ట్రయల్స్‌లో భాగంగా శనివారం 400 మీటర్ల ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో 3 నిమిషాల 54.18 సెకన్లలో రేసు పూర్తి చేసి ప్రపంచ రికార్డు సృష్టించింది. ఈ క్రమంలో గతంలో అరిర్నె టిట్మస్ (ఆస్ట్రేలియా) పేరిటనున్న 3:55.38 సెకన్ల రికార్డును తుడిచేసింది. తాజాగా సోమవారం రాత్రి జరిగిన 200 మీటర్ల వ్యక్తిగత మెడ్లే ఈవెంట్‌ను మెకింటోష్ 2 నిమిషాల 5.7 సెకన్లలో ఈదింది. దీంతో 2015లో కతిన్కా హోజు (హంగేరి) నెలకొల్పిన 2 నిమిషాల 6.12 సెకన్ల రికార్డు బద్దలైంది. మెకింటోష్ గతేడాది పారిస్ ఒలింపిక్స్‌లో మూడు స్వర్ణాలు, ఓ రజతం గెలిచింది.

ఎంతో కలచివేసింది..

బెంగళూరు దుర్ఘటనపై ద్రవిడ్



న్యూఢిల్లీ: భారత క్రీడా చరిత్రలో రెండో అతిపెద్ద ప్రమాదమైన చిన్నస్వామి స్టేడియంలో తొక్కిసలాట ఘటనపై టీమిండియా మాజీ చీఫ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ స్పందించాడు. ఐపీఎల్ విజేత రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) విజయోత్సవం సందర్భంగా జరిగిన ఈ ఘటనలో పదకొండు మంది అభిమానులు చనిపోవడం తనను తీవ్రంగా కలచివేసిందని అన్నాడు. 'క్రీడలను ఎంతగానో ప్రేమించే నగరం బెంగళూరు. నేను అక్కడినుంచే వచ్చాను. అక్కడి ప్రజలు క్రికెట్‌నే కాదు.. ఫుట్‌బాల్, కబడ్డీ ఇలా ఏ క్రీడకైనా మద్దతిస్తారు. అలాంటి నగరంలో ఈ దుర్ఘటన జరగడం చాలా బాధిస్తోంది. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపం తెలియజేస్తున్నా' అని ఓ చానెల్‌కిచ్చిన ఇంటర్వ్యూలో ద్రవిడ్ తెలిపాడు.



సత్తా చాటిన ప్రియాంక

న్యూఢిల్లీ: భారత రేస్ వాకర్ ప్రియాంక గోస్వామి ఈ సీజన్‌లో తొలి విజయాన్ని నమోదు చేసింది. ఆస్ట్రియాలోని ఇన్స్‌బ్రక్‌లో జరిగిన రేస్ వాకింగ్ చాంపియన్‌షిప్ మహిళల 10 కిలోమీటర్ల ఈవెంట్‌లో అగ్రస్థానం సాధించింది. రేస్‌ను ప్రియాంక 47 నిమిషాల 54 సెకన్లలో ముగించి విజేతగా నిలిచింది.

కౌంటీల్లో రుతురాజ్



లీడ్స్ (ఇంగ్లండ్): ప్రస్తుతం భారత్-ఎ జట్టుతో కలిసి ఇంగ్లండ్ పర్యటనలో ఉన్న టీమిండియా యువ క్రికెటర్ రుతురాజ్ గైక్వాడ్ త్వరలోనే అక్కడ కౌంటీ చాంపియన్‌షిప్‌లో ఆడనున్నాడు. ఇంగ్లండ్ కౌంటీల్లోని యార్క్‌షైర్ జట్టుతో రుతురాజ్ ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఇటీవల ఇంగ్లండ్ లయన్స్‌తో భారత్-ఎ జట్టు ఆడిన రెండు అనధికారిక టెస్టుల్లో రుతురాజ్‌కు తుదిజట్టులో ఆడే అవకాశం దక్కలేదు. ఈనెల 13 నుంచి 16 వరకు భారత సీనియర్ జట్టుతో నాలుగురోజుల మ్యాచ్ ఆడతాడు. ఆ తర్వాత యార్క్‌షైర్ జట్టుతో చేరనున్న రుతురాజ్.. అక్కడి కౌంటీ చాంపియన్‌షిప్‌లో ఐదు మ్యాచ్‌ల్లో పాల్గొంటాడు. ఆ తర్వాత వన్డే కప్‌లోనూ ఆడతాడు.

కక్షసాధింపు రాజకీయాలు మానాలి

- రేవంత్ హామీల అమలుపై దృష్టి సారించాలి: హరీశ్



హైదరాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రతిపక్ష నాయకులపై కక్షసాధింపు రాజకీయాలు మానాలని, రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఇప్పటికైనా ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంపై దృష్టిసారించాలని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. సిద్దిపేట ఎమ్మెల్యేగా హరీశ్ రావు ఎన్నిక చెల్లదంటూ హైకోర్టులో వేసిన కేసు కొట్టివేసిన నేపథ్యంలో.. అక్రమ కేసులకు భయపడేది లేదని మంగళవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొన్నటి ఫోన్ ట్యాపింగ్ కేసయినా, ఇప్పుడు ఎమ్మెల్యేగా తన ఎన్నిక చెల్లదని వేసిన కేసయినా దురుద్దేశపూర్వకంగా పెట్టినవని తేటతెల్లమైందన్నారు. న్యాయస్థానాల్లో అడుగడుగునా కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బలు తగులుతున్నాయని, వారి అక్రమ కేసులు న్యాయస్థానాల్లో వీగిపోవడంతో రేవంత్‌రెడ్డి కుట్రలు ఫలించడం లేదన్నారు. న్యాయస్థానాలపై పూర్తి విశ్వాసంతో కాంగ్రెస్ పెడుతున్న అక్రమ కేసులను తాము ధైర్యంగా ఎదుర్కొంటున్నామని చెప్పారు.

విత్తన కంపెనీల మోసాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

- గద్వాల రైతులకు న్యాయం చేయాలి: కేటీఆర్
- రైతులకు బీఆర్ఎస్ అండ: హరీశ్

హైదరాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి):జోగులాంబ గద్వాల జిల్లాలో రైతులను మోసం చేస్తున్న విత్తన కంపెనీలపై ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. రైతులు పెట్టిన పెట్టుబడి తిరిగివచ్చేలా కంపెనీలతో చర్చించి తగిన న్యాయం చేయాలన్నారు. విత్తన కంపెనీల అక్రమాలతో మోసపోయిన గద్వాల జిల్లా రైతులు బీఆర్ఎస్ నేత కుర్వ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లో కేటీఆర్‌ను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. విత్తన కంపెనీలు చేసిన మోసాల వల్ల తాము ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ఆర్గనైజర్లతో కాకుండా సీడ్ కంపెనీలు ప్రభుత్వ వ్యవసాయశాఖ ద్వారా రైతులకు విత్తనాలను పంపిణీ చేయాలన్నారు. ఈ సందర్భంగా గద్వాల జిల్లా కలెక్టర్ సంతోష్‌తో ఫోన్‌లో మాట్లాడిన కేటీఆర్.. సీడ్ కంపెనీల అక్రమాలను అడ్డుకోవాలని, గద్వాల జిల్లా పత్తిరైతులకు న్యాయం చేయాలని కోరారు. గద్వాల జిల్లా పత్తి రైతులు అధైర్య పడొద్దని, బీఆర్ఎస్ పార్టీ, మాజీ సీఎం కేసీఆర్ అండగా ఉంటారని మాజీ మంత్రి హరీశ్ రావు తనను కలిసిన రైతులకు హామీ ఇచ్చారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఈ సమస్యపై మాట్లాడతామని, ఈ లోపు రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాస్తానన్నారు. పత్తి రైతులకు న్యాయం జరిగేవరకు పోరాటం చేస్తామని ఆయన పేర్కొన్నారు. అలాగే రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డిని కూడా పత్తి రైతులు కలిశారు. తమకు న్యాయం చేయాలని విన్నవించారు.

రేపటి నుంచి అమర్‌నాథ్‌లో 'సిద్దిపేట' అన్నప్రసాదం

సిద్దిపేట కల్చరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జమ్ముకశ్మీర్‌లోని అమర్‌నాథ్ పుణ్యక్షేత్రంలో ఈ నెల 12 నుంచి యాత్రికులకు అన్నప్రసాదం పంపిణీ చేయనున్నట్లు సిద్దిపేట అమర్‌నాథ్ సేవా సమితి అధ్యక్షుడు కాచం కాశీనాథ్, ఛైర్మన్ చీకోటి మధుసూదన్ తెలిపారు. సమితి ఆధ్వర్యంలో బాల్టాల్ బేస్ క్యాంప్, పంచతరణి, అమర్‌నాథ్ గుహ వద్ద ఈ అన్నప్రసాద వితరణ ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమ కరపత్రాన్ని మంగళవారం సిద్దిపేట పాతగంజి హనుమాన్ దేవాలయంలో ఆవిష్కరించారు.

పెంచిన బస్‌పాస్ ధరలను తగ్గించాలి: కవిత

రాంనగర్/చంపాపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ యాజమాన్యం పెంచిన బస్‌పాస్ చార్జీలను వెంటనే తగ్గించాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బస్‌పాస్ చార్జీల పెంపును నిరసిస్తూ జాగృతి ఆధ్వర్యంలో మంగళవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని బస్‌భవన్ వద్ద ధర్నా నిర్వహించారు. అంతకుముందు ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ నుంచి బస్‌భవన్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించి బస్‌భవన్ ముట్టడికి ప్రయత్నించారు. పోలీసులు కవితను బస్‌భవన్ ప్రధాన గేట్ వద్దకు రాకుండా కొద్ది దూరంలోనే అడ్డుకున్నారు. దీంతో కవిత, జాగృతి కార్యకర్తలు రోడ్డుపైనే బైఠాయించారు. పోలీసులు కవితను అరెస్టు చేసి కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం పోలీస్‌స్టేషన్ నుంచి విడుదల అయిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. పెంచిన బస్‌పాస్ ధరలను తగ్గించేవరకు ఉద్యమిస్తామని పేర్కొన్నారు.



ఆర్టీసీ బస్‌భవన్ ఎదుట ధర్నా చేస్తున్న ఎమ్మెల్సీ కవిత

ఆ కులాలను బీసీ జాబితాలో తిరిగి చేర్చాలి

- తెలంగాణ బీసీ కమిషన్‌ను కోరిన ఏపీ కార్మికమంత్రి, ఎంపీ

హైదరాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : బీసీ కులాల జాబితా నుంచి తొలగించిన గవర, తూర్పుకాపు(గాజులకాపు), శెట్టిబలిజ, నాగవంశం, కొప్పుల వెలమలను తిరిగి చేర్చాలని కోరుతూ ఆయా కులసంఘాల ప్రతినిధులు మంగళవారం బీసీ కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయా కుల సంఘాల ప్రతినిధులు విచారణకు హాజరై బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్‌కు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఎంపీ పాక వెంకట సత్యనారాయణ, కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్ శెట్టిబలిజ కులం తరఫున కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు. ఆయా కులాలను చేర్చాలని కొంతమంది, చేర్చకూడదని మరి కొంతమంది మొత్తంగా 56 ప్రతినిధి బృందాలు బీసీ కమిషన్‌ను అభ్యర్థించాయి.

విద్యార్థులకు ఉచిత బస్‌పాస్ ఇవ్వాలి

విద్యార్థులకు ఉచిత బస్సుపాస్ సౌకర్యం కల్పించాలని అఖిల భారత విద్యార్థి పరిషత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆర్టీసీ ఛార్జీలు పెంచుతూ తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో 10 లక్షల మంది విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారని, వారిపై ఛార్జీల భారాన్ని మోపొద్దని కోరారు.

పెండింగ్ డీఏల కోసం పెన్షనర్ల పోరుబాట!

పింఛనుదారుల సమస్యలపై పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పెన్షనర్ల జేఏసీ వాపోయింది. ఛైర్మన్ కె. లక్ష్మయ్య నేతృత్వంలో మంగళవారం హైదరాబాద్‌లో కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఇందులో క్యాబినెట్ ప్రకటించిన నిర్ణయాలపై జేఏసీ నిరసన వ్యక్తం చేసింది. పింఛనుదారుల సమస్యలపై స్పష్టత ఇవ్వలేదని, ఇప్పుడు ఒక డీఏ, ఆరు నెలల తరువాత రెండో డీఏ అని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని పేర్కొంది. ఈనెల 18న పింఛనుదారుల ఐకాస సమావేశం ఏర్పాటు చేసి జూలైలో ఉద్యమానికి సమాయత్తమవ్వాలని కోర్ కమిటీ తీర్మానించినట్లు జేఏసీ ఛైర్మన్ లక్ష్మయ్య తెలిపారు.

ఏపీ గ్రూప్-1 మెయిన్స్ ఫలితాలు విడుదల

అమరావతి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 మెయిన్స్ ఫలితాలను ఏపీపీఎస్సీ మంగళవారం విడుదల చేసింది. మొత్తం 89 పోస్టుల భర్తీ కోసం 2023లో విడుదల చేసిన నోటిఫికేషన్‌కు సంబంధించిన మెయిన్స్ పరీక్షలు మే 3 నుంచి 9 వరకు జరిగాయి. ఆ పరీక్షల ఫలితాలను ఇప్పుడు ప్రకటించింది. జనరల్ కోటాలో 182 మంది, స్పోర్ట్స్ కోటాలో 42 మంది ఇంటర్వ్యూలకు ఎంపికయ్యారు. స్పోర్ట్స్ కోటా పోస్టుల భర్తీలో భాగంగా ఈ నెల 17 నుంచి ఏపీపీఎస్సీ కార్యాలయంలో క్రీడా ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తారు. వాటిని శాప్‌కు పంపి, శాప్ నిర్ధారించిన వారికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. జనరల్ అభ్యర్థులకు ఈనెల 23 నుంచి 30 వరకు ఇంటర్వ్యూలు జరుగుతాయి. అనంతరం తుది ఫలితాలు ప్రకటిస్తారు. ఎంపికైన అభ్యర్థులకు వ్యక్తిగతంగా సమాచారం అందుతుందని, ఇంటర్వ్యూలకు హాజరయ్యే సమయంలో ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకురావాలని కమిషన్ స్పష్టం చేసింది.

కుల రాజకీయం జరుగుతుందా..?

- సీనియర్లకు అవకాశం ఇస్తారా..??
- జూబ్లీహిల్స్ బీజేపీ అభ్యర్థి ఎంపికపై.. ఎమ్మెల్యే రాజాసింగ్ హాట్ కామెంట్
- కిషన్‌రెడ్డిని ఉద్దేశించి పరోక్ష వ్యాఖ్యలు
- ముస్లింల ఓట్లను ఈసారి ఎంఐఎం.. ఏ పార్టీకి అమ్మేస్తుందోనని వ్యంగ్యం



హైదరాబాద్ సిటీ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో పోటీ చేసే బీజేపీ అభ్యర్థిని కుల సమీకరణ ఆధారంగా నిర్ణయిస్తారా..? లేక సీనియర్లకు అవకాశం ఇస్తారా..? అని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇటీవల రాజాసింగ్ తరచూ ఏదో ఒక అంశంలో కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని పరోక్షంగా టార్గెట్ చేస్తూ విమర్శలు చేస్తున్నారు. తాజాగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రస్తావనను తీసుకొచ్చారు. ఈ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించిన మాగంటి గోపీనాథ్ చనిపోయారు. నిబంధనల ప్రకారం ఆరు నెలల్లోపు ఇక్కడ ఉప ఎన్నిక నిర్వహించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఉప ఎన్నికపై వివిధ పార్టీల్లో చర్చ నడుస్తోంది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో రాజాసింగ్ మాట్లాడారు. గత ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజకర్గంలోని ముస్లిం ఓటు బ్యాంక్‌ను ఎంఐఎం నాయకులు బీఆర్ఎస్‌కు అమ్మేశారని ఆరోపించారు. రాబోయే ఉప ఎన్నికలో బీఆర్ఎస్ పార్టీకి అమ్ముతారా..? లేక కాంగ్రెస్‌కు విక్రయిస్తారా..? అన్నది ముందు ముందు తెలుస్తుందన్నారు. ఇక, బీజేపీ విషయానికొస్తే గతంలో కుల రాజకీయం జరిగిందని, ఇప్పుడు కూడా కుల సమీకరణ జరుగుతుందా..? లేక సీనియర్లకు అవకాశం ఇస్తారా..? అనేది చూడాలన్నారు. కాగా, రాజాసింగ్ ఇటీవల కిషన్‌రెడ్డి లక్ష్యంగా చేసుకుని సంచలన వ్యాఖ్యలు చేస్తున్నారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన గవర్నర్ దత్తాత్రేయ ఆత్మకథ పుస్తకావిష్కరణలో సీఎం రేవంత్‌రెడ్డి.. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలపై కూడా రాజాసింగ్ హాట్ కామెంట్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన తర్వాత రాజాసింగ్ కొంత కాలం పాటు స్తబ్దుగా ఉన్నప్పటికీ, తర్వాత తరచూ ఏదో అంశంపై సంచలన వ్యాఖ్యలు చేస్తున్నారు. పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికపై ఆయన అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఆ సమయంలో ఆయన అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం కూడా చేయలేదు. ఢిల్లీ నుంచి అగ్రనేతలు వస్తే తప్ప పార్టీ కార్యక్రమాలకు హాజరు కావడం లేదు. ఆయన రాష్ట్ర పార్టీ కార్యాలయానికి వెళుతున్న దాఖలాలు కూడా లేవు. అయితే పార్టీలోని సీనియర్ నేతలు ఎవరూ రాజాసింగ్ వ్యాఖ్యలపై పెదవి విప్పడం లేదు. అంతర్గతంగా పార్టీ నాయకుల మధ్య చర్చ జరుగుతున్నప్పటికీ ఎవరూ దీనిపై స్పందించడం లేదు.

రాజీవ్ యువ వికాసం మరింత జాప్యం!

(మొదటిపేజీ తరువాయి)

దరఖాస్తుల పునఃపరిశీలన చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో రాజీవ్ యువ వికాసంపై నిర్ణయం తీసుకుంటారని భావించినా.. అలాంటిదేమీ జరగలేదు. పైగా, రాష్ట్రవ్యాప్తంగా దరఖాస్తులను హోల్డ్‌లో పెట్టాలని ప్రభుత్వం కలెక్టర్లకు మౌఖిక ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసింది. దీంతో ఆగస్టు వరకు లబ్ధిదారుల ఎంపిక, యూనిట్ల మంజూరులో జాప్యం తప్పదని సమాచారం. లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యం కారణంగా కాంగ్రెస్ కార్యకర్తలకే ప్రాధాన్యమివ్వడంతో ప్రజల్లో వ్యతిరేకత వస్తుందనే, వెనక్కి తగ్గినట్లు ప్రచారం సాగుతోంది.

లక్షలాది దరఖాస్తులు..!

రాజీవ్ యువ వికాసం పథకానికి 16.23 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. బీసీలకు 1.55 లక్షల యూనిట్లు లక్ష్యంగా పెట్టుకుంటే.. ఏకంగా 8.01 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఎస్సీలకు 1.44 లక్షల యూనిట్లు ఉంటే.. 3.92 లక్షలు; ఎస్టీలకు 91 వేల యూనిట్లకు 1.83 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఇక ఈబీసీలకు 51 వేల యూనిట్లు ఉంటే.. 37 వేల దరఖాస్తులే వచ్చాయి. క్రైస్తవులకు 5 వేల యూనిట్లు ఉంటే 4,604 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షల మంది లబ్ధిదారులను ఎంపిక చేసి, స్వయం ఉపాధి కల్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కానీ, 16 లక్షలకు పైగా దరఖాస్తులు రావడంతో మల్లగుల్లాలు పడుతోంది. మొదటి విడతలో రూ.లక్షలోపు యూనిట్లకు ఈ నెల 2 నుంచి 9 వరకు రుణ మంజూరు పత్రాలు పంపిణీ చేస్తామని షెడ్యూల్ ప్రకటించింది. కేటగిరీ-1లో రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు యూనిట్ల కోసం దరఖాస్తుల సంఖ్య చాలా తక్కువగా ఉంది. దాదాపు 2.8 లక్షల మందికి ఈ కేటగిరీ కింద యూనిట్లు మంజూరు చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం. కానీ, కేవలం 1,32,634 మందే దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో రూ.50 వేల లోపు యూనిట్‌కు పూర్తి రాయితీ ప్రకటించినా.. 39,401 దరఖాస్తులే వచ్చాయి. రూ.లక్షలోపు యూనిట్లకు 90 శాతం రాయితీ ప్రకటించినా 93,233 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. మొత్తం దరఖాస్తుదారుల్లో 79 శాతం మంది రూ.3-4 లక్షల యూనిట్లకు దరఖాస్తు చేసుకున్నారు. లక్ష లోపు యూనిట్లకు మార్చుకోవాలని అధికారులు వారికి సూచించినా ఫలితం లేకపోయింది. ఇక రూ.50 వేల లోపు యూనిట్ల ఏర్పాటు కూడా సమస్యగా మారే అవకాశం ఉన్నట్లు ఉన్నతాధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. ప్రస్తుతం కొనసాగుతున్న వ్యాపారాన్ని విస్తరించుకోడానికి నిబంధనలు వర్తించకపోవడంతో అలాంటి దరఖాస్తులను తిరస్కరించారు. తక్కువ మొత్తంలో ఎక్కువ మందికి లబ్ధి చేకూర్చాలని ప్రభుత్వం భావించినా.. అందుకు భిన్నంగా దరఖాస్తులు రావడంతో పునరాలోచనలో పడింది.

వ్యవసాయ అనుబంధ రంగాల్లో భారీగా..

ఈ పథకానికి 21-55 ఏళ్ల వయసున్న వారు దరఖాస్తు చేసుకోవడానికి సర్కారు అవకాశం కల్పించింది. మరోవైపు వ్యవసాయ అనుబంధ రంగాల్లో యూనిట్లు ఏర్పాటు చేసుకునేవారికి గరిష్ఠ వయోపరిమితిని 60 ఏళ్లుగా నిర్ణయించడంతో రైతులు ఎక్కువగా ఆసక్తి చూపారు. ముఖ్యంగా పాడి పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ల వంటి యూనిట్ల ఏర్పాటుకు దరఖాస్తులు భారీగా వచ్చాయి. అయితే, వీటి ఏర్పాటులో గతంలో జరిగిన అక్రమాలను అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. ఈ క్రమంలో పారదర్శకంగా యూనిట్లు ఎలా ఏర్పాటు చేయించాలనేదానిపై సమాలోచనలు చేస్తున్నట్లు సమాచారం. ఇక బ్యాంకు లింకేజీ ఉండే యూనిట్లకు సిబిల్ స్కోర్ ఆధారంగానే రుణం మంజూరయ్యే అవకాశం ఉంది. చాలా మందికి సరైన సిబిల్ లేకపోవడం వల్ల రుణాలు పొందే విషయంలో ఆందోళన నెలకొంది. ఈ పథకానికి, సిబిల్ స్కోరుకు సంబంధం లేదని ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క ప్రకటించినప్పటికీ సిబిల్ సరిగా లేనివాళ్లను బ్యాంకర్లు ఎంపిక చేయలేదు. పథకం దరఖాస్తు గడువు ముగిసిన తర్వాత చాలా మందికి కొత్తగా రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. దీంతో ఈ పథకాన్ని తమకూ వర్తింపజేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి వారిని ఏం చేయాలనే అంశంపైనా ప్రభుత్వం తర్జనభర్జన పడుతున్నట్లు తెలుస్తోంది.

రాజకీయ జోక్యంతోనూ..

లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా అధికారులే చేస్తారని నిబంధనల్లో పేర్కొన్నా.. తుది జాబితాకు ఇన్‌చార్జి మంత్రి ఆమోదాన్ని తప్పనిసరి చేయడంతో ఎంపికలో రాజకీయ జోక్యం పెరిగింది. ఎమ్మెల్యేలు సూచించిన వారినే ఎంపిక చేశారన్న ఆరోపణలున్నాయి. దీంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దళితబంధుపై వచ్చిన వ్యతిరేకతే యువ వికాసానికి ఎదురవచ్చని నిఘా వర్గాలు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. ఈ ప్రభావం స్థానిక ఎన్నికలపై పడుతుందని ఆందోళన చెందుతున్నారు. దీంతో చాలా జిల్లాల్లో నిర్ణీత గడువులోపు దరఖాస్తుల పరిశీలన కూడా చేయలేకపోయినట్లు సమాచారం. మరోవైపు పరిశీలన సమయంలో దరఖాస్తుదారులు లేకపోతే వారి దరఖాస్తులను తిరస్కరించారు. ఇలా రాజీవ్ యువ వికాసం పథకంలో ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని మార్పులు చేర్పులతో కొత్త మార్గదర్శకాల రూపకల్పనకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తికావడానికి ఆగస్టు వరకు పట్టే అవకాశం ఉందని, పథకం అమలు చేయడానికి నిధుల కొరత కూడా ఉందని ఎస్సీ సంక్షేమశాఖ అధికారి ఒకరు చెప్పారు. వాస్తవానికి తొలుత ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం అక్టోబరు 2 వరకు యూనిట్ల మంజూరు పత్రాలు అందించాల్సి ఉంది. కానీ, చాలా జాప్యం జరిగే అవకాశం ఉండడంతో దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు.

రంగారెడ్డి జిల్లాలో 19 మంది ఓపీఎస్‌ల తొలగింపు!

- డీపీవో చర్యతో గగ్గోలు
- ఆదేశాల్లేకుండా క్రమశిక్షణ చర్యలు వద్దన్న పీఆర్ డైరెక్టర్

హైదరాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ నూతన మార్గదర్శకాలతో రూపొందించిన యాప్‌ను రద్దు చేయాలని కొద్ది రోజులుగా పంచాయతీ కార్యదర్శులు పోరుబాట పట్టిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో రంగారెడ్డి జిల్లాలో 19 మంది ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను(ఓపీఎస్) తొలగించడం చర్చనీయాంశంగా మారింది. ఆ జిల్లా పంచాయతీ అధికారి తన పరిధిలోని 19 మంది ఓపీఎస్‌లను తొలగిస్తున్నట్లు సర్క్యులర్ జారీ చేయడంతో ఆ జిల్లాకు చెందినవారే కాకుండా... రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఓపీఎస్‌లు గగ్గోలు పెడుతున్నారు. డీఎస్ఆర్ యాప్‌ను రాష్ట్రంలోని 95 శాతం మంది కార్యదర్శులు ఉపయోగించడం లేదని, అలాంటిది తమను మాత్రమే ఉద్యోగం నుంచి తొలగించడం ఏమిటని బాధితులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారుల నుంచి ఎటువంటి మార్గదర్శకాలు లేవని, కొందరిలోనైనా భయం కలగాలన్న ఉద్దేశంతోనే తాను 19 మంది ఓపీఎస్‌లను తొలగించినట్లు రంగారెడ్డి జిల్లా డీపీవో పేర్కొన్నారని సంఘం నాయకుడొకరు తెలిపారు. గ్రామపంచాయతీల్లో పనిచేసే కార్యదర్శులు విధులకు హాజరయ్యేలా చూసుకోవడం జిల్లా పంచాయతీ అధికారుల బాధ్యత అని, దానిపైనే డీపీవోలు దృష్టి పెట్టాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ సృజన మంగళవారం తెలిపారు. కార్యదర్శులకు నచ్చజెప్పి డీఎస్ఆర్ యాప్‌ను వినియోగించేలా చూడాలని మాత్రమే తాము చెప్పామన్నారు. రంగారెడ్డి జిల్లాలో 19 మంది ఓపీఎస్‌లను తొలగిస్తూ.. అక్కడి డీపీవో తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని సూచిస్తానన్నారు. ఉన్నతాధికారుల మార్గదర్శకాల్లేకుండా ఇటువంటి చర్యలు ఏ జిల్లాలోనూ తీసుకోవద్దని డైరెక్టర్ సృజన సూచించారు.

వీడియో వైరల్.. తీన్మార్ మల్లన్న పనే

- మాదిగలకు మంత్రి పదవి కోసం కృషిని, నా ఎదుగుదలను చూసి ఓర్వలేక కుట్ర
- చిల్లర దందాలు, చీటింగ్‌లు నా పని కాదు
- తప్పుడు వీడియో సృష్టించిన వ్యక్తులను అధికారులు గుర్తించి చర్యలు తీసుకోవాలి
- తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్
- కాంగ్రెస్ నేత ఫిర్యాదుతో ఆరుగురిపై కేసు



నల్లగొండ, జూన్ 10(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వైన్స్ దుకాణాల నిర్వాహకుల నుంచి ముడుపులు డిమాండ్ చేశానంటూ తనపై అసత్య ప్రచారాలతో ఒక వీడియోను సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేయడం ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పనేనని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ ఆరోపించారు. తన ఎదుగుదలను ఓర్వలేక, మాదిగలకు మంత్రివర్గంలో స్థానం ఇప్పించడానికి తాను చేసిన కృషిని సహించలేక ఇలాంటి కుట్రకు తెరతీశారని ఆరోపించారు. మంగళవారం సామేల్ సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో విలేకరులతో మాట్లాడారు. ఆ వీడియోలో తన బొమ్మే లేదని, ఆ గొంతు కూడా తనది కాదనే సందేహం కలుగుతోందన్నారు. వాళ్లు తన ఇంటికి వచ్చారని, మంచినీళ్లు, చాయ్ ఇస్తే తాగి వెళ్లారన్నారు. అయితే ఈ వీడియో తీసిన వ్యక్తి తెల్లారి మల్లన్న స్టూడియోలో ప్రత్యక్షమవడంతో మల్లన్నే అతడిని ప్రోత్సహించారని భావిస్తున్నానని ఎమ్మెల్యే చెప్పారు. తమ వద్ద ఇంకో వీడియో కూడా ఉందని బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని, తాను అలాంటి బెదిరింపులకు భయపడేవాడిని కాదన్నారు. చిల్లర దందాలు, చీటింగులు, మాఫియాలు తన పని కాదని, తాను ప్రజలతో ఉండేవాడినని పేర్కొన్నారు. ఇంటికొచ్చిన వారికి మంచినీళ్లు, చాయ్ ఇస్తామని, అలాంటి సందర్భాల్లో అన్ని విషయాలు మాట్లాడుతుంటామని, కొన్ని అవసరమైనవి, కొన్ని అవసరం లేనివి కూడా చర్చకు వస్తాయని, అంతమాత్రాన తప్పుడు ప్రచారాలు చేయడం ఏంటని ప్రశ్నించారు. తనకు ఎవరు డబ్బులిచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ తప్పుడు వీడియో సృష్టించిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. దీనిపై కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్ తుంగతుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రంగయ్యగౌడ్ (గుండాల మండలం రామారం), బీఆర్ఎస్ సోషల్ మీడియా కార్యకర్త నాని (తిరుమలగిరి), వివిధ ఎలక్ట్రానిక్ మీడియా చానళ్లలో పనిచేస్తున్న శంకుయాదవ్ (తిరుమలగిరి), వేముల పండు (శాలిగౌరారం మండలం ఉట్కూరు), ఎండీ మాజీద్ (తుంగతుర్తి మండలం అన్నారం), ఒక పత్రిక విలేకరి తడకమళ్ల రవి... ఎమ్మెల్యేపై అసత్య వ్యాఖ్యలతో కూడిన వీడియోను వైరల్ చేశారని, వీరిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో వారు ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రుద్ర క్రాంతికుమార్ తెలిపారు.

దేశాభివృద్ధికి మోదీ, అమిత్‌షా విరోధులు

మతం పేరిట రాజకీయం.. మనుషుల మధ్య చిచ్చుతో లబ్ధికి యత్నం.. పహల్గాం తర్వాత పాక్‌పై ప్రగల్భాలు

- ఆపరేషన్ సిందూర్ చేపట్టినా.. ట్రంప్ జోక్యంతో తోక ముడిచారు
- షాద్‌నగర్ జైబాపు-జై భీం - జై సంవిధాన్ సభలో టీపీసీసీ చీఫ్



షాద్‌నగర్‌లో నిర్వహించిన పార్టీ ర్యాలీలో పాల్గొన్న మహేశ్‌కుమార్‌గౌడ్

హైదరాబాద్/ షాద్‌నగర్ అర్బన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మతం పేరిట రాజకీయం చేస్తూ దేశాభివృద్ధికి ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా విరోధులుగా నిలిచారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. మతం పేరిట మనుషుల మధ్య చిచ్చు పెట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన జై బాపు- జై భీం - జై సంవిధాన్ ర్యాలీలో పాల్గొన్న మహేశ్ కుమార్ గౌడ్.. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అటుపై కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విధానాలకు భిన్నంగా దేశ విచ్ఛిన్నానికి కుట్ర జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేసి మనుధర్మశాస్త్రాన్ని అమల్లోకి తేవాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. పహల్గాం ఘటన తర్వాత పాకిస్తాన్‌పై ప్రగల్భాలు పలికిన మోదీ.. అమిత్‌షాలు ఆ దేశాన్ని రూపురేఖలు లేకుండా చేస్తామని ఆపరేషన్ సిందూర్ చేపట్టినా, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ జోక్యంతో తోక ముడిచారని ఎద్దేవా చేశారు. భారత్ వైపు తిరిగి చూడటానికే భయపడే విధంగా బుద్ధి చెప్పే అవకాశం వచ్చినా చేతగాని వారిలా మౌనంగా ఉండిపోయారని మహేశ్ కుమార్ వ్యాఖ్యానించారు. 1971లో పాక్‌తో జరిగిన యుద్ధంలో ఇందిరాగాంధీ ఆ దేశాన్ని ఓడించి బంగ్లాదేశ్‌ను వేరు చేశారన్నారు. ఇక ప్రధాని మోదీ విధానాలతో 3% ఉన్న ధనికుల చేతుల్లోకి 40% సంపద వెళితే, 50% పేదల చేతుల్లో 3% సంపద మాత్రమే ఉందని మహేశ్ గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో మత రాజకీయాలు, ఆర్థిక అసమానతలను రూపుమాపడానికే కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ.. కన్యా కుమారి నుంచి కశ్మీర్ వరకూ పాదయాత్ర చేశారని గుర్తు చేశారు. భారత రాజ్యాంగం, లౌకికవాద పరిరక్షణ కోసమే ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా జై బాపు-జై భీం- జై సంవిధాన్ కార్యక్రమం చేపట్టారని పేర్కొన్నారు.

ఉద్యోగాల క్రమబద్ధీకరణకు పర్యాటక ఉద్యోగుల విజ్ఞప్తి

రెండున్నర దశాబ్దాలుగా వివిధ విభాగాల్లో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా పని చేస్తున్న తమ సర్వీసులను క్రమబద్ధీకరించాలని మహేశ్ గౌడ్‌కు పర్యాటక సంస్థ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరుతూ ఆయనకు వినతి పత్రం సమర్పించారు. ఇ పర్యాటక సంస్థలోనూ రిటైరుమెంట్ వయస్సు 61 ఏళ్ల అమలు చేయాలని సంఘం ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి కోరారు.

దక్షిణ ధ్రువానికి ఒంటరిగా..

-37 డిగ్రీల ఉష్ణోగ్రతలో 50 రోజుల సోలో ప్రయాణం

- హైదరాబాద్‌కు చెందిన సతీష్ సాహసం
- ఈ ఫీట్ సాధించిన తొలి భారతీయుడు
- 'టెన్జింగ్ నార్గే' పురస్కారానికి తనను సిఫారసు చేయాలని ప్రభుత్వానికి వినతి



దక్షిణ ధ్రువం వద్ద జాతీయ జెండాతో సతీష్ గోగినేని

హైదరాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోని ఏడు ఖండాల్లో అంటార్కిటికా చాలా ప్రత్యేకం. అత్యధిక భాగం మంచుతో కప్పబడి ఉండే ఆ ఖండంలోని కొన్ని ప్రాంతాల్లో మైనస్ 60 డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతూ ఉంటాయి. అలాంటి చోటుకు హైదరాబాద్‌కు చెందిన సతీష్ గోగినేని అనే పర్వతారోహకుడు ఒంటరిగా వెళ్లి ఊహకందని సాహసం చేశారు. అవును.. -37 డిగ్రీల ఉష్ణోగ్రతలో 50 రోజుల పాటు సోలోగా ప్రయాణించి దక్షిణ ధ్రువాన్ని చేరుకుని భారతదేశ జెండాను అక్కడ ఎగురవేశారు. దక్షిణ ధ్రువానికి ఒంటరిగా వెళ్లిన తొలి భారతీయుడిగా, తెలుగు వ్యక్తిగా చరిత్ర సృష్టించారు. గ్లోబల్ అడ్వెంచర్ రంగంలో భారత్, తెలంగాణ ఖ్యాతిని ప్రపంచానికి చాటాలని లక్ష్యంగా పెట్టుకున్న సతీష్.. మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంచడం, యువతలో ఆత్మహత్యలను నివారించడమే లక్ష్యంగా ఇలాంటి సాహసయాత్రలు చేస్తుంటారు. సాహస క్రీడల్లో ప్రతిభ చూపిన వారికి భారత ప్రభుత్వం ఇచ్చే అత్యున్నత పురస్కారం.. టెన్జింగ్ నార్గే నేషనల్ అడ్వెంచర్ అవార్డుకు తన పేరును సిఫారసు చేయాలని సతీష్ గోగినేని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సీఎంవో అధికారి జయేశ్ రంజన్‌ను కలిసి తన ప్రస్థానాన్ని వివరించారు.

మంచుగడ్డల మధ్య 50 రోజుల యాత్ర

దక్షిణ ధ్రువ యాత్రలో భాగంగా 2024 నవంబరు నుంచి 2025 జనవరి మధ్య 50 రోజులు పాటు సతీష్ అత్యంత ప్రతికూల వాతావరణంలో ఒంటరిగా తన యాత్ర కొనసాగించారు. 1133 కిమీల మేర సాగిన యాత్రలో రోజుకు 8 నుంచి 10 గంటల పాటు మంచు మైదానంలో -37 డిగ్రీల ఉష్ణోగ్రతల మధ్య స్కీయింగ్ చేసేవారు. 126 కిలోల బరువు ఉన్న తన సామగ్రిని స్లెడ్జ్‌పై పెట్టుకుని లాగుకుంటూ స్కీయింగ్ చేస్తూ గమ్యాన్ని చేరుకున్నారు. అయితే, ఈ యాత్ర కోసం సతీష్ ముందుగా తీవ్రమైన శిక్షణ తీసుకున్నారు అత్యంత చలితో కూడిన ప్రాంతాల్లో మనుగడ సాధించేందుకు అవసరమైన అంశాలపై తర్ఫీదు పొందారు. ఇందుకోసం కెనడాలోని బఫిన్ ద్వీపంలో, ఆర్కిటిక్ మంచు పర్వతాల్లో శిక్షణ పొందారు.

మారథాన్‌లతో మొదలుపెట్టి...

చిన్నచిన్న మారథాన్‌లతో మొదలైన సతీష్ ప్రయాణం దక్షిణ ధ్రువం వరకు చేరింది. ఈ క్రమంలో ఆయన ఎన్నో సాహసయాత్రలు చేశారు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన పది పర్వతాల్లో ఐదింటిని అధిరోహించారు. ఇప్పటిదాకా ప్రపంచ వ్యాప్తంగా 14 ఫుల్ మారథాన్‌ల్లో పాల్గొన్న సతీష్.. 2022 మే నెలలో ఎవరెస్టు పర్వతాన్ని అధిరోహించారు. ఆ తర్వాత 19 గంటల వ్యవధిలోనే లోట్సే శిఖరాన్ని అధిరోహించారు. ఈ రెండు పర్వతాలను అత్యంత వేగంగా అధిరోహించిన భారతీయునిగా గుర్తింపు పొందారు. కాంచన్‌జంగ పర్వతాన్ని 2025 మేలో అధిరోహించారు. 2023 మేలో ధౌలగిరి పర్వతం, 2023ఏప్రిల్‌లో అన్నపూర్ణ:1 శిఖరాన్ని అధిరోహించారు. వీటితోపాటు ఉత్తర అమెరికా, దక్షిణ అమెరికా, మెక్సికోలో ఉన్న ఎత్తైన పర్వతాలను కూడా అధిరోహించారు.



మంత్రి తుమ్మలను సన్మానిస్తున్న ఆయిల్‌ఫెడ్ చైర్మన్ రాఘవరెడ్డి, అధికారులు, ఉద్యోగులు

పామాయిల్ విస్తీర్ణం 5 లక్షల ఎకరాలకు పెరగాలి

- వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పామాయిల్ తోటల సాగు విస్తీర్ణం 5 లక్షల ఎకరాలకు పెరిగేలా ఆయిల్‌ఫెడ్ కృషిచేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. పామాయిల్ సాగుచేస్తున్న రైతులు పొందుతున్న ప్రయోజనాలను ఇతర రైతులకు వివరించి, సాగు చేసేలా ప్రోత్సహించాలని తెలిపారు. హైదరాబాద్‌లో చైర్మన్ జంగా రాఘవరెడ్డి అధ్యక్షతన సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. తుమ్మల మాట్లాడుతూ జూలై నాటికి సిద్దిపేట జిల్లా నర్మెట్టలో పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తిచేయాలని ఆదేశించారు. ఆయిల్‌ఫెడ్ సంస్థ ఆర్థికంగా బలోపేతమవుతూ రైతులకు లాభం చేకూర్చేలా పనిచేయాలని అధికారులకు సూచించారు.

ఇందిర సౌర గిరి జల వికాసంతో గిరిజనుల భూముల్లో సిరులు: సీతక్క



గిరిజన భవన్‌లో ట్రైబల్ కెఫెటేరియాను ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

హైదరాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల భూముల్లో సిరులు పండించడానికి ప్రభుత్వం ఇందిర సౌర గిరి జల వికాసం పథకాన్ని తీసుకొచ్చిందని మంత్రి సీతక్క తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని ఉద్యోగాలు స్థానికులకే దక్కేలా జీవో నెం. 3ను పునరుద్ధరించే ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టినట్లు పేర్కొన్నారు. సీతక్క అధ్యక్షతన హైదరాబాద్‌లోని సంక్షేమ భవన్‌లో గిరిజన ఎమ్మెల్యేల సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. ఉట్నూరు, ఏటూరునాగారం ఐటీడీఏల అభివృద్ధి కోసం రూ.12 కోట్లు ప్రత్యేకంగా కేటాయించినట్లు తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రత్యేక జాబ్ మేళాలను ఏర్పాటు చేసి యువతకు ఉపాధి మార్గాలు కల్పించేందుకు కృషి చేస్తామని ఆమె చెప్పారు. అంతకు ముందు మంత్రి సీతక్క సంక్షేమ భవన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ట్రైబల్ కెఫెటేరియాను ప్రారంభించి, ట్రైబల్ దేవాలయాలను ఆవిష్కరించారు.

చిన్నారి సహస్రకు ఉచిత వైద్యం: దామోదర

హైదరాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 5న పెద్దపల్లి జిల్లాలో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో, అదే జిల్లాలోని బసంత్‌నగర్‌కు చెందిన గుంటిపల్లి రాము, ఆయన భార్య అనూష మరణించారు. ఈ దంపతుల మూడున్నర సంవత్సరాల కూతురు సహస్ర తీవ్రంగా గాయపడింది. ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు ఆమెను తొలుత కరీంనగర్‌కు, అక్కడి నుంచి మంగళవారం హైదరాబాద్‌లోని రెయిన్‌బో ఆస్పత్రికి తరలించారు. సహస్ర పరిస్థితిపై గురించి తెలుసుకున్న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చలించిపోయారు. చిన్నారి సహస్రకు పూర్తి ఉచితంగా వైద్య సేవలు అందించాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను ఆయన ఆదేశించారు. ఇందుకయ్యే ఖర్చులను ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. మంత్రి ఆదేశాలతో హైదరాబాద్ డీఎంహెచ్‌వో, డాక్టర్ వెంకట్ రెయిన్‌బో ఆస్పత్రికి వెళ్లి సహస్ర ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. సహస్ర వెన్నుపూసకు తీవ్రగాయమైందని, ఆపరేషన్ చేయాల్సి ఉంటుందని డాక్టర్లు వివరించారు. సహస్రకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఈ సందర్భంగా డాక్టర్లకు డీఎంహెచ్‌వో సూచించారు.

లక్ష మందితో రాజ్యాంగ పరిరక్షణ సభ

- సంవిధాన్ బచావో కమిటీ నిర్ణయం

హైదరాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణ పేరుతో త్వరలోనే భారీ బహిరంగ సభ నిర్వహించాలని టీపీసీసీ సంవిధాన్ బచావో కమిటీ ప్రాథమికంగా నిర్ణయించింది. టీపీసీసీ సంవిధాన్ బచావో కమిటీ తొలి సమావేశం మంగళవారం గాంధీభవన్‌లో జరిగింది. ఈ సమావేశంలో కమిటీ చైర్మన్ వినయ్‌కుమార్‌తో పాటుగా సభ్యులు అద్దంకి దయాకర్, ఆత్రం సుగుణ తదితరులు పాల్గొన్నారు. జిల్లాల వారీగా సంవిధాన్ బచావో కమిటీలూ పూర్తయిన తర్వాత.. అధిష్ఠానంతో చర్చించి రాజ్యాంగ పరిరక్షణ సభపైన నిర్ణయం తీసుకోనున్నారు.

సంపద సృష్టికి ఐటీఐల దోహదం: దానకిశోర్

హైదరాబాద్ సిటీ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సంపద సృష్టించి రాష్ట్ర ఆదాయాన్ని పెంచేందుకు వృత్తి విద్యాసంస్థ(ఐటీఐ)లు దోహదపడుతాయని కార్మికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఉపాధి శిక్షణశాఖ కమిషనర్, ఎంప్లాయ్‌మెంట్ అండ్ ట్రైనింగ్ డైరెక్టర్ దాన కిశోర్ అన్నారు. అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని ఆర్థిక వృద్ధి రేటులో చైనా, జపాన్, థాయిలాండ్, సింగపూర్‌లాంటి దేశాలతో పోటీపడాలని పేర్కొన్నారు. నగరంలోని నేషనల్ స్కిల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూటట్‌లో మంగళవారం రాష్ట్రంలోని 65 ప్రభుత్వ ఐటీఐ కాలేజీల ప్రిన్సిపాళ్లకు వర్క్‌షాప్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తొలిరోజు వర్క్‌షాప్‌ను దానకిశోర్ ప్రారంభించి మాట్లాడారు. హైదరాబాద్, వరంగల్ లాంటి కొన్ని జిల్లాలు నైపుణ్యం పరంగా ముందవరసలో ఉంటే.. ఆదిలాబాద్ లాంటి కొన్ని జిల్లాలు వెనుకబడి ఉన్నాయన్నారు. వీటిని అభివృద్ధి చేసి స్థానిక విద్యార్థులకు నైపుణ్య విద్యను అందించాలని ఆయన సూచించారు.

మీసేవ ద్వారా 1.33 కోట్ల మందికి సేవలు

గడిచిన ఆర్థిక సంవత్సరం (2024-25) రాష్ట్రవ్యాప్తంగా ఆన్‌లైన్ వేదికగా 1.33 కోట్లమంది పౌరులకు సేవలు అందించినట్లు మీసేవ విభాగం వెల్లడించింది. అందులో భాగంగానే రూ.7,150 కోట్ల విలువైన లావాదేవీలను జరిపినట్లు తెలిపింది. తెలంగాణలో ఇ-గవర్నెన్స్ అమలుపై ప్రత్యేక దృష్టి సారించామని, ఈ నెల 9 నాటికి రాష్ట్రంలో 20 కోట్ల మీసేవ లావాదేవీలతో పౌర కేంద్రీకృత సేవలను పారదర్శకంగా అందించినట్లు పేర్కొంది. 1999లో కేవలం నాలుగు రకాల బిల్లుల చెల్లింపు సేవలతో ప్రారంభమైన మీసేవ విభాగం దేశంలోనే ప్రభుత్వం నిర్వహించే అతిపెద్ద డిజిటల్ వేదికగా అభివృద్ధి చెందిందని తెలిపింది.

3 వేల కోట్ల అప్పు తీసుకున్న రాష్ట్రం

హైదరాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.3000 కోట్ల అప్పు తీసుకుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మంగళవారం నిర్వహించిన ఈ-వేలం ద్వారా ఈ రుణాన్ని సేకరించింది. 30 ఏళ్ల కాల పరిమితి, 7.10% వార్షిక వడ్డీతో రూ.1000 కోట్లు, 31 ఏళ్ల కాల పరిమితి, 7.08% వార్షిక వడ్డీతో రూ.1000 కోట్లు, 32 ఏళ్ల కాల పరిమితి, 7.08% వార్షిక వడ్డీతో రూ.1000 కోట్ల చొప్పున రుణాన్ని తీసుకుంది.

కర్ణాటకలో మరోసారి కులగణన: సిద్దరామయ్య

బెంగళూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో మరోసారి కులగణన చేయనున్నట్లు సీఎం సిద్దరామయ్య ప్రకటించారు. ఢిల్లీలో కాంగ్రెస్ అధిష్ఠానం పెద్దలతో భేటీ అనంతరం డీసీఎం డీకే శివకుమార్‌తో కలసి సీఎం మంగళవారం మీడియాతో మాట్లాడారు. పదేళ్ల కిందట బీసీ కులాల ఆర్థిక, సామాజిక, రాజకీయ అంశాలను లెక్కించడానికి చేపట్టిన కులగణనపై వివిధ సామాజికవర్గాలు వ్యతిరేకత వ్యక్తం చేశాయని అన్నారు. దీనిపై పార్టీ అధిష్ఠానంతో చర్చించానని తెలిపారు. ఎవరికీ అన్యాయం జరగకూడదనే మరోసారి కులగణనకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ నెల 12న ప్రత్యేకంగా జరిగే క్యాబినెట్ సమావేశంలో కులగణన సర్వే అంశంపై స్పష్టత ఇస్తామని ఆయన తెలిపారు.

24 నుంచి ఆషాఢ బోనాలు

- రాష్ట్ర ప్రభుత్వం తరపున 28 ప్రధాన దేవాలయాలకు పట్టు వస్త్రాలు
- ఢిల్లీ, విజయవాడ, శ్రీశైలంల్లోనూ బోనాలు
- రాష్ట్ర మంత్రులు పొన్నం, సురేఖ



హైదరాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26 నుంచి జూలై 24 వరకూ రాష్ట్రంలో ఆషాఢ బోనాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ తెలిపారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టే విధంగా ఘనంగా బోనాల నిర్వహణకు సర్కారు ఇప్పటికే రూ.20 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఆషాఢ బోనాల ఉత్సవ ఏర్పాట్లపై మంగళవారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో జరిగిన సమీక్షలో వివిధ శాఖల ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేశారు. బోనాల ఉత్సవాల్లో పాల్గొనే భక్తులకు ఎలాంటి ఇబ్బందులెేకుండా అన్ని ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పని చేయాలని అధికారులను ఆదేశించారు. బోనాల సందర్భంగా 28 ప్రధాన దేవాలయాలకు రాష్ట్ర ప్రభుత్వం పట్టు వస్త్రాలు సమర్పిస్తుందని చెప్పారు. ఢిల్లీతోపాటు విజయవాడలోనూ ఆషాఢ బోనాలు జరుగుతాయని, శ్రీశైల భ్రమరాంబికా దేవాలయంలోనూ బోనాల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. 700 మంది కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రదర్శనలు నిర్వహిస్తారని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం తాగునీటి వసతి, బారికేడ్లు, ప్రత్యేక ఆర్టీసీ బస్సు సర్వీసులను ఏర్పాటు చేయడంతోపాటు వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా అన్ని శాఖలతో పోలీసులు సమన్వయం చేసుకోవాలని మంత్రులు సూచించారు. గతానుభవాలను దృష్టిలో పెట్టుకుని జోగినులు, శివసత్తులకు ఆలయాల వద్ద ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమీక్షా సమావేశంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, డీజీపీ జితేందర్, జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతా శోభన్‌రెడ్డి, హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్, రోడ్లు, భవనాలు, రవాణాశాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ తదితరులు పాల్గొన్నారు. కాగా, సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కొండా సురేఖ చిత్ర పటాలకు దేవాదాయ శాఖ ఉద్యోగులు, అర్చకులు పాలాభిషేకం చేశారు. అర్చకులు, ఉద్యోగుల కుటుంబాల కోసం అర్చక సంక్షేమ నిధి ట్రస్ట్ ఏర్పాటు చేసినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం రాష్ట్రంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

శాఖల్లో భారీ మార్పులు!

(మొదటిపేజీ తరువాయి)

పదవులు, పెండింగ్‌లో ఉన్న వర్కింగ్ ప్రెసిడెంట్ పదవులపైనా చర్చించినట్లు సమాచారం. ఓవైపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెండురోజులుగా ఢిల్లీలోనే ఉండి.. అధిష్ఠానం పెద్దలతో వరుసగా సమావేశం కాగా, మంగళవారం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హుటాహుటిన హస్తినకు వచ్చారు. దీంతో ఈ పరిణామాలన్నింటినీ పరిశీలిస్తే.. మంత్రుల శాఖల్లో మార్పులు భారీగానే ఉండే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మరోవైపు తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ, బీసీ కులగణనపై రెండు బహిరంగ సభలు నిర్వహించాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం నిర్ణయించింది. ఈ సభలకు హాజరు కావాల్సిందిగా రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గేలను రేవంత్‌రెడ్డి కోరగా.. వారిద్దరూ సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది. అలాగే, 11 ఏళ్ల నరేంద్రమోదీ పాలనా వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రేవంత్‌రెడ్డికి రాహుల్‌గాంధీ సూచించినట్లు సమాచారం. కాగా, ఇందిరా భవన్‌లో అధిష్ఠానం పెద్దలతో సమావేశం ముగిసిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి నేరుగా తన అధికారిక నివాసానికి చేరుకున్నారు. అనంతరం సాయంత్రం సునీల్ కనుగోలుతో రేవంత్ సుదీర్ఘంగా సమావేశమైనట్లు తెలిసింది. మంత్రివర్గ విస్తరణ, టీపీసీసీ పనితీరు తదితర అంశాలపై వీరి మధ్య కీలక చర్చ జరిగినట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. ప్రస్తుత పరిస్థితులను పరిశీలిస్తే.. మంత్రుల శాఖల్లో మార్పులు, చేర్పులు అన్నీ ఈ వారంలోనే జరిగే అవకాశం ఉందంటున్నారు.

త్వరలోనే మంత్రులకు శాఖల కేటాయింపు: వివేక్

న్యూఢిల్లీ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): త్వరలోనే రాష్ట్ర మంత్రులకు శాఖల కేటాయింపు ప్రక్రియ పూర్తవుతుందని కొత్తగా మంత్రిగా బాధ్యతలు చేపట్టిన గడ్డం వివేక్ వెంకటస్వామి ఆశాభావం వ్యక్తం చేశారు. తనయుడు, పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణతో కలిసి మంగళవారం ఢిల్లీలోని ముఖ్యమంత్రి అధికారిక నివాసంలో రేవంత్‌రెడ్డిని కలిశారు. తనకు క్యాబినెట్‌లో చోటు కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఇందిరా భవన్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సీఎం చేతిలోనే మంత్రులకు శాఖల కేటాయింపు ఉంటుందన్నారు. మంత్రివర్గ విస్తరణలో సామాజిక న్యాయం పాటించారని, శాఖల కేటాయింపులోనూ అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి తగు నిర్ణయం తీసుకుంటారని ఆయన పేర్కొన్నారు. కొత్త మంత్రులకు శాఖల కేటాయింపు విషయమై కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలతో సీఎం చర్చిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆలోచనా విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని అధిష్ఠానం తనకు సూచించిందని చెప్పారు.

ఒంటరిగా చాయ్ తాగిన చోటుకే మంత్రినై వచ్చా

- కాంగ్రెస్ ఇంకా ఎక్కడుందని హేళన చేశారు
- ఎన్నో అవమానాలకోర్చి పార్టీ కోసం పని చేశా
- ధర్మారంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



పెద్దపల్లి జిల్లా ధర్మారంలో మాట్లాడుతున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్

ధర్మారం/వెల్గటూర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఒంటరిగా చాయ్ తాగిన చోటుకే మంత్రి హోదాలో వచ్చానని, పార్టీ తనను ఈ స్థాయికి తీసుకువచ్చిందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మంగళవారం పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఆయన మాట్లాడారు. ఆ రోజుల్లో చాయ్ తాగడానికి కూడా తనతో ఎవరూ ఉండేవారు కాదని, ఇంకా కాంగ్రెస్ ఎక్కడుందంటూ తనను హేళన చేశారని చెప్పారు. ప్రతిపక్షాలు చేసిన అవమానాలను ఓర్చుకొని కాంగ్రెస్ కోసం అహర్నిశలు పని చేశానని, అందుకే దళిత వర్గానికి చెందిన తనను పార్టీ అక్కున చేర్చుకుని ఆశీర్వదించిందని తెలిపారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఎస్సీ వర్గీకరణ ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ చేశారని, అందువల్లనే సమన్యాయంలో భాగంగా తనతోపాటు వివేక్‌కు మంత్రి పదవులు దక్కాయని చెప్పారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్‌లో ఎస్సీలకు సమన్యాయం జరగలేదని విమర్శించారు. ప్రాణం ఉన్నంత వరకు కాంగ్రెస్‌లోనే ఉంటానని లక్ష్మణ్ తెలిపారు.



బోధన్‌లో వాటర్ ట్యాంక్ పైకెక్కి, నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ కార్యకర్తలు

మంత్రులను చూస్తే కడుపు మండుతోంది

- తెలంగాణ పోరాటం చేయని వారు క్యాబినెట్‌లో
- అంతా ఎన్నికల ముందు చేరినోళ్లే: అంజన్ కుమార్

కవాడిగూడ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మంత్రులను చూస్తే కడుపు మండుతోందని సికింద్రాబాద్ మాజీ ఎంపీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్ యాదవ్ అన్నారు. క్యాబినెట్‌లో రాష్ట్ర సాధన కోసం పోరాటం చేసిన వారు ఎవరూ లేరని చెప్పారు. ఉద్యమంతో సంబంధం లేని వారు, ఎన్నికల ముందు పార్టీలో చేరిన వ్యక్తులు పదవులు అనుభవిస్తున్నారని విమర్శించారు. సోమవారం ప్రకటించిన టీపీసీసీ కమిటీ జాబితాలో కూడా పార్టీ కోసం కష్టపడిన వారికి కాకుండా కొత్తవారికి అవకాశం కల్పించి అన్యాయం చేశారని పేర్కొన్నారు. మంగళవారం కవాడిగూడ డివిజన్ బండమైసమ్మ నగర్‌లోని కమ్యూనిటీ హాలులో జరిగిన ముషీరాబాద్ నియోజకవర్గం ఏ బ్లాక్ కాంగ్రెస్ కమిటీ విస్తృత కార్యకర్తల సమావేశంలో అంజన్ కుమార్ మాట్లాడారు. గత ఎన్నికల్లో ముషీరాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలుపు కోసం కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ప్రచారం చేసినా ముషీరాబాద్ ప్రజలు తనను ఓడించారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఎమ్మెల్యేగా గెలిస్తే క్యాబినెట్‌లో మంత్రి పదవి వచ్చేదని, నిత్యం ముషీరాబాద్ ప్రజలకు అందుబాటులో ఉండేవాడినని తెలిపారు. నియోజకవర్గానికి రావాలంటేనే ఇబ్బందిగా ఉందని అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గ్రేటర్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం కృషి చేయాలని ఆయన సూచించారు.

సుదర్శన్‌రెడ్డికి మంత్రి పదవి రాలేదని ట్యాంక్ ఎక్కి నిరసన

బోధన్ రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వకుంటే చావడానికైనా సిద్ధమని కాంగ్రెస్ కార్యకర్తలు హెచ్చరించారు. సుదర్శన్‌రెడ్డికి మంత్రి ఇవ్వనందుకు నిరసనగా మంగళవారం నిజామాబాద్ జిల్లా బోధన్‌లోని బీటీ నగర్‌లో వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన తెలిపారు. ఆయనకు మంత్రి పదవి ఇచ్చేంత వరకూ జిల్లాలో నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.



సీజ్ చేసిన నకిలీ విత్తనాల ప్యాకెట్లను మీడియాకు చూపుతున్న సూర్యాపేట ఎస్పీ నర్సింహ

నకిలీ పత్తి విత్తనాలు @ ఆంధ్రప్రదేశ్

- తెలంగాణలో జోరుగా విక్రయాలు
- ముఠా ఆట కట్టించిన సూర్యాపేట పోలీసులు
- నలుగురి అరెస్టు.. పరారీలో మరో ఇద్దరు

సూర్యాపేట క్రైం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లా ఇంకోలు గ్రామం కేంద్రంగా నకిలీ పత్తి విత్తనాలను తయారు చేసి, సరఫరా, విక్రయాలు జరిపే ముఠా ఆటను సూర్యాపేట పోలీసులు కట్టించారు. ఈ ముఠా నుంచి రూ.65 లక్షల విలువైన 22 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. ఒక నాకాబందీతో ఈ ముఠా గుట్టురట్టయిందని సూర్యాపేట ఎస్పీ కొత్తపల్లి నర్సింహ మీడియాకు వివరించారు. సోమవారం ఆత్మకూర్(ఎస్) మండలం పాతర్లపాడు బస్టాప్ వద్ద పోలీసులు నాకాబందీ నిర్వహించారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడకు చెందిన తండ నగేశ్ అనే వ్యక్తి.. బైక్‌పై గోనెసంచిలో 120 ప్యాకెట్ల పత్తి విత్తనాలను తీసుకెళ్తూ పట్టుబడ్డాడు. అతని వద్ద రసీదులు లేకపోవడంతో.. అదుపులోకి తీసుకుని, ప్రశ్నించగా.. నకిలీ విత్తనాల ముఠా డొంక కదిలింది. "ఏపీలోని బాపట్ల జిల్లా ఇంకోలుకు చెందిన మాగులూరి సాంబశివరావు అరుణోదయ కంపెనీ పేరుతో నకిలీ విత్తనాలను తయారు చేస్తున్నారు. కర్నూలు జిల్లాకు చెందిన చెవుల నర్సింహ ఈ విత్తనాలను తన వాహనంలో సరఫరా చేసేవారు. అలా గుంటూరుకు చెందిన తరిగొప్పల శ్రీనివాసరావు, అతని నుంచి ఎన్టీఆర్ జిల్లా పెనుగోలు గ్రామానికి చెందిన పి.రాములు, కృష్ణా జిల్లా మైలవరానికి చెందిన బానోతు జయరాం తదితరులకు నకిలీ విత్తనాలు సరఫరా అయ్యేవి. రాములు ద్వారా నగేశ్ విత్తనాలను కొన్నాడు" అని ఎస్పీ వివరించారు. శ్రీనివాసరావుకు చెందిన దుకాణంలో 37 బస్తాల నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నగేశ్, శ్రీనివాసరావు, రాములు, జయరాంలను అరెస్టు చేశామని, సాంబశివరావు, నర్సింహలు పరారీలో ఉన్నారని చెప్పారు. మరో కేసులో.. మోతె, సీసీఎస్ పోలీసులు నిర్వహించిన దాడిలో.. రావిపహాడ్ గ్రామానికి చెందిన శ్రీను ఇంట్లో అడ్వాన్స్-333, అరుణోదయ కంపెనీలకు చెందిన 98 నకిలీ పత్తి ప్యాకెట్లను సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇతనికి ఏపీలోని ఎన్టీఆర్ జిల్లాకు చెందిన శాతవాహన అనే బంధువు నకిలీ విత్తనాలను సరఫరా చేస్తున్నట్లు గుర్తించామన్నారు. శాతవాహను నివాసంలో 30 ప్యాకెట్లను సీజ్ చేసి, అతణ్ని అరెస్టు చేశామని చెప్పారు.

2,125 కోట్ల పెట్టుబడులు

(మొదటిపేజీ తరువాయి)

పెట్టుబడులు తెచ్చాం. ఫలితంగా ప్రైవేటు రంగంలో లక్ష మందికి పైగా తెలంగాణ యువతకు ఉద్యోగాలు లభించాయి. ఈ ప్రయాణంలో ఈరోజు మరో గొప్ప అడుగు ముందుకేశాం" అని అన్నారు. శైవ గ్రూప్, టారనిస్ క్యాపిటల్ సంయుక్తంగా రివలేషన్స్ బయోటెక్ లో రూ.1,360 కోట్లు, మనాకిన్ బయోలో రూ.340 కోట్లు, స్వబోధ ఇన్ఫినిటీ ఇన్వెస్ట్‌మెంట్స్ అడ్వైజర్స్‌లో రూ.80 కోట్లు, ఎగ్జిగెంట్ డ్రిల్లింగ్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్‌లో రూ.90 కోట్లు, యంత్ర టెక్ కంట్రోల్స్‌లో రూ.255 కోట్ల పెట్టుబడులు పెడుతున్నాయని వెల్లడించారు. ఇది తొలి అడుగు మాత్రమేనని, రాబోయే మూడేళ్లలో బయోటెక్, ఏఐ, డేటా సెంటర్, డిఫెన్స్, ఎనర్జీ, ఫిన్ టెక్, పబ్లిక్ సెక్టార్స్ తదితర రంగాల్లో మరో రూ.24 వేల కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ఆ రెండు కంపెనీలు సంసిద్ధత వ్యక్తం చేశాయని పేర్కొన్నారు.

ప్రతిపక్షాలకు కనిపించడం లేదా?

రాష్ట్రానికి పెట్టుబడులు రావడం లేదని, పరిశ్రమలు తరలిపోతున్నాయంటూ కొందరు తమ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని మంత్రి శ్రీధర్‌బాబు మండిపడ్డారు. తాము తీసుకొస్తున్న పెట్టుబడులు, కల్పిస్తున్న ఉద్యోగాలు వారికి కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. "తెలంగాణ ఒక రాష్ట్రం కాదు.. అవకాశాల గని. ప్రతిభకు కేరాఫ్ అడ్రస్. కొత్త ఆలోచనలు, సృజనాత్మకత, ఆవిష్కరణలకు కేంద్రం. అంతర్జాతీయ భాగస్వామ్యాలకు గమ్యస్థానం. మీ ఎదుగుదలే మా రాష్ట్రాభివృద్ధి అని నమ్మే సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటుంది. అందుకే తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలి" అని మంత్రి అన్నారు. ఏఐ సిటీ గురించి దేశ విదేశాలకు చెందిన మేధావులతో చర్చించామని, దానికి సంబంధించిన రూపకల్పన, సాంకేతిక అంశాల పరిశోధన తుది దశకు చేరుకుందని తెలిపారు. పీపీపీ విధానంలో ఏఐ సిటీ నిర్మాణం చేయాలని యోచిస్తున్నట్లు చెప్పారు. దీనికి 800 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తామని, ఐదు నెలల లోపు పూర్తి చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో శైవ గ్రూప్ చైర్మన్, సీఈవో అమిత్ జగన్నాథ్ వర్మ, టారనిస్ క్యాపిటల్ సీఈవో నికోలస్ ఎస్.బింగ్‌హామ్, రివలేషన్స్ బయోటెక్ ఎండీ రవిచంద్ర బీరం, మనాకిన్ బయో డైరెక్టర్ జశ్వంత్ ప్రణవ్ యతిరాజాం, స్వబోధ ఇన్ఫినిటీ ఇన్వెస్ట్‌మెంట్స్ అడ్వైజర్స్ సీఈవో సంకర్ష్ చందా, ఎగ్జిగెంట్ డ్రిల్లింగ్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ పాండురంగారావు తమ్మినేని, యంత్ర టెక్ కంట్రోల్స్ సీఈవో సమీర్‌కాంత్, రాయ్ డిన్‌రోచ్, తదితరులు పాల్గొన్నారు.



శైవ గ్రూప్, టారనిస్ క్యాపిటల్ ప్రతినిధులతో మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్‌ను సినిమా సిటీగా మార్చాలి

- సింగిల్ విండోలో సినిమా నిర్మాణ అనుమతులు
- ఎఫ్‌డీసీ నుంచే అన్ని అనుమతులకూ చర్యలు: భట్టి విక్రమార్క



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్‌రాజు, చిత్రంలో మంత్రులు శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి

హైదరాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌ను సినిమా సిటీగా మార్చేందుకు అవసరమైన సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ను సిద్ధం చేయాలని డిప్యూటీ సీఎం, క్యాబినెట్ సబ్ కమిటీ చైర్మన్ భట్టి విక్రమార్క.. సమాచార శాఖ కమిషనర్, ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎఫ్‌డీసీ) అధికారులను ఆదేశించారు. సినీ రంగ అభివృద్ధిపై ఏర్పాటైన సబ్ కమిటీ సమావేశం మంగళవారం సచివాలయంలో జరిగింది. సభ్యులు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. హైదరాబాద్‌ను సినిమా సిటీగా అభివృద్ధి చేసి, దేశ విదేశాల నుంచి సినీ రంగ ప్రముఖులను ఆకర్షించడమే ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో సినిమా షూటింగ్ చేయాలంటే పోలీసు, అగ్నిమాపక, మునిసిపల్ తదితర శాఖల నుంచి విడివిడిగా అనుమతులు తీసుకోవాల్సి వస్తోందని, ఫలితంగా సినీ పరిశ్రమ వర్గాలు ఇబ్బంది పడుతున్నాయన్నారు. ఈ విధానాన్ని మరింత సరళతరం చేయాలని, అనుమతులన్నింటినీ ఒకేచోటు నుంచి ఇచ్చేలా సింగిల్ విండో విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించామని చెప్పారు. ఎఫ్‌డీసీలో ఒక అధికారిని నియమించి, ఆ అధికారి ద్వారానే అన్ని శాఖల అనుమతులు త్వరితగతిన ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని పర్యాటక ప్రాంతాల్లో షూటింగ్‌లను చేపట్టేలా చూడాలని, తద్వారా పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. సినిమా థియేటర్లలోని క్యాంటీన్లలో తినుబండారాల ధరలను నియంత్రించాలని చెప్పారు. ఎఫ్‌డీసీకి గతంలో రాష్ట్ర ప్రభుత్వం 50 ఎకరాలను కేటాయించిందని, ప్రస్తుతం ఆ భూమికి సంబంధించిన పూర్తి వివరాలను వచ్చే సమావేశం నాటికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 14న నిర్వహించనున్న తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డుల ప్రదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని డిప్యూటీ సీఎం చెప్పారు.

విద్యుత్ ఉద్యోగులకు రూ.కోటి బీమా పథకం

తెలంగాణ పెట్టుబడులకు కేంద్రంగా మారిందని, అభివృద్ధిలో రాష్ట్రం దూసుకుపోతోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో విద్యుత్ సంస్థల ఉద్యోగులు/కార్మికులకు రూ.కోటి బీమా అందించే పథకంపై స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ)తో ఒప్పందం జరిగింది. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. రాష్ట్ర, దేశ ప్రగతిలో కీలక పాత్రను పోషిస్తున్న 51868 మంది విద్యుత్ ఉద్యోగులకు రూ.కోటి ప్రమాద బీమా కోసం ఒప్పందం చేసుకోవడం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. రాష్ట్ర జీడీపీ పెరుగుదలలో విద్యుత్ శాఖ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. విద్యుత్ శాఖలో పని చేసే ఉద్యోగులు రాత్రి, పగలు అని తేడా లేకుండా శ్రమిస్తారని, ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రాణాలు అడ్డుపెట్టి విధులు నిర్వర్తిస్తారని ఆయన కొనియాడారు.

'యాదాద్రి థర్మల్'పై వారాంతపు నివేదికలు

యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ (వైటీపీపీ) పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచించారు. మంగళవారం ప్రజాభవన్‌లో వైటీపీపీ పనులపై జెన్‌కో, బీహెచ్‌ఈఎల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. నిర్ణీత వ్యవధిలోగా ప్లాంట్ పనులు పూర్తిచేయాలని, పనుల పురోగతిపై వారం వారం నివేదిక అందించాలని ఆయన సూచించారు. 2030 నాటికి 20 వేల మెగావాట్ల హరిత ఇంధనాన్ని ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిలో తెలంగాణ కీలక పాత్ర పోషించనుందని ఆయన పేర్కొన్నారు.

స్వర్ణయుగానికి పదకొండేళ్లు



» మోదీ పాలనపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

అమరావతి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): స్వతంత్ర భారతావనిలో స్వర్ణయుగానికి సాక్ష్యంగా గత పదకొండేళ్ల ఎన్డీయే పాలన నిలిచిందని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. దేశంలోని అన్ని వర్గాలకు సమానంగా అభివృద్ధి ఫలాలు అందించేందుకు ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. పదకొండేళ్ల ఎన్డీయే పాలన, దేశ ప్రగతిపై ఆయన మంగళవారం విజయవాడలో మీడియాతో మాట్లాడారు. దేశంలో ఆర్థిక ప్రగతి, అన్నదాతల సంక్షేమం, జాతీయ భద్రత, వైద్య-విద్యా రంగాల్లో మార్పులు, మహిళా సాధికారత, యువతకు ఉద్యోగాలు, ఉపాధి, పేదరికం తగ్గుదల, సామాజిక సంస్కరణలు, అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధి మోదీ పాలనలో సాధ్యమైందని వివరించారు. 2014 నాటికి దేశం ఆర్థికంగా అట్టడుగున, అవినీతిలో అగ్రభాగాన ఉందని.. సమర్థవంత నాయకుడైన మోదీ అధికారం చేపట్టిన తర్వాత దేశ దిశ మారిందని ఆయన పేర్కొన్నారు.

విధులకు రాని ఉపాధ్యాయురాలికి జీతం.. ఎంఈవో సస్పెన్షన్

» పాఠశాలకు రాకున్నా హాజరుపట్టికలో ఆమె సంతకాలు

» నల్లగొండ జిల్లా చందంపేట మండలంలో ఘటన

చందంపేట, జూన్ 10(ఆంధ్రజ్యోతి): డిప్యుటేషన్‌లో ఉన్న ఉపాధ్యాయురాలు ఏడాదిగా విధులకు హాజరు కాకున్నా.. పర్యవేక్షించకుండా ఆమెకు వేతనం చెల్లించినందుకు ఓ మండల విద్యాధికారి(ఎంఈవో)పై సస్పెన్షన్ వేటు పడింది. నల్లగొండ జిల్లా చందంపేట మండలంలో వెలుగు చూసిన ఈ వ్యవహారంలో ఇద్దరు ప్రధానోపాధ్యాయులను అధికారులు ఇది వరకే సస్పెండ్ చేశారు. చందంపేట మండలం కొర్రతండా పాఠశాల ఉపాధ్యాయురాలు పర్విన్‌సుల్తానా గత ఏడాది గాగిళ్లపురం పాఠశాలకు డిప్యుటేషన్‌పై వెళ్లారు. కానీ ఏ రోజూ ఆమె విధులకు హాజరవ్వలేదు. అప్పుడప్పుడు ఆమె దేవరకొండ వచ్చి వెళుతుండగా గాగిళ్లపురం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేణుమాధవ్ హాజరుపట్టికలో ఆమెతో సంతకాలు చేయించేవారు. ఇందుకు గాను వేణుమాధవ్‌తోపాటు పోలేపల్లి కాంప్లెక్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సామ్యానాయక్‌కు పర్విన్ తన వేతనంలో కొత్త మొత్తాన్ని వాటాగా ఇచ్చేవారు. ఈ వ్యవహారంపై వచ్చిన ఫిర్యాదులతో విచారణ చేసిన జిల్లా విద్యాశాఖాధికారి(డీఈవో).. ప్రధానోపాధ్యాయులు సామ్యానాయక్, వేణుమాధవ్‌ను మే 26న సస్పెండ్ చేశారు. సదరు ఉపాధ్యాయురాలు విధులకు హాజరుకాకున్నా, ఏడాదిగా వేతనం చెల్లించి విధి నిర్వహణలో అలసత్వంగా ఉన్నందుకు ఎంఈవో చందర్‌నాయక్‌ను సస్పెండ్ చేసినట్టు డీఈవో భిక్షపతి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, ఎంఈవో చందర్ నాయక్ మరో 20 రోజుల్లో ఉద్యోగ విరమణ చేయాల్సి ఉంది.

నల్లగొండలో నిలిచిన 'జన్మభూమి'

» గంటన్నర పాటు ఆగిపోయిన పలు రైళ్లు

నల్లగొండ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): లింగంపల్లి నుంచి విశాఖపట్నం వెళ్తున్న జన్మభూమి (12806) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సాంకేతిక సమస్యలతో మంగళవారం నల్లగొండ రైల్వే స్టేషన్‌లో దాదాపు గంటన్నర పాటు నిలిచిపోయింది. ఈ రూట్ సింగిల్ లైన్ కావడంతో పలు రైళ్లను ఆపివేశారు. హౌరా నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్తున్న ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌ను ఇదే స్టేషన్‌లో నిలిపివేయగా, త్రివేండ్రం నుంచి సికింద్రాబాద్‌కు వస్తున్న మరో రైలును తిప్పర్తి మండలం రాయినిగూడెం వద్ద ఆపివేశారు. దీంతో నల్లగొండ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. హైదరాబాద్ సమీపంలోని లింగంపల్లి నుంచి బయలుదేరిన జన్మభూమి ఎక్స్‌ప్రెస్ ఉదయం 9 గంటగలకు నల్లగొండకు చేరుకొంది. పూర్తిగా ప్లాట్‌ఫామ్‌పైకి రాకముందే ఇంజన్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో రైలు ఆగిపోయింది. దీంతో రైల్వే అధికారులు నడికూడ జంక్షన్ నుంచి రిలీఫ్ ఇంజన్‌ను రప్పించటంతో 10.30 గంటలకు జన్మభూమి ఎక్స్‌ప్రెస్ కదిలింది. అనంతరం ఇతర రైళ్ల రాకపోకలు ప్రారంభమయ్యాయి.

అప్పులు మిగిల్చిన సాగు.. రైతు ఆత్మహత్య

వెల్దుర్తి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఆ రైతుది పెద్ద కుటుంబం.. వ్యవసాయమే జీవనాధారం. అయితే, అప్పులు తెచ్చి సాగు చేసిన పంటలు దిగుబడి రాక జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మెదక్ జిల్లా వెల్దుర్తి పంచాయతీ పరిధిలోని ఎల్కపల్లిలో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన మందస్వామి(41) తన సొంత పొలంతో పాటు మరి కొంత భూమి కౌలు తీసుకుని రూ.10 లక్షల వరకు అప్పులు చేసి పంటలను సాగు చేశాడు. దిగుబడి సరిగా రాకపోవడంతో చేసిన అప్పులు తీర్చే మార్గం లేకపోవడంతో మంగళవారం పొలం వద్ద చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

ఆ గ్రామంలో మద్య నిషేధం.. అమ్మితే లక్ష జరిమానా

హవేళిఘణపూర్, జూన్ 10: మెదక్ జిల్లాలోని హవేళిఘణపూర్ మండలం పోచమ్మరాల్ గ్రామంలో సంపూర్ణ మద్య నిషేధం పాటించాలని గ్రామస్థులు నిర్ణయించారు. ఇక మీదట ఎవరైనా మద్యం అమ్మితే రూ.లక్ష వరకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం గ్రామసభ నిర్వహించి ఏకగ్రీవంగా తీర్మానించారు.

జల్సాల కోసం సొంతింటికే కన్నం

» ఎవరూ లేని వేళ ఆభరణాలు ఎత్తుకెళ్లిన తనయుడు

కరీమాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జల్సాల కోసం చేసిన అప్పులు తీర్చేందుకు సొంతింటికే కన్నం వేశాడో యువకుడు. హనుమకొండ జిలా ఖిలా వరంగల్‌లోని పడమరకోటకు చెందిన గుర్రపు రామకృష్ణ, సవితారాణి దంపతుల కుమారుడు జయంత్. హనుమకొండలోని ఓ కాలేజీలో బీబీఏ కోర్సు చదువుతూనే.. హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్‌లో స్టార్టర్స్ ఆన్ వీల్స్ పేరిట ఫుడ్ కోర్టు పెట్టి నష్టపోయాడు. దీని కోసం స్నేహితులు, తెలిసిన వారి వద్ద అప్పులు చేశాడు. దీనికి తోడు తన గర్ల్ ఫ్రెండ్‌తో కలిసి జల్సాలకు అవసరమైన డబ్బు సంపాదించడానికి అదను కోసం ఎదురు చూశాడు. తల్లిదండ్రులు, సోదరి శ్రీనిధి.. ఈ నెల ఎనిమిదో తేదీ ఉదయం హైదరాబాద్‌లోని బంధువుల ఇంట్లో శుభకార్యానికెళ్లగానే జయంత్ బీరువాలోని 16 తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లాడు. తమ ఇంట్లో చోరీ జరిగిందని రామకృష్ణ మిల్స్ కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ కేసు దర్యాప్తు చేపట్టిన సీఐ బొల్లం రమేశ్ మంగళవారం రామకృష్ణ కుమారుడు జయంత్ సెల్‌ఫోన్ ఇవ్వమంటే నిరాకరించాడు. దీంతో అనుమానించి లోతుగా విచారించడంతో తానే దొంగతనం చేసినట్లు అతను అంగీకరించాడు.



కారులోనే సాక్షి వాంగ్మూలం నమోదు చేసుకుంటున్న న్యాయాధికారి

నడిచి వచ్చిన న్యాయాధికారి

» కారులోనే దివ్యాంగురాలి వాంగ్మూలం నమోదు

నిర్మల్ రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): 'న్యాయం' నడిచి వచ్చింది.. దివ్యాంగురాలైన సాక్షి వద్దకే న్యాయాధికారి నేరుగా వచ్చి వాంగ్మూలం నమోదు చేసుకున్న ఘటన నిర్మల్ జిల్లాలో మంగళవారం చోటుచేసుకుంది. లక్ష్మణచాంద మండలానికి సంబంధించిన ఓ క్రిమినల్ కేసులో సాక్షిగా ఉన్న సాదు ఇందిరమ్మ కోర్టు ముందు హాజరు కావాల్సి ఉంది. అయితే ఆమె దివ్యాంగురాలు కావడంతో.. భవనం మెట్లు ఎక్కేందుకు తీవ్ర ఇబ్బందులు పడింది. ఈ విషయం తెలుసుకున్న ప్రిన్సిపల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ పి.రవీందర్ స్వయంగా కిందకు దిగి వచ్చారు. కారులో ఉన్న ఇందిరమ్మ వద్దకు వచ్చి అక్కడే వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్నారు.

సమాచార హక్కు అప్పీళ్లపై రేపటి నుంచి విచారణ

(మొదటి పేజీ తరువాయి)

చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై నిపుణులు వారికి సూచనలు చేశారు. కీలక అంశాలపై అవగాహన కల్పించారు. సమాచార హక్కు చట్టం అమల్లో ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ వెనుకబడి ఉంది. దీనికి కారణాలను గుర్తించిన కమిషన్.. ఈ చట్టం పక్కాగా అమలయ్యేందుకు వీలుగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని భావిస్తోంది. వాస్తవానికి 2023 ఫిబ్రవరి నుంచి తాజా నియామకాల వరకు రాష్ట్రంలో సమాచార కమిషనర్లు లేరు. అప్పీళ్ల విచారణ జరగకపోవడంతో.. 20వేలకుపైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో రెవెన్యూ శాఖకు చెందిన 5,222 అప్పీళ్లు, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ 3,189, హోం శాఖ 1,468, పాఠశాల విద్య 1,122, ఆర్థిక శాఖకు చెందిన 858 అప్పీళ్లు ఉన్నాయి. వీటిని సాధ్యమైనంత త్వరగా, నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరించాలని కమిషన్ భావిస్తోంది. పెండింగ్ అప్పీళ్ల విచారణ ఈ నెల 12 నుంచి ప్రారంభం కానుంది. ప్రధాన కమిషనర్, ఐదుగురు కమిషనర్లు ఇందులో పాల్గొంటారు.

హాజరుకాని పీఐవోలపై చర్యలు

సమాచార హక్కు చట్టం ప్రకారం ప్రజలు కోరిన సమాచారాన్ని అధికారులు గరిష్ఠంగా 30 రోజుల్లో ఇవ్వాలి. ఇందుకోసం ప్రతి ప్రభుత్వ కార్యాలయంలోని ఉన్నతాధికారి ప్రజా సమాచార అధికారి (పీఐవో)గా, ఆ తర్వాతి స్థాయి అధికారి సహాయక సమాచార అధికారి (ఏపీఐవో)గా వ్యవహరించాలి. కానీ అధికారులు ఉద్దేశపూర్వకంగా ఏళ్ల తరబడి జాప్యం చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రజలు దీనిపై రాష్ట్ర కమిషన్‌కు ఫిర్యాదు చేసినా ఆయా అధికారులు హాజరవకుండా కిందిస్థాయి సిబ్బందిని విచారణకు పంపిస్తున్నారు. ఈ అంశంపై కమిషన్ ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఇక నుంచి సమాచార జాప్యానికి కారణమైన అధికారి తప్పకుండా హాజరవాలని, రాకుంటే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కమిషన్ నిర్ణయించినట్లు తెలిసింది. ఇక నిబంధనల మేరకు సమాచార కమిషన్ క్రమం తప్పకుండా వార్షిక నివేదికలు విడుదల చేయాలి. వాటిని శాసన సభ, శాసన మండలిలో ప్రవేశపెట్టాలి. కానీ రాష్ట్రం ఏర్పాటైనప్పటి నుంచి వార్షిక నివేదికల జాడే లేదు. తొలుత మూడేళ్లు కమిషనే లేదు. 2017 సెప్టెంబరులో కమిషన్ ఏర్పాటైనా వార్షిక నివేదికలు విడుదల చేయలేదు. ఇకముందు వార్షిక నివేదికలు విడుదల చేసే అంశంపైనా కమిషనర్లు దృష్టిపెట్టారు. అంతే కాదు ఇకపై అన్ని ప్రభుత్వ శాఖలు జిల్లాలవారీగా ప్రతీ మూడు నెలలకోసారి సమాచార హక్కు దరఖాస్తుల వివరాలు తెలపాలని కమిషన్ కోరనుంది.

కాళేశ్వరాన్ని ఎప్పుడు ఆమోదించారు?

(మొదటి పేజీ తరువాయి)



ఇవ్వాలంటూ అప్పటి ఈఎన్‌సీ సి.మురళీధర్ 2016 ఫిబ్రవరి 18న ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపా రు. వాటికి అనుగుణంగా ప్రభుత్వం మేడిగడ్డ బ్యారేజీకి అనుమతినిస్తూ 2016 మార్చి 1న జీవో జారీ చేసింది. ఈ జీవో విడుదలైన 14 రోజుల తర్వాత అంటే 2016 మార్చి 15న మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేస్తూ నాటి సీఎస్ రాజీవ్ శర్మ ఉత్తర్వులు ఇచ్చారు. అప్పటి నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్ చైర్మన్‌గా, మంత్రులు ఈటల రాజేందర్, తుమ్మల నాగేశ్వరరావులను సభ్యులుగా నియమిస్తూ జీవో 655 జారీ చేశారు. కానీ, మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం మేరకే మేడిగడ్డ నిర్మాణం జరిగిందని, కాళేశ్వరం నిర్మాణాన్ని క్యాబినెట్ ఆమోదించిందని ఇటీవల ఈటల కమిషన్ ఎదుట చెప్పారు. నాటి మంత్రివర్గ ఉపసంఘంలో సభ్యుడిగా ఉన్న తుమ్మల దీన్ని ఖండించారు. మంత్రివర్గ ఉపసంఘానికి, మేడిగడ్డ నిర్మాణానికి సంబంధమే లేదని ప్రకటించారు. మరోవైపు హరీశ్ కూడా ఈటల వ్యాఖ్యలకు కొనసాగింపుగా సమాధానాలిచ్చారు. కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) లేఖలతో పాటు వ్యాప్కోస్ నివేదిక తర్వాతే మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణం చేపట్టినట్లు కమిషన్ ఎదుట వాం గ్మూలం ఇచ్చారు. వాస్తవానికి మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో బ్యారేజీలు కట్టడానికి అనుగుణంగా నివేదిక ఇవ్వాలని అప్పటి ప్రభుత్వం వ్యాప్కోస్‌కు పని అప్పగించినట్లు కమిషన్ గుర్తించింది.ఈ నేపథ్యంలో కేసీఆర్ విచారణ విషయంలో అన్ని ఆధారాలను ముందు పెట్టుకొని ఆయన్ను ప్రశ్నించాలని కమిషన్ నిర్ణయించింది. కాళేశ్వరం ఆమోదించిన తేదీ ఏంటీ? సబ్‌కమిటీ వేసిందెప్పుడు? సబ్ కమిటీ సిఫారసులకు కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధం ఉందా? కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి మంత్రివర్గం ఆమోదం ఉందా? మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణ స్థలాల వద్ద రాతి పునాది ఉందా? లేదా? అని కమిషన్ ప్రశ్నించే అవకాశాలున్నాయి. మరోవైపు కాళేశ్వరం బ్యారేజీల ను ఇసుక పునాదులపై కట్టడానికి డిజైన్లు/డ్రాయింగ్‌లు ఇస్తే, వాటికి విరుద్ధంగా కట్టారన్న జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ)ప్రాథమిక నివేదిక ఆధారంగా కేసీఆర్‌ను ప్రశ్నించే అవకాశాలున్నాయి. రెండు దశాబ్దాల్లో తెలుగు రాష్ట్రాల్లో కమిషన్ల విచారణకు హాజరైన రెండో మాజీ సీఎంగా కేసీఆర్ నిలవనున్నారు. గతంలో ఏలేరు భూకుంభకోణంపై విచారణకు మాజీ సీఎం చంద్రబాబు హాజరయ్యారు.

కేసీఆర్ ఏం చెబుతారో?

మంత్రివర్గ ఉపసంఘానికి కాళేశ్వరం ప్రాజెక్టులకు సంబంధం లేదని, దాని అజెండాలో కాళేశ్వరం లేదని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ గుర్తించింది. ప్రాణహిత-చేవెళ్ల ఎత్తిపోతల పథకం, ఇందిరమ్మ వరద కాలువ, దేవాదుల ఎత్తిపోతల పథకంపై మంత్రివర్గ ఉపసంఘం వేశారన్న విషయం వెలుగులోకి వచ్చింది. 2015 ఏప్రిల్ 2న మేడిగడ్డ వద్ద బ్యారేజీ డీపీఆర్ తయారీ బాధ్యతలు వ్యాప్కోస్‌కు ఇవ్వడానికి అనుమతి కోరుతూ నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శికి సీఈ లేఖ రాయగా.. ఏప్రిల్ 13న డీపీఆర్ తయారీ బాధ్యతలు వ్యాప్కోస్‌కు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. అంటే.. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై ముందే నిర్ణయాలు తీసుకొని, ఆ ప్రాంతంలోనే బ్యారేజీలు కట్టడానికి అనువుగా డీపీఆర్ ఇవ్వాలని వ్యాప్కోస్‌ను ప్రభుత్వం కోరినట్లు తేలింది. దీంతో జస్టిస్ ఘోష్ కమిషన్ ఎదుట ఎవరు నిజాలు చెబుతున్నారు? ఎవరు అబద్ధాలు చెబుతున్నారనే దానిపై ఆసక్తికరమైన చర్చ మొదలైంది. ఈ నేపథ్యంలో నాటి ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ విచారణ కమిషన్ ఎదుట ఏం చెబుతారనేదానిపై ఉత్కంఠ నెలకొంది. మేడిగడ్డకు ప్రాజెక్టు స్థలం మార్పు, డిజైన్లు, నాణ్యత లోపం, నిర్వహణ లేకపోవడం, బ్యారేజీ కుంగిపోవడం, ప్రాజెక్టు పూర్తి కాకముందే బిల్లుల చెల్లింపులు తదితర అంశాలపై కమిషన్ కేసీఆర్‌ను ప్రశ్నించే అవకాశాలున్నాయని తెలుస్తోంది. కాగా, బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున బీఆర్కే భవన్‌కు వస్తున్న దృష్ట్యా.. ఎమ్మెల్సీ కవిత వర్గం కూడా కేసీఆర్‌కు మద్దతుగా రావడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు సమాచారం.

భారీ కాన్వాయ్‌తో కేసీఆర్..

ఎర్రవల్లి ఫాంహౌస్ నుంచి హైదరాబాద్‌లోని బీఆర్కే భవన్‌కు కేసీఆర్ బుధవారం భారీ కాన్వాయ్‌తో రానున్నారు. ఉదయం 11 గంటలకు కాళేశ్వరం కమిషన్ ఎదుట హాజరవనున్నారు. మంగళవారం ఆయన ఫాంహౌస్‌లో మరోసారి హరీశ్‌తో భేటీ అయ్యారు. ఇద్దరి మధ్య సుదీర్ఘ చర్చ జరిగింది. కాళేశ్వరం కమిషన్‌కు ఇచ్చేందుకు ఇప్పటికే ఓ నివేదికను సిద్ధం చేసిన కేసీఆర్.. హరీశ్‌ను అడిగిన ప్రశ్నల ఆధారంగా మరో నివేదికను కూడా రూపొందించుకున్నట్లు తెలిసింది. అలాగే కమిషన్ అవకాశం ఇస్తే.. కాళేశ్వరం ప్రాజెక్టుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కూడా ఇచ్చే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. కాగా, విచారణకు వెళ్లే సమయంలో కేసీఆర్‌కు మద్దతుగా బీఆర్ఎస్ శ్రేణులు భారీ సంఖ్యలో వచ్చేందుకు ఏర్పాట్లు చేసినట్లు సమాచారం. మరోవైపు విచారణ పూర్తికాగానే తెలంగాణ భవన్‌లో కేసీఆర్ విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉందని పార్టీ నేత ఒకరు చెప్పారు.

నేడు మళ్లీ ప్రభాకర్‌రావు విచారణ

» సెల్‌ఫోన్లను అప్పగించాలని సిట్ ఆదేశం

» నాంపల్లి కోర్టుకు హాజరైన ప్రభాకర్‌రావు



హైదరాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు, ఎస్ఐబీ మాజీ చీఫ్(ఓఎస్డీ) టి.ప్రభాకర్‌రావు బుధవారం సిట్ విచారణకు హాజరుకానున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికలు, అంతకు ముందు జరిగిన ఉప ఎన్నికల సమయంలో ఆయన వాడిన అధికారిక, అనధికారిక సెల్‌ఫోన్లను తమకు అప్పగించాలని సిట్ అధికారులు ఆదేశించారు. సెల్‌ఫోన్లతో పాటు ల్యాప్‌టాప్, మ్యాక్ నోట్‌బుక్‌లను సైతం అందజేయాలని సూచించారు. తొలిరోజు విచారణలో ప్రభాకర్‌రావు విచారణాధికారులకు సరిగ్గా సహకరించక, ఎదురు ప్రశ్నలు వేసిన నేపథ్యంలో తదుపరి విచారణలో ఇప్పటి వరకు అరెస్టు అయిన రాధాకిషన్ రావు, తిరుపతన్న, భుజంగరావు, ప్రణీత్‌రావు వాంగ్మూలాలు, ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబరేటరీ(ఎఫ్ఎస్ఎల్) నుంచి రిట్రీవ్ చేసిన డాటా ఆధారంగా విచారణ జరపనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా.. కొందరూ న్యాయమూర్తులతో పాటు కొన్ని కీలక ప్రొఫైల్స్‌ను ఎందుకు తయా రు చేయాల్సి వచ్చింది? స్పెషల్ ఆపరేషన్ టీంను ఎందుకు ఏర్పాటు చేశారు? హోంశాఖ ముఖ్య కార్యదర్శి రవిగుప్తాకు తెలియకుండా ఫోన్ ట్యాపింగ్ ఎలా చేశారు? అనే విషయాలపై ఆధారాలను ఆయన ముందు పెట్టి, ప్రశ్నించడానికి సిట్ అధికారులు సన్నద్ధమైనట్లు తెలుస్తోంది. కాగా.. ప్రభాకర్‌రావు మంగళవారం నాంపల్లి కోర్టుకు హాజరయ్యారు. ప్రభాకర్‌రావు అమెరికాలో ఉన్న సమయంలో ఆయనను ప్రకటిత నేరస్థుడిగా ప్రకటించాలంటూ సిట్ అధికారులు నాంపల్లి కోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన నాంపల్లి కోర్టు న్యాయమూర్తి.. ఈ నెల 20వ తేదీలోపు ప్రభాకర్‌రావు కోర్టులో హాజరుకావాలని ఆదేశించారు. అయితే.. సంబంధిత న్యాయమూర్తి సెలవులో ఉండటంతో ప్రభాకర్‌రావు వెనుదిరిగారు.

ఇంజనీరింగ్‌లో బోలెడన్ని సీట్లు

(మొదటి పేజీ తరువాయి)

హెచ్చరించారు. మంగళవారం ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ఈ.పురుషోత్తం, ఎస్‌కే మహమూద్, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్‌లతో కలిసి బాలకిష్టారెడ్డి మీడియాతో మాట్లాడారు. ఈసారి ఎప్‌సెట్ కౌన్సెలింగ్‌ను జూలై మొదటివారంలో ప్రారంభిస్తామని, ఆగస్టు 14లోపు పూర్తి చేస్తామని చెప్పారు. విద్యార్థులకు అవగాహన కోసం మాక్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. వృత్తివిద్యా కోర్సుల ఫీజులు పెంచే అంశంపై ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు.

అనుమతి లేని కాలేజీలతో జాగ్రత్త..

అనుమతి లేని కాలేజీల విషయంలో జాగ్రత్తగా ఉండాలని ఆచార్య బాలకిష్టారెడ్డి విద్యార్థులు, తల్లిదండ్రులను కోరారు. హైదరాబాద్ నానక్‌రాంగూడ వీవర్క్ రాజపుష్ప సమిట్‌లోని నెక్స్ట్ వేవ్ విద్యాసంస్థ, మాదాపూర్ ఇనార్బిట్ మాల్‌లోని బైట్ ఎక్సెల్ టెక్ ఎడ్ ప్రైవేట్ లిమిటెడ్, నానక్‌రాంగూడలోని షైన్‌స్కేప్ వ్యూబిల్డింగ్‌లోని లీప్‌స్టార్ట్ స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, హైటెక్ సిటీ సైబర్ టవర్స్‌లోని ఇంటెల్లిపాట్ స్కూల్ ఆఫ్ టెక్నాలజీ తదితర సంస్థలకు ఏఐసీటీఈ గుర్తింపు లేదని తెలిపారు. ఈ విద్యాసంస్థలు గత ఏడాది అడ్మిషన్లు నిర్వహించాయని, ఈఏడాది కూడా ప్రవేశాల పేరుతో రూ.10-12 లక్షలు వసూలు చేస్తున్నాయని వివరించారు. ఆ విద్యా సంస్థలకు లీగల్ నోటీసులు పంపామని, త్వరలో చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా మల్లారెడ్డి యూనివర్సిటీ, అరోరా, చైతన్య కాలేజీలు వాటి నిర్వహణకు తోడ్పడుతున్నట్టు ప్రాథమిక విచారణలో తేలిందని.. సమగ్ర విచారణ చేసి ఈ కాలేజీలపైనా చర్యల కోసం ఏఐసీటీఈకి సిఫార్సు చేస్తామని వివరించారు. ఉన్నత విద్యామండలికి మరిన్ని అధికారాలు కల్పించేందుకు ఉన్నత విద్య సంస్కరణ బిల్లు ముసాయిదాను సిద్ధం చేస్తున్నామని, త్వరలో ప్రభుత్వానికి సమర్పిస్తామని తెలిపారు.

సౌదీలో మతిస్థిమితం కోల్పోయిన తెలంగాణ వాసి

» భారత్‌కు తీసుకురావాలని కుటుంబీకుల విజ్ఞప్తి

» స్పందించిన ప్రజావాణి నోడల్ అధికారి

బేగంపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం సౌదీ అరేబియా వెళ్లిన ఓ వ్యక్తి మతిస్థిమితం కోల్పోయి ఆస్పత్రిలో చేరాడు. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం భవానిపేటకు చెందిన గోస్వామి రాము కల్తీ కల్లుకు బానిసయ్యాడు. ఈ నేపథ్యంలో ఉపాధి కోసం సౌదీకి వెళ్లాడు. అక్కడికి చేరుకున్న రెండు,మూడు రోజులకే మతిస్థిమితం కోల్పోయి మదీనా ఆస్పత్రిలో చేరాడు. రామును భారత్‌కు తిరిగి తీసుకురావాలని అతడి భార్య సీత, కుమారుడు ఉమేష్ మంగళవారం హైదరాబాద్‌లోని ప్రవాసీ ప్రజావాణిలో ముఖ్యమంత్రి పేరిట వినతిపత్రం సమర్పించారు. వెంటనే స్పందించిన ప్రజావాణి నోడల్ అధికారి దివ్యా దేవరాజన్ జెడ్డాలోని ఇండియన్ కాన్సులేట్‌కు తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై విభాగం ద్వారా సమాచారం ఇచ్చారు.

వారెవ్వా వంగర పోలీసు!

జీపు, బైక్‌లు వదిలేసి సైకిళ్లపై గ్రామాల్లోకి సిబ్బంది.. యువతను చైతన్యం చేయడమే లక్ష్యం

» గంజాయికి దూరంగా ఉండాలని ప్రచారం

» సైబర్ నేరాలు, బాల్య వివాహాలపై అప్రమత్తం

» స్వయంగా 50వేలు పెట్టి సైకిళ్లు కొన్న ఎస్సై దివ్య



వృద్ధులతో మాట్లాడుతున్న ఎస్సై దివ్య

భీమదేవరపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): వారిలో తాము పోలీసులమనే అధికారదర్పం లేదు! స్టేషన్ నుంచి కాలు బయటపెడితే జీపులోనో.. బైక్‌లపైనో వెళ్లాలనీ లేదు! సైకిలెక్కి మండల పరిధిలోని గ్రామాల్లోకి వెళతారు. ప్రజలను మాటల్లో పెట్టి.. ఒల్లు గుల్ల చేసే గంజాయి వంటి దురలవాట్లు కూడదని.. ఇల్లు గుల్ల చేసే సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అవగాహన కలిగిస్తారు. బాల్య వివాహాల కారణంగా జరిగే విపరిణామాలను, విద్య ప్రాముఖ్యతను వివరిస్తారు. ప్రజలను, ముఖ్యంగా యువతను చైతన్యం చేసేందుకు.. గ్రామాల్లో జరిగే అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్టవేసేందుకు ఇలా సైకిళ్లపై కదిలింది హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర పోలీసులు! మాజీ ప్రధాని పీవీ స్వగ్రామమైన వంగర పరిధిలో యువతను గంజాయి మత్తు నుంచి వదిలించేందుకు గ్రామాల్లోకి వెళ్లి వారితో మమేకమవుతున్నారు. వీధి వీధికి వెళుతున్నారు. ప్రజలతో ఆప్యాయంగా మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటున్నారు. స్టేషన్ ఎస్సై గొల్లెపల్లి దివ్య సొంతంగా రూ.50వేలు పెట్టి సిబ్బంది కోసం కొత్త సైకిళ్లు కొనుగోలు చేశారు. సైకిల్‌పై వచ్చి.. తమలో ఒకరిగా కలిసిపోయి మంచీచెడుపై అవగాహన కలిగిస్తున్న పోలీసుల తీరుపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని రత్నగిరి గ్రామంలో సైకిళ్లపైనే పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించారు. స్వయంగా ఎస్సై దివ్య సైకిల్ తొక్కుతూ గ్రామాలకు వెళ్లారు.

నిరంతరం సైకిళ్లపైనే పెట్రోలింగ్

గ్రామాల్లో పోలీసులు స్వచ్ఛందంగానే సైకిల్‌పై వెళుతున్నారు. ఈ పెట్రోలింగ్ నిరంతరం కొనసాగుతోంది. గ్రామాల్లోని సమస్యలు, శాంతి భద్రతల విషయంలో ఎలాంటి సందేహాలు ఉన్నా పోలీసులకు విన్నవించుకోవొచ్చు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి. పోలీసులు ప్రజల మధ్యే ఉంటే అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేందుకు దుండగులు జంకుతారు. గ్రామాల్లో పోలీసులు నిరంతరం తిరుగుతుండటంతో ఒంటరిగా నివసించేవారిలో, వృద్ధుల్లో ఓ భరోసా ఏర్పడుతుంది.

- దివ్య, ఎస్సై, వంగర

'మా ముందే ఫోన్ మాట్లాడతావా?'

వాహన తనిఖీల్లో భాగంగా ద్విచక్రవాహనదారుడిపై పోలీసుల దౌర్జన్యం

» సీపీ, ఎస్సీ కమిషన్, మానవ హక్కుల సంఘానికి బాధితుడి ఫిర్యాదు

» కరీంనగర్ జిల్లాలో గత నెల 8న ఘటన

సైదాపూర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మా ముందే ఫోన్ మాట్లాడతావా..? అంటూ ముగ్గురు పోలీసులు ఓ ద్విచక్రవాహనదారుడిపై రెచ్చిపోయారు. ఫోన్ మాట్లాడితే తప్పేంటి ? అని ఎదురు ప్రశ్నించినందుకు ఆ వ్యక్తిని చావబాదారు. అంతేనా.. విధి నిర్వహణకు ఆటంకం కలిగించాడంటూ అతనిపై కేసు నమోదు చేశారు. కరీంనగర్ జిల్లాలో గతనెల 8న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూడగా.. తనకు న్యాయం చేయాలంటూ బాధితుడు.. పోలీసులను, ఎస్సీ కమిషన్‌ను, మానవ హక్కుల సంఘాన్ని ఆశ్రయించాడు. ఈ ఘటనకు సంబంధించి కరీంనగర్ జిల్లా సైదాపూర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ట్రైనీ ఎస్సై భార్గవ్, కానిస్టేబుళ్లు ఆకాష్‌రెడ్డి, అజయ్‌పై పోలీసులు సోమవారం రాత్రి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. సైదాపూర్ మడలం గొల్లగూడెం గ్రామానికి చెందిన బత్తుల మహేందర్ శీతల పానీయాల ఏజెన్సీ నిర్వహిస్తున్నాడు. మహేందర్ మే 8వ తేదీన శంకరపట్నం మండలం మొలంగూర్ వైపు నుంచి సైదాపూర్‌కు తన ద్విచక్రవాహనంపై వస్తుండగా వాహన తనిఖీల్లో భాగంగా లస్మన్నపల్లి శివారులో పోలీసులు ఆపారు. విధుల్లో ఉన్న సైదాపూర్ ట్రైనీ ఎస్సై భార్గవ్, కానిస్టేబుళ్లు ఆకాష్‌రెడ్డి, అజయ్.. మహేందర్‌కు డ్రంకెన్ డ్రైవ్ పరీక్ష చేసి వాహన రికార్డులు తనిఖీ చేశారు. ఈ సమయంలో ఫోన్ కాల్ రావడంతో మహేందర్ పక్కకి వెళ్లి మాట్లాడాడు. అయితే, పోలీసుల ముందే ఫోన్ మాట్లాడతా ? అంటూ మహేందర్ తీరుపై ట్రైనీ ఎస్సై భార్గవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫోన్ మాట్లాడితే తప్పేంటి? అని మహేందర్ ఎదురు ప్రశ్నించగా ఎస్సై భార్గవ్, కానిస్టేబుళ్లు ఆకాష్‌రెడ్డి, అజయ్ కలిసి మహేందర్‌ను చితక బాదారు. అనంతరం మహేందర్ ఫోన్ లాక్కొని విడిచిపెట్టారు. కాగా, పోలీసులు కొట్టిన దెబ్బకు మహేందర్ కర్ణభేరి పగిలి చెవి నుంచి రక్తస్రావమైంది. అనంతరం మహేందర్ తన ఫోన్ కోసం పోలీసుస్టేషన్‌కు వెళ్లగా.. పోలీసులు క్షమాపణ పత్రం రాయించుకుని ఫోన్ ఇచ్చారు. మహేందర్‌పై డ్రంకెన్ డ్రైవ్, విధులకు ఆటంకం కలిగించాడని కేసులు నమోదు చేశారు. అయితే, తాను దళితుడిని అని చెప్పినా వినకుండా కులం పేరుతో దూషిస్తూ తనపై దాడి చేసిన ట్రైనీ ఎస్సై, కానిస్టేబుళ్లపై చర్యలు తీసుకోవాలని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని మహేందర్ సైదాపూర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. అలాగే, తనపై జరిగిన దౌర్జన్యంపై సీపీ, ఎస్సీ కమిషన్, మానవ హక్కుల సంఘానికీ ఫిర్యాదు చేశాడు. దళిత సంఘాలు మహేందర్‌కు మద్దతుగా ఆందోళనలు నిర్వహించాయి. దీంతో ఈ ఘటనపై విచారణ జరిపిన కరీంనగర్ సీపీ గౌస్ ఆలం.. ట్రైనీ ఎస్సై, ఇద్దరు కానిస్టేబుళ్లను సీపీ కార్యాలయానికి అటాచ్ చేశారు. ఈ క్రమంలో పోలీసుల దాడికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరలైంది. దీంతో మహేందర్ తన కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం పీఎస్ వద్ద ఆందోళన చేపట్టగా.. ట్రైనీ ఎస్సై, కానిస్టేబుళ్లపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.